సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 334

శనివారం 24-2-2018

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | WARANGAL | KHAMMAM | MAHABOOBNAGAR | KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



సమగ్రతను ప్రశ్నిస్తే సహించం

భారత్–కెనడా ప్రధానుల సంయుక్త సమావేశంలో మోదీ స్పష్టీకరణ -7లో



34,000పైకి సెన్సెక్స్

అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్లు. పుంజుకున్న రూపాయి -11లో

నిరుద్యోగ భృతి.. నెలకు రూ. 2,000



కొత్త పథకం దిశగా ప్రభుత్వం యోచన

- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచే అమలు!
- నిరుద్యోగుల లెక్కలు, విధివిధానాలపై మల్లగుల్లాలు.. పథకం మార్గదర్శకాలపై కసరత్తు
- అధికారులకు అధ్యయన బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి కేసీఆర్

అర్హత ఏమిటి?

డిగ్రీ పూర్తి చేసి.. 18–30 ఏళ్ల మధ్య వయసున్న వారు!

ఎంత మందికి?

10 లక్షల నుంచి 15 లక్షల మంది నిరుద్యోగులు ఉండొచ్చని అంచనా

సాక్షి, హైదరాబాద్: మరో కీలకమైన నిర్ణయం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లక్షలాది మంది రైతులను ఆదుకునేందుకు వ్యవసాయానికి పెట్టుబడి సాయం పథకానికి శ్రీకారం చుట్టిన సర్కారు.. నిరుద్యోగ యువతపైనా దృష్టి సారించింది. కొత్త రాష్ట్రంలో ఆశించినన్ని ఉద్యోగావకాశాలు రాకపోవటంతో అసంతృప్తితో ఉన్న లక్షలాది నిరుద్యోగులకు భరోసా ఇచ్చేందుకు.. ప్రతినెలా ఆర్థిక సాయం అందించే నిరుద్యోగ భృతి పథకాన్ని ప్రవేశ పెట్టాలని యోచిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచే దీన్ని అమలు చేయాలని, ఈ మేరకు బడ్జెట్‌లో పథకాన్ని చేర్చాలని సూచనప్రాయంగా నిర్ణయించింది. ఈ పథకానికి అవసరమైన విధివిధానాలు, అనుసరించాల్సిన మార్గదర్శకాలపై ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో మిగతా 2వ పేజీలో ▶

భారం ఏడాదికి రూ.2,400 కోట్లు

రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది వరకు నిరుద్యోగ భృతికి అర్హులు ఉంటారని అంచనా. వారికి భృతి చెల్లించాలంటే.. ప్రభుత్వంపై నెలకు రూ.200 కోట్ల చొప్పున ఏడాదికి రూ.2,400 కోట్ల భారం పడుతుంది. అయితే ప్రస్తుతం అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కాలేజీల జేబులు నింపుతోందని, దాని బదులు నిరుద్యోగులకు జీవన భృతి కల్పించడమే మేలని కేసీఆర్ భావిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాల్లో చర్చ సాగుతోంది. వ్యవసాయ పెట్టుబడి పథకానికి రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్న తరుణంలో నిరుద్యో భృతికి నిధుల సర్దుబాటు కష్టమేమీ కాదని అధికారులు అంటున్నారు.



శుక్రవారం ఢిల్లీలో మాట్లాడుతున్న మత్తయ్య

'ఓటుకు కోట్లు' కేసులో వాస్తవాలన్నీ చెబుతా

సుప్రీంకోర్టులో జెరుసలేం మత్తయ్య పిటిషన్

- గతంలో నాకు ఎప్పటికప్పుడు కేసు గురించి చెప్పేవాళ్లు
- ఇప్పుడెవరూ కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు
- టీడీపీ, టీఆర్ఎస్ కలిసి పోయాయి.. నాకు భయమేసి అప్పు చేసి మరీ ఢిల్లీకి వచ్చా
- కేసును నేనే వాదించుకుంటానని పిటిషన్ దాఖలు చేశా
- సీబీఐ దర్యాప్తు ద్వారానే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి

- వివరాలు 2లో

పాస్‌బుక్‌కు ఆధార్



కచ్చితంగా లింక్ చేయాలి: కేసీఆర్

లేదంటే బినామీ ఆస్తులుగా గుర్తించాల్సి వస్తుంది

- భూరికార్డులు పక్కాగా నిర్వహించేందుకే అనుసంధానం
- అసైన్డ్ భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు
- వ్యవసాయ భూమితో పాటు వ్యవసాయేతర భూమికి ప్రత్యేక కాలమ్
- ఎంట్రీల్లో ఎలాంటి పొరపాట్లకు తావు ఉండొద్దని సూచన
- పాస్ పుస్తకాలపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: పట్టాదారు పాస్ పుస్తకానికి ఆధార్ నంబర్‌ను కచ్చితంగా అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రైతులకు సూచించారు. లేదంటే పాస్ పుస్తకాల్లోని భూములను బినామీ ఆస్తులుగా గుర్తించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. భూ రికార్డులకు ఆధార్ కార్డు లింక్ చేయడానికి కొంతమంది ముందుకు రావడం లేదని, ఇప్పటికైనా వారంతా ఆధార్ నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ''భూ రికార్డులను పక్కాగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేస్తున్నాం. మేడ్చల్, రంగారెడ్డితో పాటు కొన్ని జిల్లాల్లో కొందరు తమ ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయించుకోలేదు. అలాంటి వారందరూ అధికారులకు ఆధార్ నంబర్ ఇవ్వాలి. లేకుంటే అవన్నీ బినామీలుగా గుర్తించే అవకాశం ఉంది..''అని స్పష్టం చేశారు. పాస్ పుస్తకాల పంపిణీపై ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష మిగతా 2వ పేజీలో ▶

కాళేశ్వరానికి సుప్రీం గ్రీన్‌సిగ్నల్

- ప్రాజెక్టు పనులు కొనసాగించవచ్చన్న హైకోర్టు ఉత్తర్వులకు సమర్థన
- దక్షిణాది పరిధిలోని చెన్నై ఎన్జీటీకి వెళ్లకుండా ఢిల్లీ ఎన్జీటీకి వెళ్లడమేంటి?..
- ఇది 'ఫోరం హంటింగ్' అంటూ పిటిషన్ కొట్టివేత

6లో

దొడ్డుబియ్యం.. చిన్న గుడ్డు

అంగన్‌వాడీల్లో చిన్నారులకు సరిగా అందని భోజనం .. కాగితాలకే పరిమితమైన మెనూ

- రెండు మూడు నెలలుగా పాలు బంద్
- సొంత భవనాల్లేక అద్దె ఇళ్లలో అగచాట్లు
- టాయిలెట్లు, తాగునీటి వసతి సరేసరి
- 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడి

- వివరాలు 8లో

ఫ్యామిలీలో | **నేను శక్తి సాక్షి**

చెత్తింటి వారు

చెత్తను కూడా రీసైకిల్ చెయ్యొచ్చేమో కానీ ఇలాంటి అత్తింటివాళ్లను మాత్రం బాగు చెయ్యలేం. ఎక్కడైనా.. అత్త వేధిస్తుంటే మామ ఆపుతాడు. భర్త వేధిస్తుంటే అత్తమ్మ అడ్డుకుంటుంది. మామ వేధిస్తుంటే భర్త తిరగబడతాడు. అత్తింట్లో ఉండే అమ్మాయికి కష్టాల నుంచి సేద కలిగించే మనుషులు వీళ్లంతా. అలాంటిది అందరూ కలిసి అమ్మాయిని వేధిస్తుంటే.. వాళ్లు.. అత్తింటివాళ్లు ఎలా అవుతారు? **చెత్తింటివాళ్లు అవుతారు.**

రాజ్యసభకు నగారా

- 59 స్థానాలకు మార్చి 5న నోటిఫికేషన్ 23న పోలింగ్
- ఏపీ, తెలంగాణల్లో ఆరు స్థానాలకు ఎన్నికలు

-వివరాలు 7లో

'హెచ్–1బీ' మరింత కఠినం

- ఉద్యోగి నైపుణ్యాన్ని, అవసరాన్ని నిరూపించుకోవాలి
- 'థర్డ్ పార్టీ వర్క్ సైట్ల'కు హెచ్–1బీల జారీ కోసం కొత్త పాలసీ -7లో

పాస్‌బుక్‌కు ఆధార్

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ప్రభుత్వ సలహా దారు అనురాగ్ శర్మ, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్ రావు, రాజేశ్వర్ తివారి, భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ప్రత్యేక అధికారి వాకాటి కరుణ పాల్గొన్నారు. ఇతర పట్టాదారులతోపాటుగానే అసైన్డ్ భూములున్న వారికి కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. అసలు లబ్ధిదారుల స్వాధీనంలో ఉన్న భూములను గుర్తించి, వాటి యాజమాన్యంపై స్పష్టత నివ్వాలని, వారి పేరిట పాస్ పుస్తకాలు తయారు చేయాలని ఆదేశించారు.

వ్యవసాయేతర భూమిని నమోదు చేయాలి

వ్యవసాయ భూమి ఉన్న రైతుకు అదే గ్రామంలో వ్యవసాయేతర భూమి ఉంటే, ఆ వివరాలు కూడా పాస్ పుస్తకంలో నమోదు చేయాలని సీఎం ఆదేశించారు. అందుకు అదనపు కాలమ్ పెట్టాలని సూచించారు. "మార్చి 11న పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించిన మాట నిజమే. అయితే అసైన్డ్ భూముల యజమానులను గుర్తించడం, వివరాలను పరిశీలించడం, వ్యవసాయేతర భూముల వివరాలు కూడా నమోదు చేయడం లాంటి పనులన్నీ చేయడానికి కొంత సమయం పడు తుంది. పాస్ పుస్తకాల తయారీ పక్కాగా జరిగిన తర్వాతే పంపిణీ కార్య క్రమం చేపట్టాలి. సొంత భూమి ఉన్న రైతులతోపాటు ప్రభుత్వం అసైన్ చేసిన భూమిని సాగు చేసుకుంటున్న రైతుల వివరాలు కూడా సేకరించాలి. వారికి కూడా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలి. అందుకు కొంత అదనపు సమయం పడుతుంది. అయినా ఫర్వాలేదు. కలెక్టర్లతో మాట్లాడి కచ్చితమైన వివరాలు తెప్పించాలి. అసైన్డదారులకు కూడా భూమి యాజమాన్య హక్కులపై స్పష్టత ఇవ్వాలి. తొందరపాటులో పొరపాట్లు దొర్లే అవకాశం ఉంది. పాస్ పుస్తకాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతీ ఎంట్రీని ఒకటికి రెండుసార్లు క్షుణ్నంగా పరిశీలించాలి" అని సీఎం పేర్కొన్నారు.

మార్చికల్లా అన్ని గ్రామాలకు మంచినీరు

ఈ ఏడాది మార్చి 31 నాటికి అన్ని గ్రామాలకు మంచినీళ్లు అందాలని సీఎం అధికారులను ఆదేశించారు. గ్రామాలకు పైపులైన్లు వేసుకుంటూనే సమాంతరంగా అంతర్గత పైపులైన్ల నిర్మాణ పనులు కూడా చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో అంతర్గత పైపులైన్ల నిర్మించి, ఇంటింటికీ నల్లాలు బిగించి మంచినీళ్లు సరఫరా చేసే విషయంలో ఎమ్మెల్యేలు చొరవ చూపాలన్నారు. శుక్రవారం ప్రగతి భవన్‌లో మిషన్ భగీరథపై సీఎం సమీక్ష నిర్వహించారు.

కాటేస్తున్న నిర్లక్ష్యం

- పాముకాటుకు సకాలంలో అందని వైద్యం
- ప్రభుత్వాస్పత్రుల్లో మందులు కరువు
- ఏటా పది వేల మంది బాధితులు.. ఏటా 600 మంది మృతి

సాక్షి, హైదరాబాద్: పాముకాటు బాధితులకు సకాలంలో వైద్యమందడంలేదు. పల్లెల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రుల్లో పాముకాటుకు సంబంధించిన ఔషధాలు అందుబాటులో లేవు. ప్రభుత్వ వైద్యం మెరుగుపడిందని అధికారులు చెబుతున్నా, ఆధునిక వైద్యం అందుబాటులో ఉందని ప్రైవేటు వైద్య సంస్థలు ప్రకటిస్తున్నా పాముకాటు మరణాలు మాత్రం ఆగడంలేదు. వైద్య, ఆరోగ్యశాఖ నివేదిక ప్రకారం ఏటా ఐదువేల మంది పాముకాటుకు గురవుతున్నారు. ప్రైవేటు వైద్యం, నాటు వైద్యం పొందేవారు మరో ఐదువేల మంది వరకు ఉంటున్నారు. కేవలం త్రాచు పాములతోనే ప్రాణభయం ఉంటుందని భావిస్తూ కట్ల పాము కరిస్తే ప్రజలు పెద్దగా పట్టించుకోవడంలేదు. ఈ నిర్లక్ష్యం వల్లే కొన్నిసార్లు ప్రాణనష్టం సంభవిస్తోంది. చాలామంది పొలాలకు వెళ్లే సందర్భాల్లోనే ఎక్కువగా పాముకాటుకు గురవుతున్నారు. రాత్రిపూట, తెల్లవారుజామున ఈ పరిస్థితి ఉంటోంది. పాముకాటు వల్ల మృతి చెందేవారి సంఖ్య ఏటా 600 వరకు ఉంది. రాత్రిపూట పాముకాటు వేసినా అది పాముకాటు అని గుర్తించకపోవడంతో ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తుతున్నాయి. చివరి నిమిషయంలో వైద్యం కోసం వెళ్లినా పరిస్థితి చేయి దాటిపోయి మరణాలకు దారితీస్తోంది. మూడేళ్ల క్రితంతో పోలిస్తే రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో పాముకాటు కేసుల సంఖ్య తగ్గింది.

నమోదుకాని తేలు కాటు...: ప్రమాదకరమైన తేలు కాటు కేసులను వైద్య, ఆరోగ్య శాఖ పట్టించుకోవడంలేదు. కనీసం కేసుల సంఖ్యను కూడా నమోదు చేయడంలేదు. తేలు కాటుకు గురయ్యేవారిలో ఎక్కువగా చిన్న పిల్లలే ఉంటున్నారు. తేలు కాటు చిన్న పిల్లలకు ప్రమాదకరంగా మారుతోంది. మొత్తం శరీరాన్ని స్తంభింపజేస్తోంది. ఏకంగా నాలుగైదు రోజులు ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై ఉండాల్సి వస్తోంది. ప్రాణాలు పోయే పరిస్థితి లేకున్నా... తేలు కాటు విషయాన్ని వైద్య, ఆరోగ్య శాఖ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మార్చి 13న నేపాల్‌కు కొత్త అధ్యక్షుడు

కాట్మండు: మార్చి 13న నేపాల్ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుత అధ్యక్షురాలు విద్యా దేవి భండారీ పదవీ కాలం ఇంకా రెండున్నర ఏళ్లు మిగిలి ఉన్నా ముందుగానే ఈ ఎన్నికలు జరగబోతున్నాయి. పాత కేంద్రీకృత రాజకీయ వ్యవస్థ స్థానంలో పూర్తిస్థాయి సమాఖ్య విధానాన్ని అమల్లోకి తెస్తున్నందున ఈ మార్పు జరిగింది. మార్చి 13న అధ్యక్ష ఎన్నికలకు పోలింగ్ నిర్వహించి, వెనువెంటనే ఓట్ల లెక్కింపు చేపడతామని నేపాల్ ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. పోటీలో ఉన్న ఎవరికీ స్పష్టమైన ఆధిక్యం రాకుంటే అగ్రస్థానంలో నిలిచిన ఇద్దరి మధ్య రన్–ఆఫ్ నిర్వహిస్తామని చెప్పారు.

అమెరికాలోని వర్సిటీలో కాల్పులు

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పులు చోటుచేసుకున్నాయి. హమ్మండ్ నగరంలోని ఆగ్నేయ లూసియానా విశ్వవిద్యాలయంలో శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు గాయపడ్డారనీ, వారిద్దరికీ ఎలాంటి ప్రాణాపాయం లేదని వర్సిటీ పోలీసులు తెలిపారు. అసెంబ్లీ హాల్ సమీపంలోని జరిగిన ఈ కాల్పుల్లో పలువురు పాల్గొన్నట్లు వర్సిటీ అధికార ప్రతినిధి ఎరిన్ కౌసర్ వెల్లడించారు. వర్సిటీ విద్యార్థులు, బయటివారికి గొడవ జరిగిన నేపథ్యంలో ఈ కాల్పులు చోటుచేసుకున్నాయన్నారు. ఈ ఘటనపై తెల్లవారు జామున 4 గంటలకు వర్సిటీ సిబ్బంది, విద్యార్థులకు ట్విటర్ ద్వారా హెచ్చరి కలు పంపినట్లు తెలిపారు. ఫ్లోరిడా కాల్పుల ఘటనతో తుపాకీ చట్టాలను కఠినతరం చేయాలని అధ్యక్షుడు ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతున్న వేళ ఇది చోటుచేసుకోవడం గమనార్హం.



శుక్రవారం హైదరాబాద్‌లో జీఈ సంస్థ సీఈవో టెర్రీ బ్రెసెన్హమ్‌తో సమావేశమైన మంత్రి కేటీఆర్



బయోకాన్ సంస్థ ఎండీ కిరణ్ మజుందర్ షాకు జ్ఞాపిక అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్‌లో మరో బయోకాన్ యూనిట్

జినోమ్ వ్యాలీలో ఏర్పాటు..
- కేటీఆర్ వంటి నేతలు మాకు స్ఫూర్తి
- కిరణ్ మజుందార్ షా కితాబు
- ఫార్మా దిగ్గజాలతో మంత్రి భేటీ

సాక్షి, హైదరాబాద్

బయో టెక్నాలజీ దిగ్గజం బయోకాన్ హైదరాబాద్‌లో కొత్తగా యూనిట్ ప్రారంభించనుంది. దీంతోపాటు ప్రస్తుత యూనిట్‌ను మరింత విస్తరించనుంది. మంత్రి కేటీఆర్ శుక్రవారం ఇక్కడ బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్ షాతో సమావేశమయ్యారు. తమ అనుబంధ కంపెనీ సింజెన్ ద్వారా జినోమ్ వ్యాలీలో బయోకాన్ కొత్త ఆర్ అండ్ డి సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ యూనిట్ ద్వారా 1,000 హై స్కిల్డ్ ఉద్యోగాలు వస్తాయన్నారు. దీంతోపాటు బయోకాన్లోని సిబ్బందిని రెట్టింపు చేస్తామని తెలిపారు. సంబంధిత వివరాలన్నీ త్వరలో అందిస్తామని మంత్రికి తెలిపారు. బయోకాన్ నూతన యూనిట్ ఏర్పాటును మంత్రి స్వాగతించారు. మజుందార్ షాకు ధన్యవాదాలు తెలిపారు. బయో ఏషియా సదస్సులో భాగంగా మంత్రి పలువురు ఫార్మా దిగ్గజాలతో సమావేశమయ్యారు. నొవార్టిస్, బయోకాన్, మెర్క్, డెలాయిట్, జీఈ కంపెనీల సీఈఓలు, సీనియర్ ప్రతినిధులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. థాయ్‌లాండ్ వాణిజ్య ఉప మంత్రి, ఇటాలియన్ కాన్సుల్ జనరల్ తదితరులతోనూ సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం తరపున టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాల్లో కేటీఆర్ చేపడుతున్న కార్యక్రమాలను ప్రతినిధులు అభినందించారు. ఫార్మా సిటీ ఏర్పాటు వివరాలను మంత్రి వివరించారు. హైదరాబాద్ స్టార్టప్ ఈకో సిస్టమ్ గురించి ప్రస్తావించారు. కిరణ్ మజుందార్ షా హైదరాబాద్ పర్యటనలో నగరంలోని 20 టాప్ స్టార్టప్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జీఈ (సస్టెయినబుల్ హెల్త్ కేర్ సొల్యూషన్స్) ప్రెసిడెంట్, సీఈఓ టెర్రీ బ్రెసెన్హమ్‌తో కూడా కేటీఆర్ సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మెడ్ డివైజెస్ పార్కు గురించి వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న టీవర్క్స్‌లో జీఈ భాగస్వామి అవుతున్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. బయో టెక్నాలజీలో వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని హైదరాబాద్‌లోని కంపెనీలు అందిపుచ్చుకునేందుకున్న అవకాశాలపైన మంత్రితో ఆమె చర్చించారు. త్వరలోనే జినోమ్ వ్యాలీ పర్యటనకు వస్తానని తెలిపారు. జినోమ్ వ్యాలీలో ఏర్పాటు చేయనున్న ఇంక్యుబేటర్‌లో జీఈ భాగస్వాములవ్వాలని కేటీఆర్ కోరారు. వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కేన్సర్ డయాగ్నస్టిక్ కార్యక్రమాలను ఆమెకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం టాస్క్‌తో కలిసి హెల్త్ కేర్ స్కిల్లింగ్ కార్యక్రమాలను చేపట్టేందుకు జీఈ సిద్ధమని ఆమె తెలిపారు.

థాయ్ బృందంతోనూ...

అనంతరం థాయ్‌లాండ్ ఉప వాణిజ్య మంత్రి చుటిమా బున్యాప్రఫసారాతో కేటీఆర్ భేటీ అయ్యారు. 20 థాయ్ కంపెనీలతో కూడిన బృందం తెలంగాణలో వ్యాపారావకాశాలపై చర్చించారు. రాష్ట్ర పారిశ్రామిక విధానం, ఫార్మా సిటీ, జినోమ్ వ్యాలీ, హైదరాబాద్‌లో ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అవకాశాలపై బృందం ఆసక్తి చూపింది. తొలిసారి హైదరాబాద్ పర్యటనలోనే ఇక్కడి విధానాలు, పెట్టుబడి అవకాశాలు ఆకట్టుకున్నాయని చుటిమా తెలిపారు. ముంబైలోని ఇటలీ కాన్సుల్ జనరల్ స్టెఫానియా కస్టాన్జాతో కూడా కేటీఆర్ భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో టెక్స్‌టైల్, ఫార్మా, సినీ, అనుబంధ రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై అలోచిస్తున్నట్టు తెలిపారు. బయోటెక్ రంగంలో ఇటలీ ఇకో సిస్టమ్, ఇక్కడ కంపెనీలు సంయుక్తంగా పని చేసే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ఏరోస్పేస్, టెక్స్‌టైల్ రంగాల్లో పలు పెట్టుబడి అవకాశాలున్నాయని, అందుకు ముందుకొచ్చే ఇటలీ కంపెనీలకు అన్ని విధాలా సహకరిస్తామని కేటీఆర్ వివరించారు. ఆ మేరకు త్వరలో ఇటలీ కంపెనీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణలో వ్యాపారావకాశాలు, పారిశ్రామిక విధానాలను వివరిస్తామని మంత్రికి ఆమె హామీ ఇచ్చారు. భారత్‌లో ఫార్మా అభివృద్ధికి సవాళ్లు అనే అంశంపై ఫార్మా కంపెనీల సీఈఓలతో సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. మెర్క్ లైఫ్ సైన్సెస్ సీఈఓ ఉదిత్ బత్రా, నొవార్టిస్, డెలాయిట్ కంపెనీల ప్రతినిధులతోనూ భేటీ అయ్యారు.

కేటీఆర్‌పై ప్రశంసలు

కేటీఆర్‌పై కిరణ్ మజుందార్ షా ప్రశంసలు కురిపించారు. ''ఆయన నాయకత్వంలో దేశంలో ఎట్టకేలకు ఉన్నత ప్రమాణాలున్న సైన్స్ మరియు ఇన్నోవేషన్ పరిశోధనలకు బీజం పడింది. కేటీఆర్ లాంటి నాయకులను చూసినప్పుడు పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తి కలుగుతుంది. ఇలాంటి నాయకులను బలపరచాలనిపిస్తుంది'' అంటూ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని కూడా మజుందార్ షా ప్రశంసించారు. నగరం భవిష్యత్తులో మరింత పురోగతి సాధించేందుకు అయా రంగాల నిపుణులు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వాధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.

నిరుద్యోగ భృతి రూ. 2వేలు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లోనే ఈ పథకాన్ని ప్రకటించాలని భావిస్తోంది. నిరుద్యోగ భృతి అమలుకు అవసరమైనన్ని నిధుల కేటాయింపులు, సాధ్యాసాధ్యాలపై అధ్యయన బాధ్యతను ఆర్థిక శాఖకు అప్పగించినట్లు సమాచారం. 18 ఏళ్లు నిండి డిగ్రీ పూర్తి చేసి.. ప్రైవేటు, ప్రభుత్వ రంగంలో ఉద్యోగం లేని వారందరినీ ఈ పథకానికి అర్హులుగా పరిగణించే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. రాష్ట్రంలో దాదాపు పది లక్షల మంది నిరుద్యోగులుంటారన్న అంచనాతో లెక్కలేసుకుంది. ఒక్కొక్కరికి ప్రతి నెలా రూ.2 వేల చొప్పున భృతి చెల్లించాలని భావిస్తోంది. కనీసం 18 ఏళ్ల వయస్సు నుంచి గరిష్టంగా 30 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగులను ఈ పథకంలో లబ్ధిదారులుగా చేర్చాలని భావిస్తోంది. అర్హతలు, విధివిధానాలు, మార్గదర్శకాల తయారీ బాధ్యతను సీఎం కేసీఆర్ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషితోపాటు ఆర్థిక శాఖ అధికారులకు అప్పగించినట్లు సమాచారం.

నిరుద్యోగుల లెక్కలపై గందరగోళం..

రాష్ట్రంలో ఎంత మంది నిరుద్యోగులున్నారన్న లెక్కలు ప్రభుత్వ శాఖల వద్ద అందుబాటులో లేవు. వివిధ ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకునేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో దాదాపు 18 లక్షల మంది అభ్యర్థులు ఇప్పటివరకు పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా ఉన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో దాదాపు 20 లక్షల జాబ్‌కార్డుదారులున్నారు. వీరిలో నిరక్షరాస్యులతోపాటు చదువుకున్నవారూ ఉన్నారు. మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 30 లక్షల మంది నిరుద్యోగులు ఉంటారని అంచనాలున్నాయి. అయితే కనీస డిగ్రీ విద్యార్హత, వయసు నిబంధనలతో ఈ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, మొత్తం 10 లక్షల నుంచి 15 లక్షల మధ్య నిరుద్యోగ భృతి పరిధిలోకి వస్తారని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఉపాధి హామీ మార్గదర్శకాల ప్రకారం వరుసగా 180 రోజులు పని దొరకని వారందరినీ నిరుద్యోగులుగా పరిగణిస్తారు. ఎవరిని, ఏ ప్రాతిపదికన నిరుద్యోగులుగా పరిగణించాలన్న విషయంలో అధికారులు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు రాష్ట్రంలో ఎందరు నిరుద్యోగులున్నారు? నిరుద్యోగిని నిర్ధారించేందుకు ఏయే అర్హతలుండాలి? ఒక్కొక్కరికి ఎంత భృతి చెల్లించాలి? పథకానికి ఏయే మార్గదర్శకాలుండాలి? అన్న అంశాలపై ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా సమాచారం సేకరిస్తోంది. నిరుద్యోగుల సంఖ్యను గుర్తించేందుకు సమగ్ర కుటుంబ సర్వే గణాంకాలను పరిశీలిస్తున్నారు. మరోవైపు డిగ్రీ పూర్తి చేసి వారి నుంచి అర్హత ధ్రువపత్రాలతోపాటు తాను నిరుద్యోగినని అఫిడవిట్‌ను తీసుకోవాలని యోచిస్తోంది.

ప్రతిపక్షాల ఎత్తుకు పైఎత్తు...

సాధారణ ఎన్నికల ముందు ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కావటంతో 2018–19 బడ్జెట్ ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఎన్నికల వ్యూహంలో భాగంగా కొత్త జనాకర్షక పథకాలపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగానే దాదాపు 70 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే పెట్టుబడి సాయం పథకాన్ని ప్రకటించారు. కానీ రాష్ట్రం ఏర్పడ్డప్పట్నుంచీ తగినన్ని నోటిఫికేషన్లు రాలేదని నిరుద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. ప్రతిపక్షాలు సైతం అదే అంశాన్ని ప్రధానాస్త్రంగా ఎంచుకున్నాయి. తాము అధికారంలోకి వస్తే రూ.3,000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. దీంతో కాంగ్రెస్ ఎత్తుగడను చిత్తు చేస్తూ ఈ ఆర్థిక సంవత్సరం నుంచే నిరుద్యోగ భృతి పథకాన్ని అమల్లోకి తేవాలని సీఎం భావిస్తున్నారు.

'ఓటుకు కోట్లు' కేసులో వాస్తవాలన్నీ చెబుతా

నా వాదనలు నేను వినిపించుకుంటా • పార్టీ ఇన్ పర్సన్‌గా అనుమతివ్వండి • సుప్రీంకోర్టులో జెరుసలేం మత్తయ్య పిటిషన్

- గతంలో నాకు ఎప్పటికప్పుడు కేసు గురించి చెప్పేవాళ్లు
- ఇప్పుడు ఎవ్వరూ కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు
- టీడీపీ, టీఆర్‌ఎస్ కలిసిపోయాయి
- నాకు భయమేసి అప్పు చేసి మరీ ఢిల్లీకి వచ్చా
- నా కేసును నేను వాదించుకుంటానని పిటిషన్ దాఖలు చేశా
- సీబీఐ దర్యాప్తు ద్వారానే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి



టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థికే ఓటేయాలంటూ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షలు లంచంగా ఇస్తున్న రేవంత్‌రెడ్డి (ఫైల్)

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్

ఓటుకు కోట్లు కేసులో వాస్తవాలన్నీ చెబుతానని, ఈ కేసులో తన వాదనలు తానే వినిపించుకుంటానని, ఇందుకు అనుమతినివ్వాలని కోరుతూ జెరుసలేం మత్తయ్య శుక్రవారం సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఇన్ పర్సన్ (న్యాయవాదితో సంబంధం లేకుండా)గా ఈ కేసులో హాజరయ్యేందుకు అనుమతి మంజూరు చేయాలని ఆయన తన పిటిషన్‌లో సుప్రీంకోర్టును కోరారు. ఆ తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ, తాను ఈ పిటిషన్ దాఖలు చేయడానికి దారి తీసిన పరిస్థితులను వివరించారు.

వారిద్దరి ప్రతీకారాలకు వాడుకున్నారు...

''నాతో మాట్లాడిన టీడీపీ ప్రభుత్వం, తెలంగాణ పోలీసులు గానీ ఈ కేసు గురించి సమాచారం ఇవ్వలేదు. మీడియాలో తెలుసుకుని ఒకవేళ వాయిదాకు రాకపోతే నాకు అరెస్టు వారెంటు జారీ అవుతుందేమోనని వచ్చా. హైకోర్టులో కేసు ఉన్నప్పుడు గంట గంటకు, రోజు రోజుకు వచ్చి అప్‌డేట్స్ అన్నీ ఇచ్చి హైకోర్టులో నా కేసు క్వాష్ అయ్యేవరకు నా వెంబడి ఉన్నవాళ్లు ఈరోజు సుప్రీంకోర్టుకు వస్తే నా వాయిదా డేట్ గురించి కూడా చెప్పడం లేదు. వారెంట్ జారీ అయితే నేను, నా కుటుంబ సభ్యులు జైలు పాలు కావడానికి ఏమైనా కుట్ర జరుగుతుందా అని ఆందోళనగా ఉంది. చంద్రబాబు, కేసీఆర్ ఏకమై చేస్తున్నారా అని భయంగా కూడా ఉంది. పార్టీ ఇన్ పర్సన్‌గా నేను హాజరై జరిగిన వాస్తవాలన్నీ చెబుతానని, నాకు జరిగిన నష్టాన్ని చెబుతానని, వారిద్దరూ నన్ను ఏ రకంగా వారి ప్రతీకారాలకు వాడుకున్నదీ, ఇద్దరు ఒకరిపై ఒకరు కేసులు పెట్టించుకుని నన్ను ఎలా వేదనకు గురిచేస్తున్నారో చెబుతానని ప్రధాన న్యాయమూర్తికి తెలియచేశాను. ఈ కేసులో నా నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకుంటానని, నాకు, నా కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని వేడుకున్నా..''అని చెప్పారు.

ఏపీ పోలీసులు నన్ను సైలెంట్‌గా ఉండమన్నారు

''ఓటుకు కోట్లు కేసులో రేవంత్ డబ్బులతో పట్టుబడ్డ నాటి నుంచి మొన్నటివరకు.. అంటే గత 2017 జూన్, జూలై వరకు వాళ్ల లాయర్లు నాతో మాట్లాడారు. ఆరు నెలలుగా ఏ సమాచారం ఇవ్వడం లేదు. 23వ తేదీన వాయిదా ఉందని తెలుసుకుని వచ్చా. వాయిదాకు రాకపోతే ఒక ముద్దాయికి శిక్ష పడుతుందని, వారెంట్ జారీ అవుతుందని వచ్చాను. అప్పుడు కేసులో పట్టుబడ్డవాళ్లు ఒక వర్గం వాళ్లు. ఒక వర్గం వాళ్లు పెట్టిన సాక్ష్యం చెల్లదు కాబట్టి.. తటస్థంగా ఉన్న ఒకరి సాక్ష్యం తీసుకోవాలని చెప్పి నా పేరు పెట్టారని తెలంగాణ ఏసీబీ డీఎస్పీ అశోక్‌కుమార్ చెప్పారు. నన్ను సాక్షిగా తీసుకుని వాళ్లను ఇరికించాలని కుట్రపన్నారు. దానికి నేను ఒప్పుకోలేదు. నాకు సంబంధం లేదని హైకోర్టు జడ్జి క్లీన్ చిట్ ఇచ్చారు. వాళ్లు పన్నిన పన్నాగానికి నేను లొంగలేదని కేటీఆర్ డ్రైవర్, గన్‌మెన్ ఫోన్ నుంచి నాకు ఫోన్ చేసి నన్ను బెదిరించారు. క్లాక్‌టవర్ దగ్గరికి రా.. వచ్చి మాట్లాడు అని ఫోన్ చేశారు. కేసున్నప్పుడు ముగ్గురు దొరికారు. వాళ్లపై కేసు ప్రూవ్ కావాలంటే తటస్థంగా ఉన్నవాడిగా నన్ను పెట్టాలని చూశారు. ఆ సీన్‌లో నేను లేను. డబ్బులు ఇచ్చినప్పుడు నేను లేను. నేను లొంగకపోవడంతో నన్ను తిట్టారు. నేను విజయవాడకు పోయాక నాకు ఫోన్ వచ్చింది. ఈ ఫోన్‌పై విజయవాడ పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాళ్లు కాల్‌డేటా తీశారు. ఆ ఫోన్ కాల్స్ కేటీఆర్ గన్‌మెన్, డ్రైవర్ ఫోన్ల నుంచి వచ్చాయని తేలింది. దీంతో ఏపీ పోలీసులు వాళ్లకు నోటీసులు ఇచ్చి తెలంగాణ క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లారు. ఆ ఆధారాల కోసం వాళ్లు కేసు పెట్టించుకున్నారు. వీళ్ల కోసం వీళ్లు కేసు పెట్టించుకున్నారు. హైకోర్టు వరకు బాగానే ఉన్నారు. నన్ను వేధించారు కదా వాళ్లపై కేసు పెట్టరా అని ఏపీ పోలీసులను అడిగాను. వాళ్లు నన్ను సైలెంట్‌గా ఉండమన్నారు. నా క్రైస్తవ సమస్యల మీద నేనేదో పోరాటం చేసుకుంటుంటే సుప్రీంకోర్టుకు వచ్చారు. అప్పీలుకు వచ్చినప్పుడు హైకోర్టు వరకు ఫాలో అప్ చేస్తున్నవాళ్లు ఇప్పుడు నాకు సమాధానం చెప్పడం లేదు. ఇంతకుముందు ఇంటెలిజెన్స్ వాళ్లు కూడా సమాచారం ఇచ్చేవాళ్లు. ఇప్పుడు ఇవ్వడం లేదు. అందుకే నేను భయపడి ఇప్పుడు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాను. వ్యక్తిగతంగా హాజరై వాదనలు వినిపిస్తానని వేడుకున్నా''అని వివరించారు.

సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని కోరా...

అనంతరం 'సాక్షి'తో మాట్లాడుతూ... రాజకీయ ప్రయోజనాల కోసం తెలుగుదేశం, టీఆర్‌ఎస్ పార్టీలు కలిసిపోయాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఓటుకు కోట్లు కేసు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కూడా ప్రధాన న్యాయమూర్తిని కోరానని తెలిపారు. సీబీఐ దర్యాప్తు ద్వారానే వాస్తవాలన్నీ వెలుగులోకి వస్తాయని వివరించారు. ఈ కేసులో తనకు సమాచారం ఇచ్చే వారెవ్వరూ లేకపోవడంతో వాస్తవాలను తెలుసుకునేందుకు తానే స్వయంగా అప్పు చేసి మరీ ఢిల్లీకి వచ్చానని చెప్పారు.

ఇదీ కేసు..

2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటు వేస్తే తనకు లంచంగా రూ.5 కోట్లు ఇవ్వడానికి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి తదితరులు ప్రయత్నిస్తున్నారంటూ నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ ఏసీబీ అధికారులుకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఇందులో రేవంత్‌రెడ్డి, అనుసంధానకర్త జెరుసలేం మత్తయ్య, సబాస్టియన్ తదితరులను నిందితులుగా పేర్కొన్నారు. ఏసీబీ అధికారులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మత్తయ్య 2015 జూన్ 17న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు మత్తయ్య అరెస్ట్‌పై స్టే విధించింది. ఆ తరువాత తుది విచారణ జరిపి ఓటుకు కోట్లు కేసులో మత్తయ్యపై ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసును కొట్టేస్తూ హైకోర్టు 2016 జూన్ 3న తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ తెలంగాణ ఏసీబీ అధికారులు 2016లో సుప్రీంకోర్టు స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్ ప్రకారం ఈ పిటిషన్ ఏప్రిల్ 8న విచారణకు రానున్నది.

ఇదం జగత్



... యాక్షన్‌లో కాదెహె

నేటి నుంచి టీఆర్‌టీ పరీక్షలు

స్కూల్ అసిస్టెంట్ పోస్టులకే అత్యధిక పోటీ

- 1,941 పోస్టులకు 1.44 లక్షల దరఖాస్తులు
- 5,415 ఎస్‌జీటీ పోస్టులకు 89,000
- జిల్లాలవారీగా మహబూబ్‌నగర్‌లో అత్యధిక పోటీ
- 2.77 లక్షల్లో 43 వేల మంది ఆ జిల్లావారే
- ఎస్‌జీటీల్లో రెండో స్థానంలో మెదక్ అభ్యర్థులు..
- స్కూల్ అసిస్టెంట్‌లో నల్లగొండ నుంచి అత్యధికులు

సాక్షి, హైదరాబాద్

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శనివారం నుంచి మార్చి 4వ తేదీ దాకా జరగనున్న పరీక్షలకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,77,518 మంది పరీక్షలు రాయనున్నారు. ఉదయం పదింటికి మొదలయ్యే పరీక్షలకు 9:15 కల్లా, మధ్యాహ్నం 2:30 పరీక్షలకు 1:45 కల్లా అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. ''హాల్‌టికెట్‌తో పాటు ఏదో ఒక ఒరిజినల్ ఐడీ కార్డు విధిగా వెంట తీసుకెళ్లాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలూ, అభరణాలూ తేవొద్దు. పరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతాయి'' అని పేర్కొంది. తొలిరోజు శనివారం ఉదయం లాంగ్వేజ్ పండిట్ తెలుగు, మధాహ్నం స్కూల్ అసిస్టెంట్ తెలుగు పరీక్షలుంటాయి.



స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లోనే అత్యధిక పోటీ

స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) పోస్టులు తక్కువున్నా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్) అభ్యర్థులు ఎక్కువగా ఉండటంతో వీటికి అధిక పోటీ నెలకొంది. 1,941 పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 1,44,906 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) అభ్యర్థులు తక్కువగా ఉండటంతో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులకు మాత్రం పోటీ తక్కువే ఉంది. ఒక్కో పోస్టుకు 16.49 మంది పోటీ పడుతున్నారు. పోస్టుల్లో 80 శాతం జిల్లా స్థాయి లోకల్ పోస్టులే కావడంతో ప్రధాన పోటీ జిల్లా పరిధిలోనే ఉండనుంది. మిగతా 20 శాతం ఓపెన్ పోస్టుల్లో అన్ని జిల్లాల వారూ పోటీలో ఉంటారు. ఉపాధ్యాయ పోస్టులకు అత్యధిక పోటీ మహబూబ్‌నగర్‌లోనే నెలకొంది. జిల్లాలో 1,979 పోస్టులకు 42,529 మంది పోటీ పడుతున్నారు. స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) మినహా మిగతా అన్ని కేటగిరీల్లోనూ మహబూబ్‌నగర్‌లోనే అత్యధిక పోటీ నెలకొంది. ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో నల్లగొండలో, ఎస్‌జీటీ పోస్టుల్లో మెదక్‌లో ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా 19,396 మంది, ఆ తర్వాత నల్లగొండలో 18,798 మంది పోటీ పడుతున్నారు. ఎస్‌జీటీ పోస్టులకు మహబూబ్‌నగర్‌లో 17,639 మంది, ఆ తర్వాత మెదక్‌లో 11,173 మంది పోటీ పడుతున్నారు.

ఓపెన్ కోటాకు అన్ని జిల్లాల్లో పోటీ

కొన్ని జిలాల్లో కొన్ని కేటగిరీలో పోస్టులు లేవన్న ఆందోళన ఈసారి అభ్యర్థులకు అవసరం లేదు. ఇతర జిల్లాలోని ఓపెన్ కోటా పోస్టు కోసం సొంత జిల్లాను వదిలి, ఇతర జిల్లాకు వెళ్లి పరీక్ష రాయాల్సిన అవసరం లేదు. అభ్యర్థులిచ్చే జిల్లా ప్రాధాన్యాల ఆప్షన్ ప్రకారం ఆయా జిల్లాల్లోని ఓపెన్ కోటా పోస్టులకు అన్ని జిల్లాల అభ్యర్థులూ పోటీలో ఉండేలా ఏర్పాటు చేశారు.

ఇవీ జిల్లాలవారీగా పోస్టులు-దరఖాస్తులు

జిల్లా	పండిట్	పీఈటీ	ఎస్‌ఏ-పీఈ	ఎస్‌ఏ	ఎస్‌జీటీ
ఆదిలాబాద్	122-2,243	25-1,247	3-179	118-10,187	1,314-9,700
హైదరాబాద్	23-416	35-182	0-26	153-3,363	206-759
కరీంనగర్	95-2,562	117-1,346	3-220	249-17,998	74-5,486
ఖమ్మం	81-1,998	13-732	0-108	92-11,059	160-4,911
మహబూబ్‌నగర్	123-3,038	36-2,270	0-186	391-19,396	1,429-17,639
మెదక్	125-2,374	33-1,521	2-131	214-11,226	876-11,173
నల్లగొండ	100-2,632	56-1,783	0-203	307-18,798	40-7,799
నిజామాబాద్	100-1,597	35-1,253	1-109	85-8,056	319-8,537
రంగారెడ్డి	146-1,788	16-991	0-110	192-9,828	915-8,678
వరంగల్	96-2,630	50-1,468	0-131	140-15,030	82-5,119
నాన్‌లోకల్	0-421	0-1,310	0-90	0-2,179	0-3,821
ఇతర	0-2,518	0-2,803	0-684	0-17,676	0-5,655
మొత్తం	1,011-24,217	416-16,906	9-2,178	1,941-1,44,906	5,415-89,311

(ఎస్‌ఏ-పీఈ = స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్)

పెరుగుతున్న ఎండలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో పలుచోట్ల 36 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ఒకట్రెండు డిగ్రీలు ఎక్కువగా భద్రాచలం, మహబూబ్‌నగర్, రామ గుండంలలో 36 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఆదిలాబాద్‌లో 35 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు రాత్రి వేళ చలి తీవ్రత తగ్గుతోంది.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు 'టెక్నాలజీ' అవార్డు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర మహిళాభి వృద్ధి, శిశు సంక్షేమ శాఖ టెక్నాలజీ సభ అవార్డుకు ఎంపికైంది. సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవటంలో ఆ శాఖ చేస్తున్న కృషికిగాను ఈ అవార్డు దక్కింది. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ నిర్వహించిన కార్యక్రమంలో హడ్కో సీఎండీ ఎన్ రవికాంత్ చేతుల మీదగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఐటీ విభాగాధిపతి రమేశ్ అవార్డు అందుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల జియో ట్యాగింగ్, సరుకుల పంపిణీలో సప్లై చైన్ సిస్టం, అంగన్‌వాడీ సిబ్బంది హాజరులో బయోమెట్రిక్ విధానాన్ని ఆ శాఖ విజయవంతంగా అమలు చేస్తోంది.

'టీఆర్‌టీ'ని నిలిపివేయలేం

- పరీక్షల రద్దుకు నిరాకరించిన హైకోర్టు
- ఆన్‌లైన్ పరీక్షలను తప్పుపడుతూ పలువురి పిటిషన్
- చివరి రోజు వ్యాజ్యం వేయడంపై ధర్మాసనం ఆగ్రహం
- వ్యాజ్యం ఉపసంహరించుకున్న పిటిషనర్లు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ నియామక పరీక్షలు (టీఆర్‌టీ) నిలుపుదల ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. నిరుద్యోగులు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న తరుణంలో టీఆర్‌టీ నోటిఫికేషన్ వెలువడిందని.. ఈ దశలో నిలుపుదల చేయడం సముచితం కాదని హైకోర్టు అభిప్రాయపడింది. నేడు (శనివారం) టీఆర్‌టీ పరీక్ష జరగనుందని, చివరి క్షణాల్లో అత్యవసరంగా వచ్చి పరీక్షలు నిర్వహించకుండా ఉత్తర్వులు ఇవ్వమని కోరడం సమర్థనీయం కాదని ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు తేల్చి చెప్పారు. పరీక్షలు నిలుపుదల చేయాలని మధ్యంతర ఆదేశాలిస్తే అభ్యర్థులు మానసికంగా ఎంత బాధ పడతారో ఒక్కసారి ఆలోచించాలన్నారు. ఒక దశలో వ్యాజ్యాన్ని కొట్టేయడానికి న్యాయమూర్తి సిద్ధపడ్డారు. వ్యాజ్యాన్ని తోసిపుచ్చమంటారా లేక మీరే వ్యాజ్యాన్ని ఉపసంహరించుకుంటారా అని పిటిషనర్‌ను నిలదీశారు. దీంతో వ్యాజ్యాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పడంతో అందుకు న్యాయమూర్తి అనుమతించారు. ఆన్‌లైన్‌లో టీఆర్‌టీ పరీక్షలు నిర్వహించబోతున్నారని, దీనికి బదులు రాత పరీక్ష నిర్వహించాలని కోరుతూ నల్లగొండ జిల్లాకు చెందిన డి.సతీశ్‌రావు సహా నలుగురు హైకోర్టులో శుక్రవారం అత్యవసరంగా వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.

ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ముందే వెల్లడి..

టీఆర్‌టీ పరీక్షలను వాయిదా వేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని విచారణలో పిటిషనర్ల తరఫు న్యాయవాది రాజశ్రీ వాదించారు. ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తే అభ్యర్థి రాసే జవాబు తప్పుఒప్పుల్ని తెలుసుకునే వీలుండదని చెప్పారు. మూడు లక్షల మంది అభ్యర్థులు టీఆర్‌టీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని, మరో రోజు వ్యవధి ఉండగా పరీక్షల్ని వాయిదా వేయాలని కోరడం సరికాదని రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి ప్రతివాదన చేశారు. టీఆర్‌టీ పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ముందుగానే ప్రకటించినట్లు వెల్లడించారు. లక్షల మంది నిరుద్యోగ అభ్యర్థుల భవితవ్యంతో ముడిపడిన టీఆర్‌టీ పరీక్షల్ని వాయిదా వేయవద్దని కోరారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం టీఆర్‌టీ పరీక్షల నిలిపివేసేందుకు నిరాకరించింది.

బాబ్లీ నీటిపై 'మహా' నాటకం!

0.6 టీఎంసీల విడుదలకూ మహారాష్ట్ర కుంటిసాకులు..

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదిపై శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్ర నిర్మించిన వివాదాస్పద బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరిచే విషయంలో మహారాష్ట్ర కొత్త నాటకానికి తెరలేపింది. రాష్ట్రానికి దక్కాల్సిన చిన్నపాటి నీటి వాటాను సైతం అడ్డుకునేందుకు ఎత్తులు వేస్తోంది. మార్చిలో తెలంగాణకు రావాల్సిన 0.6 టీఎంసీల నీటిని విడుదల చేయలేమంటూ రాష్ట్రానికి లేఖ రాసింది. ఎగువన ప్రాజెక్టుల్లో చెప్పుకోదగ్గ నిల్వలు ఉన్న నేపథ్యంలో బాబ్లీ నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన నీటిని విడుదల చేయాల్సిందేనంటూ రాష్ట్రం స్పష్టం చేస్తోంది.

సుప్రీం చెప్పినా కూడా..: ఉత్తర తెలంగాణ నాలుగు జిల్లాల్లోని 7 లక్షల ఎకరాలకు ప్రధాన నీటి వనరుగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు గోదావరి జలాలను అడ్డుకునే బాబ్లీ ప్రాజెక్టుపై నాలుగేళ్ల కింద సుప్రీం తీర్పు వెలువరించింది. దీని ప్రకారం ఏటా జూలై 1న గేట్లు తెరిచి అక్టోబర్ 28 వరకు నది సహజ ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని మహా రాష్ట్రను ఆదేశించింది. అక్టోబర్ 29 నుంచి మరుసటి ఏడాది జూన్ 30వరకు ప్రాజెక్టు గేట్లు మూసి ఉంచాలని సూచించింది. అలాగే మార్చి 1న కచ్చితం గా గేట్లు ఎత్తి 0.6 టీఎంసీల నీటిని దిగువకు వదలాలని సూచించింది. ఈ ఆదేశాల మేరకు అక్టోబర్ 29న ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తింది. మళ్లీ మార్చి 1న వాటిని తెరవాల్సి ఉంది. అయితే ప్రస్తుతం బాబ్లీ ప్రాజెక్టులో కేవలం 0.048 టీఎంసీల మేర మాత్రనే నీరుందని మహారాష్ట్ర అంటోంది. ఈ నేపథ్యంలో నీటి విడుదల సాధ్యం కాదని ఇటీవల నాందేడ్ చీఫ్ ఇంజనీర్ ఎస్సారెస్పీ అధికారులకు లేఖ రాశారు. నిజానికి మహారాష్ట్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా బాబ్లీ ఎగువన ఉన్న గైక్వాడ్ ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 102.73 టీఎంసీలకు గానూ 77.77 టీఎంసీల నిల్వలు న్నాయి. గైక్వాడ్ దిగువన విష్ణుపురి ప్రాజెక్టులోనూ 2.7 టీఎంసీల సామర్థ్యానికి గాను 2 టీఎంసీల నిల్వ లున్నాయి. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 90.313 టీఎంసీల సామర్థ్యానికి గాను 26.98 టీఎంసీలే ఉన్నాయి. దీంతో సుప్రీం ఆదేశాల మేరకు 0.6 టీఎంసీ నీటిని విడుదల చేయాల్సిందేనంటూ ఎస్సా రెస్పీ ప్రాజెక్టు అధికారులు నాందేడ్ చీఫ్ ఇంజనీర్‌కు లేఖ రాశారు.

అక్కడ ఉత్పత్తి.. ఇక్కడ ఉత్తుత్తి



ఇది రైలు బోగీల ఫ్రేమ్స్ తయారు చేసే ఫియెట్ కార్ఖానా. కర్ణాటకలోని యద్గీర్‌లో నిర్మితమైంది. 2014లో దీనికి శంకుస్థాపన జరగ్గా గతేడాది ఉత్పత్తి ప్రారంభమైంది. ప్రత్యక్షంగా 500 మందికి పరోక్షంగా 2 వేల మందికిపైగా ఉపాధి కల్పిస్తోంది. రూ.90 కోట్ల వ్యయంతో 150 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో దీన్ని రెండు రెట్ల సామర్థ్యానికి విస్తరించే యోచన ఉంది.



ఇది కాజీపేటలో వ్యాగన్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాపు నిర్మించబోయే స్థలం. ఈ ప్రాజెక్టు మంజూరై పదేళ్లు కావస్తోంది. 160 ఎకరాల్లో దీన్ని నిర్మించాల్సి ఉంది. రైల్వే శాఖ బడ్జెట్‌లో దీనికి నిధులు కేటాయించటం, అవి మురిగిపోయి వెనక్కు వెళ్లిపోవడం ఆనవాయితీగా మారింది. తొలుత వ్యాగన్ ఫ్యాక్టరీ, ఆ తర్వాత వ్యాగన్ వర్క్‌షాప్, ఆ తర్వాత వ్యాగన్ పీరియాడికల్ ఓవర్ హాలింగ్ యూనిట్.. ఇలా మారుతూ వచ్చింది. కానీ కనీసం భూమి పూజ కూడా కాలేదు.

- కర్ణాటక రైల్వే యూనిట్ కళకళ
- దానికన్నా ముందే మంజూరైన మన ప్రాజెక్టు వెలవెల

సాక్షి, హైదరాబాద్: ఈ రెండు ఉదంతాలకు దక్షిణ మధ్య రైల్వేనే వేదికైంది. మరి అక్కడ అలా ఇక్కడ ఇలా ఎందుకున్నట్టు... రాష్ట్ర ప్రభుత్వం-రైల్వే శాఖ మధ్య సమన్వయ లోపం ప్రాజెక్టులకు శాపంగా మారింది. రైల్వే ప్రాజెక్టులు, లైన్ల విషయంలో తెలంగాణ వెనుకబడినందున రైల్వే శాఖపై ఒత్తిడి తెచ్చి కొత్త వాటిని సాధించుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. కాజీపేటకు దశాబ్దం క్రితం మంజూరైన ప్రాజెక్టు జాప్యానికి.. అందుకు కేటాయించిన భూమిపై వివాదాలు ఏర్పడటమే కారణం. దేవాదాయ శాఖకు చెందిన భూమిని నేరుగా రైల్వేకు కేటాయించే వెసులుబాటు లేకపోవటంతో న్యాయపరమైన చిక్కులు ఏర్పడ్డాయి. ఇప్పటికీ ఆ చిక్కులు వీడలేదు. ఇంకా జాప్యం చేస్తే ఆ వర్క్‌షాప్ కూడా చేజారిపోయే ప్రమాదం ఉన్నట్టు రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా భూమి తమకు స్వాధీనపరుస్తారనే నమ్మకంతో రైల్వే శాఖ ఇటీవలి బడ్జెట్‌లో దానికి రూ.250 కోట్లు కేటాయించింది. స్థలం స్వాధీనమైన 18 నెలల్లో ఉత్పత్తి ప్రారంభించేలా వర్క్‌షాప్ సిద్ధం చేస్తామని స్వయంగా దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్ కుమార్ యాదవ్ చెబుతున్నారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 వేల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. కాజీపేట కీలక రైల్వే జంక్షన్ అయినందున భవిష్యత్తులో అది పెద్ద యూనిట్‌గా మారే వీలుంది.

శాటిలైట్ టెర్మినళ్లు అంతే..: సికింద్రాబాద్, నాంపల్లి స్టేషన్ల విస్తరణకు అవకాశం లేకపోవటంతో ఇప్పుడు రైళ్లు ప్లాట్‌ఫామ్ దొరక్క శివారు ప్రాంతాల్లో అరగంట నుంచి గంటపాటు నిలబడాల్సి వస్తోంది. దీంతో చర్లపల్లి, వట్టి నాగులపల్లిల్లో శాటిలైట్ టెర్మినల్స్ నిర్మించాలని గతంలో రైల్వే శాఖ ప్రతిపాదించింది. ఇందుకు చర్లపల్లిలో 150 ఎకరాలు, నాగులపల్లిలో 300 ఎకరాలు కావాలని కోరింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రాకపోవటంతో చర్లపల్లిలో అందుబాటులో ఉన్న 50 ఎకరాల్లో 3 అదనపు ప్లాట్‌ఫామ్స్, 3 పిట్‌లైన్స్‌తో టెర్మినల్ నిర్మించేందుకు రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. నాగులపల్లిలో 300 ఎకరాలు ఇవ్వలేమని, 150 ఎకరాల వరకు ప్రయత్నిస్తామని ఇటీవల ప్రభుత్వం చెప్పటంతో రైల్వే శాఖ కంగుతింది. శంషాబాద్ విమానాశ్రయాన్ని ఎంఎంటీఎస్‌తో అనుసంధానించాలని రైల్వే నిర్ణయించింది. కానీ దీనికి విమానాశ్రయ నిర్వహణ చూసే జీఎంఆర్ సుముఖంగా లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థను ఒప్పించాలని ప్రభుత్వాన్ని రైల్వే కోరింది. కానీ ఇప్పటి వరకు ఆ ప్రయత్నమే కనిపించటం లేదు. ఈలోపు విమానాశ్రయానికి మెట్రో రైల్ అనుసంధానంపై వార్తలు వస్తుండటంతో ఎంఎంటీఎస్ అనుసంధానం జరగదని రైల్వేశాఖ నిర్ణయానికి వచ్చేసింది.


సాక్షి
శనివారం, ఫిబ్రవరి, 24

చిక్కుల్లో ఆప్ సర్కారు

సరిగ్గా మూడేళ్లక్రితం జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలను మట్టి కరిపించి 70 స్థానాలకు 67 గెల్చుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ని వరస సంక్షోభాలు చుట్టుముడుతూనే ఉన్నాయి. ఆ పార్టీకి అసెంబ్లీలో ప్రత్యర్థులు దాదాపు లేకపోవచ్చుగానీ వెలుపల చాలామంది ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ల సంగతలా ఉంచి కేంద్ర ప్రభుత్వం, లెఫ్టినెంట్ గవర్నర్, ఉన్నతాధికారగణం వగైరాలతో అది వ్యవహరించాల్సి ఉంటుంది. కనుకనే ఆచితూచి అడుగేయడం ఆ పార్టీకి అవసరం. కానీ చాలాసార్లు ఆ విషయంలో అది విఫలమవుతూనే వస్తోంది. తాజాగా అక్కడి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షుప్రకాష్‌పై ఆప్ ఎమ్మెల్యేలిద్దరు చేయి చేసుకున్న ఉదంతం ఆ సంగతిని రుజువు చేస్తోంది. రాజ్యాంగబద్ధంగా రావలసినవి రాబట్టుకోవడం ముఖ్యమే. కానీ అందుకు అనుసరించే విధానాలు హేతుబద్ధంగా ఉండాలి. పోరాటం విడనాడి ప్రాధేయపడాలని ఎవరూ చెప్పరు. న్యాయంగా రావలసినవాటి గురించి పోరాడటం వేరు-అందుకు దౌర్జన్యానికి దిగడం వేరు. 2015 ఫిబ్రవరిలో అఖండ మెజారిటీ సాధించాక పార్టీ శ్రేణులనుద్దేశించి కేజ్రీవాల్ పదే పదే చెప్పిన మాట-అహంకారాన్ని దరిదాపులకు రానీయొద్దన్నదే. ఈ ఫలితాలు తనను భయపెడుతున్నాయని కూడా అప్పట్లో ఆయనన్నారు. ఇందుకు కారణాలున్నాయి. పోలైన ఓట్లలో 54.3 శాతం ఆయన పార్టీ ఖాతాలోనే పడ్డాయి. కాంగ్రెస్, బీజేపీలకొచ్చిన ఓట్ల శాతాలను కలిపినా అది ఆప్ దరిదాపుల్లో లేదు. బీజేపీకి 32.3 శాతం, కాంగ్రెస్‌కు 9.7 శాతం మాత్రమే వచ్చాయి. కనుకనే కేజ్రీవాల్ తమ పార్టీ శ్రేణులకు అంతగా హితవు చెప్పారు. కానీ ఢిల్లీ ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేల్లో కొందరి సంగతలా ఉంచి కేజ్రీవాలే దీన్ని మరిచిపోయారని ఈ మూడేళ్లలో జరిగిన పరిణామాలు చెబుతున్నాయి. ఏదో విషయంలో అటు కేంద్రంతోనూ, ఇటు అధికార యంత్రాంగంతోనూ అక్కడి ప్రభుత్వం ఘర్షణ పడుతూనే ఉంది.

ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అధికార నివాసంలో సమావేశం జరిగినపుడు ఆప్ ఎమ్మెల్యేలు అమనతుల్లా ఖాన్, ప్రకాష్ జర్వాలు తనపై పిడిగుద్దులు కురిపించి గాయపరిచారని అన్షుప్రకాష్ కేసు పెట్టగా, ఆయన తమను కులం పేరుతో దూషించాడని ప్రకాష్ జర్వాతోపాటు మరో ఎమ్మెల్యే అజయ్ దత్ కేసు పెట్టారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పెట్టిన కేసులో ఇద్దరు ఎమ్మెల్యేలనూ అరెస్టు చేసి రిమాండుకు పంపారు. తొలుత ఈ ఘటనను తాను చూడలేదని బుధవారం చెప్పిన కేజ్రీవాల్ సలహాదారు వీకే జైన్... ఆ తర్వాత స్వరం మార్చి అందుకు తాను ప్రత్యక్షసాక్షినని గురువారం వాంగ్మూలం ఇచ్చారు. ఇందులో నిజానిజాలేమిటన్న సంగతలా ఉంచి అసలేమీ జరగకుండా పరిస్థితి ఇంతవరకూ రాదన్నది వాస్తవం. చానెళ్లకు విడుదల చేయాల్సిన ఒక వాణిజ్య ప్రకటన గురించి, రేషన్ పంపిణీ గురించి ఇంత వివాదం తలెత్తిందంటే, అది సీనియర్ ఐఏఎస్ అధికారిని కొట్టేంతవరకూ వచ్చిందంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇంతకూ రేషన్ పంపిణీ గురించి జరిగిన ఈ సమావేశంలో పౌరసరఫరాల మంత్రి ఇమ్రాన్ హుస్సేన్ లేరు! ఇలా అధికారులతో ఆప్ నేతలు గొడవపడటం తొలిసారి కాదు. కీలకమైన అధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వం వద్దే కేంద్రీకృతమైన ఢిల్లీ వంటిచోట కొందరు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వంపై చిన్నచూపు ఉన్నదంటే అందులో వింతేమీ లేదు. అలాంటి పరిస్థితిని తమకు అనుకూలంగా మలుచుకుని ఎదగడానికి ప్రయత్నించేవారు సహజంగానే ఉంటారు. అలాగే ఎన్నికైన ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో మంచి చేయడానికి ప్రయత్నిస్తున్నారని గ్రహించి ప్రజలకు ఉపయోగపడే పథకాలు, కార్యక్రమాలు అమలు కావడానికి దోహదపడేవారూ ఉంటారు. అంతిమంగా ఇలాంటి అధికారులందరితో పనిచేయించుకోవాల్సింది, సమన్వయంతో మెలగాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే. కేంద్ర, రాష్ట్రాల మధ్య వైరం వల్ల తమకు సస్పెన్షన్లు, వేతనాల కోతలు, సీబీఐ దాడులు తప్పడం లేదని ఆమధ్య ఢిల్లీ ఐఏఎస్‌ల సంఘం, సబార్డినేట్ సర్వీసుల సంఘం ఆవేదన వ్యక్తం చేశాయి. ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలపై అఖిల భారత ఐఏఎస్‌ల సంఘం సకాలంలో స్పందించి అటు తమ సహచరుల పనితీరు విషయంలో సలహాలిస్తూ ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి వారెదుర్కొంటున్న సమస్యల్ని తీసుకెళ్లి ఉంటే పరిస్థితి ఇంతవరకూ వచ్చేది కాదు. ఈ పరిణామాల పర్యవసానంగా కేజ్రీవాల్ ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతిన్నట్టే అధికారగణం విశ్వసనీయతపై కూడా సందేహాలు ఏర్పడుతున్నాయని ఆ సంఘం గుర్తించాలి.

ఢిల్లీ పరిస్థితి విచిత్రమైనది. అక్కడ పేరుకు ప్రభుత్వం, అసెంబ్లీ ఉన్నా... ఆ ప్రభుత్వం దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరి అధికారాలు చలాయించలేదు. శాసనాలు చేయడానికి అసెంబ్లీకి ఉండే అధికారాలు కూడా పరిమితమైనవి. ప్రతి దానికీ కేంద్రం వైపు చూడాల్సిందే. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా అత్యంత కీలకమైన ఉపకరణమని భావించే పోలీసు శాఖ కూడా కేంద్రం చేతుల్లోనే ఉంటుంది. అది దేశ రాజధాని ప్రాంతం కావడం వల్ల రాజ్యాంగంలోని 239ఏఏ అధికరణ ద్వారా ఈ ప్రత్యేక పరిస్థితిని కల్పించారు. అయితే ఢిల్లీకి పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రతిపత్తి ఇస్తామని ఒకానొక సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్, బీజేపీలు రెండూ కేంద్రంలో తమ నేతృత్వంలో ప్రభుత్వాలు వచ్చినా ఆ హామీ నెరవేర్చడానికి సిద్ధపడలేదు. 2013లో ఎన్నికై స్వల్పకాలం పాలించిన సమయంలో యూపీఏ సర్కారు ఉన్నా, ఇప్పుడు ఎన్‌డీఏ సర్కారున్నా ఆప్ సమస్యలు షరా మామూలే. ఢిల్లీ సర్కారుకు తగినన్ని అధికారాలివ్వడమంటే వ్యక్తిగతంగా కేజ్రీవాల్‌కు అధికారాలివ్వడం కాదు. ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజల అభీష్టాన్ని, ఆకాంక్షలను గుర్తించడం. వారికి మెరుగైన పాలన అందడానికి దోహదపడటం. భిన్నాభిప్రాయాలున్న వ్యక్తులనూ, పార్టీలనూ, ప్రభుత్వాలనూ గౌరవించే సంస్కృతిని ఆచరిస్తే ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. వారికి కూడా ప్రజాస్వామిక సంస్కృతి అలవడుతుంది. అందుకు బదులుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం కలహించుకున్నప్పుడు ఓడేది ప్రజాస్వామ్యమే.



ప్రజాస్వామ్యం అనేది ఒక ప్రభుత్వ రూపం మాత్రమే కాదు. అది అందరూ పాటించి తీరవలసిన కొన్ని సూత్రాల సమ్మేళనం.

– ఉడ్రో విల్సన్
అమెరికా పూర్వ అధ్యక్షుడు

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి శు.నవమి రా. 7.53 వరకు, తదుపరి దశమి, నక్షత్రం రోహిణి ఉ.9.11 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం ప.2.23 నుంచి 3.54 వరకు, దుర్ముహూర్తం ఉ.6.24 నుంచి 7.57 వరకు అమృతఘడియలు ఉ.6.09 నుంచి 8.11 వరకు.

సూర్యోదయం : 6.27
సూర్యాస్తమయం : 5.59
రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుంచి 3.00 వరకు

నమాజ్ వేళలు



ఫజర్	5.25	మగ్రీబ్	6.21
జొహర్	12.29	ఇషా	7.34
అసర్	4.43		

ఈ ధోరణికి పేరేమిటి?



శేఖర్ గుప్తా

ఆ పార్టీ వాళ్లు ఇలాంటి హింసను చట్టబద్ధం చేస్తే ఆ స్థాయి అధికారుల మీద దాడికి సంబంధించి దేశం నలుమూలలా ఉన్న కొరకరాని కొయ్యల వంటి రాజకీయనాయకులకు వేరే విధమైన సంకేతాలు వెళతాయి. నిజాయితీ కల అధికారి ఒక ముఖ్యమంత్రి లేదా కేంద్ర మంత్రి ఆదేశాలను తప్పుడు ఆదేశాలుగా భావించి తిరస్కరించినప్పుడు దానికి పరిష్కారం ఊహించండి. అలాంటి అధికారిని మీ ఇంట్లో జరిగే భేటీలోనో లేక అతడి కార్యాలయంలోనో చితకబాదడమే పరిష్కారమా?

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) గుండెలు తీసిన భయానక వీధి రౌడీలతో రూపొందిందన్న విషయంలో ఎవరికీ అనుమానం లేదు. కానీ ఆప్‌ను గట్టిగా వ్యతిరేకించేవారితో సహా చాలామంది అంగీకరించే మరొక విషయం మాత్రం ఉంది. నరేంద్ర మోదీ ప్రభ వెలిగిపోతున్న కాలంలో, అంటే 2014–15 సంవత్సరం శీతాకాలంలో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆప్ 70 స్థానాలకుగాను 67 చోట్ల గెలిచింది. అలా అధికారం చేపట్టినప్పటి నుంచి బీజేపీకి అది ఇబ్బందికరంగా పరిణమించింది. కేంద్రం ఆ పార్టీ ప్రభుత్వంతో ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభించింది కూడా. ఆఖరికి పూర్తి రాష్ట్ర హోదా లేనప్పటికి, ఉన్న ఆ తక్కువ అధికారాలను కూడా చలాయించకుండా కేంద్రం అడ్డంకులు సృష్టిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి, మృదుభాషి, చాలామంది అభిమానించే అన్షు ప్రకాశ్ (1986 బ్యాచ్) మీద సోమవారం రాత్రి సాక్షాత్తు ముఖ్యమంత్రి నివాసంలో చేయి చేసుకున్న సంఘటన జరిగిందని చెబితే, దానిని చాలామంది సందేహిస్తారంటే నేను నమ్మను.

ప్రభుత్వాలకీ, అధికారులకీ ఘర్షణ పాతదే

ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలకీ, ప్రభుత్వోద్యోగులకీ మధ్య ఘర్షణ కొత్త విషయం కాదు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సహా ప్రభుత్వోద్యోగులను ముఖ్యమంత్రులు కించపరిచే సంస్కృతి కూడా కొత్తది కాదు. చాలామంది నాయకులు అధికారులను తమ తస్మదీయుల చుట్టూ తిరిగేటట్టు చేసి, అందులో నుంచి పైశాచిక ఆనందం పొందుతూ ఉంటారు.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మాయావతి అధికారుల బదలీ విషయంలో మహారాణి అనిపించుకున్నారు. అలాంటి అధికారాన్ని చలాయించడం గర్వకారణంగా కూడా ఆమె భావించేవారు. 2005లో ఆమెతో నేను 'వాక్ ది టాక్'ఇంటర్వ్యూ చేసినప్పుడు ఈ విషయాన్ని మాయావతి ఘనంగా చెప్పారు కూడా. తన గురువు కాన్షీరామ్‌ను మొదటిసారి కలుసుకున్నప్పుడు (ఈ ఇంటర్వ్యూ జరుగుతున్నప్పుడు కాన్షీరామ్ హుమాయూన్ రోడ్‌లోని నివాసం ఫస్ట్‌ఫ్లోర్‌లో కోమాలో ఉన్నారు) ఆమె ఐఏఎస్ పరీక్షకు సమాయత్తమవుతున్నారు. ఐఏఎస్ పరీక్షను పట్టించుకోవద్దనీ, తనతో పాటు రాజకీయాలలో చేరమని ఆయన చెప్పారు. 'నీవు మామూలు ఐఏఎస్ అధికారివి కావాలని అనుకుంటున్నావు. కానీ ఆ ఐఏఎస్ అధికారులంతా నీ చుట్టూ తిరిగేటట్టు నేను చేస్తాను' అని ఆయన అన్నారు. అలాగే చేసిన వాగ్దానాన్ని కాన్షీరామ్ నిలబెట్టుకున్నారు కూడా. బెహెన్జీ కూడా ఏమీ తగ్గకుండా వారిని తన చుట్టూ తిప్పించుకున్నారు. 2007 ఎన్నికల సమయంలో బదయూన్‌లో జరిగిన ఒక సభలో సభికుల హర్షధ్వానాల నడుమ ఇందుకు తగ్గట్టే ఆత్మస్తుతి కూడా చేసుకున్నారు. తను పేరు చెబితేనే ఉద్యోగస్వామ్యం గడగడలాడిపోతుందని ఆమె అన్నారు.

మాయావతి అంటే గడగడలాడిపోవడానికి అవసరమైనంత భయాన్ని ఆమె అధికారులకి పుష్కలంగా ఇచ్చారు. ఆమె తరుచూ వారిని బదలీలు చేసేవారు. బదలీ చేసిన కొత్త ప్రదేశానికి వారు కుటుంబాలను తరలించే అవకాశం లేకుండా అవి జరిగేవి. దీనితో కుటుంబాలను పదే పదే తిప్పడం ఇష్టం లేక ఉద్యోగులు సర్క్యూట్ హౌస్‌లో మకాం పెట్టేవారు. చదువుకుంటున్న పిల్లలు ఉంటే మరీ ఇబ్బంది. ఏ పోస్టులో ఎవరు ఎంతకాలం ఉంటారో ఎవరికీ తెలిసేది కాదు. నిజానికి మాయావతి అంటే ఎంత భయపడేవారో, అంతగానూ అధికారులు ద్వేషించేవారు. కేంద్ర సర్వీసులలోకి, ఆఖరికి ద్వితీయ స్థానాలకు వెళ్లడానికి కూడా ప్రయత్నించేవారు.

ఇలా ఉద్యోగుల పట్ల దురుసుగా వ్యవహరించిన రాష్ట్రాలలో నాకు తెలిసి హరియాణా కూడా ఉంటుంది. మరీ ముఖ్యంగా బన్సీలాల్, ఓంప్రకాశ్ చౌతాలా హయాములు అధికారులను వేధించడానికి పేర్గాంచాయి. ఆ సమయంలో అక్కడ తరుచూ ఉద్యోగుల బదలీలు ఉండేవి. వారి మీద అవినీతి కేసులు మోపేవారు. విజిలెన్స్ దర్యాప్తులు వంటి చర్యలు ఉండేవి. అలాగే అంతకు ముందు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ఇష్టులని పేరు పడిన వారికి బాధ్యతలు అప్పగించకుండా కూర్చోబెట్టడం కూడా జరిగేది (ఇలాంటి శిక్షకే ఖుద్దే లైన్ అని పేరు. అదేమిటో అనువదించి చెప్పడం ఇక్కడ బొత్తిగా అనవసరం). ఇలాంటి ఉదాహరణలు ఇంకా చాలా చెప్పవచ్చు. రాజకీయ నేతల కుత్సిత మనస్తత్వానికి అద్దం పడుతూ ఉండే ఇంకొన్ని వాస్తవిక ఘటనలను కూడా ఉదాహరించవచ్చు. పత్రికా రచయితగా నా నలభయ్ ఏళ్ల జీవితంలో ఇలాంటి మరొక ఘటన జరిగినట్టు వెంటనే చెప్పమంటే నాకు కష్టమే. ఒక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మీద చేయి చేసుకోవడం, అందులోను ముఖ్యమంత్రి నివాసంలో అది జరిగిన ఉదంతం నాకు తక్షణం ఏదీ గుర్తుకు రావడం లేదు.



జాతిహితం

అన్షు ప్రకాశ్

దాడి జరగలేదంటే ఎవరూ నమ్మరు

వైద్యుల నివేదిక, ఇప్పటిదాకా లభించిన వీడియో ఆధారాలు పరిశీలించినా, మూడు దశాబ్దాలుగా మంచి పేరు సంపాదించుకున్న అన్షు ప్రకాశ్ మాటను బట్టి ముఖ్యమంత్రి నివాసంలో దాడి జరిగిందనే వాస్తవాన్ని సందేహించడానికి అవకాశం తక్కువే. కాబట్టి ఇందులో వాస్తవం ఏమిటి అనేదాని గురించి చర్చ అనవసరం. ఇప్పుడు ముఖ్యమంత్రి సహాయకుడు వీకే జైన్ కూడా ప్రకాశ్ మీద చేయి చేసుకున్న మాట నిజమని నిర్ద్వంద్వంగా చెబుతున్నారు. రోజులూ గంటలూ గడిచే కొద్దీ ఆప్ అధికార ప్రతినిధి సహా ఇతర నాయకులు కూడా తమ తమ వైఖరులను సడలిస్తూ వచ్చారు. అసలు అలాంటి దాడి ఏదీ జరగలేదని మొదట చెప్పారు. తరువాత మరింత అలక్ష్యంతో, న్యాయమూర్తి లోయా హత్య కేసులో అమిత్‌షాను ప్రశ్నించడానికి ఏమీ లేనట్టే భావిస్తూ, 'ఏవో రెండు దెబ్బల'కే ముఖ్యమంత్రి ఇంటికి పోలీసులను పంపించి విచారిస్తారు అనే వరకు వారి మాటలు నడిచాయి. ఈ వైఖరిని మీరు పాత తరహా దబాయింపు అని పేర్కొనవచ్చు. నేను ఇంకో అడుగు ముందుకు వేసి దీనిని రాజ్యాంగపరమైన దురహంకారానికి మించినదని అంటాను. పశ్చాత్తాపం సంగతి పక్కన పెడదాం. మీ పాలనలో ఉన్న వ్యక్తి మీద జరిగిన దాడికి చిన్న సానుభూతి పదం కూడా నోటి నుంచి రాలేదు. భౌతికదాడికి గురైన వ్యక్తికి సంఘీభావం అసలే ప్రకటించలేదు.

ఢిల్లీ స్థాయిలో అరవింద్ కేజ్రీవాల్ ఆప్, కేంద్రంలో నరేంద్ర మోదీ బీజేపీ గడచిన మూడేళ్లుగా సంఘర్షిస్తూనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలనీ, పంపిన ఫైళ్లనీ లెఫ్టినెంట్ గవర్నర్లు నిరాకరిస్తూనే ఉన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు చేసిన నియామకాలను లెఫ్టినెంట్ గవర్నర్లు మార్చడం లేదా నిరాకరించడం చేశారు. ముఖ్యమంత్రి సన్నిహిత ఐఏఎస్ అధికారి రాజేంద్రకుమార్ మీద సీబీఐ దాడి చేయించి అవినీతి కేసును నమోదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న అవినీతి నిరోధక శాఖను వారి అధీనం నుంచి తొలగించారు. ఆర్థిక లబ్ధి ఉన్న పదవులలో ఉన్నారన్న ఆరోపణతో ఈ మధ్యనే 20 మంది ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులను చేస్తూ ఎన్నికల సంఘం రాష్ట్రపతికి సిపారసు చేసింది. ఆ వారాంతంలోనే రాష్ట్రపతి అనుమతి కూడా వచ్చింది. ఇలా చెప్పుకుంటూ వెళితే ఆ జాబితాకు అంతు ఉండదు. కానీ ఇది అధికారులు, నియమ నిబంధనల పేరుతో కేంద్రం వైపు నుంచే ఎక్కువ దాడి జరిగిన సంగతిని మనకి చెబుతుంది. దీనికి కేవలం మాటలతోనే ఆప్ ఎదురుదాడికి దిగింది. ఆ మాటలలో చాలా ప్రసిద్ధమైనవి లేదా చాలా అవమానకరమైనవి మోదీని గురించి కేజ్రీవాల్ చేసిన వర్ణనలే. మోదీని కేజ్రీవాల్ అబద్ధాల కోరు, మానసిక రోగి అన్నారు. ప్రకాశ్ మీద జరిగిన దాడి నేపథ్యంలో ఈ మాటల యుద్ధం పరాకాష్టకు చేరుకుంది.

ఇదే సంస్కృతి విస్తరిస్తే...

ఇది దేనికి దారితీస్తుందంటే, మనం దేనిని మున్నెన్నడూ లేనిది అంటున్నామో, అదే కొత్త ఉదాహరణను కూడా ప్రవేశపెడుతుంది. అన్షు ప్రకాశ్ విషయంలో మనలని ఎక్కువ భయపెట్టేది అదే. ఆప్‌ను భయానక వీధి రౌడీల మూక అని మనం చెప్పాల్సిందే. కానీ ఆ పార్టీ వాళ్లు ఇలాంటి హింసను చట్టబద్ధం చేస్తే ఆ స్థాయి అధికారుల మీద దాడికి సంబంధించి దేశం నలుమూలలా ఉన్న కొరకరాని కొయ్యల వంటి రాజకీయనాయకులకు వేరే విధమైన సంకేతాలు వెళతాయి. నిజాయితీ కల అధికారి ఒక ముఖ్యమంత్రి లేదా కేంద్ర మంత్రి ఆదేశాలను తప్పుడు ఆదేశాలుగా భావించి తిరస్కరించినప్పుడు దానికి పరిష్కారం ఊహించండి. అలాంటి అధికారిని మీ ఇంట్లో జరిగే భేటీలోనో లేక అతడి కార్యాలయంలోనో చితకబాదడమే పరిష్కారమా? ఈ వ్యవహారంలో మనకు వినపడుతున్న వాదనల్లో ఒకటి ఏమిటంటే.. ప్రధాన కార్యదర్శి లేక అధికారులు.. రెండున్నర లక్షలమంది ప్రజలకు రేషన్ కార్డులను తిరస్కరించిన విషయాన్ని పట్టించుకోలేదన్నదే. అలా అని చెప్పి రాజకీయ నేతలు ఈ అధికార్ల పైకి మూకను ఉసిగొల్పుతారా?

రాజకీయ నేతలు, ప్రభుత్వ సర్వీసులో ఉన్న అధికారులకు మధ్య సున్నితమైన సంబంధం ఉంటుంది. ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఎలా ఎదుర్కోవాలనేది మంచి నాయకత్వానికి తెలుసు. ఒక రాష్ట్ర నాయకుడు, అదీ ఢిల్లీ వంటి పరిమిత అధికారాలు కల రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలాంటి సమస్యలను పరిణామాలు దిగజారిపోని రీతిలో పరిష్కరించాల్సి ఉంది. తనకు సాధ్యం కానప్పుడు సమస్యను అత్యున్నత రాజ్యాంగాధికారుల దృష్టికి తీసుకుపోవలసి ఉంటుంది. అది కూడా విఫలమైతే, బహిరంగంగా నిరసన తెలుపడం, మీడియా దృష్టికి తీసుకుపోవడం, (ఆప్‌కి ఇది వెన్నతో పెట్టిన విద్య) వంటి అవకాశాలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి. కానీ మీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మీ ఇంట్లో దెబ్బలు తినడం – రెండు చెంపదెబ్బలే కావచ్చు– గర్వించవలసిన విషయం మాత్రం కాదు.


2014లో నా పుస్తకం 'యాంటిసిపేటింగ్ ఇండియా' ముందుమాటలో నేను ఒక ముఖ్యమైన అంశం ప్రస్తావించాను. మోదీ, రాహుల్, కేజ్రీవాల్ త్రయం మన వర్తమాన రాజకీయాల్లో అద్భుతమైన లక్షణాలను ప్రదర్శించనున్నారని, జర్నలిస్టుల జీవితాలకు ఇవి ఏమాత్రం విసుగెత్తించే క్షణాలు కావని నేను రాశాను. పైగా ఈ ముగ్గురు నేతలూ పరిణితి సాధిస్తారని అభిప్రాయం వ్యక్తం చేశాను. మోదీ ప్రధాన స్రవంతి సమన్వయం వైపుగా పయనిస్తారని, రాహుల్ బహిరంగ జీవితంలో బిడియాన్ని పక్కన పెడతారని రాశాను. కేజ్రీవాల్ వ్యవస్థాగతమైన శాంతివైపు పయనిస్తారని రాశాను. ఈ మూడో అంశంలో నా అంచనా తప్పు అని ఈ వారం మనకు చెబుతోంది.

వ్యాసకర్త దప్రింట్ ఛైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

బడ్జెట్ ఓ కురవని మేఘం

గ్రామీణాభివృద్ధి శాఖకు కేంద్ర బడ్జెట్‌లో నాలుగు శాతం నామమాత్రపు కేటాయింపులు చేశారు. వీటితో ఆరున్నర లక్షల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన అంటే 21వ శతాబ్దపు మయసభను ఊహించుకోవటం తప్ప మరో మార్గం లేదు.

సందర్భం



కొండూరి వీరయ్య

గత మూడేళ్లుగా గ్రామీణ ప్రాంతాలు ఎదుర్కొంటున్న దుర్భిక్షం నేపథ్యంలో 2018 బడ్జెట్ గ్రామీణ ప్రజల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తుందని భావించారు. బడ్జెట్ ఉపన్యాసం కూడా అదే ధోరణిని ధ్వనించింది. అయితే ఆర్థికమంత్రి చూస్తున్న గ్రామీణ భారతం, ప్రజలనుభవిస్తున్న గ్రామీణ భారతం ఒక్కటేనా అన్నది ఇప్పుడు మన ముందున్న సమస్య. గత 3 బడ్జెట్లలో మాట వరుసకన్నా ఉపాధి, నైపుణ్యం, గ్రామీణ ఉపాధి, ఉత్పత్తి వంటి పదాలు వినిపించాయి. ఈ బడ్జెట్‌లో అవి కూడా కరువయ్యాయి. గ్రామీణ మౌలిక సదుపాయాలు, ఆరోగ్య బీమా ఈ బడ్జెట్ ప్రాధాన్యతలుగా ముందుకొచ్చాయి. 2008 బడ్జెట్‌లో యూపీఏ ప్రతిపాదించిన రుణ మాఫీ పథకం 2009 ఎన్నికల్లో ఫలితాన్నిచ్చినట్లుగా ఈ ఆరోగ్యబీమా ఎన్డీయేకు 2019లో అచ్చొస్తుందా అన్నది వేచి చూడాలి.

ఈ రెండు పథకాల మధ్య మౌలికమైన తేడా ఉంది. రైతు రుణ మాఫీ పథకం ఎన్ని పరిమితులతోనైనా రైతుల చేతుల్లో రొక్కం మిగిల్చింది. కానీ మోదీ ప్రభుత్వ ఆరోగ్యబీమా పథకం కార్పొరేట్ ఆసుపత్రుల ఖజానాను నింపే పథకమన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్యబీమా పథకాన్ని ముందుకు తేవటంతో 2014 ఎన్నికల్లో గ్రామీణ ప్రజల ఆదాయాలు రెట్టింపు చేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, అవినీతిని అంతమొందిస్తామని బీజేపీ వాగ్దానాలు నీటి మీద రాతలయ్యాయన్న అంగీకరించినట్లైంది. విత్తనాలు వేయటానికి ముందు రైతు ఆకాశంలో కనపడే ప్రతి మేఘమూ కురవటానికే వచ్చిందా అన్నట్లు చూస్తాడు. మోదీ మాయాజాలం కూడా ప్రజలకు కురవని మేఘాలు చూపించి కాలక్షేపం చేస్తోంది.

బడ్జెట్ ప్రసంగానికి, కేటాయింపులకు మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోటానికి ఒక్క గ్రామీణ మౌలిక రంగం గురించి ప్రస్తావనను చూస్తే సరిపోతుంది. గ్రామీణాభివృద్ధికి క్లస్టర్ విధానాన్ని అనుసరించనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. అంటే పాతిక ముప్పై గ్రామాలకు ఉపయోగపడేలా మౌలికసదుపాయాల కల్పన వ్యూహం. కానీ గ్రామీణాభివృద్ధి శాఖ కేటాయింపులు 4 శాతానికి మించి పెరగలేదు. మరి ఆరున్నర లక్షల గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించటం అంటే 21వ శతాబ్దపు మయసభను ఊహించుకోవటం తప్ప మరో మార్గం లేదు.

ప్రభుత్వానికి ప్రాణప్రదమైన పథకాలు స్వచ్ఛభారత్ అభియాన్, ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన, ఆవాస్ యోజన, ఉపాధి హామీ పథకం కేటాయింపులు నిరాశాజనకంగా ఉన్నాయి. ఆవాస్ యోజన కేటాయింపులు 9 శాతం తగ్గితే ఉపాధి హామీ కేటాయింపులు యథాతథంగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఈ ఏడాది దాదాపు రెండు కోట్ల పాయఖానాలు, యాభై లక్షల నివాసాలు నిర్మాణం లక్ష్యంగా నిర్ణయించింది. కానీ కేటాయింపులు తగ్గట్టుగా లేవు. ఒక్క ఏపీలోనే 30 లక్షల ఇళ్ల నిర్మాణానికి కేంద్రం సహకరించాలని డిసెంబరులో హూంకరించిన టీడీపీ తన విజ్ఞప్తిని కనీసం ప్రభుత్వం దృష్టికి తెచ్చే ప్రయత్నం కూడా చేయకపోవటం గమనిస్తే రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజల ఆగ్రహావేశాన్ని కేంద్రంపై నెట్టే ప్రయత్నమే తప్ప మరోటి కాదని తేటతెల్లమవుతుంది.

ఇక ఆరోగ్య బీమా పథకంపై ఆర్థిక మంత్రి ప్రకటన రెండు కీలక అంశాలు చర్చకు పెడుతోంది. మొదటిది దేశంలో పేదలెందరు అన్న ప్రశ్న. దావోస్ మొదలు ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థలకిచ్చిన లెక్కల్లో దేశ జనాభాలో పేదలు 20 శాతంలోపే అన్న వాదన వినిపించిన ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న యాభై కోట్ల ప్రజానీకం కోసం ఆరోగ్య బీమా పథకం ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో ఏది మోసం, ఏది వాస్తవం అన్నది ప్రజలే నిర్ణయించుకోవాలి. పైగా 2008లో నాటి యూపీఏ ప్రభుత్వం ప్రారంభించిన రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనకు (ఆరెస్బీవై) నేడు మోదీ రంగు మార్చి చెప్పుకుంటున్న 'ఆయుష్మాన్ భారత్' పథకానికి మధ్య పేర్లలో తప్ప తేడా లేదు. యూపీఏ ప్రభుత్వం ప్రారంభించిన పదుల కొద్దీ పథకాలకు పేర్లు మార్చటం తప్ప మోదీ గ్రామీణ ప్రజలకు కొత్తగా ఇచ్చిన వరాలు ఏమీ లేవు.

రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనకు పునాది నాటి ఉమ్మడి ఏపీలో ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ. ఆరెస్బీవై అమలు కొన్ని రాష్ట్రాల్లో తప్ప విజయవంతం కాలేదు. ప్రజల్లో ఈ పథకం, దాని ప్రయోజనం పట్ల సరైన అవగాహన లేకపోవటం ఒక కారణమైతే ప్రాథమిక వైద్యసేవలను పటిష్టం చేయకపోవటం మరో కారణం. చివరిగా 2018 బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఆరోగ్యబీమా పథకం నేరుగా ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరవేయటం కాకుండా బీమా కంపెనీల ద్వారా చేరవేయటానికి సంకల్పించింది. నేరుగా అందించాల్సిన సేవల విషయంలోనే ప్రభుత్వ వైఫల్యం బట్టబయలవుతుంటే మార్కెట్ నియంత్రిత సేవలు ప్రజలకు ఎక్కువ ప్రయోజనం కల్గిస్తాయని నమ్మటం ఎలా? ప్రైవేటు వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలనే నియంత్రించలేని మనదేశంలో లక్షల కోట్ల రూపాయలతో కూడిన ప్రైవేటు ఆరోగ్య బీమా కంపెనీలను నియంత్రించి ప్రజల ఆరోగ్యానికి బీమా హామీ కల్పిస్తుందని ఆశించటం ఎలా?

వ్యాసకర్త ఆర్థికరంగ నిపుణులు । 98717 94037

ఇంటి దొంగను ఈశ్వరుడైనా...

పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రపంచ ఆర్థిక మోసాల చరిత్రకు కొత్త పాఠం చేర్చింది. ఒకే ఒక్క శాఖలో ఇంటి దొంగలు సహకరిస్తే కొన్ని వేల కోట్ల రూపాయలనైనా సరే అప్పనంగా అందించేయవచ్చని పీఎన్బీ నిరూపించింది. సన్నకారు రుణాలకు సంబంధించి కొన్ని వేల రూపాయలను రైతులకు, తదితర వర్గాలకు ఇవ్వాలంటే సవాలక్ష సాకులతో, కొర్రీలతో వేధించుకు తినే బ్యాంకులు ఒక బడా వ్యాపారికి మేలు చేయడానికి అత్యంత రహస్యమైన కోడ్‌నే అతగాడికి ధారాదత్తం చేయడం చూసి ప్రపంచం నివ్వెరపోతోంది. ఒక్క శాఖ పరిధిలోనే ఆర్థిక మోసం ఈ స్థాయిలో చెయ్యడానికి అవకాశం ఉంటే, దేశవ్యాప్తంగా వేలాది శాఖల్లో ప్రజాధనం దోపిడీ కావడానికి గల అవకాశం గురించి ఆలోచిస్తే మతి పోవడం ఖాయం. 11 వేల కోట్ల రూపాయలను ఒక శాఖ కొన్నేళ్ల వ్యవధిలో గజదొంగలకు సమర్పించడం దారుణం.

మన దేశంలో ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు మొదటి నుంచి ప్రజావ్యతిరేక స్వభావంతోటే ఉన్నాయి. ఈ దేశంలో సామాన్య రైతుకి ఎరువు కొనుక్కోడానికి అప్పు పుట్టదు. చిన్న వేతన జీవి ఇల్లు కట్టుకోడానికి లక్ష ప్రశ్నలు ఎదురవ్వకుండా రుణం దొరకదు. విద్యార్థులకు చదువుకోడానికి రుణం కోరాలన్నా, హామీ ఉండాల్సిందే. ఒక వైపు ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు బడా కంపెనీల అప్పులు మాఫీ చేస్తూ, రైతుకి సమయానికి రుణం అందించడానికి గానీ, వడ్డీ మాఫీ చెయ్యడానికి గానీ ఎక్కడ లేని ఆర్థిక సూత్రాలు వల్లె వేస్తూంది. పైగా బ్యాంకు దివాళా తీస్తే, దానికి సర్దుబాటు ఖాతాదారుల సొమ్ము నుండి చేస్తారట. పైసా పైసా కష్టపడి కూడబెట్టుకొన్న సొమ్ముని ఖాతాదారు బెయిల్ ఇన్ పేరుతో బ్యాంకు పాలు చేయాలన్న మాట. పీఎన్బీ వ్యవహారం బ్యాంకుల పనితీరు పైనే కాదు... ప్రభుత్వ సమర్థతపైనా విశ్వాసాన్ని పూర్తిగా దిగజార్చివేసిందనే చెప్పాలి.

– నాగేశ్వర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్

అది తిరునామం!

చంద్రబాబు 'ప్యాకేజీ' అనే ఎండమావి వెనకాలపడి నాలుగేళ్లనుంచీ పరుగులు పెడుతున్నారు. దానివల్ల దాహం పెరిగిందిగానీ ఎక్కడా తడి తగల్లేదు.



శ్రీరమణ

బాగా ఎత్తైనవి, చాలా లోతైనవి మామూలు దృష్టికి అంతుచిక్కవు. ఉదాహరణకి భూగోళం. అది గుండ్రంగా ఉంటుందని, నారింజపండు లాగానో, రుద్రాక్ష కాయలాగానో ఉంటుందనే సత్యం మామూలు కంటితో చూసి నిర్ధారించలేం. నిజం నిరూపించాలంటే చాలా ఎత్తుమీద నుంచైనా చూడాలి, లేదా అత్యాధునిక టెలిస్కోపునైనా వాడాలి. రాజకీయం తెలుసు కాబట్టి చక్రం తిప్పుతానని ఊరికే అతి విశ్వాసంతో ముందుకు వెళ్లకూడదు. శాస్త్ర పురాణాలు క్షుణ్ణంగా కాకపోయినా పైపైన అయినా చదవాలి. దేవుడు పది అవతారాలెత్తాడు. కానీ ఏ రెండూ ఒక దాన్ని పోలి ఒకటి లేవు. చేపకి, తాబేలుకి, నరసింహానికి సాపత్యం ఏవన్నా ఉందీ? లేదని భావం. వామనావతారం మరో చమత్కారం. భూమికి జానెడు ఎత్తున వటువుగా నడిచి వచ్చి మూడు వేళ్లు చూపించి మూడడుగుల దానం ఇమ్మన్నాడు. బలి చక్రవర్తికి తెలిసి చావలా– అవి మూడేళ్లు కావు తిరునామం. ఆంతర్యం అంతుపట్టక తీసుకో, కొలుచుకో అన్నాడు. అంతే! వామన పురాణంగా వాసికెక్కింది. ఒకే ఒక డాట్‌ని విశదపరిస్తే కేంద్ర బడ్జెట్ సవివరంగా వచ్చినట్టు– వామనుడు త్రివిక్రముడి డిజిటలైజ్ వెర్షన్.

చంద్రబాబు కూడా ఇక్కడే పప్పులో కాలేశాడు. మోదీని ముందు ధరించి పసుపు పచ్చ జెండా ఊపుకుంటూ ముందుకు కూతలు వేసుకుంటూ సాగిపోవచ్చనుకున్నాడు. ఇప్పుడు పట్టాల దారి కనిపించడంలేదు. 'నేనున్నానని' అభయమిస్తూ కనిపించిన వెంకయ్యనాయుడుని సమున్నతమైన కొండ గుహలో కూర్చోపెట్టారు. ఇది కూడా మోదీ పుణ్యమే! చంద్రబాబు అందరూ చెబుతున్నా వినకుండా 'ప్యాకేజీ' అనే ఎండమావి వెనకాల పడి నాలుగేళ్ల నుంచీ పరుగులు పెడుతున్నారు. దానివల్ల దాహం పెరిగిందిగానీ ఎక్కడా తడి తగల్లేదు. ఇప్పుడు మళ్లీ తూచ్ అనేసి ప్రత్యేక హోదాయే ముద్దు, అది అయిదుకోట్ల చిల్లర తెలుగువారి హక్కు అని గర్జిస్తున్నారు. 'ప్యాకేజీ' చాలా చాలా లాభమన్నారు మొన్నటిదాకా. నిన్నట్నించి గళం మార్చి స్వరం మార్చి ప్రసంగిస్తున్నారు. ఎన్నడూ లేనిది, మోదీని గట్టిగా ప్రశ్నిస్తున్నారు. ఆయన 'దేశముదురండీ' అని నాలుగేళ్ల నాడే ఒక సంఘ్ పెద్ద అన్నారు– ఏ భావంతో అన్నారో గానీ.

అక్షర తూణీరం



అరటితోటలో ఆంజనేయస్వామి కొలువై ఉంటాడని పుస్తకంలో ఉందని తోటలన్నీ గాలిస్తే దొరుకుతాడా? దొరకడని భావం. త్రేతాయుగంలో ఆంజనేయస్వామి రామబంటుగా రామాయణం నిండా కొలువు తీరాడు. ద్వాపరం వచ్చే సరికి జెండా మీద బొమ్మై, జెండాపై కపిరాజుగా గాలిలో రెపరెపలాడాడు. కలియుగం వచ్చే సరికి కిరసనాయిల్ డబ్బాల మీద, ట్రాన్స్‌పోర్ట్ లారీలపైన ట్రేడ్‌మార్క్ గుర్తుగా స్వామి సేవలందిస్తున్నాడు. సంఘ్‌లో పుట్టి సంఘ్‌లో పెరిగిన సంఘీయుడు మోదీ. ఆయన నాయకత్వంలో అయోధ్య బృహత్తర రామమందిరం ప్రస్తుతం రైలు స్టేషన్‌గా అవతరించబోతోంది. మన కల నెరవేరబోతోంది. అందుకని చంద్రబాబు మనుషుల్ని జాగ్రత్తగా అంచనా వేసుకోవాలి. ఆట్టే వ్యవధి కూడా లేదు.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

రేపు, ఎల్లుండి రైతు సదస్సులు

- హైదరాబాద్, కరీంనగర్‌లలో ఘనంగా ఏర్పాట్లు
- 17 వేల మంది రైతు సమితుల సభ్యుల రాక
- హాజరుకానున్న సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: మండల, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులతో సదస్సులను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆదివారం (25వ తేదీన) హైదరాబాద్‌లో, సోమవారం (26న) కరీంనగర్‌లో రైతు సదస్సులు జరగనున్నాయి. ఈ సదస్సులకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హాజరు కానుండటంతో వ్యవసాయ శాఖ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఆ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ముఖ్య కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ జగన్‌మోహన్.. ఇప్పటికే హైదరాబాద్, కరీంనగర్‌లలో సదస్సుల ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాకో రాష్ట్ర వ్యవసాయాధికారిని పర్యవేక్షణాధికారిగా నియమించారు. రైతు సభ్యులు, ఇతర అధికారులు సదస్సులకు వచ్చేందుకు 344 బస్సులను ఏర్పాటు చేశారు. వారికి అవసరమైన భోజన సదుపాయాలు పర్యవేక్షణాధికారులే కల్పిస్తారు. మొత్తం 17 వేల మంది వరకు సమితుల సభ్యులు ఈ రెండు సభలకు హాజరు కానున్నారు. సీఎం కేసీఆర్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగే సదస్సులో రోజు మొత్తం ఉండి సభ్యులతో సంభాషిస్తారు. వారిని కార్యోన్ముఖులను చేస్తారు. రైతు సమన్వయ సమితిని కార్పొరేషన్‌గా ప్రకటిస్తూ జారీ చేసిన మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తారు. రైతులను కూడగట్టి మద్దతు ధర ఇప్పించడంలో సమితి సభ్యుల పాత్రను సీఎం ప్రస్తావిస్తారు.

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా..

సదస్సులకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, డీసీసీబీ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు కూడా హాజరుకానున్నారు. సమితి సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేస్తారు. ఒక గ్రీన్ ఫోల్డర్‌లో నోట్ బుక్, రెండు పెన్నులు, ఆకుపచ్చ, గులాబీ రంగుల్లో రెండు పేపర్లు అందజేస్తారు. రైతులు తమ సలహాలను ఆకుపచ్చ కాగితంపైన, ప్రశ్నలను గులాబీ రంగు కాగితంపైనా అందజేయాలని సూచనలు జారీ చేశారు. ఉదయం సీఎం మాట్లాడుతున్న సమయంలో ప్రశ్నలు అడగాలనిపిస్తే కాగితంపై రాసి సంబంధిత వ్యవసాయాధికారులకు అందజేయాలి. భోజన విరామ సమయంలో ఆ ప్రశ్నలను కేటగిరీల వారీగా విభజించి ఒక ప్రత్యేక నోటు తయారు చేస్తారు. ఆ నోటును సీఎంకు అందజేస్తారు.

కార్పొరేషన్ ఏర్పాటుతో ఉత్సాహం

రాష్ట్రస్థాయి రైతు సమన్వయ సమితిని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సమితి సభ్యుల్లో ఉత్సాహం నెలకొంది. జిల్లా రైతు సమితి సమన్వయకర్తల పేర్లను కూడా వ్యవసాయ శాఖ వెల్లడించింది. దీంతో జిల్లా సమన్వయకర్తలంతా సదస్సులను విజయవంతం చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఇక రాష్ట్ర సమన్వయ సమితి సభ్యులు, చైర్మన్ నియామకంపై సదస్సుల్లోగా వెల్లడించే అవకాశముంది. లేకుంటే సదస్సుల్లోనైనా ప్రకటిస్తారని సమాచారం. కార్పొరేషన్ చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైంది. ప్రకటించడం కేవలం లాంఛనమేనని అంటున్నారు.

‘సమన్వయకర్తలు’ వీరే

- జిల్లా రైతు సమితులకు నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన వ్యవసాయ శాఖ
- 14 మంది ఓసీలు, 10 మంది బీసీలు, ఐదుగురు ఎస్సీ, ఎస్టీలు
- నేడో రేపో రాష్ట్ర సమితి ప్రకటన

సాక్షి, హైదరాబాద్: జిల్లా రైతు సమితుల సమన్వయకర్తల పేర్లను వ్యవసాయ శాఖ వెల్లడించింది. శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ జిల్లా సమన్వయకర్తగా గుండెల్లి తిరుపతిని నియమించారు. పెద్దపల్లి జిల్లాకు కోట రాంరెడ్డి, జగిత్యాలకు చీటి వెంకటరావు, సిరిసిల్లకు గడ్డం నర్సయ్య, సిద్దిపేటకు వి.నాగిరెడ్డి, మెదక్‌కు టి.సోములు, సంగారెడ్డికి వెంకటరాంరెడ్డి, ఆదిలాబాద్‌కు అడ్డి భోజిరెడ్డి, మంచిర్యాలకు ఎం.గురవయ్య, ఆసిఫాబాద్‌కు బసవత్ కార్ విశ్వనాథ్, నిర్మల్‌కు ఎస్.వెంకటరాంరెడ్డి, నిజామాబాద్‌కు బనావత్ మంజుల, కామారెడ్డికి డి.అంజిరెడ్డి, వరంగల్ అర్బన్‌కు ఇ.లలితాయాదవ్, వరంగల్ రూరల్‌కు బొల్లె భిక్షపతి, భూపాలపల్లికి పల్లా బుచ్చయ్య, మహబూబాబాద్‌కు భుక్యా బాలాజీ, జనగామకు ఐ.రమణారెడ్డి, ఖమ్మంకు నల్లమల వెంకటేశ్వర్‌రావు, కొత్తగూడెంకు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, నల్లగొండకు ఇ.రాంచందర్ నాయక్, యాదాద్రికి కొల్పుల అమరేందర్ ముదిరాజ్, సూర్యాపేటకు ఎస్.ఎ.రజాక్, మహబూబ్‌నగర్‌కు ఎస్.బస్వ రాజ్ గౌడ్, నాగర్‌కర్నూలుకు పోకల మనోహర్, గద్వాలకు కె.వెంకటరాములు, వనపర్తికి పి.జగదీశ్వర్‌రెడ్డి, రంగారెడ్డికి వంగేటి లక్ష్మారెడ్డి, వికారాబాద్‌కు కె.మహేశ్‌రెడ్డి, మేడ్చల్‌కు నారెడ్డి నందారెడ్డి నియమితులయ్యారు. సమన్వయకర్తల్లో ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు 14 మంది, బీసీ వర్గాలకు చెందిన వారు 10 మంది, ఎస్సీ ఇద్దరు, ఎస్టీ ముగ్గురు, ముస్లిం వర్గానికి చెందిన వారు ఒకరు ఉన్నారు.

రాష్ట్ర సమితిపై సీఎం కసరత్తు

రాష్ట్ర సమన్వయ సమితి సభ్యుల ఎంపికపై ముఖ్యమంత్రి కసరత్తు చేస్తున్నారు. మొత్తం 42 మందిని నియమిస్తారు. సమితిని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. దానికి చైర్మన్‌గా ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. రైతు సమితి కార్పొరేషన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ శుక్రవారం జరిగింది. రిజిస్ట్రేషన్ తర్వాత చైర్మన్‌గా గుత్తా పేరును ప్రకటిస్తారని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు శనివారం ప్రకటించకపోతే రైతు సదస్సు సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం గుత్తా పేరును ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటిస్తారన్న ప్రచారమూ జరుగుతోంది. మరోవైపు రాష్ట్ర సమితిలో చోటుకోసం అనేకమంది ప్రయత్నాలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం 15 మంది పేర్లను తాత్కాలికంగా ఇచ్చారు. రిజిస్ట్రేషన్ అయ్యాక కొత్త పాలక మండలిని ఎంపిక చేసినట్లు తీర్మానం చేసి దానికి సభ్యులను, చైర్మన్‌ను నియమిస్తారని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి.

ఎంసెట్ ద్వారానే బీఎస్సీ ఫారెస్ట్రీలో ప్రవేశాలు

సాక్షి, హైదరాబాద్: నాలుగేళ్ల బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సులో ప్రవేశాలను ఎంసెట్ ర్యాంకుల ఆధారంగానే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్.ఆచార్య శుక్రవారం జీవో జారీ చేశారు. ఇంటర్మీడియెట్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మ్యాథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివి ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇంటర్‌లో ఆ సబ్జెక్టులు లేకపోతే ఎంసెట్‌లో మాత్రం బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు రాయాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఇంటర్‌లో కనీసం 45 శాతం మార్కులు సాధించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీలైతే 40 శాతం ఉంటే సరిపోతుందని వెల్లడించారు.

2 నుంచి డీఎడ్ ఫైనల్ లెస్సన్ టీచింగ్ ప్రాక్టికల్స్

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎడ్) ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫైనల్ లెస్సన్ టీచింగ్ ప్రాక్టికల్స్‌ను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం ఓ ప్రకటనలో పేర్కొంది. మార్చి 2 నుంచి 8 వరకు, మార్చి 12 నుంచి 17 వరకు వీటిని నిర్వహించనున్నట్లు తెలిపింది. వివరాల కోసం ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ డైట్ కాలేజీల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని వెల్లడించింది.

ఎక్సైజ్ కానిస్టేబుల్ అభ్యర్థులకు విజన్ టెస్టులు

సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా పీఈటీ టెస్టులో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 26 నుంచి 28 వరకు, వచ్చే నెల 2, 3, 5వ తేదీల్లో విజన్ టెస్టు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. సరోజినీదేవీ కంటి ఆస్పత్రిలో ఉదయం 9 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభం అవుతాయని పేర్కొంది. అభ్యర్థులు హాల్‌టికెట్, రెండు ఫొటోలు, ఐడీ ప్రూఫ్, రూ.300 వెంట తెచ్చుకోవాలని సూచించింది. మరిన్ని వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందవచ్చని పేర్కొంది.

డీఎంఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 28న ఇంటర్వ్యూలు

సాక్షి, హైదరాబాద్: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్ (సూపర్ స్పెషాలిటీ విభాగాలు) పోస్టుల భర్తీలో భాగంగా ప్రాథమికంగా అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 28న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభం అవుతాయని పేర్కొంది. అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 ఫొటోలు, ఒరిజినల్ ఐడీ కార్డు వెంట తెచ్చుకోవాలని తెలిపింది. మరిన్ని వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందవచ్చని పేర్కొంది.

మార్చి 25 నుంచి మెడికల్ పీజీ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య పీజీ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ మార్చి 25 నుంచి మే 18 మధ్య పూర్తి కానుంది. ఆలిండియా, డీమ్డ్ యూనివర్సిటీలు, రాష్ట్ర యూనివర్సిటీలు అన్నింటికీ ఇదే వర్తిస్తుందని భారత వైద్య మండలి(ఎంసీఐ) తెలిపింది. 2018–19 వైద్య విద్య సీట్ల అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియపై ఎంసీఐ మార్గదర్శకాలు జారీ చేసింది. జాతీయ స్థాయి వైద్య విద్య సంస్థల్లోని సీట్లకు, డీమ్డ్ యూనివర్సిటీల్లోని సీట్లకు మార్చి 12 నుంచి, రాష్ట్ర స్థాయి యూనివర్సిటీల్లోని సీట్లకు మార్చి 25 నుంచి కౌన్సెలింగ్ మొదలవుతుందని పేర్కొంది. అన్ని సంస్థల్లోని సీట్లకు మే 18లోపు కౌన్సెలింగ్ పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ తేదీలకు అనుగుణంగా మన రాష్ట్రంలోని సీట్ల భర్తీకి కాళోజీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఎంసీఐ నిర్దేశించిన తేదీల్లోనే కౌన్సెలింగ్ పూర్తి చేయనుంది. అల్లోపతి, ఆయుష్, నర్సింగ్, ఫిజియోథెరపీ అన్ని కోర్సులు కలిపి రాష్ట్రంలో మొత్తం 2,262 పీజీ వైద్య సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో 805, ప్రైవేటు కాలేజీలో 1,451 సీట్లు ఉన్నాయి. కేవలం అల్లోపతి వైద్య విద్య పీజీ సీట్లు రాష్ట్రంలో 1,405 ఉన్నాయి. వీటిలో 683 సీట్లు ప్రభుత్వ కాలేజీల్లోనే ఉన్నాయి.

రిజిస్ట్రేషన్ వ్యవస్థకు రూ.100 కోట్లు!

- అంచనా వేస్తున్న ప్రభుత్వ వర్గాలు
- ప్రభుత్వానికి అవసరమైన పరికరాల జాబితా
- దాదాపు వెయ్యి మంది సిబ్బంది అవసరమని ప్రతిపాదన

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలను ప్రారంభించాలంటే ఖర్చు భారీగానే ఉండబోతోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లేని 473 తహశీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసేందుకు ఏర్పాటు చేయాల్సిన పరికరాలు, సర్వర్లు, నెట్‌వర్క్ ఏర్పాటు, సిబ్బంది వేతనాలు, రోజువారీ వ్యవహారాల నిర్వహణకు కోట్ల రూపాయలు ఖర్చయ్యే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఆ వ్యవస్థ ఏర్పాటుకే రూ.100 కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా.

ఇవన్నీ అవసరం..!

రిజిస్ట్రేషన్ కార్యకలాపాలకు అవసరమయ్యే సరంజామాతో పాటు మానవ వనరులను సమకూర్చే బాధ్యతను రాష్ట్ర టెక్నలాజికల్ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్)కు అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. రెవెన్యూ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరగాలంటే అవసరమైన పరికరాల జాబితాను ఇప్పటికే రిజిస్ట్రేషన్ల శాఖ ప్రభుత్వానికి పంపింది. ప్రతి తహశీల్‌కు 4 కంప్యూటర్లు, స్కానర్, రెండు ప్రింటర్లు, 2 వేలిముద్రల నమోదు యంత్రాలు, 2 వెబ్‌క్యామ్‌లు, 1 వ్యాన్ ఆప్టిమైజర్, నెట్‌వర్క్ ర్యాక్, మోడెమ్, స్విచ్, 2 సీసీ కెమెరాలు, ఒక డిజిటల్ కెమెరా, డిస్‌ప్లే యూనిట్లు అవసరమవుతాయని ప్రతిపాదించారు. ప్రతి తహశీల్ కార్యాలయంలో ఒక డేటా ప్రాసెసింగ్ ఆపరేటర్ (డీపీఓ), ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈవో)లు అవసరం పడతారని, దాదాపు వెయ్యి మంది సిబ్బంది అవసరమవుతారని పేర్కొన్నారు.

ముందడుగు పడేనా..?

వ్యవస్థ ఏర్పాటు, సిబ్బంది సమకూర్చుకోవడంతో పాటు రెవెన్యూ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రారంభానికి సర్వర్లు, నెట్‌వర్క్ అనే రెండు సమస్యలను అధిగమించాల్సి ఉంటుంది. ఇందుకోసం ముందుగా రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించిన సమాచారాన్ని నిక్షిప్తం చేసే గచ్చిబౌలిలోని సర్వర్ స్టోరేజీ సామర్థ్యాన్ని కూడా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. దీంతో పాటు రెయిల్‌టెల్ నెట్‌వర్క్‌ను ప్రతి రెవెన్యూ కార్యాలయానికి అనుసంధానం చేయాల్సి ఉంది. అయితే, ఇప్పటివరకు ఈ ప్రతిపాదనలేవీ ఫైనల్ కాలేదు. ఈ నేపథ్యంలో ప్రాథమిక స్థాయిలోనే ఉన్న ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించి రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు ప్రారంభం కావడం మార్చి 12 నాటికి సాధ్యపడే అవకాశాలు కనిపించట్లేదు.

PUBLIC NOTICE

NOTICE is hereby given to the public at large that we have been instructed by our client, **Reliance Jio Infocom Limited** to investigate the title of **Reliance Communications Limited,** a company incorporated under the provisions of the Companies Act, 1956 and having its registered office at **'H' block, 1st floor, DAKC, Navi Mumbai – 400709,** including its subsidiaries and affiliates (collectively **"the Company"**) to the property more particularly described in the **Schedule** hereunder written (**"said Property"**) as our client is in process of negotiating to acquire the said Property from the Company.

All individuals, proprietorship, partnerships firms, limited liability partnership, Hindu undivided family, companies, body corporates, trusts or any other entity, agency, bodies or association of persons having any claim and/or demand and/or objection against / upon / in respect of the right title interest of the Company to the said Property or any portion thereof by way of inheritance, mortgage, sale, agreement for sale, transfer, assignment, lease, sublease, license, sub-license, lien, charge, trust, maintenance, easement, gift, litigation, lis-pendens, decree or order of any adjudicating authority, exchange, partition, power of attorney, will, bequest, FSI, tenancy, development rights, family arrangement /settlement, possession, allotment or otherwise howsoever (**"Claims"**) are hereby requested to give written notice of the same to Khaitan & Co, Advocates at One Indiabulls Centre, Tower-1, 13th floor, Senapati Bapat Marg, Elphinstone Road, Mumbai 400 013, along with certified true copies of documents in support of such Claims within 7 (Seven) days from the date of publication of this Notice, failing which, it shall be presumed that no such Claims exists and our client will be free to complete the purchase of the said Property without reference or recourse to such Claims and even if such Claims exists in law or otherwise, it shall be deemed that the claimant has relinquished such Claims and/or waived his/her/ its/ their right to exercise such Claims and the same shall not be binding on our client.

SCHEDULE REFERRED TO HEREINABOVE

SR. NO	LOCATION	DESCRIPTION OF PROPERTY
1	DICHPALLI	Land measuring 2 (two) acres in Survey No. 461/A, situated at Ditchpally village, Ditchpally Mandal, Nizamabad District.
2	GUNTUR	Land measuring 1 (one) acre 10 (ten) cents in Survey No. 558, situated at Ankireddopalem Village, Guntur Mandal, Guntur District, A.P.
3	MAHABUBNAGAR	Land measuring 2 (two) Acres 17 (seventeen) cents in Survey Nos. 529, 530 and 531, all situated at Yedira Village, Mahaboobnagar Mandal, Mahaboobnagar District of A. P Pradesh.
4	ELURU	1) Lands measuring 1 acre in Survey Nos. 282, 283 and 285, situated in Vatluru Village, Pedapadu Mandal, West Godavari District of A.P 2) Lands measuring 44 cents in Survey No. 285, situated in Vatluru Village, Pedapadu Mandal, West Godavari District of A.P. 3) Lands measuring 74 cents in Survey Nos. 282 and 283, situated in Vatluru Village, Pedapadu Mandal, West Godavari District of A.P.
5	ANANTAPUR	Land measuring 1 (one) Acre 39 (thirty nine) cents in Survey Nos. 147 1/C and 143/2B2, both situated at Kakkalapalli Village, Ananthapur Mandal, Ananthapur District of A.P.
6	ADILABAD	1) Land measuring 1666.67 square yards in Survey No. 37/A, situated at Dasnapur Village, code No. 109 G.P. Mavala, adilabad Mandal, Adilabad District of A.P 2) Land measuring 16.977 square yards, in Survey No. 37/A, situated at Dasnapur Village, adilabad Mandal and District of A.P.
7	SANGAREDDY	1) Land measuring 30 guntas in Survey No. 685 (P) and 690 (P), both situated at Peddapur Village, Sadasivapet Mandal, Medak District of A.P. 2) Land measuring 2 acres 26 guntas in Survey Nos. 683 (part) and 684 (part), both situated at Peddapur Village, Sadasivapet Mandal, Medak District of A.P.
8	SRIKAKULAM	Land measuring 1 acre .0024 cents in Survey No. NS466/4 O.S.178/B1, situated at Singupuram Village, Srikakulam Mandal, Srikakulam District.
9	VIZIANAGARAM	Land measuring 97 cents in Survey No. 166/11 and Survey No. 166/12, both situated at Singavaram Village, Denkada Mandal, Vizianagaram District of A.P.
10	KURNOOL	Land measuring 39.53 cents in Survey Nos. 311/1A1 and 322/1A1 and semi finished building thereon including (main building of 84 x 60, room, toilets, borewell, pipeline for municipal water connection etc.,) with door Nos. 51-15-D5-1 &51-15-D5-2, situated at Kallur Village, Kurnool District.
11	RAJAHMUNDRY	Land measuring 2300 square yards in Plot Nos. 60, 61, 62,63, 64 and 65, R.S.No.490, situated at Palacharla Village, Lalacheruvu Gram Panchayat, Korukonda Talk Rajahmundry, East Godavari District
12	RENIGUNTA	Land measuring 4230.70 square yards, comprised in Plot Nos. S7 (2140 square yards) and Plot No. S8 (2090.70 square yards, forming part of assisted private industrial estate, tirupati in Survey No. 841/1 of Thookivakam Village, Renigunta Mandal, Chittor District, Renigunta Sub District, Sri Balaji Registration District, Tirupati.
13	ONGOLE	1) Land measuring 210. 3/9 square yards in Survey No. 234/1, situated at Ongole Village, forming part of Ongole Municipal Area, Prakasam District 2) Non- agricultural land measuring 199.5/9 square yards in Survey No. 234/1, situated at Ongole Village, forming party of Ongole Municipal area, Prakasam District.. 3) Non-agricultural land measuring 200.1/9 square yards in Survey No. 234/1, situated at Ongole Village, forming part of Ongole Municipal Area, Prakasam District 4) Non-agricultural land measuring 198.3/9 square yards in Survey No. 234/1, situated at Ongole Village, forming part of Ongole Municipal Area, Prakasam District 5) Non agricultural land measuring 198.6/9 square yards in Survey No. 234/1, situated at Ongole Village, forming part of Ongole Municipal Area, Prakasam District 6) Non agricultural land measuring 195.7/9 square yards in Survey No. 234/1, situated at Ongole Village, forming part of Ongole Municipal Area, Prakasam District 7) Non-agricultural land measuring 196.4/9 square yards in Survey No. 234/1, situated at Ongole Village, forming part of Ongole Municipal Area, Prakasam District. 8) Non-agricultural land measuring 195.00 square yards in Survey No. 234/1, situated at Ongole Village, forming part of Ongole Municipal Area, Prakasam District. 9) Non-agricultural land measuring 197.7/9 square yards in Survey No. 234/1, situated at Ongole Village, forming part of Ongole Municipal Area, Prakasam District. 10) Non-agricultural land measuring 197.1/9 square yards in Survey No. 234/1, situated at Ongole Village, forming part of Ongole Municipal Area, Prakasam District.
14	NELLORE	Land measuring 0.50 cents in Survey No. 180-7, bearing Patta No. 1887 along with 3302 square feet ACC factory and 1376 square feet RCC building etc., situated in Padugupadu Village, Kovvur Mandal, Nellore District
15	NARKETPALLY	Land measuring 2 (two) acres 10 ¾ (ten and three fourth) guntas in Survey No. 222, situated at Narketpalli Village, Narketpalli Mandal, Nalgonda District
16	VISHAKHAPATNAM	1) Land measuring 798.33 square yards, bearing plot No. D-6 in Survey No. 39, situated industrial estate of kapparada Village, Visakapatnam Revenue Mandal, Visakapatnam Municipal Corporation area, Visakapatnam District. 2) Land measuring 2020 square yards in Survey No. 39 with cellar slab, ground floor slab and partly brick walls in ground floor without flooring, situated at Kapparada Village, Vishakhapatnam Mandal, Vishakhapatnam District.
17	HYDERABAD	Land measuring 2030.65 square yards with constructed area of 21000 square feet having D.No.88/E situated in Phase I, IDA, in Survey No. 311/5, situated at Jeedimetla Village, Quthbullapur (Mandal), Rangareddy District of A.P
18	BHIMAVARAM	Land measuring 600 square yards in Survey No. 456/1, situated at Gunupudi Village, Bhimavaram mandal, West Godavari District.
19	GUNTUR – TENALI	Land measuring 775 square yards, in D.No.1-42-25&1-42-26, situated at Jandhyala vari street, Tenali Municipality, Tenali District, Guntur
20	VUYYURU	Land measuring 798.6 square yards in survey No. 174/1 and 183/3A, both situated at Gandigunta Village, Vuyyuru Mandal, Krishna District.
21	WARANGAL	Land measuring 780 square yards bearing M.No.2-14-522, situated at Ramnagar street, Hanmakonda, Warangal District.
22	CUDDAPAH	1) Land measuring 290.4 square yards in Survey No. 561, situated at Chammumiyyapeta, Cuddapah Mandal and District of A.P 2) Land measuring 266.2 square yards in Survey No. 561, situated at Chammumiyyapeta mandal and District 3) Land measuring 217.8 square yards, in survey No. 561, situated at Chammumiyyapeta, Cuddapah Mandal and District.
23	KARIMNAGAR	Land measuring 960 square yards, bearing Plot No. 23 in Survey No. 819, situated at Karimnagar Municipality, Karimnagar District.
24	KAKINADA	Land measuring 776.78 square yards in Survey No. 100, situated at Ramanayyapeta Village, Municipal ward No. 30, Block No. 70, Kakinada Municipality, Kakinada East, Godavari District.
25	KHAMMAM	1) Land measuring 687.28 square yards, in Survey No. 288B and 287E, situated at Khanapuram Haveli Village, Khammam Urban Mandal, Khammam District 2) Land measuring 106.15 square yards or 88.79 square meters, in Survey No. 288, situated at Khanapuram Haveli Village, Khammam Urban Mandal, Khammam District
26	PEDAPALLE	Land measuring 644.16 square yards/ 539.16 square meters in Survey No. 259/B, situated at Maidipally Village, Municipality Ramagundam Mandal Parishad of A.P
27	VIJAYAWADA	Land bearing No.5 with D.No.54-2-2A, admeasuring 6026 square yards with building and godown thereon and situated in R.S. Nos. 481 (part) and No. 482 (part) of erstwhile Gunadala Village but presently within the limits of the Municipal Corporation, Vijayawada in Municipal ward No. 33A with Assessment No. 41160 and having Electrical services consumer Nos. 00045913138 and 00045813137 and a bore well in Jawahar Autonagar, Vijayawada, Krishna District
28	HYDERABAD	Land measuring 4.001 (four point zero zero one) acres in Plot No.s 20 & 38 forming part of Survey No. 64 (part) and situated at Madhapur Village, Serilingampally Mandal, Ranga Reddy District

Place: Mumbai
Dated: 24.02.2018

For Khaitan & Co
Sd/-

Rahul Dutt
Partner

కాళేశ్వరానికి సుప్రీం గ్రీన్ సిగ్నల్

అప్పీల్ పిటిషన్‌ను కొట్టివేసిన అత్యున్నత ధర్మాసనం

- ప్రాజెక్టు పనులు కొనసాగించవచ్చన్న హైకోర్టు ఉత్తర్వులకు సమర్థన
- దక్షిణాది పరిధిలోని చెన్నై ఎన్జీటీకి వెళ్లకుండా ఢిల్లీ ఎన్జీటీకి వెళ్లడమేంటి?
- ఇది 'ఫోరం హంటింగ్' కాదా.. అని వ్యాఖ్య
- విచారణ సందర్భంగా కోర్టుకు హరీశ్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు సంబంధించి దాఖలైన అప్పీలు పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రాజెక్టు ప్రారంభమైన ఏడేళ్ల తర్వాత కేసు వేయడం, ఫిర్యాదు చేయాల్సిన పరిధి దాటి మరోచోట పిటిషన్ వేయడం ఏమిటని పిటిషనర్లను ప్రశ్నించింది. ప్రాజెక్టు పనులు కొనసాగించుకోవచ్చంటూ ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. ఈ మేరకు జస్టిస్ రోహింటన్ ఫాలీ నారీమన్, జస్టిస్ నవీన్‌సిన్హాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది.

ఎన్జీటీ నుంచి హైకోర్టుకు.. సుప్రీంకోర్టుకు..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎలాంటి అనుమతులు లేకుండా అటవీ భూములను వినియోగిస్తున్నారంటూ హైదరాబాద్‌కు చెందిన హయాతుద్దీన్ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ప్రధాన ధర్మాసనంలో ఫిర్యాదు చేశారు. దాంతో ఎన్జీటీ గతేడాది అక్టోబర్ 5న ప్రాజెక్టు పనులపై స్టే విధించింది. ప్రాజెక్టుకు పూర్తిస్థాయి అనుమతులు వచ్చే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించగా.. ఎన్జీటీ స్టేను రద్దు చేసి, పనులు కొనసాగించుకోవచ్చంటూ నవంబర్ 8న ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి పనులు ప్రారంభమైన ఆరు నెలల్లోపు దాఖలైన పిటిషన్లను మాత్రమే విచారించాలని ఎన్జీటీ చట్టం సెక్షన్ 14(3) చెబుతోందని, కానీ ఎన్జీటీ ఆ సెక్షన్‌ను పరిశీలించకుండానే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని హైకోర్టు స్పష్టం చేసింది. ఇక దక్షిణాది రాష్ట్రాల కోసం చెన్నైలో ఎన్జీటీ బెంచ్ ఉండగా ఢిల్లీలోని ప్రధాన బెంచ్ ముందు నేరుగా పిటిషన్ దాఖలు చేయడం ఏమిటని.. అసలు ఈ పిటిషన్‌ను విచారించే న్యాయపరిధి ప్రధాన బెంచ్‌కు ఉందా, లేదా అన్నది కూడా తేల్చాల్సి ఉందని అభిప్రాయపడింది. అయితే పర్యావరణ అనుమతులు వచ్చేవరకు కాలువలు, పిల్ల కాలువల నిర్మాణాలు, ఇతర అను బంధ పనులను మాత్రం చేయవద్దని.. అటవీ అనుమతులు వచ్చేవరకు అటవీ భూములను తాకరాదని ఆదేశించింది.



ఏవైనా ఉల్లంఘనలు జరిగితే రాష్ట్ర ప్రభుత్వంపై తగిన చర్యలు తీసుకోవచ్చని ఎన్జీటీకి స్పష్టం చేసింది. అయితే ఎన్జీటీ ఇచ్చిన స్టేను హైకోర్టు ఎత్తివేయడంపై పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

కోర్టు హాల్‌లో మంత్రి హరీశ్‌రావు

శుక్రవారం మంత్రి హరీశ్‌రావు స్వయంగా సుప్రీంకోర్టు విచారణకు హాజరయ్యారు. గురువారం సాయంత్రమే ఢిల్లీ వచ్చిన ఆయన.. న్యాయవాదుల బృందంతో చర్చించారు. విచారణ అనంతరం పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడంతో న్యాయవాదులను హరీశ్‌రావు అభినందించారు. కోర్టు ఉత్తర్వులను ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు ఫోన్‌లో వివరించారు. ఈ సందర్భంలో న్యాయవాది ముకుల్ రోహత్గీ స్పందిస్తూ.. 'నేను చాలా మంది మంత్రులను చూశాను. కానీ మీలాంటి ప్రతిభ కల మంత్రిని చూడలేదు..'అని ప్రశంసించారు. విచారణకు తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, అదనపు అడ్వొకేట్ జనరల్ రామచంద్రరావు కూడా హాజరయ్యారు.

ఇది 'ఫోరం హంటింగ్' కాదా?

ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ సవాలు చేసిన అనుమతులన్నీ కాళేశ్వరం ప్రాజెక్టుకు ఉన్నాయని, కేవలం ప్రాజెక్టును అడ్డుకునేందుకే పిటిషన్ వేశారని పేర్కొన్నారు. పిటిషనర్ తరపున న్యాయవాది సంజయ్ ఉపాధ్యాయ వాదనలు వినిపిస్తూ.. ''ఈ ప్రాజెక్టును ఎలాంటి అనుమతులు లేకుండా పనులు ప్రారంభించారు. అందు వల్లే ఎన్జీటీ స్టే ఇచ్చింది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కేవలం తాగునీటి ప్రాజెక్టుగా చెబుతూ వచ్చింది. కానీ సాగునీరు కూడా అందించే ప్రాజెక్టు ఇది. అటవీ చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం అటవీ భూములను ఇతర అవసరాలకు వినియోగించినప్పుడు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంది'' అని విన్నవించారు. దీంతో జస్టిస్ నారీమన్ జోక్యం చేసుకుంటూ.. ''దక్షిణాది రాష్ట్రాలకు చెన్నైలో ఎన్జీటీ బెంచ్ ఉండగా.. ఢిల్లీ ఎన్జీటీకి ఎందుకు రావాల్సి వచ్చింది? ఇది ఫోరం హంటింగ్ (నిబంధనల ప్రకారం ఆశ్రయించాల్సిన బెంచ్‌ను కాకుండా.. నిర్దిష్ట బెంచ్ వినడం ద్వారా అనుకూలమైన ఉత్తర్వులు వస్తాయని భావించి ఇతర న్యాయస్థానాలను, ధర్మాసనాలను ఆశ్రయించడం) చేస్తున్నట్టు కాదా..?'' అని వ్యాఖ్యానించారు. దీంతో పిటిషనర్ తరపు న్యాయవాది వివరణ ఇస్తూ.. ఈ కేసు తెలంగాణ వరకే పరిమితం కాదని, మహారాష్ట్రతో కూడా ముడిపడి ఉందని చెప్పారు. తాము పిటిషన్ దాఖలు చేసిన సమయంలో చెన్నై బెంచ్ ఖాళీగా ఉందని, ఢిల్లీలోని ప్రధాన బెంచ్‌లో కూడా ఒక న్యాయమూర్తి, ఒక ఎక్స్‌పర్ట్ మెంబర్ మాత్రమే ఉన్నారని... పూర్తి బెంచ్ లేదన్న కారణంగానే ఎన్జీటీ ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసిందని వివరించారు. దీంతో న్యాయమూర్తి స్పందిస్తూ.. అసలు ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాక ఏడేళ్లకు ఎలా ఫిర్యాదు చేస్తారని ప్రశ్నించారు. పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నట్టు స్పష్టం చేశారు. ప్రాజెక్టులను అడ్డుకునేందుకు తరచూ పిటిషన్లు వేస్తున్నారని, దాన్ని నివారించేందుకు పిటిషనర్‌కు జరిమానా విధించాలని న్యాయవాది ముకుల్ రోహత్గీ విజ్ఞప్తి చేయగా ధర్మాసనం అంగీకరించలేదు.

చెంపలేసుకుని క్షమాపణ కోరాలి

- కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన మంత్రి హరీశ్
- ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కుట్ర
- సుప్రీం తీర్పు వారికి చెంపపెట్టు
- ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి
- కోదండరాం, కాంగ్రెస్ వేర్వేరు కాదు
- కుట్రలను శాసనసభలో బయటపెడతామని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రాజెక్టులను అడ్డుకుంటున్న ప్రతిపక్ష కాంగ్రెస్ ఇప్పటికైనా కళ్లు తెరవాలని, చేసిన పనికి చెంపలేసుకుని క్షమాపణ అడగాలని మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలను సుప్రీంకోర్టు కొట్టివేసిందని వ్యాఖ్యానించారు. శుక్రవారం సుప్రీంకోర్టులో కాళేశ్వరం పిటిషన్‌పై విచారణకు హాజరైన ఆయన.. తీర్పు అనంతరం కోర్టు ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ''కాంగ్రెస్ నాయకులు గ్రీన్ ట్రిబ్యునల్‌లో, హైకోర్టులో, సుప్రీంకోర్టులో కేసులు వేసి ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలా కాళేశ్వరంపై దాఖలైన పిటిషన్‌ను ఈ రోజు సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. పిటిషనర్ల తీరును న్యాయమూర్తి తీవ్రమైన పదజాలంతో తప్పుపట్టారు. 'ఫోరం హంటింగ్'అనే పదాన్ని కూడా వాడారు. వాస్తవానికి ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టుకు పర్యావరణ, అటవీ, అంతర్రాష్ట్ర, హైడ్రాలజీ, కేంద్ర జల సంఘం అనుమతులన్నీ వచ్చాయి. ఈ వివరాలను సుప్రీంకోర్టుకు నివేదించాం. కేసు వేసిన వారు ఈ వాస్తవాలను పిటిషన్‌లో ప్రస్తావించకుండా కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. అంతిమంగా న్యాయం గెలిచింది''అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

శాసనసభలో ఎండగడతాం..

కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకిగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. రైతుల పొలాలకు నీరిచ్చేందుకే కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులు కడుతున్నామని, వాటిని అడ్డుకోవడమంటే రైతులకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. ''ఈ కోర్టు కేసుల కోసం కాంగ్రెస్‌లోని ఏ నాయకుడు టికెట్ కొనిచ్చారో, ఏ నాయకుడు వెనకుండి నడిపిస్తున్నారో అన్నింటిపై మా వద్ద సమాచారముంది. వందకుపైగా కేసులు వేశారు. కాంగ్రెస్ కుట్రలను సాక్ష్యాధారాలతో సహా శాసనసభలో బయటపెట్టి ఎండగడతాం. ఇప్పటికైనా వాళ్లు బుద్ధి తెచ్చుకోవాలి. అసలు ప్రాజెక్టులు వేగంగా పూర్తిచేయాలని ప్రతిపక్షాలు పోరాడాలి. కానీ ప్రాజెక్టులపై స్టే ఇవ్వండి, పనులు ఆపండి అంటే అభివృద్ధిని అడ్డుకోవడం అవుతుంది. సుప్రీంకోర్టు మొట్టికాయ వేసిన తరువాతైనా కాంగ్రెస్ కళ్లు తెరవాల్సిన అవసరముంది..''అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మరో ప్రశ్నకు స్పందిస్తూ.. ప్రాజెక్టులను అడ్డుకోవాలని చూసే వారికి ఇది చెంపపెట్టు వంటిదన్నారు. తాము కోదండరాంను, కాంగ్రెస్‌ను వేరుగా చూడమని.. వారు ఒక చెట్టుకు రెండు కొమ్మల వంటివారని వ్యాఖ్యానించారు. ఆ ఇద్దరి ఎజెండా ఒక్కటేనని, వాళ్లది రాజకీయ ఎజెండా తప్ప ప్రజల ఎజెండా కాదని విమర్శించారు. కేసీఆర్‌కు పదవులు పెద్ద లెక్క కాదని, ఏ లక్ష్యం కోసం తెలంగాణ తెచ్చుకున్నామో ఆ లక్ష్యం కోసం ఆయన పనిచేస్తున్నారని చెప్పారు. మనదేశంలో 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో సాగునీటి ప్రాజెక్టు కట్టే ప్రభుత్వం ఎక్కడా లేదని, కేవలం తెలంగాణ ప్రభుత్వమే అలా పనిచేస్తోందని పేర్కొన్నారు.



వాటా సాధించుకుంటాం

- కృష్ణా జలాల్లో హక్కుపై హరీశ్‌రావు
- పరీవాహకం తెలంగాణలోనే ఎక్కువ
- రాష్ట్రానికి అధిక నీటి వాటా దక్కాలి
- దాన్ని సాధించుకొనే వరకు పోరాటం
- బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణకు హాజరు
- తుది ఆదేశాలు వస్తే నీటి వాటా పెరుగుతుందని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటాను సాధించుకుంటామని మంత్రి హరీశ్‌రావు విశ్వాసం వ్యక్తం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంతం తెలంగాణలోనే ఎక్కువగా ఉందని, ఆ లెక్కన రాష్ట్రానికి అధిక నీటి వాటా దక్కాల్సి ఉందని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో నదీ జలాల పంపకాలపై బ్రిజేశ్ ట్రిబ్యునల్‌లో జరుగుతున్న విచారణకు మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన నీటి వాటాను సాధించుకుంటామని హరీశ్‌రావు చెప్పారు. నదీ పరీవాహక ప్రాంతం ఆధారంగా తెలంగాణకు నీటి కేటాయింపులు పెంచాలని సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని, కోర్టు కేంద్రం నుంచి స్పందన కోరిందని తెలిపారు. కానీ కేంద్రం ఇంతవరకు స్పందించలేదని.. ఇప్పటికైనా స్పందించి సుప్రీంకోర్టుకుగానీ, ట్రిబ్యునల్‌కుగానీ అభిప్రాయం తెలపాలని విజ్ఞప్తి చేశారు.

విచారణ వేగంగా జరగాలి..

తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం సీనియర్ న్యాయవాదులు వైద్యనాథన్, రవీందర్‌రావు, అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని హరీశ్‌రావు పేర్కొన్నారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణ వేగవంతంగా జరగాల్సి ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి కూడా ఈ విషయాన్ని తెలియజేశామన్నారు. నీటి తుది కేటాయింపులు జరిగితే.. తెలంగాణకు తాత్కాలిక సర్దుబాటు కింద ఉన్న 299 టీఎంసీల వాటా కంటే అధికంగా జలాలు వస్తాయని తెలిపారు. అందువల్ల విచారణను వేగిరం చేసేలా ట్రిబ్యునల్‌కు విజ్ఞప్తి చేయాలని న్యాయవాదులకు సూచించామన్నారు.

విచారణ మార్చి 26కు వాయిదా..

నీటి పంపకాలకు సంబంధించి విచారణను బ్రిజేశ్ ట్రిబ్యునల్ వచ్చే నెల 26, 27, 28 తేదీలకు వాయిదా వేసింది. శుక్రవారం విచారణ సందర్భంగా వ్యవసాయ రంగంపై ఏపీ తరపున సాక్షి అయిన వ్యవసాయ రంగ నిపుణుడు పీవీ సత్యనారాయణను తెలంగాణ న్యాయవాది వైద్యనాథన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. తెలంగాణ కోరుతున్న అదనపు నీటి కేటాయింపుల్లో కొత్తగా వరిసాగుపై ఎలాంటి ప్రతిపాదన చేయలేదన్నది తెలుసని, ఏపీలోని కృష్ణా బేసిన్‌లో వరి అధికంగా సాగవుతోందని, తెలంగాణలో మెట్ట పంటలు సాగవుతున్నాయన్న విషయాలను సత్యనారాయణ అంగీకరించారు. నీరు ఇంకిపోవడమన్నది నేల స్వభావాన్ని బట్టి ఉంటుందని.. ఏపీలోని పరీవాహక ప్రాంతంలో నీరు ఇంకడం 2 ఎంఎంగా, తెలంగాణలో భిన్నరకాల నేలల వల్ల 5 ఎంఎంగా ఉందని పేర్కొన్నారు. అయితే దీనికి సంబంధించి తాను ఎలాంటి అధ్యయనం చేయలేదని, సాగు అవసరాలకు సంబంధించి నీరు ఇంకిపోయే నష్టాలను ఐక్యరాజ్యసమితి ఎఫ్ఏవో మ్యాన్యువల్ నుంచి తీసుకున్నానని ఆయన వెల్లడించారు.

ఆశ్రమ పాఠశాలలపై నిఘా నేత్రం!

విద్యా ప్రమాణాల పెంపునకు గిరిజన సంక్షేమ శాఖ నిర్ణయం

- బోధన, అభ్యసన, నిర్వహణపై తనిఖీలకు బృందాలు
- ప్రతి ఆశ్రమ పాఠశాల స్థాయిలో ఓ బృందం
- ప్రతి నెలా తనిఖీలు.. రాష్ట్ర కార్యాలయానికి నివేదికలు
- వాటి ఆధారంగా చర్యలకు సిఫారసు

సాక్షి, హైదరాబాద్: ఆశ్రమ పాఠశాలల నిర్వహణపై గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తోంది. ఆశ్రమ పాఠశాలలపై భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో వాటి ద్వారా వచ్చే ఫలితాలను బేరీజు వేసుకోవడంతోపాటు అత్యుత్తమ సేవలందించేందుకు దోహదపడేలా తనిఖీ బృందాలను నియమిస్తోంది. పాఠశాల స్థాయిలో బోధన, అభ్యసన, సిబ్బంది పనితీరు, నిర్వహణపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించింది. తనిఖీల అనంతరం ఆయా బృందాలు ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునేలా కార్యాచరణ రూపొందించింది. ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 319 ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిలో 316 ఆశ్రమ పాఠశాలలు పదో తరగతి వరకు, మరో 3 పాఠశాలలు ఇంటర్మీడియెట్ వరకు కొనసాగుతున్నాయి. వీటిలో 1.10 లక్షల మంది వరకు విద్యార్థులున్నారు. గురుకుల పాఠశాలలతో పోల్చితే ఆశ్రమ పాఠశాలల్లోనే అధిక సంఖ్యలో విద్యార్థులున్నారు.

3 కేటగిరీలుగా తనిఖీలు

తనిఖీ నిర్వహించే బృందంలో ప్రధానోపాధ్యాయులు బాధ్యులుగా వ్యవహరిస్తారు. సభ్యులుగా ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లు ఉంటారు. ఓ డివిజన్ బృందం.. ఇతర డివిజన్లకు చెందిన ఆశ్రమ పాఠశాలల్లో నిర్దేశిత తేదీల్లో తనిఖీలు నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలి. తనిఖీ ప్రక్రియకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక నమూనాలను రూపొందించింది. ఆ ప్రకారం మూడు రకాలుగా తనిఖీలు నిర్వహిస్తారు. ఫార్మాట్–1లో తరగతి పరిశీలన నిర్వహిస్తారు. ఇందులో ఉపాధ్యాయుడి పనితీరుతోపాటు తరగతి గది నిర్వహణ, రికార్డుల తీరును అధ్యయనం చేస్తారు. ఫార్మాట్–2లో పాఠశాల పరిశీలన చేస్తారు. ఇందులో వసతిగృహ నిర్వహణతోపాటు విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, పాఠశాల సుందరీకరణ, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, లైబ్రరీ తదితర వసతుల తీరును పరిశీలిస్తారు. ఫార్మాట్–3లో విద్యార్థులు, ఉపాధ్యాయుల పెర్ఫార్మెన్స్‌ను పరిగణిస్తారు. ఇందుకు మార్కుల గణాంకాలతోపాటు మౌఖిక ప్రశ్నలకు వచ్చే సమాధానాలను కూడా లెక్కిస్తారు. అనంతరం వాటి ఫలితాలను క్రోడీకరించి తుది నివేదిక తయారు చేస్తారు. దీన్ని జిల్లా గిరిజన సంక్షేమ శాఖకు సమర్పిస్తారు. వాటిని సంబంధిత జిల్లా గిరిజన సంక్షేమాధికారులు రాష్ట్ర కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుంది.

పాఠశాల వారీగా నివేదికలు

పాఠశాల వారీగా వచ్చిన నివేదికలను రాష్ట్ర కార్యాలయంలో విశ్లేషిస్తారు. అనంతరం ఫలితాలు, ర్యాంకులు పరిశీలించి మెరుగ్గా ఉన్న పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. పనితీరు అధ్వానంగా ఉన్న పాఠశాలలకు ప్రత్యేక అధికారిని నియమించి మెరుగుపడేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ ప్రారంభ దశలో ఉన్నప్పటికీ.. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పక్కాగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తనిఖీ ప్రక్రియతో అన్ని పాఠశాలలను సమాన స్థాయిలో తీర్చిదిద్దేందుకు వీలుంటుందని గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు నవీన్ నికోలస్ 'సాక్షి'కి తెలిపారు.

సింగరేణి కార్మికుడి సొంతింటి కల సాకారం

రూ.10 లక్షల రుణంపై వడ్డీ చెల్లింపునకు బోర్డు అంగీకారం

సాక్షి, హైదరాబాద్: సింగరేణి కార్మికుడి సొంతింటి కల సాకారం కానుంది. కార్మికుడు సొంతింటి కోసం తీసుకునే రూ.10 లక్షల రుణంపై వడ్డీ చెల్లింపునకు ఆమోదం తెలుపుతూ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కార్మికుల గృహ రుణాలపై వడ్డీ చెల్లింపునకు రూ.130 కోట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. మెడికల్ అన్‌ఫిట్ కేసుల్లో ఉద్యోగం వద్దనుకున్న వారికి ఒకేసారి రూ.25 లక్షలు లేదా నెలకు రూ.25 వేలు చెల్లించనున్నట్లు చెప్పారు. వందమందికి పైగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవడానికి ముందుకు వచ్చారన్నారు. ఉద్యోగుల తల్లిదండ్రులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తామని, దీనిపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

కాంగ్రెస్ యాత్రలతో ఒరిగేదేమీ లేదు

- బ్యాంకులకు రైతులు అప్పులిచ్చే రోజులు రావాలి
- 'సారథి' కళాకారుల సదస్సులో వ్యవసాయ మంత్రి పోచారం

సాక్షి, హైదరాబాద్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా ఎన్నో పథకాలు తీసుకొస్తుంటే కాంగ్రెస్ నేతలు బిత్తరబోయి ఏవేవో మాట్లాడుతున్నారని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. రైతు సమన్వయ సమితులు, పెట్టుబడి సాయం, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ వంటి అంశాలపై శుక్రవారం రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏమి చేయాలో అర్థం కాక కాంగ్రెస్ నేతలు పాద యాత్ర, బస్సు యాత్రలు అంటున్నారని పోచారం ఎద్దేవా చేశారు. 'మీ యాత్రల (కాంగ్రెస్ యాత్రల) వల్ల ఒరిగేది ఏమి ఉండదు, సర్కారుది మాత్రం శోభాయాత్ర, సంక్షేమయాత్ర, అభివృద్ధి యాత్ర'అని అన్నారు. సారథి కళాకారులు చేసే సాంస్కృతిక యాత్ర చూసి కాంగ్రెస్ వారు పారిపోక తప్పదని అన్నారు. భూలక్ష్మి, క్రాంతిలక్ష్మి, ధాన్యలక్ష్మి ఇలా 11 రకాల లక్ష్ములను ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం తీసుకోచ్చిందని పేర్కొన్నారు. ఏప్రిల్ 20 నుంచి 15 వరకు పెట్టుబడి క్రింద ప్రభుత్వం ఎకరాకు రూ. 4 వేల చొప్పున రైతులకు చెక్కులు పంపిణీ చేస్తుందన్నారు. ఆయా గ్రామాల్లో జరిగే పంపిణీ కార్యక్రమానికి గంట ముందుగా కళాకారులు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ప్రతి నియోజక వర్గానికి రూ.100 కోట్లు పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఏప్రిల్ 20 నుంచి మే 15 వరకు రూ.6 వేల కోట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రైతే రాజు కావాలని, ప్రజల కళ్లలో ఆనందం కనిపించినప్పుడే బంగారు తెలంగాణ వచ్చినట్లని అభిప్రాయపడ్డారు. బ్యాంకులకు రైతులు అప్పులిచ్చే రోజులు రావాలని ఆకాంక్షించారు. మార్చి 11న 72 లక్షల మందికి పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. తెలంగాణ గడ్డపై బాధపడే, కష్టపడే మనిషి ఉండకూడదనే దృఢసంకల్పంతో సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక మంత్రి అజ్మీరా చందులాల్, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, వ్యవసాయ కమిషనర్ జగ్‌మోహన్, సారథి కళాకారుల ప్రతినిధి యశ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల్లోకి 'గ్రామీణాభివృద్ధి'

ప్రతి గురువారం 3 గంటలకు టి-శాట్‌లో కార్యక్రమాల ప్రసారం: జూపల్లి



సాక్షి, హైదరాబాద్: గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను టి–శాట్ ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. ఈ శాఖకు సంబంధించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టి–శాట్‌లో ప్రతి గురువారం కార్యక్రమాలను ప్రసారం చేస్తామని మంత్రి తెలిపారు. తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాన్ని టి–శాట్ స్టూడియోలో ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత మూడున్నరేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం గ్రామీణుల జీవ న స్థితిగతులను మార్చేందుకు అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు. పంచాయతీలకు నిధులు పెంచడం, ఖర్చును తగ్గించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుపోతుందన్నారు. గ్రామాభివృద్ధిలో నిధుల కన్నా ప్రజలు సంఘటిత శక్తిగా మారడమే కీలకమన్నారు. ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ నిధులను ఖర్చు చేయడం ఒక్కటే తమ విధిగా వారు భావించడం సరికాదన్నారు. ప్రజాప్రతినిధులకు టి– శాట్ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు.

ప్రణాళికలు సిద్ధం

స్వచ్ఛ భారత్, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, పేదరిక నిర్మూలన, సేంద్రియ వ్యవసాయం, మహిళా సంఘాలకు ప్రభుత్వ చేయూత లాంటి అంశాలపై కార్యక్రమాలను ప్రసారం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సెర్ప్ సీఈవో పౌసమి బసు తెలిపారు. ప్రతి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు గ్రామీణాభివృద్ధిశాఖ కార్యక్రమాలను ప్రసా రం చేస్తామని టి–శాట్ సీఈవో శైలేశ్‌రెడ్డి తెలిపారు.

వర్గీకరణ బిల్లును వెంటనే ఆమోదించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్

బంద్‌కు మద్దతు ఇవ్వాలని చాడను కలిసిన మంద కృష్ణ





సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ఆమోదించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. వర్గీకరణ బిల్లును ఆమో దించాలనే డిమాండ్‌తో మార్చి 13న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలంటూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ శుక్రవారం మఖ్దూంభవన్‌లో చాడ వెంకటరెడ్డిని కలిశారు. చాడ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం అన్ని పార్టీలు మద్దతిచ్చాయని, దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేసిన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. జాతీయ స్థాయిలో వర్గీకరణకు అన్ని పార్టీలతో సమన్వయం చేస్తామని, వర్గీకరణకు మద్దతు ఇస్తున్నామని, బంద్‌కు సంపూర్ణంగా సహకరిస్తామని ప్రకటించారు. వర్గీకరణ కోసం 24 ఏళ్లుగా ఉద్యమం జరుగుతున్నా ఎన్నడూ బంద్ పిలుపును ఇవ్వలేదని మంద కృష్ణ మాదిగ గుర్తుచేశారు.

టీఆర్ఎస్ కార్యకర్తలతో రైతు సమితులా?

రైతు సమితులు టీఆర్ఎస్ కార్యకర్తలకు పునరావాస కేంద్రాలుగా మారాయని చాడ విమర్శించారు. రైతు సమన్వయ సమితుల పేరుతో అధికారాన్ని, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ సంక్షోభంపై మార్చిలో ప్రత్యక్ష ఆందోళన చేపడతామన్నారు.

✦ నాగం చేరితే కాంగ్రెస్‌కు లాభమే: చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం వల్ల ప్రయోజనమే కలుగుతుందని, ఎవరూ వ్యతిరేకించాల్సిన అవసరంలేదని ఎమ్మెల్యే జి.చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం విలేకరులతో చిన్నారెడ్డి, మరో ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి మాట్లాడారు. నాగం జనార్దన్ రెడ్డి జిల్లాలోనే కాకుండా, రాష్ట్రంలోనూ ప్రభావం చూపించే నాయకుడని చిన్నారెడ్డి అన్నారు. నాగం లాంటి బలమైన నాయకుడు కాంగ్రెస్‌లోకి వస్తానంటే ఆహ్వానించాల్సిందేనన్నారు. జైపాల్‌రెడ్డి, నాగంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ నాయకుడు పనిచేయాలని కోరారు. వనపర్తికి చెందిన టీడీపీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. తెలంగాణలో టీడీపీ లేదని, అందుకే రావులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నానని చిన్నారెడ్డి వెల్లడించారు. తన కంటే రావుల బలమైన అభ్యర్థి అని భావిస్తే వనపర్తి సీటును త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కాంగ్రెస్‌లో పుట్టి పెరిగిన నేతలెవరూ నాగం చేరికను వ్యతిరేకించడంలేదని వంశీచంద్‌రెడ్డి అన్నారు.

✦ సీపీఎస్ రద్దుకు సకల ఉద్యోగుల మహాసభ

వచ్చేనెల 25న నిర్వహణ: ఉద్యోగుల జేఏసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమయ్యారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 25న సకల ఉద్యోగుల మహాసభ నిర్వహిస్తామని ఉద్యోగుల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఉద్యోగుల జేఏసీ నేతలు కారం రవీందర్ రెడ్డి, మమత, మామిళ్ల రాజేంద్ర, స్వామిరెడ్డి, జ్ఞానేశ్వర్ శుక్రవారం సీఎస్ ఎస్కే జోషికి నోటీసు అందజేశారు. కేంద్రం తీసుకొచ్చిన పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని వెనక్కి తీసుకొని, సీపీఎస్‌ను రద్దు చేసి, 2004 తర్వాత నియమితులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని, తగుచర్యలు చేపట్టాలని విన్నవించారు. 2017 జూలై 1 నుంచి రావాల్సిన డీఏను చెల్లించాలని, కొత్త జిల్లాల్లో ఆర్డర్ టు సర్వ్‌ను రద్దు చేసి శాశ్వత కేటాయింపులు చేపట్టాలని కోరారు. పదవీ విరమణ వయసును 60 ఏళ్లకు పెంచాలని, చనిపోయిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలకు గ్రాట్యుటీ, పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సీఎస్ హామీ ఇచ్చినట్లు సంఘాల నేతలు వెల్లడించారు.

✦ జేఏసీకి అనుబంధంగా వృత్తి సంఘాలు

సాక్షి, హైదరాబాద్: జేఏసీ చైర్మన్ కోదండరాం నేతృత్వంలో ఆవిర్భవించనున్న రాజకీయ పార్టీకి అనుబంధంగా వృత్తి సంఘాలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వంటి కుల సంఘాలు కాకుండా వృత్తుల పేరుతోనే అనుబంధ సంఘాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని జేఏసీ నేతలు ప్రతిపాదిస్తున్నారు. దీనికి అనుగుణంగానే ఏయే వృత్తులకు సంఘాలు ఏర్పాటు చేయాలనే దానిపై జేఏసీ నేతలు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్ ఏర్పాటు చేయడం కన్నా వృత్తుల పేరిట సంఘాల నిర్మాణం చేసి, వృత్తుల వారీగా సమస్యలను గుర్తించి నిర్దిష్ట సమాచారం క్రోడీకరించడం వీలుగా ఉంటుందని భావిస్తున్నారు. వృత్తుల వారీగా పరిస్థితులపై అధ్యయనం చేయాలని, సమస్యలను గుర్తించి, పోరాటాలు చేయాలని వారి యోచన. వృత్తుల వారీగా పోరాటాలతో దాదాపుగా అన్ని కులాలు, వర్గాలకు జేఏసీ దగ్గరయ్యే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

✦ 'మొక్కల సంరక్షణ బాధ్యత అటవీ శాఖదే'

సాక్షి, హైదరాబాద్: వేసవి సెలవుల నేపథ్యంలో పాఠశాలల ఆవరణల్లో నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత అటవీ శాఖదే అని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి పీకే ఝా స్పష్టం చేశారు. స్కూళ్లు, కాలేజీలు, వివిధ సంస్థల ప్రాంగణాల్లో నాటిన ప్రతీ మొక్క బతకాలని, అందుకోసం మిగతా శాఖలతో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత ఆయా జిల్లాల అటవీ అధికారులదేనని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి ఓఎస్డీ(హరితహారం) ప్రియాంక వర్గీస్ కలసి ఆ శాఖ అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారం రోజుల్లో అన్ని జిల్లాల కలెక్టర్లు వారి పరిధిలో ఎంపీడీవోలు, ఎంఈవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించటంతోపాటు, బతికిన మొక్కల శాతం నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 24, 25వ తేదీల్లో అటవీ ప్రాంతాల్లో నీటి వసతిపై వలంటీర్ల సహకారంతో సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు.

✦ ప్రగతిపథంలో పాడి పరిశ్రమ: భూమారెడ్డి

హైదరాబాద్: పాడి పరిశ్రమాభివృద్ధికి పటిష్టమైన చర్యలు చేపట్టామని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య(విజయ డెయిరీ) చైర్మన్ లోక భూమారెడ్డి చెప్పారు. విజయ డెయిరీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ లాలాపేటలోని కార్యాలయంలో ఆయనను అధికారులు, ఉద్యోగులు అభినందించారు. ఏడాదికాలంలో పాల ఉత్పత్తిదారుల సంఖ్యను 44,432 నుంచి 67,259 వరకు, పాల సేకరణను 3,10,000 నుంచి 4 లక్షల లీటర్ల వరకు పెంచామని ఆయన చెప్పారు. డెయిరీలో ఖాళీగా ఉన్న 110 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వ అనుమతి సాధించామని, ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ చర్యలు తీసుకుంటోందన్నారు.

✦ 'నల్ల కుబేరులకు కొమ్ముగాస్తున్న మోదీ'

సాక్షి, హైదరాబాద్: దేశాన్ని విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్న నల్ల కుబేరులకు ప్రధాని నరేంద్ర మోదీ కొమ్ముగాస్తున్నారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీ వి.హనుమంత రావు ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజుకో అవినీతి, భారీ కుంభకోణాలతో ప్రజలను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబానీలతో మోదీ అంటకాగుతూ పెద్ద నోట్లను రద్దు చేశారని ఆరోపించారు. నోట్ల రద్దు, జీఎస్టీతో దేశ ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. డబ్బులను బ్యాంకుల్లో వేయాలని పేద, మధ్య తరగతి ప్రజలకు చెప్పి నల్ల కుబేరులకు కట్టబెడుతున్నారని, ప్రజలను మోసం చేయడానికి ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.

✦ ఆ ఆస్తులతో నాకు సంబంధం లేదు

ఏసీబీ విచారణలో పురుషోత్తంరెడ్డి

సాక్షి, హైదరాబాద్: హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం మాజీ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి ఏసీబీ అధికారులకు ఏ మాత్రం సహకరించలేదని తెలిసింది. ఆరు రోజుల కస్టడీలో భాగంగా పురుషోత్తంరెడ్డిని శుక్రవారం ఏసీబీ అధికారులు చంచల్‌గూడ జైలు నుంచి అదుపులోకి తీసుకున్నారు. కోట్ల రూపాయల ఆస్తుల సంపాదన, బినామీ పేర్ల మీద వ్యాపారాలు, ఆస్తులు కూడబెట్టిన అంశాలపై ఏసీబీ ప్రశ్నించింది. అయితే ప్రతీ ప్రశ్నకు తనకూ, స్వాధీనం చేసుకున్న ఆస్తులకు సంబంధం లేదని, గతంలో నమోదైన ఏసీబీ కేసు ఇలాంటి ఆరోపణల మీదే చేశారని సమాధానం చెప్పినట్టు తెలిసింది. తన కూతురు పెళ్లికి కొనుగోలు చేసిన విలువైన ఆభరణాలపై ప్రశ్నించగా వంశపారంపర్యంగా వస్తున్న ఆదాయంతోనే కొనుగోలు చేశామని చెప్పినట్టు తెలిసింది. పురుషోత్తంరెడ్డి బావమరిది, బినామీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీనివాస్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు.

మోగిన రాజ్యసభ నగారా



59 స్థానాలకు మార్చి 5న నోటిఫికేషన్, 23న పోలింగ్

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: ఏప్రిల్ 2న పదవీకాలం ముగియనున్న రాజ్యసభ స్థానాలకు మార్చి 23న జరపనున్నట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. రెండేళ్ల రాజ్యసభ పదవీకాలం ముగియనున్న సభ్యులతోపాటు.. ఇటీవల సభ్యత్వానికి రాజీనామా చేసిన, మృతిచెందిన సభ్యుల ఖాళీలను కలుపుకుని 17 రాష్ట్రాల్లో మొత్తం 59 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. మార్చి 5న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ ఎన్నికల తర్వాత రాజ్యసభలో బీజేపీ బలం పెరగనుంది. 58 స్థానాలు ఏప్రిల్ 2న ఖాళీ అవనుండగా.. కేరళ ఎంపీ వీరేంద్ర కుమార్ గతేడాది డిసెంబర్‌లో రాజీనామా (ఏప్రిల్ 2022 వరకు సమయం ఉన్నప్పటికీ) చేసిన సంగతి తెలిసిందే.

ఏపీ, తెలంగాణల్లో..

సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 18 రాజ్యసభ స్థానాలుండగా.. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీకి 11కు, తెలంగాణకు 7 సీట్లను లాటరీ పద్ధతిలో నిర్ణయించారు. ప్రస్తుతం రెండు తెలుగురాష్ట్రాల నుంచి ఆరు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ జాబితా ప్రకారం.. ఏప్రిల్ 2 తర్వాత ఏపీ నుంచి ముగ్గురు ఎంపీల (దేవేందర్ గౌడ్, రేణుక చౌదరి, చిరంజీవి) పదవీకాలం ముగియనుంది. తెలంగాణ నుంచి ఇద్దరు ఎంపీల (సీఎం రమేశ్, రాపోలు ఆనంద భాస్కర్) సభ్యత్వం ముగియనుండగా.. జూలై 2017న పాల్వాయి గోవర్ధన్ రెడ్డి హఠాన్మరణంతో ఖాళీ అయిన స్థానాన్ని ఇంతవరకు భర్తీ చేయలేదు.

జాబితాలో మహామహులు..

పదవీకాలం ముగుస్తున్న సభ్యుల్లో కేంద్ర మంత్రులు జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, ధర్మేంద్ర ప్రధాన్, జేపీ నడ్డా, థావర్‌చంద్ గెహ్లాట్, రాందాస్ అథావలే తదితరులున్నారు. కాంగ్రెస్‌తోపాటు పలు ప్రాంతీయ పార్టీనుంచి కూడా సీనియర్ రాజకీయ నాయకులు ఈ జాబితాలో ఉన్నారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో ఖాళీ కానున్న 10సీట్లలో మెజారిటీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోనుంది. యూపీ (10 స్థానాలు), బిహార్, మహారాష్ట్ర (చెరో ఆరు), పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ (ఐదేసి), కర్ణాటక, గుజరాత్ (తలో నాలుగు) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, రాజస్తాన్ (చెరో మూడు), జార్ఖండ్‌లో రెండు, ఛత్తీస్‌గఢ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళలో ఒకటి చొప్పున మొత్తం 59 స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి.

'టెర్రరిస్ట్ ఫండింగ్ వాచ్ లిస్ట్'లో పాక్!

అభ్యంతరాలు విరమించుకున్న చైనా, సౌదీ అరేబియా • పారిస్ సమావేశంలో అమెరికా తీర్మానానికి ఆమోదం!

పారిస్: అంతర్జాతీయ వేదికపై పాకిస్తాన్‌కు మరో పరాభవం. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చడం, మనీ ల్యాండరింగ్‌కు పాల్పడుతున్న ఆ దేశాన్ని 'టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ వాచ్ లిస్ట్'లో మళ్లీ చేర్చడానికి రంగం సిద్ధమైనట్లు తెలిసింది. పారిస్‌లో జరుగుతున్న ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) ప్లీనరీ సమావేశాల ముగింపు సందర్భంగా ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. పాక్‌ను ఆ జాబితాలో చేర్చాలని అమెరికా ప్రవేశపెట్టిన తీర్మానానికి తొలుత మోకాలడ్డిన చైనా, టర్కీ, సౌదీ అరేబియాలు వెనక్కి తగ్గినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అమెరికా, ఇతర సభ్య దేశాల ఒత్తిళ్ల మేరకే చైనా తన వైఖరి మార్చుకున్నట్లు తెలిసింది. ఉగ్ర ఫండింగ్, మనీ ల్యాండరింగ్ వ్యతిరేక నిబంధనలకు లోబడని పాక్‌ను దారిలోకి తేవడానికే అమెరికా ఈ తీర్మానాన్ని ప్రతిపాదించింది. 2012–15 మధ్య కాలంలో పాకిస్తాన్ 'టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ వాచ్ లిస్ట్'లో ఉంది. పాకిస్తాన్ మరోసారి ఆ నిషేధిత జాబితాలో చేరితే ఆర్థికంగా దెబ్బ తింటుంది. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్ల సేవలు కోల్పోనుంది. గతంలో టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ వాచ్ లిస్ట్‌లో ఉన్నప్పుడు అంతర్జాతీయ ద్రవ్య సంస్థ(ఐఎంఎఫ్) నుంచి బెయిల్ అవుట్ పొంది గట్టెక్కింది.



పాక్ ప్రధాని అబ్బాసీ (ఫైల్)

ఆలస్యంగా మేల్కొన్నా ఫలితం శూన్యం!

ఇటీవల ఉగ్ర సంస్థలపై పాకిస్తాన్ కొరడా ఝుళిపించింది. జమాతే చీఫ్ సయీద్‌కు చెందిన కొన్ని ఆస్తులు, మదర్సాలను స్వాధీనం చేసుకుని ఉగ్ర వ్యతిరేక చర్యలను ప్రారంభించినట్లు బాహ్య ప్రపంచాన్ని నమ్మించే ప్రయత్నం చేసింది. జమాతే, ఎఫ్ఐఎఫ్ అనే సంస్థలను నిషేధిస్తున్నట్లు అధ్యక్షుడు మమ్నూన్ హుసేన్ ఫిబ్రవరి 9న ఆర్డినెన్స్ జారీ చేశారు. టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ వాచ్ లిస్ట్‌లో తన పేరు చేర్చకుండా ఉండేందుకు పాకిస్తాన్ ఈ వారంలో ఎఫ్ఏటీఎఫ్ సభ్య దేశాలతో బేరసారాలు నిర్వహించింది. అమెరికా ప్రయత్నాలను భగ్నం చేసినట్లు పాక్ విదేశాంగ మంత్రి ఖవాజా ఆసిఫ్ మూడు రోజుల క్రితం తొందరపడి ప్రకటించారు.



నార్వేలో శుక్రవారం కనువిందు చేసిన ధృవ కాంతులు

ఐదు హైకోర్టులకు 37 మంది జడ్జీలు

న్యూఢిల్లీ: అలహాబాద్, రాజస్తాన్, కేరళ, గుజరాత్, బొంబాయి హైకోర్టుల్లో పనిచేస్తున్న 37 మంది అదనపు జడ్జిలను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఈ జడ్జీల్లో కొందరిపై ఫిర్యాదులు అందినప్పటికీ వారిపై చర్యలు తీసుకోదగ్గ కారణాలేవీ తమకు కన్పించలేదని కొలీజియం తెలిపింది. ఈ మేరకు కొలీజియం చేసిన సిఫార్సులు సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో శుక్రవారం అందుబాటులోకి వచ్చాయి.

టీవీ ప్రియులకు పెనుముప్పు



వాషింగ్టన్: గంటల కొద్దీ టీవీల ముందు కూర్చునేవారి సిరల్లో రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉందని ఓ అధ్యయనంలో తేలింది. టీవీలు చూస్తూ కూర్చోవటం వల్ల కాళ్లకు రక్తప్రసరణ పూర్తిస్థాయిలో జరగక సిరల్లో రక్తం గడ్డలు(వీన్స్ థ్రోంబోంబోలిజం–వీటీఈ) ఏర్పడే అవకాశముందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా శాస్త్రవేత్తలు తేల్చారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేసే వ్యక్తులు సైతం టీవీ చూడడం, కదలకుండా ఒకేచోట ఎక్కువసేపు కూర్చోవడం వంటివాటికి దూరంగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచించారు.

'తేజ్‌పాల్' విచారణ నుంచి తప్పుకున్న జడ్జి

న్యూఢిల్లీ: తెహెల్కా వ్యవస్థాపకుడు తరుణ్ తేజ్‌పాల్ కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ లావు నాగేశ్వరరావు తప్పుకున్నారు. సహోద్యోగిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో తనపై మోపిన అభియోగాలను తొలగించాలంటూ తేజ్‌పాల్ సుప్రీంను ఆశ్రయించారు. ఈ కేసును స్వీకరించిన జస్టిస్ నాగేశ్వరరావు, జస్టిస్ బాబ్డేల ధర్మాసనం విచారణ ప్రారంభించింది. కేసుకు సంబంధించిన కొన్ని అంశాలను ముందుగానే గుర్తించి ఉండాల్సిందని తేజ్‌పాల్ తరపున కపిల్ సిబల్ వాదించారు. ఇంతలోనే విచారణ నుంచి జడ్జి తప్పుకున్నారు.

కీలక ట్రిబ్యునల్‌కు చైర్మన్‌గా జస్టిస్ అమితవరాయ్?



న్యూఢిల్లీ: ఈ నెలాఖర్లో పదవీవిరమణ పొందనున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమితవ రాయ్‌కు అనంతరం కేంద్ర ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పజెప్పే అవకాశాలున్నాయి. దేశంలోని అత్యంత కీలకమైన, భారీ ట్రిబ్యునల్‌కు అమితవ రాయ్ చైర్మన్‌గా నియమితులవుతారని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ సంకేతాలిచ్చారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ)ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో వేణుగోపాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆయన సుప్రీంకోర్టు బాధ్యతలనుంచి రిటైరవటం బాధాకరం. కానీ ఆయన సేవలను మనం వదులుకోలేం. త్వరలోనే ఓ కీలకమైన ట్రిబ్యునల్‌లో ముఖ్యమైన బాధ్యతలు అందుకోనున్నారు' అని కేకే పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర జలవివాదాలపై ఒకే ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేయనున్నారన్న వార్తల నేపథ్యంలో.. ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అటు, ఎన్జీటీ చైర్మన్ స్వతంత్రకుమార్ పదవీకాలం కూడా ఇటీవలే ముగిసింది. కాగా, న్యాయమూర్తులందరూ ఐకమత్యంగా ఉండాలని.. న్యాయవ్యవస్థను నాశనం చేసేందుకు కొన్ని శక్తులు పన్నుతున్న కుట్రను తిప్పికొట్టాలని వీడ్కోలు సమావేశంలో జస్టిస్ అమితవ కోరారు.

ఆత్మాహుతి దాడి.. 18 మంది మృతి

మొగదిషు: సోమాలియా రాజధాని మొగదిషులో ఉగ్రవాదులు శుక్రవారం కారుబాంబులతో ఆత్మాహుతి దాడికి పాల్పడి 18 మంది ప్రాణాలు తీశారు. పేలుడు పదార్థాలతో నిండిన వాహనం మొగదిషులో తిరుగుతోందని సోమాలియా హోం మంత్రి గురువారమే హెచ్చరించారు. అయినా భద్రతా దళాలు పేలుళ్లను అడ్డుకోలేకపోయాయి. సోమాలియా నిఘా విభాగం ప్రధాన కార్యాలయం వద్ద తొలి ఆత్మాహుతి దాడి జరిగింది. ఆ తర్వాత పార్లమెంటు సమీపంలో రెండో దాడి చోటుచేసుకుంది.

స్కామ్‌స్టర్స్‌పై ఉక్కుపాదం



పీఎన్‌బీ కుంభకోణంపై మోదీ

న్యూఢిల్లీ: దేశాన్ని కుదిపేస్తున్న పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణంపై ప్రధాని మోదీ తొలిసారి పెదవి విప్పారు. నీరవ్, పీఎన్‌బీల పేర్లను ప్రస్తావించకుండా మోదీ మాట్లాడారు. ఆర్థిక అవకతవకలకు పాల్పడే వారిపై తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఇలాంటి కుంభకోణాలను గుర్తించేందుకు ఆర్థిక సంస్థలు, వాటి పర్యవేక్షక విభాగాలు శ్రద్ధతో పనిచేయాలన్నారు. ఆంగ్ల దినపత్రిక ఎకనమిక్ టైమ్స్ నిర్వహించిన ప్రపంచ వాణిజ్య సదస్సులో శుక్రవారం మోదీ మాట్లాడారు. 'ఆర్థిక అవకతవకలపై మా ప్రభుత్వం ఇప్పటికే కఠిన చర్యలు తీసుకుంటోందనీ, ఇకపై కూడా అలాగే వ్యవహరిస్తామని నేను స్పష్టంచేస్తున్నాను' అని అన్నారు. 2011 నుంచి 2017 మధ్య నీరవ్ మోదీ బ్యాంకు అధికారులతో కుమ్మక్కై అక్రమంగా ఎల్‌వోయూలు జారీ చేయించుకుని బ్యాంకును రూ.11,400 కోట్లకు మోసగించడం తెలిసిందే. 'నిబంధనలు, విధానాలను రూపొందించేవారు తమ పనిని జాగ్రత్తగా చేయాలని నేను కోరుతున్నాను' అని మోదీ అన్నారు. జీఎస్టీ వల్ల పన్ను ఆదాయం పెరిగిందనీ, గతంలో 60 లక్షల మంది పన్నులు కడుతుండగా ఇప్పుడు ఆ సంఖ్య కోటికి చేరిందని ఆయన అన్నారు. ఆర్థిక లోటు, ద్రవ్య లోటుల్లో తగ్గుదల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రాక తదితరాలే భారత వృద్ధి గురించి చెబుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత వాటా 3.1 శాతానికి పెరిగిందనీ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో 21 శాతం భారత్‌దేనని మోదీ వెల్లడించారు.

హెచ్1బీ మరింత కఠినం

ఉద్యోగి నైపుణ్యాన్ని, అతని అవసరాన్ని నిరూపించుకోవాలి

- 'థర్డ్ పార్టీ వర్క్ సైట్ల'కు హెచ్–1బీల జారీ కోసం కొత్త పాలసీ
- వీసా పొడిగింపు నిబంధనలు కట్టుదిట్టం

వాషింగ్టన్: భారతీయ ఐటీ కంపెనీలు, ఉద్యోగులపై పెను ప్రతికూల ప్రభావం చూపేలా హెచ్1–బీ వీసాల జారీలో అమెరికా భారీ మార్పులు చేసింది. విదేశీ కంపెనీల తరపున అమెరికాలోని 'థర్డ్ పార్టీ వర్క్ సైట్ల'లో పనిచేసేవారికి హెచ్–1బీ వీసాల జారీని కఠినంచేస్తూ కొత్త పాలసీ తెచ్చింది. ఫిబ్రవరి 22 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త పాలసీ ప్రకారం థర్డ్ పార్టీ వర్క్‌సైట్‌లో హెచ్–1బీ వీసా కోరుతున్న ఉద్యోగి పనిచేయాల్సిన అవసరాన్ని, వారి నైపుణ్యాల్ని కంపెనీలు నిరూపించాలి. హెచ్–1బీ వీసాదారు వర్క్ కాంట్రాక్ట్ ఎంతకాలముంటే అంత కాలానికే వీసాలు జారీ చేస్తామని, ఒకవేళ వీసాల్ని పొడిగించుకోవాలనుకుంటే తాజా నిబంధనల్ని పాటించాల్సిందేనని అమెరికా ఇమ్మిగ్రేషన్ విభాగం తెలిపింది. ఉద్యోగి తరపున వీసా దరఖాస్తు సమయంలోనే ఆ వివరాల్ని సమర్పించాలని సూచించింది. భారతీయ కంపెనీల తరపున హెచ్–1బీ వీసాదారులు పని చేసే కంపెనీలను 'థర్డ్ పార్టీ వర్క్‌సైట్లు' అంటారు.

పని ఉన్నంత కాలానికే..

అమెరికన్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) గురువారం జారీ చేసిన ఏడు పేజీల తాజా పాలసీ ప్రకారం థర్డ్ పార్టీ వర్క్‌సైట్‌లో ఎంత కాలం పనుంటే అంత కాలానికే హెచ్–1బీ వీసాలు జారీ చేస్తారు. ఇప్పటిదాకా మూడేళ్ల కాలానికి హెచ్–1బీ వీసాల్ని జారీచేస్తుండగా... ఇక నుంచి అంతకంటే తక్కువ కాలానికే జారీ చేయనున్నారు. 2019 ఆర్థిక సంవత్సరానికి హెచ్–1బీ వీసా దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 2 నుంచి ప్రారంభం కానుందన్న వార్తల నేపథ్యంలో ఈ పాలసీని కొత్తగా అమెరికా తెరపైకి తెచ్చింది.





యజమాని–ఉద్యోగి బంధం కొనసాగించాలి

ఈ పాలసీ ప్రకారం 'థర్డ్ పార్టీ వర్క్‌సైట్‌లో ఉద్యోగి పనిచేస్తున్నంతకాలం చట్టబద్ధమైన యజమాని–ఉద్యోగి సంబంధం కొనసాగేలా కంపెనీ చూసుకోవాలి. అలాగే ఉద్యోగి ప్రత్యేక నైపుణ్యమున్న వృత్తిలోనే పనిచేస్తాడని నిరూపించాల్సి ఉంటుంది. ఉద్యోగి చేయాల్సిన ప్రత్యేకమైన పని.. ఎంత కాలం పనిచేస్తాడు.. అందుకు సరిపడా నైపుణ్యం ఉందా? మొదలైన వివరాల్ని వీసా దరఖాస్తు సమయంలోనే కంపెనీలు వెల్లడించాలి. హెచ్–1బీ వీసాను గరిష్టంగా మూడేళ్ల వరకూ జారీచేయవచ్చని, అయితే ఆ నిర్ణయం తన విచక్షణాధికారంపైనే ఆధారపడి ఉంటుందని, అయితే దరఖాస్తు సమయంలో కంపెనీ పేర్కొన్న కాలానికే వీసా జారీ చేస్తామని యూఎస్‌సీఐఎస్ తెలిపింది. అయితే వీసా కోసం దరఖాస్తు చేసిన కంపెనీ.. యజమాని–ఉద్యోగి సంబంధాన్ని తప్పకుండా కొనసాగించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

వీసా పొడిగింపునకు తాజా నిబంధనలే

హెచ్–1బీ వీసా పొడిగింపునకు దరఖాస్తు చేస్తే తాజా నిబంధనల మేరకు అన్ని డాక్యుమెంట్లు సమర్పించాలని యూఎస్‌సీఐఎస్ తెలిపింది. 'తాము సూచించిన నిబంధనల్ని పాటించకపోయినా.. నియమాలకు అనుగుణంగా వీసా పిటిషన్ లేకపోయినా తగిన చర్యలు తీసుకునేందుకు అధికారం ఉంటుంది' అని స్పష్టం చేసింది. కొన్నిసార్లు అమెరికన్ కంపెనీలు ఉద్యోగితో కాంట్రాక్టును అర్ధాంతరంగా రద్దు చేసుకుంటాయి. ఆ సమయంలో ఉద్యోగులకు తాత్కాలికంగా ఎలాంటి పని ఉండదు. బెంచ్ పిరియడ్‌గా పేర్కొనే ఆ సమయంలో కంపెనీలు ఉద్యోగులకు వేతనాలు చెల్లించవు. అయితే అలా చేయడం చట్ట విరుద్ధమని, వ్యవస్థను దుర్వినియోగం చేయడమేనని యూఎస్‌సీఐఎస్ స్పష్టం చేసింది.

భారతీయ కంపెనీలకు ఇబ్బందే..

తాజా నిబంధనల నేపథ్యంలో హెచ్–1బీ ఉద్యోగుల్ని అమెరికాకు పంపే కంపెనీలు వీసా దరఖాస్తులు సమర్పించేందుకు మరింత ఎక్కువ డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుంది. వీసా దరఖాస్తు లేఖతో పాటు.. ఉద్యోగికి కేటాయించే పని వివరాలు, ఆ పని చేసేందుకు అవసరమయ్యే నైపుణ్యం, విద్యార్హతలు, పని ఎంతకాలం ఉంటుంది, వేతనం, పనిగంటలు, ఇతర ప్రయోజనాల్ని జతపరచాలి.

కేజ్రీవాల్ ఇంట్లో సోదాలు

సీసీటీవీ ఫుటేజ్, హార్డ్‌డిస్క్ పోలీసుల స్వాధీనం

న్యూఢిల్లీ: ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)పై ఆప్ ఎమ్మెల్యేల దాడి కేసులో ఆధారాలను సేకరించేందుకు ఆ రాష్ట్ర సీఎం కేజ్రీవాల్ నివాసంలో పోలీసులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. సీసీటీవీ కెమెరా ఫుటేజ్ ఉన్న హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే సీఎం ఇంట్లో సీఎస్‌పై దాడి జరిగినట్లుగా చెబుతున్న గదిలో సీసీటీవీ కెమెరా లేదు. సోదాలకు వస్తున్నట్లు సీఎం ఇంట్లోని సంబంధిత వ్యక్తికి ముందుగానే సమాచారమిచ్చామన్నారు. కేజ్రీవాల్‌ను పోలీసులు ప్రశ్నించే అవకాశముందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ అహిర్ కూడా సంకేతాలిచ్చారు.



ఆధారాలు తీసుకెళ్తున్న పోలీసులు

పోలీసులు రౌడీల్లా వ్యవహరించారు..

ఢిల్లీ పోలీసులు కేంద్రం చేతిలో కీలుబొమ్మల్లా మారారనీ, సీఎం నివాసంలోకి అక్రమంగా ప్రవేశించి రౌడీల్లా వ్యవహరించారని ఆప్ ఆరోపించింది. సీఎంను అవమానించడానికే పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారంది. ప్రధాని మోదీ ప్రభుత్వ ఆదేశం లేకుంటే పోలీసులు అలాంటి దాదాగిరి చేసి ఉండేవారు కాదని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. కేజ్రీవాల్ ఓ ట్వీట్ చేస్తూ 'పెద్ద పోలీసు బలగాన్ని మా ఇంటికి పంపారు. మరి న్యాయమూర్తి లోయా మృతి కేసులో అమిత్ షాను ఎప్పుడు ప్రశ్నిస్తారు?' అని అన్నారు. ఆప్ ప్రభుత్వంతో కలసి పనిచేసేలా ఉద్యోగులను ఆదేశించాల్సిందిగా లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్‌ను కేజ్రీవాల్ కోరారు. కాగా, అరెస్టైన ఎమ్మెల్యేల బెయిల్ అభ్యర్థనలను స్థానిక కోర్టు కొట్టివేసింది. కాగా, ప్రజోపయోగ పనులకు అడ్డొచ్చే అధికారులను కొట్టాల్సిందేనని ఉత్తమ్ నగర్ ఎమ్మెల్యే నరేశ్ బాల్యాన్ వ్యాఖ్యానించారు.

'ధనుష్' ప్రయోగం సక్సెస్


బాలాసోర్(ఒడిశా): అణ్వాయుధాలను మోసుకుపోగల సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ క్షిపణి ధనుష్ పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని భారత నావికా దళానికి చెందిన ఓ నౌక ద్వారా ధనుష్‌ను పరీక్షించారు. 350 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఇది విజయవంతంగా ఛేదించినట్టు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. భూ ఉపరితలం నుంచి భూ ఉపరితలంపై లక్ష్యాలను ఛేదించగల పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన పృథ్వీ క్షిపణిని నావికా దళ అవసరాల కోసం అభివృద్ధి పరిచి ధనుష్ క్షిపణిగా రూపొందించారు. ఈ క్షిపణిని శుక్రవారం ఉదయం బంగాళాఖాతంలో పారాదీప్ దగ్గర్లోని ఓ నౌక ద్వారా విజయవంతంగా ప్రయోగించినట్టు అధికారులు చెప్పారు.



ధనుష్ క్షిపణి 500 కిలోల పేలుడు పదార్థాలను మోసుకుపోగలదు. భూ, సముద్ర తలంలోని లక్ష్యాలను ఛేదించగలదు. ధనుష్ ఇప్పటికే భారత రక్షణ బలగాల్లో చేరింది.

నా అభిమానులే మీకు పాఠాలు చెబుతారు

విమర్శకులపై రజనీకాంత్ స్పందన



సాక్షి ప్రతినిధి, చెన్నై: రాజకీయ నాయకులెవ్వరూ తన అభిమానులకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని, వారే ఎదుటి వారికి పాఠాలు చెప్పగల నేర్పులని నటుడు రజనీకాంత్ విమర్శకులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చెన్నైలో ప్రజా సంఘాల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 32 ఏళ్ల చరిత్ర కలిగిన అభిమాన సంఘాల నుంచి తమ పార్టీ ఉద్భవిస్తోందని, తాము ఇప్పుడు చేయాల్సిందల్లా వాటిని మరింత బలోపేతం చేయడమేనని అన్నారు. జిల్లాల్లో ఇన్‌చార్జ్‌ల నియామకం పూర్తయ్యాక రాష్ట్ర పర్యటన చేపడతానన్నారు.

కమల్ సమర్థుడు..

ఇటీవల పార్టీ స్థాపించిన సహ నటుడు కమల్ హాసన్‌పై రజనీకాంత్ ప్రశంసలు కురిపించారు. కమల్ సమర్థుడని, ఆయన ప్రజల విశ్వాసం చూరగొంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయాల్లోకి రాబోతున్న తనది, కమల్‌ది రెండు వేర్వేరు దారులని, అయినా ఇద్దరి అంతిమ లక్ష్యం ప్రజా సంక్షేమమేనని అన్నారు.

మరో 44 కోట్లు అటాచ్!

నీరవ్ బ్యాంకు డిపాజిట్లు, షేర్లు స్వాధీనం

ముంబై/న్యూఢిల్లీ: పీఎన్‌బీ కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం నీరవ్ మోదీకి సంబంధించిన 44 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. నీరవ్ భార్య అమీ, మామ చోక్సీలు 26న విచారణకు రావాలని సమన్లు జారీచేసింది. వివిధ ప్రాంతాల్లో నీరవ్ ఆస్తులపై జరిగిన సోదాల్లో దిగుమతి చేసుకున్న ఖరీదైన చేతివాచీలను, ఇతర ముఖ్యమైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు, గీతాంజలి గ్రూప్‌నకు సంబంధించిన 144 బ్యాంకు అకౌంట్లను (రూ.20.26కోట్లు) ఐటీ అధికారులు అటాచ్ చేశారు. అటు, నీరవ్ మోదీ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న నటి ప్రియాంకా చోప్రా.. ఆ సంస్థతో తన కాంట్రాక్ట్‌ను రద్దు చేసుకున్నారు. రొటోమ్యాక్ యజమాని విక్రమ్ కొఠారీ, ఆయన కుమారుడు రాహుల్‌లను ఒక్కరోజు సీబీఐ తాత్కాలిక రిమాండ్‌కు అనుమతిస్తూ ఢిల్లీ కోర్టు ఆదేశాలిచ్చింది. లక్నో కోర్టులో హాజరుపరిచేందుకు సీబీఐకి అనుమతిచ్చింది.

సమగ్రతను ప్రశ్నిస్తే సహించం

మతాన్ని వాడుకునే వేర్పాటువాదులకు ఎక్కడా చోటుండరాదు

సంయుక్త మీడియా సమావేశంలో మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: భారత్ ఐక్యతను, సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను సవాలుచేస్తే సహించబోమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. రాజకీయ లక్ష్యాలు, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించడానికి మతాన్ని దుర్వినియోగం చేసేవారికి ప్రపంచంలో ఎక్కడా చోటు ఉండకూడదన్నారు. ఖలిస్తాన్ వేర్పాటువాదులపై కెనడా ప్రభుత్వ ఉదాసీన వైఖరిని పరోక్షంగా ప్రస్తావిస్తూ మోదీ మాట్లాడారు. శుక్రవారం నాడిక్కడ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోతో భేటీ అయిన మోదీ పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. తర్వాత సంయుక్త మీడియా సమావేశంలో మోదీ మాట్లాడారు.' ఇరుదేశాల మధ్య రక్షణ రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. భిన్న సంస్కృతులున్న భారత్, కెనడా వంటి ప్రజాస్వామ్య దేశాలకు ఉగ్రవాదం, తీవ్రవాదాలే ప్రధాన ముప్పు. వీటిని తుదముట్టించడానికి కలసికట్టుగా పోరాడాలని నిర్ణయించుకున్నాం' అని మోదీ అన్నారు. ట్రూడో పర్యటన సందర్భంగా ఇరు దేశాలు వాణిజ్యం, ఇంధన భద్రత, ఉన్నత విద్య, సైన్స్ అండ్ ఐటీ, మేధో సంపత్తి హక్కులు, అణు రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ట్రూడో దేశమంతా పర్యటించడాన్ని ఉటంకిస్తూ.. భారత్‌లోని భిన్నత్వం ఈ పర్యటనలో ఆయనకు అర్థమై ఉంటుందని మోదీ వ్యాఖ్యానించారు.

ట్రూడోకు ఘన స్వాగతం: అంతకుముందు రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్న ట్రూడో కుటుంబానికి మోదీ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ట్రూడోను మోదీ ఆలింగనం చేసుకున్నారు. పర్యటనలో భాగంగా ట్రూడో కుటుంబం రాజ్‌ఘాట్‌ను సందర్శించి గాంధీజీకి నివాళులర్పించింది. మోదీ–ట్రూడోల సమావేశం అనంతరం 'విభిన్న సంస్కృతులు, జాతుల సమాజాలున్న భారత్, కెనడాలు ప్రజాస్వామ్య విలువలు, మానవ హక్కులు, సమన్యాయ పాలనకు కట్టుబడి ఉన్నాయి. అల్‌కాయిదా, ఐఎస్ వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఎదురయ్యే ప్రమాదాలను ఉమ్మడిగా ఎదుర్కోవడానికి అంగీకరించాం' అని భారత్–కెనడాలు సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఈ పర్యటనలో భాగంగా ట్రూడో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కాంగ్రెస్ పార్టీ చీఫ్ రాహుల్ గాంధీలను కలుసుకున్నారు.



రాష్ట్రపతి భవన్ వద్ద ట్రూడో, మోదీ ఆలింగనం



ట్రూడో భార్య, పిల్లలతో సరదాగా ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

దొడ్డు బియ్యం.. చిన్న గుడ్డు!

అంగన్‌వాడీ కేంద్రాలపై.. సమస్యల దాడి

రెండు మూడు నెలలుగా పాలూ బంద్

వంటకు తీరని తంటా

సొంత భవనాల్లేక అద్దె కొంపల్లో అగచాట్లు

టాయిలెట్లు, తాగునీటి వసతి సరేసరి

'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడి

సాక్షి, నెట్‌వర్క్

అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో సతమతం అవుతున్నాయి. రాష్ట్రంలో దాదాపు 20 రోజులుగా అంగన్‌వాడీలకు పాల సరఫరా నిలిచిపోయింది. హాస్టళ్లు, స్కూళ్లకు సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లుగానే అంగన్‌వాడీలకు అందజేస్తామని గతేడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం ప్రకటించినా.. ఆ దిశగా ఇంతవరకు ఒక్క అడుగూ పడలేదు. చాలాచోట్ల చిన్నారులు దొడ్డు బియ్యం తినలేకపోతున్నారు. ఇక వసతులు సంగతి సరేసరి.. సొంత భవనాలు లేక చాలా కేంద్రాలు ఇరుకైన అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. గ్యాస్ సరఫరా చేయకపోవడంతో వంటకు కట్టెల పొయ్యిలే దిక్కవుతున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 3,500 కేంద్రాలు ఉండగా.. వీటిలో 1,102 అద్దె భవనాల్లోనే కొనసాగుతుండడం గమనార్హం.

పాల సరఫరా ఏది?

ఆరోగ్య లక్ష్మి పథకం కింద గర్భిణులు, బాలింతలకు నిత్యం 200 మిల్లీలీటర్ల చొప్పున పాలు, కోడి గుడ్డు, ఒకపూట భోజనాన్ని అంగన్‌వాడీలు ప్రతిరోజూ అందించాలి. కొద్ది రోజుల వరకు స్థానిక వ్యాపారుల నుంచి కేంద్రాలు పాలు కొనుగోలు చేసేవి. అయితే పాలల్లో నాణ్యత లేకపోవడం, కల్తీ అవుతుండటం తదితర కారణాలతో ఆ పాల కొనుగోళ్లను ప్రభుత్వం నిలిపి వేసింది. దీనికి బదులుగా ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ నుంచి పాలను టెట్రాప్యాక్‌ల రూపంలో సరఫరా చేయాలని నిర్ణయించింది. కానీ 20 రోజులు గడుస్తున్నా ఇంతవరకు పాల సరఫరా ఊసే లేకపోవడంతో కేవలం అన్నం, గుడ్డు మాత్రమే అందిస్తున్నారు. కొన్ని జిల్లాల్లో రెండు నెలలుగా పాల పంపిణీ లేదు. గతంలో కనీసం నీళ్లపాలయినా ఇచ్చేవారని, ఇప్పుడు అవి కూడా అందడం లేదని గర్భిణులు, బాలింతలు చెబుతున్నారు. మెదక్ జిల్లాలోని పలు అంగన్‌వాడీ సెంటర్లకు మూడు నెలలుగా పాలు సరఫరా కావడం లేదు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో పాల నాణ్యతపై మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆయాలే.. అంతా!

అంగన్‌వాడీ సెంటర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగాలి. టీచర్లు విధులకు డుమ్మాలు కొడుతుండటంతో భారమంతా ఆయాలపైనే పడుతోంది. చిన్నారుల నిర్వహణ, అటు గర్భిణులు, బాలింతలకు భోజనం వడ్డించడం కష్టంగా వారికి మారుతోంది. చాలాచోట్ల కేంద్రాలను ఎప్పుడు తెరుస్తున్నారో.. ఎప్పుడు మూస్తున్నారో తెలియడం లేదు. కొన్ని అంగన్‌వాడీలైతే ఒక్కపూటకే పరిమితమవుతున్నాయి. దీనికి తోడు చాలాచోట్ల టీచర్లు, ఆయా పోస్టుల ఖాళీలు వేధిస్తున్నాయి. ఒక్క ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే మొత్తం 627 ఖాళీలున్నాయి. పిల్లల హాజరులోనూ అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. చాలాచోట్ల పిల్లలు రాకున్నా వస్తున్నట్టు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు.



ఇది నాగర్‌కర్నూల్ జిల్లా ఎండబెట్ల–1 అంగన్‌వాడీ కేంద్రం. ఇక్కడ చిన్నారుల ప్లేట్లను గమనించండి.. కేవలం ఉడకబెట్టిన గుడ్డు మాత్రమే కన్పిస్తోంది కదా. ఇదే వీరి భోజనం! ఈ సెంటర్లో కొన్నాళ్లుగా గుడ్డు మాత్రమే పెట్టి పంపించేస్తున్నారు. ఇదేమని అంగన్‌వాడీ టీచర్‌ను అడిగితే.. రెండు వారాలుగా బియ్యం రావడం లేదని చెప్పింది. బియ్యమే కాదు.. పాలు, పప్పు, నూనె.. ఇలా ఏదీ రావడం లేదని చెబుతోంది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి ఇది.



ఇటు పిల్లలు.. అటు వంట

కామారెడ్డి జిల్లా కామారెడ్డి మండలం లింగాయపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్ర భవనానికి వంట గది లేదు. దీంతో ఉన్న ఒకే గదిలోనే ఓ మూలకు విద్యార్థులను కూర్చోబెట్టి, మరో పక్క ఇలా వంట వండుతున్నారు.

చిక్కిపోతున్న గుడ్డు

కాంట్రాక్టర్లు చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు తక్కువ బరువున్న గుడ్లను సరఫరా చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు మిన్నకుండి పోతున్నారు. ప్రతి గుడ్డు తప్పనిసరిగా 50 గ్రాముల బరువు ఉండాలి. కానీ 35–40 గ్రాములకు మించడం లేదు. పౌల్ట్రీ ఫాంలోనే చిన్నసైజు గుడ్లను వేరుచేసి అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేస్తున్నారు. ఈ చిన్న సైజు గుడ్లను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కాంట్రాక్టర్లు నెలలో మూడు సార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు పంపిణీ చేయాల్సి ఉండగా కేవలం ఒకట్రెండుసార్లు సరఫరా చేస్తున్నారు. వాటిల్లో పగిలిపోయినవి, పగుళ్లు ఉన్నవి ఉండటంతో చాలా గుడ్లు పాడైపోతున్నాయి. బిల్లులు రాకపోవడంతోనే పూర్తిస్థాయిలో సరఫరా చేయడం లేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గుడ్లు పంపిణీ చేసే కాంట్రాక్టర్ గడువు జనవరిలో ముగిసింది. టెండర్ దక్కించుకున్న కొత్త కాంట్రాక్టర్.. ధర గిట్టుబాటు కావడం లేదంటూ 20 రోజులుగా గుడ్లు పంపిణీ చేయడంలేదు.





నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం



మెదక్ మండల పరిధిలోని అవుసులపల్లి గ్రామంలోని అంగన్‌వాడీలో నీళ్లచారు..

కుడితిలో బాలామృతం..



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట్ మండలం అంగన్‌వాడీ సెంటర్‌లో సరఫరా చేసే బాలామృతం పశువులకు పెడుతున్నారు. అందులోని పోషక విలువలు తెలియకో.. నాణ్యతగా ఉండదని భావించో అనేక మంది తల్లులు బాలామృతాన్ని ఇంటికి తీసుకెళ్లి ఇలా బర్రెలు, అవులకు కుడితిలో కలిపి తాపిస్తున్నారు.

దొడ్డు బియ్యం తింటలేరు



అంగన్‌వాడీలకు సన్న బియ్యం అస్తయి అని చెప్పిండ్లు. కానీ దొడ్డుబియ్యమే ఇస్తున్నరు. దొడ్డు అన్నం తినేందుకు పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఇష్టపడతలేరు. కోడి గుడ్లు కూడా చిన్నగా ఉంటున్నయి. కొన్ని సార్లు గుడ్లు వాసన వస్తుండటంతో పిల్లలు తినకుండానే పడేస్తున్నరు.

– జి.పద్మ, ఆయా కుమురంభీం జిల్లా, రెబ్బెన సెంటర్–1

3 గంటల్లో 'డీఎన్‌ఏ' తేల్చేస్తుంది!

కొత్త పరికరాన్ని అందుబాటులోకి తేనున్న సీఐడీ..

సాక్షి, హైదరాబాద్: అత్యాచార, హత్య కేసుల్లో కీలక సాక్ష్యాలైన డీఎన్‌ఏ నమూనాలను అత్యంత వేగంగా పరీక్షించేందుకు ఓ కొత్త పరికరాన్ని అందుబాటులోకి తేవాలని సీఐడీ భావిస్తోంది. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. ఎస్సీ, ఎస్టీ యాక్టు కింద సీఐడీకి రూ.7 కోట్లు నిధులు సమకూరాయి. వీటితో అమెరికాలో డీఎన్‌ఏ టెస్టును వేగంగా నిర్వహించేందుకు ఉపయోగిస్తున్న అత్యాధునిక పరికరాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. కేవలం 3 గంటల్లోనే డీఎన్‌ఏ ఎవరిదో గుర్తించడం ఈ పరికరం ప్రత్యేకత. ప్రస్తుతం పరికరం కొనుగోలుకు ప్రతిపాదనలు రూపొందించామని సీఐడీ అధికారులు తెలిపారు. త్వరలోనే టెండర్ల రూపంలో కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తామని వెల్లడించారు. ఈ పరికరం ఇప్పటివరకు దేశంలో ఎక్కడా అందుబాటులోకి రాలేదన్నారు. ప్రస్తుతం ఫోరెన్సిక్ ల్యాబ్లో ఉన్న డీఎన్‌ఏ పరీక్ష యంత్రం ద్వారా 48 నుంచి 52 గంటల్లో డీఎన్‌ఏ గుర్తిస్తున్నారు. కొత్త పరికరం అందుబాటులోకి వస్తే వేగంగా డీఎన్‌ఏను గుర్తించి బాధితులకు సత్వర న్యాయం చేయవచ్చని సీఐడీ భావిస్తోంది.

ఫార్మా కంపెనీలో భారీ ప్రమాదం

జీడిమెట్ల పారిశ్రామికవాడలో ఘటన

- డ్రమ్ముల్లో రసాయనాలు నింపుతుండగా పేలిన బాయిలర్
- ఏడుగురు కార్మికులకు తీవ్ర గాయాలు
- గాంధీ ఆస్పత్రిలో బాధితులు
- ఆరుగురి పరిస్థితి విషమం

హైదరాబాద్: జీడిమెట్ల పారిశ్రామికవాడలో శుక్రవారం భారీ ప్రమాదం చోటు చేసుకుంది. ఐడీఏ జీడిమెట్ల ఎస్వీ కో–ఆపరేటివ్ సొసైటీలోని స్యూటిక్ ఫార్మా కంపెనీలో బాయిలర్ పేలడంతో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఉదయం 6 గంటలకు 8 మంది కార్మికులు మొదటి షిఫ్ట్ విధులకు హాజరయ్యారు. బాయిలర్ నుంచి బయటకు వస్తున్న ఘాటైన రసాయనాలను డ్రమ్ముల్లో నింపుతుండగా ఒక్కసారిగా బాయిలర్ పేలడంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. భారీగా మంటలెగిసిపడడంతో కుమార స్వామి (39), కొమర సింహాచలం (34), సమీద్ కుమార్(19), బండి శ్రీనివాస్(38), నరహరి(20), ఆవ్రేన్(40), నాగ్(20) అనే కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ఆసుపత్రికి, అటు నుంచి సికింద్రా బాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నాగ్ మినహా మిగతావారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు.

గాలిలోకి ఎగిరిపడిన డ్రమ్ములు

మంటల తాకిడికి పరిశ్రమలోని డ్రమ్ములు ఒక్కసారిగా గాల్లోకి ఎగిరి జనావాసాల మధ్య పడ్డాయి. దీంతో పరిశ్రమకు ఆనుకుని ఉన్న గంపలబస్తీవాసులు ఇళ్ల నుంచి పరుగులు తీశారు. పక్కనే ఉన్న రీ సైక్లింగ్ పరిశ్రమ, విజయశ్రీ కెమికల్స్, సత్య ఫ్యాబ్రికేషన్స్‌లో సైతం మంటలు చెలరేగడంతో సిబ్బంది, స్థానికులు నీళ్లు చల్లి అదుపు చేశారు. మంటలు వ్యాపించిన అరగంటలో ఆరు అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. 3 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన గంట వరకు కూడా పరిశ్రమలు, పీసీబీ, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకోలేదు. జీడి మెట్ల ఫైర్ సిబ్బంది తొలుత అక్కడికి చేరుకున్నా ఇంజన్‌లో నీళ్లు సరిపడాలేక ట్యాంకర్‌లు వచ్చేవరకు వేచి ఉండాల్సి వచ్చింది.

మీకు దండం పెడతాం.. హాస్పిటల్‌కు తీసుకువెళ్లండి..

ప్రమాదంలో గాయపడిన కార్మికులు హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. తమను ఆస్పత్రికి తీసుకువెళ్లమంటూ కనబడ్డవారినల్లా వేడుకున్నారు. 108 అంబులెన్స్ అక్కడికి చేరుకునేందుకు ఆలస్యం కావడంతో వారి వేదన వర్ణనాతీతం. బాధిత కుటుంబసభ్యులు వారి వద్దకు వచ్చి కన్నీరుమున్నీరుగా విలపించారు.

'సింగిల్ పర్మిట్‌ను అమలు చేయండి'

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల మధ్య నడుస్తున్న లారీలకు సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలు చేసేలా ఏపీపై ఒత్తిడి తీసుకురావాలని ప్రభుత్వాన్ని తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వి.శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శుక్రవారం తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ యాజమాన్యాల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పర్మిట్‌పై త్వరలోనే చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, రాజేందర్‌రెడ్డి, సలీం పాల్గొన్నారు.

✦ ఆర్జీవీ విచారణ వాయిదా

- ఎఫ్ఎస్ఎల్ నివేదిక వచ్చాక మరోసారి విచారణ
- 'జీఎస్టీ' కేసులో నిర్ణయించిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: వివాదాస్పద అశ్లీల వెబ్ సిరీస్ 'జీఎస్టీ'పై నమోదైన కేసులో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ (ఆర్జీవీ) విచారణ వాయిదా పడింది. ఇప్పటికే ఓసారి సైబర్ క్రైమ్ పోలీసుల విచారణను ఎదుర్కొన్న ఆయన శుక్రవారం రెండోసారి హాజరుకావాల్సి ఉంది. తొలి రోజు విచారణలో ఆయన నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను విశ్లేషించేందుకు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)కి పంపించిన విషయం తెలిసిందే. ఎఫ్ఎస్ఎల్ నివేదిక వచ్చిన తర్వాతే వర్మను ప్రశ్నించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఆయనకు సమాచారం అందించారు. ఈలోపు జీఎస్టీకి వర్మకు ఉన్న సంబంధాలను ఆరా తీసేందుకు ఈ వెబ్ సిరీస్‌కు పనిచేసిన మరికొందరిని ప్రశ్నించాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ విచారణలో తగిన ఆధారాలు లభిస్తే వర్మను అరెస్టు చేయాలా? లేక న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేసి కోర్టు ద్వారా తదుపరి చర్యలు తీసుకోవాలా? అనే అంశంపై న్యాయ నిపుణుల్ని సంప్రదిస్తున్నారు. నివేదిక వచ్చిన తర్వాతే వర్మను ప్రశ్నిస్తే మరిన్ని కీలకాంశాలు రాబట్టడంతో పాటుగా తదుపరి చర్యలు తీసుకోవానికి ఆస్కారం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

✦ ఇండియన్ స్టాటిస్టికల్ ఆఫీసర్లకు శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ (ఐఎస్ఎస్) ఆఫీసర్లకు ఐసీటీ ప్రాజెక్టులపై శిక్షణ విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్ ఎంసీహెచ్ఆర్‌డీలో కేంద్ర గణాంక శాఖ అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి ఐఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు. నిర్దిష్టమైన డేటా, గణాంకాల సేకరణ సుపరిపాలనలో అత్యంత కీలకమని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.పి.ఆచార్య ఈ సందర్భంగా అన్నారు. ఐఎస్ఎస్‌లు జీఎస్ లక్ష్మి, నరేశ్‌కుమార్ శర్మ, శంకర్‌లాల్ మేనారియా, సుప్రియా ముఖర్జీ, మదన్ మోహన్ హసీజా, జేమ్స్ మాథ్యూ, మిట్టర్ సేన్ తదితరులు మాట్లాడారు.

✦ ఆ సమావేశానికి అనుమతివ్వండి

పెద్దపల్లిలో టీ–విద్యార్థి సంఘ సమావేశంపై పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 26న తెలంగాణ విద్యార్థి సంఘం నిర్వహించనున్న సమావేశానికి అనుమతి ఇవ్వాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లిలోని డీసెండ్ ఫంక్షన్ హాల్లో సమావేశాన్ని నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులకు దరఖాస్తు చేసుకుంటే అనుమతి ఇవ్వలేదంటూ టీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కోట శ్రీనివాస్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఫంక్షన్ హాల్లో సమావేశం జరుపుకునేందుకు పోలీసులకు అభ్యంతరం లేదని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ కుమార్ చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సమావేశాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని న్యాయమూర్తి తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వినిపించే బీపీ.. నిలబెట్టి సర్జరీ..



హాస్పిటల్ నీడ్ ఎక్స్‌పో-18కి విశేష స్పందన

వందకుపైగా కంపెనీలు.. ఐదు వేలకుపైగా ఉత్పత్తులు ● వీక్షించేందుకు తరలివచ్చిన వైద్య, నర్సింగ్ విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్

వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఏమిటి..? మార్కెట్‌లో లభిస్తున్న సరికొత్త మెడికల్ ఉత్పత్తులు ఏవి? వాటిని ఎలా వినియోగించాలి? ఇలాంటి అనేక అంశాల గురించి భావివైద్యులకు పరిచయం చేసేందుకు ఏర్పాటు చేసిందే ప్రతిష్టాత్మక 'మెడికాల్'హాస్పిటల్ నీడ్ ఎక్స్‌పో–2018. శుక్రవారం హైటెక్స్‌లో మెడికాల్ ఎక్స్‌పో ఘనంగా ప్రారంభమైంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెలంగాణ అధ్యక్షుడు టి.నర్సింగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఎక్స్‌పోను ప్రారంభించారు. దేశవిదేశాలకు చెందిన సుమారు వంద కంపెనీలు వివిధ రకాల ఆపరేషన్ టేబుళ్లు, లైట్లు, సీజర్లు, అనెస్థీషియా యంత్రాలతోపాటు పల్స్ ఆక్సోమీటర్లు, వెంటిలేటర్లు, గైనకాలజీ ఎగ్జామినేషన్ టేబుళ్లు, ఆర్థో, న్యూరో, ల్యాప్రోస్కోపిక్, కార్డియో థొరాసిక్ సర్జికల్, ఈసీజీ మిషన్లు, మానిటర్లు, పీడియాట్రిక్ వార్మర్లు, అత్యాధునిక హైడ్రాలిక్ పడకలు, రకరకాల డిస్పోజల్స్, మైక్రోస్కోపులు, గ్లౌజులు, మాస్కులు ఇలా ఐదు వేల రకాల సర్జికల్, నాన్ సర్జికల్ వైద్య పరికరాలను ప్రదర్శించాయి. భావి వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు ఈ పరికరాలను చూసి.. వాటి వినియోగం గురించి తెలుసుకునేందుకు ఎక్స్‌పోకు భారీగా తరలివచ్చారు.

టేబుల్‌పై నిలబెట్టి సర్జరీ..

సాధారణంగా రోగులను ఆపరేషన్ థియేటర్‌లోని టేబుల్‌పై పడుకోబెట్టి సర్జరీ చేస్తారు. కానీ ఊబకాయంతో బాధపడుతున్న రోగులను మాత్రం టేబుల్‌పై నిలబెట్టి బెరియాట్రిక్ సర్జరీ చేస్తారు. వీరి కోసం స్టాన్ కంపెనీ ప్రత్యేకంగా ఓటీ టేబుల్‌ను తయారు చేసింది. దీన్ని వైద్యుడు తనకు ఎలా కావాలంటే అలా ఉపయోగించుకోవచ్చు. దీని ధర రూ. 8.5 లక్షల వరకు ఉంది.

వైద్యుడి పర్యవేక్షణ అవసరం లేకుండా..



శ్వాస కూడా తీసుకోలేని పరిస్థితుల్లో ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగికి వెంటిలేటర్ సహాయంతో కృత్రిమ శ్వాసను అందిస్తుంటారు. రోగికి దీనిని అమర్చిన తర్వాత వైద్యులు, నర్సులు అక్కడే ఉండి మానిటర్ చేస్తుంటారు. ఇటీవల మార్కెట్‌లోకి వచ్చిన 'హ్యామిల్టన్ సి–3'రోబోటిక్ వెంటిలేటర్‌ను ఒకసారి రోగికి అమర్చితే చాలు.. ఆ తర్వాత వైద్యుల పర్యవేక్షణ అవసరం లేకుండా ఆటోమేటిక్‌గా వెంటిలేషన్ సపోర్ట్‌ను అందిస్తుంది. రోగి ఆరోగ్య పరిస్థితిపై దానికదే ఓ అంచనాకు వస్తుంది. ఆ మేరకు శ్వాసను అందిస్తుంది. స్విట్జర్లాండ్ నుంచి దిగుమతి అవుతున్న ఈ మిషన్ ఖరీదు రూ.20 లక్షల వరకు ఉంటుంది.

అంధుల కోసం ప్రత్యేక బీపీ మిషన్..



ప్రస్తుతం మార్కెట్లో చాలా రకాల డిజిటల్ బీపీ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. ఇంట్లోనే ఎప్పటికప్పుడు బీపీ చెక్ చేసుకునేందుకు వీలుగా అక్యుర కంపెనీ అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ బీపీ మిషన్.. బీపీని మానిటర్‌పై నమోదు చేయడంతో పాటు ఆ విషయాన్ని వాయిస్ రూపంలో ప్రకటిస్తుంది. చదువురాని, కంటి చూపులేని రోగులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. దీని ధర రూ.4,700.

శ్రమించకుండానే బాడీ మసాజ్..

మనిషి పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజూ శరీరానికి తగిన వ్యాయామం అవసరం. చాలా మంది వాకింగ్, రన్నింగ్, యోగా వంటివి సాధన చేస్తుంటారు. అయితే ఉదయాన్నే నిద్ర లేచి కిలోమీటర్ల కొద్దీ నడిచే ఓపిక, సమయం చాలా మందికి ఉండటం లేదు. ఇలాంటి వారి కోసం ఫుల్‌బాడీ మసాజ్ చైర్ అందుబాటులోకి వచ్చింది. చైర్‌లో అరగంట కూర్చుంటే చాలు బాడీమసాజ్ పూర్తయినట్లే. దీని కోసం రూ.3.5 లక్షల నుంచి రూ.5.5 లక్షల వరకు విలువ చేసే చైర్లు అందుబాటులో ఉన్నాయి.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI ACADEMY
సోషల్ స్టడీస్ (ఇం.మీ.)

ఏపీ గురుకుల పాఠశాల సెట్-2018

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ సాంఘిక, గిరిజన, వెనకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో 2018-19కి గానూ ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీటీపీసీఈటీ)-2018 నోటిఫికేషన్ వెలువడింది. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం (2017-18)లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ: మార్చి 20, 2018. ప్రవేశ పరీక్ష: ఏప్రిల్ 8, 2018న ఉంటుంది. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: apgpcet.apcfss.in

నాలెడ్జ్ Bytes

సౌరశక్తి- కొన్ని నిజాలు


- ప్రపంచంలో అతిపెద్ద సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం (single location solar power project) తమిళనాడులోని కాముతిలో ఉంది. దాదాపు 2,500 ఎకరాల విస్తీర్ణంలో 45.5 బిలియన్ రూపాయల పెట్టుబడితో ఏర్పాటుచేసిన ఈ కేంద్రం సామర్థ్యం 648 మెగావాట్లు. సుమారు 8,500 మంది ఎనిమిది నెలల పాటు పనిచేసి రికార్డు స్థాయిలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయగలిగారు. దీన్ని 400 కేవీ సబ్‌స్టేషన్‌తో అనుసంధానించారు. దీనిద్వారా 2,65,000 ఇళ్లకు విద్యుత్ అందించవచ్చు.
- దుబాయిలో రోడ్ల పక్కన, డివైడర్ల మధ్యలో, అక్కడక్కడా కొన్ని అనువైన ప్రాంతాల్లోనూ సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసే కృత్రిమ చెట్లు కనిపిస్తాయి. ఇవి వీధులకు అందాన్ని, వెలుగును ఇవ్వడంతోపాటు ఈ చెట్లకు అమర్చిన తెరపై పర్యాటకులు దుబాయి మ్యాప్ చూసేందుకూ ఉపయోగపడుతున్నాయి. అలాగే వీటి దగ్గర ఉచిత వైఫై సౌకర్యం పొందొచ్చు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు చార్జింగ్ పెట్టుకోవచ్చు.
- ప్రపంచ వింతల్లో ఒకటైన ఈఫిల్ టవర్ రాత్రిళ్లు విద్యుద్దీప కాంతులతో తళుకులీనుతుంటుంది. ఈ బల్బులు వెలగడానికి కావల్సిన విద్యుత్తు.. ఈఫిల్ టవర్‌కి అమర్చిన సౌర ఫలకాల నుంచి ఉత్పత్తి అవుతోంది. టవర్ అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్తును సమీప రెస్టారెంట్లు ఉపయోగించుకుంటున్నాయి.
- షిరిడీలోని సాయినాథుని సన్నిధిలో ఉన్న వంటగది.. ప్రపంచంలోనే అతిపెద్ద 'సోలార్ కిచెన్'. సౌరశక్తి ద్వారా ఆవిరిని సృష్టించి దాని ద్వారా వంటలు చేస్తున్నారు.

చైనా కాలుష్య పాఠాలు!

చైనా జనాభా మనకంటే ఎక్కువ. పారిశ్రామికాభివృద్ధిలోనూ భారత్ కంటే ఎన్నో రెట్లు ముందుంది. అందుకే అక్కడి నగరాల్లో కాలుష్యమూ ఎక్కువే. ఇది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో ఇటీవల చైనా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది.

- బొగ్గు వినియోగాన్ని గణనీయంగా తగ్గించింది. బొగ్గుతో విద్యుదుత్పత్తి చేసే కేంద్రాలను మూయించింది. పవన, సౌర విద్యుదుత్పత్తి పెంచింది.
- వాహనాల కోసం తక్కువ కాలుష్యాన్ని విడుదల చేసే ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తోంది. ఈ చర్యల కారణంగా అక్కడ కాలుష్యం తగ్గుతోంది.

Quote of the Day
It is during our darkest moments that we must focus to see the light.
- Aristotle





అమ్మాయిలూ.. ఉన్నతవిద్యను అందుకోండిలా..!

హయ్యర్ ఎడ్యుకేషన్..

ఉన్నతవిద్యలో విద్యార్థినుల నమోదు శాతం పెంచడంతోపాటు డ్రాప్ అవుట్స్‌ను తగ్గించేందుకు దేశంలో పలు కార్యక్రమాలు అమలవుతున్నాయి. అలాగే ఆర్థిక కారణాలతో చదువులో ముందడుగు వేయలేకపోతున్న అమ్మాయిలను ఉన్నత విద్యవైపు ప్రోత్సహించేలా పలు పథకాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన సెంట్రల్ అడ్వయిజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (సీఏబీఈ) సమావేశంలోనూ ఉన్నతవిద్యలో అమ్మాయిలకు ప్రోత్సాహంపై ప్రధానంగా చర్చ జరిగింది. సీఏబీఈ పరిధిలోని సబ్ కమిటీలు కూడా పలు సిఫార్సులు చేశాయి. మరోవైపు ఐఐటీలు, ఐఐఎంల్లో అదనపు సీట్లు, మహిళలకు ప్రత్యేకంగా యూనివర్సిటీల ఏర్పాటు ప్రతిపాదన తదితరాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. ప్రస్తుతం విద్యార్థినులకు ఉన్న ఉన్నత విద్యావకాశాలు, ప్రోత్సాహకాలపై ఫోకస్..

14 శాతం అదనపు సీట్లు

విద్యార్థినులను ఉన్నతవిద్య వైపు ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యల్లో ప్రధానమైనది.. ప్రతిష్ఠాత్మక ఐఐటీ, ఎన్ఐటీల్లో 2018-19 విద్యా సంవత్సరం నుంచి అదనంగా 14 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు కేటాయించడం. దీనివల్ల ఐఐటీల్లో దాదాపు 550 సీట్లు విద్యార్థినులకు అందుబాటులోకి రానున్నాయి. అలాగే ఎన్ఐటీల్లో దాదాపు 400 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీన్ని 2020 నాటికి 20 శాతానికి పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది.

మేనేజ్‌మెంట్ విద్య

విద్యార్థినులు మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశించేలా ప్రోత్సహించేందుకు ఐఐఎంలలో జండర్ డైవర్సిటీ పేరుతో మూడేళ్ల క్రితం నుంచి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అన్ని ఐఐఎంలలో 5 నుంచి 10 శాతం మేర జెండర్ డైవర్సిటీని అమలు చేస్తున్నారు. ఫలితంగా ఐఐఎంలలో అడుగుపెడుతున్న విద్యార్థినుల సంఖ్య గత రెండేళ్ల నుంచి క్రమేణా పెరుగుతోంది. మొత్తం విద్యార్థుల్లో 25 నుంచి 30 శాతం మేరకు విద్యార్థినులు ఉండటం దీనికి నిదర్శనం. కొన్ని ఐఐఎంలు విద్యార్థినుల అకడమిక్ ప్రతిభ ఆధారంగా రెండో సెమిస్టర్ నుంచి స్కాలర్‌షిప్ అందిస్తున్నాయి.

ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక యూనివర్సిటీ

అమ్మాయిలను ఉన్నతవిద్య దిశగా ప్రోత్సహించే చర్యల్లో భాగంగా.. ఇటీవల సీఏబీఈ సబ్ కమిటీ కీలక సిఫార్సులు చేసింది. వీటిలో ఒకటి ప్రతి రాష్ట్రంలో ఒక్కొక్కటి చొప్పున మహిళలకు ప్రత్యేక యూనివర్సిటీని నెలకొల్పడం. ఈ సిఫార్సులు ఫిబ్రవరి చివరి నాటికి తుది రూపు దిద్దుకోనున్నాయి. వాటి ఆధారంగా మానవ వనరుల మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంటుంది.

జిల్లాకో రెసిడెన్షియల్ స్కూల్

అమ్మాయిల కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను సీఏబీఈ సబ్ కమిటీ సిఫార్సు చేసింది. ప్రస్తుతం అమలవుతున్న నవోదయ విద్యాలయాల తరహాలో వీటిని రూపొందించాలని సూచించింది. +2 వరకు సీబీఎస్ఈ సిలబస్ విధానాన్ని అమలు చేయాలని.. ఫలితంగా జాతీయస్థాయిలో పోటీపడే సన్నద్ధత లభిస్తుందని సబ్ కమిటీ సిఫార్సు చేసింది. జిల్లాకో రెసిడెన్షియల్ స్కూల్ విధానం ఫలితంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని.. పదోతరగతి తర్వాత డ్రాప్ అవుట్స్ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టొచ్చని భావిస్తున్నారు.

ప్రోత్సాహకాలు

ప్రస్తుతం దేశంలో విద్యార్థినులను ప్రోత్సహించేందుకు వివిధ స్కాలర్‌షిప్ పథకాలు అమలవుతున్నాయి. వీటి వివరాలు..

సెంట్రల్ సెక్టార్ స్కీమ్

దేశంలోనే భారీ స్కాలర్‌షిప్ పథకంగా దీన్ని చెప్పొచ్చు. ఆయా రాష్ట్రాల పరిధిలోని ఇంటర్మీడియెట్, తత్సమాన కోర్సుల్లో 80 పర్సంటైల్ కంటే ఎక్కువ సాధించి.. డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు చదవాలనుకునే విద్యార్థులకు అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ పథకమిది. మొత్తం 82వేల మందికి ఈ స్కాలర్‌షిప్ అందిస్తారు. ఇందులో 50 శాతం స్కాలర్‌షిప్‌లను విద్యార్థినులకు కేటాయించారు. స్కాలర్‌షిప్ వ్యవధి కనిష్ఠంగా మూడేళ్లు, గరిష్ఠంగా అయిదేళ్లు. ఎంపికైన వారికి తొలి మూడేళ్లు ఏటా రూ.10 వేలు, తర్వాతి రెండేళ్లు ఏటా రూ.20 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తారు.



వెబ్‌సైట్: www.scholarships.gov.in

యూజీసీ స్కాలర్‌షిప్

నాన్-ప్రొఫెషనల్ కోర్సుల ఔత్సాహిక విద్యార్థినులకు యూజీసీ అందుబాటులోకి తెచ్చిన స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్.. పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇందిరాగాంధీ స్కాలర్‌షిప్ స్కీమ్ ఫర్ సింగిల్ గర్ల్ చైల్డ్. పీజీ స్థాయిలో నాన్-ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థినులు వీటికి అర్హులు. మొత్తం 1200 మందికి స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. రెండేళ్ల పీజీ కోర్సు వ్యవధిలో ప్రతి విద్యా సంవత్సరంలో పది నెలల పాటు నెలకు రూ.3,100 చొప్పున స్కాలర్‌షిప్ లభిస్తుంది.
వెబ్‌సైట్: www.ugc.ac.in

పీజీ వరకు ఉచిత విద్య

విద్యార్థినులకు పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీఏబీఈ సభ్య రాష్ట్రాలు సూచించాయి. 2018, జనవరి 10న హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకోసం అవసరమైతే ఆర్‌టీఈలో మార్పులు చేయాలని కూడా సూచించారు. ఈ అంశాన్ని సీఏబీఈ జనవరి 15, 16 తేదీలలో నిర్వహించిన జాతీయ సదస్సులో సైతం ప్రస్తావించారు. ఇలాంటి విధానం ఫలితంగా.. అన్ని ప్రాంతాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులకు ప్రయోజనకరంగా ఉంటుందని.. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఉన్నత చదువులవైపు అడుగులు వేయించేందుకు ఆస్కారం లభిస్తుందని వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పేర్కొన్నట్లు సమాచారం.

ఏఐసీటీఈ స్కాలర్‌షిప్

సాంకేతిక విద్య ఔత్సాహిక విద్యార్థినులకు ఏఐసీటీఈ ప్రవేశపెట్టిన వినూత్న స్కాలర్‌షిప్ పథకం.. ప్రగతి స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ స్టూడెంట్. ఇది డిప్లొమా (పాలిటెక్నిక్), బ్యాచిలర్ డిగ్రీ (బీటెక్) విద్యార్థులకు అందిస్తారు. ఏటా డిప్లొమా అభ్యర్థులకు రెండు వేలు, బీటెక్ విద్యార్థులకు రెండు వేలు చొప్పున మొత్తం 4 వేల స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉంటాయి. ఎంపికైన వారికి ఏటా ట్యూషన్ ఫీజు లేదా రూ.30 వేలు (ఏది తక్కువైతే దాన్ని) ఆర్థిక ప్రోత్సాహకంగా మంజూరు చేస్తారు. ప్రతి విద్యా సంవత్సరంలో 10 నెలల పాటు నెలకు రూ.2 వేలు స్టైపెండ్ కూడా లభిస్తుంది.
వెబ్‌సైట్: www.aicte-india.org

సైన్స్ విద్యార్థులకు డీఎస్‌టీ

సైన్స్ కోర్సుల ఔత్సాహికులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ).. సైన్స్ స్కాలర్‌షిప్ ఫర్ ఉమెన్ పేరుతో ప్రోత్సాహకం అందిస్తోంది. ఎంఎస్సీ, ఎంఫిల్, పీహెచ్‌డీ స్థాయిలో రీసెర్చ్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్‌లో చేరిన వారిని అర్హులుగా పేర్కొంది. ఎంపికైన వారికి ఎంఎస్సీ స్థాయిలో నెలకు రూ.30 వేలు; ఎంఫిల్ స్థాయిలో నెలకు రూ.40 వేలు; పీహెచ్‌డీ స్థాయిలో నెలకు రూ.55 వేలు అందిస్తుంది.
వెబ్‌సైట్: www.dst.gov.in

డీబీటీ స్కాలర్‌షిప్స్

లైఫ్ సైన్సెస్ విభాగంలో విద్యార్థినులను ప్రోత్సహించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ (డీబీటీ) ప్రత్యేక ఫెలోషిప్ పథకాన్ని అమలు చేస్తోంది. బయోటెక్నాలజీ కెరీర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ రీ-ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్ సైంటిస్ట్స్ పేరిట అన్ ఎంప్లాయ్డ్/ఎంప్లాయ్డ్ పర్సన్స్‌కు ఫెలోషిప్‌ను అందుబాటులో ఉంచింది.
వెబ్‌సైట్: zww.dbtindia.nic.inp

Japan Best Country in Neonatal Care

Civils, Groups Special
Current Affairs

International

- **Japan Best Country in Neonatal Care: UNICEF Report**

Japan is the best country in terms of neonatal mortality rate (NMR) across the world, with Pakistan being the worst, according to the latest report by the United Nations International Children's Emergency Fund (UNICEF). In a list of over 200 countries released by UNICEF, Pakistan having a NMR of 45.6 was followed by Central African Republic (42.3), Afghanistan (40), Somalia (38.8) and Lesotho (38.5). India has a NMR of 25.4, which means at least 25 babies die within 28 days in every 1,000 live births. India is 12th worst among 52 "lower middle-income countries" that pose risk for newborns. India is also the only major country in the world to have a higher mortality for girls than boys. Within the country as well, disparities are highly significant. While Kerala and Goa have neonatal mortality rates of ten per 1,000 live births, the figure for Bihar and Uttarakhand stands at 44 per 1,000. Additionally, Uttar Pradesh, Bihar, Madhya Pradesh and Rajasthan account for 46% of all births and 57% of India's neonatal deaths.

National

- **Committee for appraisal of eminent institutes**

University Grants Commission on 20th February constituted a four-member Empowered Expert Committee, which is being entrusted to conduct the appraisal of applications for shortlisting 20 Institutions of Eminence. N.Gopalaswami, former Chief Election Commissioner of India is the Chairperson of the committee. The government is likely to announce the names of the selected institutions by April 2018.

Bilateral

- **India, Iran ink agreements in nine fields**

India and Iran have reiterated their commitment to combat terrorism. Indian Prime Minister Narendra Modi and Iranian President Hassan Rouhani were held discussions in New Delhi on 17th February. The two countries signed nine pacts in different fields including Avoidance of Double Taxation and the Prevention of Fiscal Evasion with respect to taxes on Income, exemption from Visa requirement for holders of Diplomatic Passports, exchange of instrument of ratification of extradition treaty. Other MoUs were signed in the areas of lease contract for Shahid Beheshti Port- Phase 1 of Chabahar, medicine and agriculture and allied sectors.

- **UK, India launch joint research projects on clean water & energy**

The UK- India Joint research projects on Water Quality Research and Energy Demand Reduction in Built Environment were launched in New Delhi on 19th February. The Water Quality Research programme has eight projects and Energy Demand Reduction in Built Environment programme has four projects, with a total joint investment of up to 15 million British Pound. These projects aim to deliver mutual benefits and research solutions not only to the UK and India but also to address shared global sustainable development goals of clean water and clean energy.

Economy

- **Cabinet clears opening up of commercial coal mining to Pvt firms**

In a major reform in the coal sector since its nationalisation in 1973, the government on 20th February allowed private companies to mine the fossil fuel for commercial use, ending the monopoly of state-owned Coal India Ltd. The decision was taken by the Cabinet Committee on Economic Affairs (CCEA) under the Chairmanship of Prime Minister Narendra Modi. The opening up of commercial coal mining for the private sector is the most ambitious coal sector reform. Currently, the private sector is allowed coal mining for captive use only. The CCEA has also approved the methodology for the auction of coal mines or blocks for sale of coal under the Coal Mines (Special Provisions) Act, 2015 and the Mines and Minerals (Development and Regulation) Act, 1957.

- **Creation of National Urban Housing Fund of Rs 60,000 crore approved**

The Cabinet has given its approval for creation of National Urban Housing Fund of 60 thousand crore rupees. The fund will be situated in Building Materials and Technology Promotion Council under the Ministry of Housing and Urban Affairs. It will facilitate raising requisite funds in the next four years so that flow of Central Assistance under different verticals is sustained and construction of houses to address the gap in Urban Sector progresses smoothly. The Ministry has so far sanctioned 39.4 lakh houses under Pradhan Mantri Awas Yojana (Urban).

Science and Technology

- **India successfully test-fires Agni-II ballistic missile**

India's surface-to-surface Agni-II ballistic missile, with a strike range of 2 thousand kilometres was on 20th February test-fired successfully from the Abdul Kalam Island, off Orissa coast. As part of user trial, the Strategic Forces Command with logistics support from Defence Research Development Organisation (DRDO) carried out the test. The test was aimed at re-establishing the operational effectiveness of the weapon system. The successful launch once again proved the reliability of the medium range surface to surface missile.

Sports

- **Indian boxers win 10 medals in Asian Games**

Indian boxers won 10 medals, including 5 gold, at the Asian Games Test event in the Indonesian capital, Jakarta on 15th February. Manish Kaushik, K.Shyam Kumar, Shaikh Salman Anwar and Ashish won a gold each in their respective categories while Pavitra was the lone Indian gold-winner in the 60-kilogram category of women's draw. It was the second successive top finish for Manish Kaushik since claiming the national title last year. Shashi Chopra, also a bronze-medallist at last month's India Open, settled for a silver medal. Signing off with bronze medals were Muhammed Etash Khan , Ritu Grewal, Pawan Kumar and Ashish Kumar in respective categories.

- **Roger Federer wins Rotterdam Open**

Roger Federer has won Rotterdam Open on 18th February, this win is his 97th career title. He defeated Bulgarian Grigor Dimitrov. Federer, the record 20-time Grand Slam winner, will reclaim the number one ranking he last held in October 2012 when the new ATP rankings are published on 19th February. He has played two tournaments this year and won both-the other being January's Australian Open.

Rajendra Sharma
Current Affairs
Faculty, Hyderabad



బులెటిన్ బోర్డ్

ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్



శాస్త్ర, సాంకేతిక విద్యలో పరిశోధనలకు మరింత ఊతం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్'నకు దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది. ఎంపికైన అభ్యర్థులకు దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీ/ఐఐఎస్సీలో పీహెచ్‌డీ ప్రవేశం కల్పించడంతోపాటు మొదటి ఏడాది నెలకు రూ.70,000; రెండో ఏడాది-రూ.75,000; చివరి మూడు సంవత్సరాల్లో నెలకు రూ.80,000 స్టైపెండ్ ఇస్తారు.

- **అర్హత:** ఏదైనా ఐఐటీ/ఐఐఎస్సీ/ఎన్ఐటీ/ఐఐఎస్ఈఆర్/ఐఐఐటీలో సైన్స్/టెక్నాలజీ విభాగాల్లో నాలుగేళ్ల అండర్‌గ్రాడ్యుయేట్/ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్/ఎంఎస్సీ/ఐదేళ్ల యూజీ-పీజీ డ్యూయల్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఈ కోర్సుల తుది సంవత్సరం విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తారు.
- **చివరి తేదీ:** మార్చి 31, 2018. **వెబ్‌సైట్:** pmrf.in

ఐబీబీఐలో 18 ఖాళీలు

ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ).. ఆఫీసర్ గ్రేడ్ 'ఎ' కేటగిరీలోని 18 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** అసిస్టెంట్ మేనేజర్.
- **వేతనశ్రేణి:** రూ.28,150-రూ.55,600.
- **మొత్తం ఖాళీలు:** 18 (జనరల్-11+ ఓబీసీ-4+ఎస్సీ-2+ఎస్టీ-1).
- **అర్హతలు:** సీఏ/సీఎస్/ఎల్ఎల్‌బీ/ఎంబీఏ (ఫైనాన్స్)/మాస్టర్ డిగ్రీ (ఎకనమిక్స్/కామర్స్) ఉత్తీర్ణులై ఉండాలి. లిమిటెడ్ ఇన్‌సాల్వెన్సీ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణులైన వారికి, పైన పేర్కొన్న విద్యార్హతల్లో 2 రెండు లేదా అంతకంటే ఎక్కువ క్వాలిఫికేషన్స్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- **వయసు:** 2018, మార్చి 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ ఎగ్జామినేషన్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ.
- **ఆన్‌లైన్ ఎగ్జామినేషన్ విధానం:** దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్, ఎకానమీ/ఫైనాన్షియల్ సెక్టార్ అవేర్‌నెస్, ఇన్‌సాల్వెన్సీ అండ్ రిలేటెడ్ లా అంశాల్లో ఒక్కోదాని నుంచి 30 చొప్పున 90 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్ అంశాల్లో ఒక్కోదాని నుంచి 20 చొప్పున 60 ప్రశ్నలు కలిపి మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కు కోత విధిస్తారు. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్రమే ఉంటుంది. ప్రతి అంశం నుంచి నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులను మెరిట్ జాబితా ప్రకారం గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్.
- **దరఖాస్తు రుసుం:** రూ.500; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **చివరి తేదీ:** మార్చి 14, 2018.
- **వెబ్‌సైట్:** www.ibbi.gov.in

సాక్షి బిజినెస్
శనివారం 24-2-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
323 ▲	108 ▲
34,142	10,491

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.30కి)

నాస్‌డాక్	7,274	▲	64
డోజోన్స్	25,147	▲	185
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,244	▼	8
డాక్స్	12,484	▲	22
షాంఘై	3,289	▲	21
నికాయ్	21,893	▲	156

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.65	65.78
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.91	92.09
€	యూరో	ఎస్‌బీఐ	81.08	81.24
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.67	61.79
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.70	51.80
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.92	50.02
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.69	18.61
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.07	18.78
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.24	11.75



బఫెట్ వారసుడెవరు?

ప్రపంచంలోనే దిగ్గజ ఇన్వెస్టర్‌గా ప్రఖ్యాతి గాంచిన ఒరాకిల్ ఆఫ్ ఒమాహా వారెన్ బఫెట్... తన వారసుడిని ప్రకటించే సమయం ఆసన్నమైనట్టే ఉంది. బెర్క్‌షైర్ హతావేకు సీఈఓ, చైర్మన్‌గా వ్యవహరిస్తున్న బఫెట్‌కు ప్రస్తుతం 87 ఏళ్లు. వైస్ చైర్మన్‌గా ఉన్న చార్లెస్ మంగర్‌కు 94 ఏళ్లు. ఈ కీలక అధికారులిద్దరికీ వయోభారం మీద పడింది కనక బఫెట్ వారసుడిని ప్రకటించే సమయం దగ్గర పడిందనేది పరిశీలకుల భావన. వారెన్ బఫెట్ తన కంపెనీ బెర్క్‌షైర్ వాటాదారులకు ఏడాదికోసారి రాసే వార్షిక లేఖ శనివారం వాటాదారులకు అందనుంది. రివాజుగానే ఈ లేఖలో అమెరికా ఆర్థిక వ్యవస్థ, కంపెనీ భవిష్యత్ వ్యూహాలు, అమెరికాలో తాజా పన్ను సంస్కరణలు, కంపెనీపై ఈ పన్ను సంస్కరణల ప్రభావం ఏ మేరకు ఉండబోతోంది? బీమా వ్యాపారాన్ని ప్రభావితం చేస్తున్న అండర్ రైటింగ్ సమస్యలేంటి? వంటివన్నీ ఆయన ప్రస్తావించే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. అమెజాన్ డాట్‌కామ్, జేపీ మోర్గాన్ ఛేజ్ అండ్ కంపెనీతో ప్రారంభించే ఆరోగ్య రంగ సంబంధిత వెంచర్ గురించి కూడా ఆయన మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. అన్నింటి కంటే ముఖ్యంగా కంపెనీ భవిష్యత్తు నాయకత్వం గురించి ఆయన ఏమని వ్యాఖ్యానిస్తారో తెలుసుకోవాలని ఒక్క అమెరికా, యావత్ ప్రపంచంతోపాటు భారత్ కూడా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఎందుకంటే ఇన్వెస్ట్‌మెంట్ ప్రపంచంలో ఒక బ్రాండ్ లాంటి బఫెట్ వారసుడి రేసులో ఓ భారతీయుడూ ఉన్నాడు మరి. బఫెట్ వారసుడికి సంబంధించి ఇప్పటికే దాదాపు ఐదు పుస్తకాల దాకా మార్కెట్లోకి వచ్చాయంటే.. ఈ అంశంపై ఎంత ఉత్సుకత ఉందో అర్థంకాక మానదు.

జనవరిలో ప్రమోషన్లు...

కంపెనీలో చిరకాలంగా పనిచేస్తున్న అజిత్ జైన్, గ్రెగరీ ఏబెల్‌లకు ఈ ఏడాది జనవరిలో కంపెనీ వైస్ చైర్మన్లుగా పదోన్నతి లభించింది. బీమాయేతర వ్యాపారాలకు వైస్ చైర్మన్‌గా 55 ఏళ్ల ఏబెల్, బీమా వ్యాపారాల వైస్ చైర్మన్‌గా 66 ఏళ్ల అజిత్ జైన్‌లు వ్యవహరిస్తారు. వారెన్ బఫెట్ వారసుడిగా ఈ ఇద్దరిలో ఒకరికి అవకాశం ఉన్నట్లు ఇన్వెస్ట్‌మెంట్ వర్గాలు భావిస్తున్నాయి. తాజా ప్రమోషన్లు.. తన వారసత్వ ప్రక్రియలో భాగమేనని బఫెట్ వర్ణించారు.

- నేడు వాటాదారులకు వారెన్ బఫెట్ వార్షిక లేఖ
- దాన్లో వారసుడిని ప్రస్తావించే అవకాశం
- రేసులో భారతీయుడు అజిత్ జైన్..
- గ్రెగరీ ఏబెల్ నుంచి గట్టి పోటీ..!

పోటాపోటీ...

భారత్‌లో జన్మించిన అజిత్ జైన్ భారత్‌లో ఐబీఎమ్ సేల్స్ పర్సన్‌గా పనిచేశారు. ఇక్కడ ఐబీఎమ్ తన కార్యకలాపాలను నిలిపేయడంతో ఉద్యోగం కోల్పోయి హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో చేరారు. అక్కడ చదివాక కొన్నాళ్లు మెకిన్సేలో పనిచేశారు. 1986లో బెర్క్‌షైర్‌లో చేరారు. ప్రస్తుతం బెర్క్‌షైర్ నేషనల్ ఇండెమ్నిటీ కంపెనీకి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. రీ ఇన్సూరెన్స్ వ్యాపారాన్ని కూడా ఆయనే చూస్తున్నారు. తనకంటే స్మార్ట్‌గా జైన్ పనిచేస్తున్నారని కొన్నేళ్ల క్రితం అజిత్ జైన్‌కు బఫెట్ కితాబివ్వడం విశేషం. బఫెట్ ఇన్వెస్ట్ చేయడానికి వీలుగా కోట్ల డాలర్ల నిధులను అజిత్ జైన్ బీమా వ్యాపారం ద్వారా ఆర్జించి ఇచ్చారు. బెర్క్‌షైర్ కోసం నా కంటే అజిత్ జైన్ అధికంగా సంపాదించారని గత ఏడాది వార్షిక లేఖలో వారెన్ బఫెట్ ప్రస్తావించడం విశేషం. ఇక కెనడాలో జన్మించిన ఏబెల్ ప్రస్తుతం బెర్క్‌షైర్ హతావే ఎనర్జీ కంపెనీకి సీఈఓగా, చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. 1992లో బెర్క్‌షైర్‌లో చేరిన ఆయనను డీల్ మేకర్ అని బఫెట్ ప్రశంసిస్తుంటారు. అజిత్ జైన్, ఏబెల్‌లు ఇద్దరూ ఇద్దరేనని, అత్యంత విశ్వాస పాత్రులని, ఉద్వేగాలకు తావివ్వకుండా వ్యాపార నిర్ణయాలు తీసుకుంటారని పేరు ఉంది. ఇద్దరి మీదా బఫెట్‌కు మంచి గురి ఉంది. కంపెనీ రీ ఇన్సూరెన్స్ వ్యాపారాన్ని అజిత్ జైన్ మరో స్థాయికి తీసుకెళ్లగా, ఏబెల్ ఇంధన వ్యాపారాన్ని విస్తృతంగా విస్తరించారు. వీరిద్దరితో పాటు జార్జ్ పాల్ లెమన్, టాడ్ కాంబ్స్, టెడ్ వేలర్ కూడా రంగంలో ఉన్నారు. కానీ ఏబెల్, అజిత్ జైన్‌లకే అవకాశాలు అధికమని చెప్పాలి.


హోవార్డ్ బఫెట్


అజిత్ జైన్


గ్రెగ్ ఏబెల్

ఏబెల్‌ది కొంచెం పైచేయి?

అజిత్ జైన్ కంటే గ్రెగ్ ఏబెల్ పదేళ్ల చిన్నవాడు కనక అజిత్ జైన్ కంటే ఏబెల్‌కే బఫెట్ వారసుడయ్యే అవకాశాలు అధికమనేది పరిశీలకుల మాట. అజిత్ జైన్‌కు ఆరోగ్య సమస్యలు ఉండటం కూడా ప్రతికూలమే. అలాగని అజిత్ అవకాశాలను కొట్టిపారేయలేం. జైన్ సరేనంటే సీఈఓను చేయడానికి కంపెనీ బోర్డ్ సిద్ధంగా ఉందని బఫెట్ 2011లోనే చెప్పారు. మరోవైపు తాను మరీ ముసలాడినేమీ కాలేదని, మరో పదేళ్లు పని చేయగలనని బఫెట్ పేర్కొన్నారు. ఇరవై ఏళ్ల క్రితమైతే వారెన్ బఫెట్ వారసుడి ప్రకటన వెలువడితే అది ఆ షేర్‌కు హార్ట్ ఎటాక్‌లా ఉండేదని, ఇప్పుడు చిన్న జెర్క్‌లాంటిది మాత్రమేనని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తన కొడుకు హోవార్డ్.. నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా, డైరెక్టర్‌గా కొనసాగుతాడని బఫెట్ తెలిపారు.

పన్ను ప్రయోజనాలు

అమెరికాలో ట్రంప్ తెస్తున్న పన్ను సంస్కరణలు బెర్క్‌షైర్‌కు భారీగా లాభం చేకూర్చే అవకాశాలున్నాయి. పన్ను రేటు తగ్గనున్నందున బెర్క్‌షైర్ బుక్ విలువ 3,700 కోట్ల డాలర్ల మేర పెరుగుతుందని అంచనా. పన్ను కోత ప్రయోజనాలతో భారీ లాభాలొస్తాయనే అంచనాలతో బెర్క్‌షైర్ షేర్ గత ఏడాది తొలిసారిగా 3 లక్షల డాలర్ల మేర ఎగసింది.

బెర్క్‌షైర్ వ్యాపార సామ్రాజ్యమిదీ..

బెర్క్‌షైర్ హతావేను 1965 నుంచి బఫెట్ నడిపిస్తున్నారు. ఐదు దశాబ్దాల ఆయన సామ్రాజ్యం నేడు భారీగా ఎదిగింది. దాదాపు 12కు పైగా అనుబంధ కంపెనీలున్నాయి. అలాగే వాహన బీమా అందించే గీకో, బెర్క్‌షైర్ హతావే రీ ఇన్సూరెన్స్ సంస్థలు గ్రూప్‌లో కీలకం. బీఎన్‌ఎస్‌ఎఫ్ రైల్వే, ఫ్రూట్ ఆఫ్ ద లూమ్, ద బఫెలో న్యూస్ కూడా కీలక సంస్థలే. క్రాఫ్ట్ హెంజ్ కంపెనీ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, వెల్స్ ఫార్గో కంపెనీలో చెప్పుకోదగ్గ వాటాలున్నాయి.

–సాక్షి బిజినెస్ డెస్క్

కేన్సర్ ఔషధాలకూ రాయితీ!

- నెలకు 5 వేల ఆర్డర్లు; రూ.5 లక్షల వ్యాపారం
- త్వరలోనే రూ.10 కోట్ల నిధుల సమీకరణ
- 'స్టార్టప్ డైరీ'తో కోమెడ్జ్.కామ్ ఫౌండర్ శ్రీహరి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సెల్‌ఫోన్లు, దుస్తులే కాదు ఔషధాలూ డిస్కౌంట్లతో ఆన్‌లైన్‌లో కొనడం మనకు తెలిసిందే. కానీ, కేన్సర్, గుండె జబ్బులు వంటి ఖరీదైన మందులు సైతం రాయితీలో దొరకటమంటే కష్టం. అందుకే దీన్నే వ్యాపారంగా మార్చి 'కోమెడ్జ్.కామ్'ను ఆరంభించారు వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన శ్రీహరి అరిగె. వ్యక్తిగత అవసరాలతో పాటు స్థానిక రిటైల్ మందుల షాపులకూ ఔషధాలను అందించడం దీని ప్రత్యేకత. మరిన్ని వివరాలు వ్యవస్థాపకుడు శ్రీహరి మాటల్లోనే...

Comedz.com
Your trusted ePharmacy

ఎస్‌వీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక.. ఐటీలో ఉద్యోగ రీత్యా లండన్‌కెళ్లా. కుటుంబ వ్యాపారం మెడికల్ స్టోర్ కావటంతో దీనికి టెక్నాలజీని జోడించా. రూ.కోటి పెట్టుబడులతో గతేడాది ఆగస్టులో కోమెడ్జ్.కామ్‌ను ప్రారంభించా. ప్రస్తుతం కోమెడ్జ్.కామ్‌లో 80 వేలకు పైగా ఔషధాలున్నాయి. సాధారణ మందులతో పాటూ మధుమేహం, గుండె జబ్బులు, కేన్సర్ చికిత్స వంటి ఖరీదైన మందులు, పోషకాహార ఉత్పత్తులు, మాతాశిశు సంరక్షణ ఔషధాలు, ఆయుర్వేద మందులు కూడా లభిస్తాయి. ప్రస్తుతం నెలకు 3,000–5,000 ఆర్డర్లు వస్తున్నాయి. వీటి విలువ సుమారు రూ.5 లక్షల వరకుంటుంది. నెలకు రూ.లక్ష వరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నాం. వెయ్యి పైన ఆర్డర్‌కు ఉచిత డెలివరీ, 22 శాతం డిస్కౌంట్ ఉంటుంది. వెయ్యి లోపయితే రూ.50 డెలివరీ చార్జీ, 15 శాతం డిస్కౌంట్ ఉంటుంది. ప్రస్తుతం మాకు 800 మంది కస్టమర్లున్నారు.

స్టార్టప్ డైరీ

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి ఎక్కువగా ఆర్డర్లు వస్తున్నాయి. కేన్సర్, గుండె జబ్బుల మందుల ఆర్డర్లు ఎక్కువగా వస్తుంటాయి. కారణం డిస్కౌంట్లే. హైదరాబాద్‌లో మందుల డెలివరీ కోసం సొంతంగా 15 మంది సిబ్బందిని నియమించుకున్నాం. ఇతర నగరాల్లో డెలివరీ కోసం తపాలా శాఖతో ఒప్పందం చేసుకున్నాం.

ప్రస్తుతం మా సంస్థలో 22 మంది ఉద్యోగులున్నారు. త్వరలోనే ల్యాబ్ పరీక్షలను అందించాలని నిర్ణయించాం. ఈ ఏడాది ముగిసేసరికి 5 వేల మంది కస్టమర్లు, నెలకు రూ.కోటి వ్యాపారం చేయాలని లక్ష్యించాం. ఈ ఏడాది ముగింపులోగా రూ.10 కోట్ల నిధుల సమీకరణ చేయనున్నాం. పలువురు ఇన్వెస్టర్లతో చర్చిస్తున్నాం.

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే startups@sakshi.com కు మెయిల్ చేయండి...

నగదు ఉపసంహరణలపై పరిమితుల్లేవు

పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ/ముంబై: ఖాతాదారుల నగదు ఉపసంహరణలపై ఎలాంటి పరిమితులు విధించలేదని పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) శుక్రవారం స్పష్టం చేసింది. ప్రతి కస్టమర్‌కు రూ.3,000 పరిమితి విధించినట్టు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తోసిపుచ్చింది. అలాగే, 18 వేల మంది సిబ్బందిని ఇటీవల బదిలీ చేసినట్టు వచ్చిన వార్తల్లోనూ నిజం లేదని, 1,415 మందినే బదిలీ చేశామని తెలిపింది. మరోవైపు ఖాతాదారుల డెబిట్, క్రెడిట్ కార్డుల సమాచారం లీక్ అయిందంటూ వస్తున్న నివేదికలను పీఎన్‌బీ తోసిపుచ్చింది. డేటా భద్రత కోసం అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతుందని వివరించింది. క్రికెటర్ విరాట్ కోహ్లీ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగుతున్నారని స్పష్టం చేసింది. అలాగే, రూ.11,400 కోట్ల స్కామ్‌పై ఫోరెన్సిక్ ఆడిటింగ్‌కు ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్‌ను (పీడబ్ల్యూసీ) నియమించుకోలేదని తెలిపింది.

నిఘా వ్యవస్థను సమీక్షించుకోవాలి: అలహాబాద్ బ్యాంక్ సీఈవో

బ్యాంకులు తమ నిఘా వ్యవస్థలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని అలహాబాద్ బ్యాంకు ఎండీ, సీఈవో ఉషా అనంత సుబ్రమణ్యం చెప్పారు. పీఎన్‌బీకి ఆమె గతంలో చీఫ్‌గా ఉన్నారు.



స్విఫ్ట్, సీబీఎస్ అనుసంధానం

మరోవైపు బ్యాంకుల మధ్య అంతర్గత సమాచారానికి వీలు కల్పించే స్విఫ్ట్ వ్యవస్థను కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌తో (సీబీఎస్) ఏప్రిల్ 1 నాటికి అనుసంధానించుకోవాలని ఆర్‌బీఐ గడువు విధించింది. పీఎన్‌బీలో మోసానికి స్విఫ్ట్ వ్యవస్థను దుర్వినియోగం చేసిన విషయం తెలిసిందే.

భారీ రుణ గ్రహీతల వివరాలివ్వండి

ఆర్‌బీఐని కోరిన ఐసీఏఐ

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచి రూ.2,000 కోట్లకు పైగా రుణాలు తీసుకున్న వారి వివరాలివ్వాలని ఆర్‌బీఐని కోరింది. సదరు జాబితాను ఐసీఏఐకి చెందిన ఫైనాన్షియల్ రిపోర్టింగ్ రివ్యూ బోర్డు పరిశీలించి, అకౌంటింగ్, ఆడిటింగ్ ప్రమాణాల ఉల్లంఘనకు ఏమైనా అవకాశం ఉందా అన్నది తేలుస్తుందని స్పష్టం చేసింది. మరోవైపు పీఎన్‌బీ, గీతాంజలి జెమ్స్ ఆడిటర్లకు ఐసీఏఐ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అలాగే, సెబీ, సీబీఐ, ఈడీలు తమ దర్యాప్తు వివరాలను ఐసీఏఐతో పంచుకోవాలని ఆదేశించాలంటూ కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖకు లేఖ రాసినట్టు పేర్కొంది.

మొబైల్స్ రిటైల్‌లోకి 'సెలెక్ట్'

- ఈ నెల 15న తొలి స్టోర్ ఆరంభం
- రెండేళ్లలో దేశవ్యాప్తంగా 500 స్టోర్లు
- కస్టమర్లకు వినూత్న ఎక్స్‌పీరియెన్స్
- మీడియాతో సెలెక్ట్ ఎండీ వై.గురు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్స్ విక్రయ రంగంలోకి మరో కొత్త బ్రాండ్ ప్రవేశిస్తోంది. సెలెక్ట్ పేరుతో దేశవ్యాప్తంగా మల్టీ బ్రాండెడ్ ఫోన్లను విక్రయించే స్టోర్లను ఏర్పాటు చేసేందుకు ఈ హైదరాబాద్ కంపెనీ రెడీ అయింది. ప్రముఖ వ్యాపారవేత్త, యాక్సెసరీస్, మొబైల్స్ రిటైల్ రంగంలో 25 ఏళ్లకు పైగా అనుభవమున్న వై.గురు సెలెక్ట్‌కు సారథ్యం వహిస్తున్నారు. మార్చి 15న తొలి ఔట్‌లెట్ భాగ్యనగరిలో ప్రారంభం కానుంది. మార్చి ఆఖర్లోగా తెలంగాణలో 23, తిరుపతిలో రెండు స్టోర్లను తెరుస్తామని సెలెక్ట్ ఎండీ వై.గురు శుక్రవారమిక్కడ విలేకరులకు తెలియజేశారు. అన్ని ప్రముఖ కంపెనీల స్మార్ట్, బేసిక్ ఫోన్లను ఈ ఔట్‌లెట్లలో విక్రయిస్తారు. సెలెక్ట్‌ను జాతీయ బ్రాండ్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

ఎక్స్‌పీరియెన్స్ జోన్లు..

సెలెక్ట్ ఔట్‌లెట్లలో ప్రత్యేకంగా ఎక్స్‌పీరియెన్స్ జోన్లను ఏర్పాటు చేస్తారు. 'ఫోన్ ఫీచర్లను ప్రత్యక్షంగా చూసేందుకు వీలుగా భారత్‌లో తొలిసారిగా వినూత్న ఎక్స్‌పీరియెన్స్ అందుబాటులోకి తెస్తున్నాం. ఫీచర్లను వివరించేందుకు భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తాం. కెమెరా పనితీరూ చూడొచ్చు. ఫీచర్లను వినియోగదార్లకు వివరించేందుకు ప్రత్యేక నిపుణులుంటారు. ఆన్‌లైన్, లార్జ్ ఫార్మాట్ స్టోర్లతో పోలిస్తే పోటీ ధరలకే ఉత్పత్తులను విక్రయిస్తాం. అన్ని మోడళ్లకు యాక్సెసరీస్ అందుబాటులో ఉంచుతాం. విభిన్న ఉపకరణాలూ కొలువుదీరతాయి. పెద్ద స్టోర్లలో సర్వీసింగ్ ఉంటుంది' అని గురు వివరించారు.



తొలి దశలో రూ.200 కోట్లు...

తెలంగాణతో ప్రారంభమై దేశవ్యాప్తంగా సెలెక్ట్ ఔట్‌లెట్లను విస్తరించనున్నారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వంటి ఉత్తరాది మార్కెట్లలో లార్జ్ ఫార్మాట్ రిటైల్ చైన్లను విజయవంతంగా నిర్వహించవచ్చని కంపెనీ పేర్కొంది. మొత్తంగా రూ.200 కోట్ల ఖర్చుతో రెండేళ్లలో 500 స్టోర్లు రానున్నాయి. తొలి దశ పూర్తయితే సుమారు 3,500 మంది యువతకు ఉపాధి లభిస్తుంది. అత్యధికంగా తెలుగు రాష్ట్రాల నుంచే వీరిని ఎంపిక చేస్తారు. ఇక ప్రాంతాన్ని బట్టి 500 నుంచి 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో స్టోర్లు ఉంటాయి. ఒక్కో ఔట్‌లెట్‌కు రూ.30–90 లక్షలు ఖర్చు అవుతుంది. రెండో దశలో మరో 500 కేంద్రాలు నెలకొల్పాలన్నది కంపెనీ ప్రణాళిక. ఈ 1,000 కేంద్రాలు కార్యరూపంలోకి వస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వీటి సంఖ్య 150 దాకా ఉంటుందని అంచనా.

మార్కెట్ ముందుకే!

స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టడం కాస్త కష్టమేనని బిగ్ బుల్ రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా వ్యాఖ్యానించారు. తగిన నైపుణ్యం లేకుండా కొత్తవాళ్లు నేరుగా పెట్టుబడులు పెట్టొద్దని సలహా ఇచ్చారు. ఇలాంటివాళ్లు మార్కెట్‌పై మంచి అవగాహన వచ్చే వరకు మ్యూచువల్ ఫండ్స్ ద్వారా పెట్టుబడులు పెట్టాలని సూచించారు. మార్కెట్లో పెట్టుబడులు పెట్టి లాభాలు పొందేందుకు నిపుణుల సలహా, పర్యవేక్షణ అవసరమన్నారు. మ్యూచువల్ ఫండ్స్ కాదనుకుంటే సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)మరో మంచి మార్గమన్నారు. మరోవైపు దేశీయ బుల్ మార్కెట్ పరుగులు కొనసాగుతాయని, కాకపోతే ఈ పరుగు ఎన్నాళ్లో ఇప్పుడే చెప్పలేమని అన్నారు. త్వరలో భారత్ రెండంకెల వృద్ధిని సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దీర్ఘకాలం పెట్టుబడులు పెడితే ఈక్విటీలు మంచి ఫలితాలిస్తాయని చెప్పారు. బ్యాంక్ మోసాలు ఇప్పుడు వెలుగులోకి రావడం మంచిదేనని, అయితే బ్యాంక్‌లకు మూలధన నిధులు అందించడం దీర్ఘకాలంలో ప్రతికూల ప్రభావం చూపుతుందని చెప్పారాయన. మార్కెట్లో ఇన్వెస్ట్ చేసేముందు చూడాల్సిన ముఖ్యాంశాలు, ఏ షేర్‌ను ఎప్పుడు అమ్మాలి, మార్కెట్‌పై ఎల్‌టీసీజీ పన్ను పోటు, వడ్డీ రేట్లు, ప్రైవేట్ పెట్టుబడులు ఇలా పలు అంశాలపై ఆయన తన అభిప్రాయాలను వివరించారు. ఆ వివరాలు..



- అవగాహన ఉంటేనే షేర్లలో పెట్టుబడి
- లేకుంటే ఫండ్స్‌తో మొదలెట్టండి
- నైపుణ్యం లేకుంటే నేరుగా దూకొద్దు!
- రెండు అంకెల వృద్ధి దిశగా భారత్
- బ్యాంక్ మోసాలు మంచికే
- ఏస్ ఇన్వెస్టర్ రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా

నాణ్యమైన చిన్న షేర్లు ఎంచుకోండి....

షేర్లలో ఇన్వెస్ట్ చేసేటప్పుడు పరిశీలించాల్సినవాటిలో ముఖ్యమైనవి ఆ షేరు ధర, విలువ. ఏం కొన్నామన్నది కాదు, ఎంతకు కొన్నామన్నదే ముఖ్యం. లార్జ్‌క్యాప్స్ కన్నా, నాణ్యమైన స్మాల్‌క్యాప్స్‌లో పెట్టుబడే మంచిది. అవి లార్జ్‌క్యాప్స్‌గా ఎదిగే క్రమంలో భారీ లాభాలిస్తాయి. కంపెనీ షేరులో ఇన్వెస్ట్ చేసే ముందు ఆ కంపెనీ ఆర్థిక స్థితిగతులు తెలుసుకోవడం కీలకం. పెట్టుబడి పెట్టేముందు సరైన విశ్లేషణ ఎంత అవసరమో, పెట్టుబడి పెట్టాక ఓపికగా ఎదురు చూడడం కూడా అంతే అవసరం.

ఎప్పుడు అమ్మాలంటే...

మీరు ఇన్వెస్ట్ చేసిన షేర్ల కన్నా మంచి షేర్లు కనిపిస్తే ఉన్నవాటిని అమ్మి కొత్తవాటిల్లో ఇన్వెస్ట్ చేయడం మంచిదే. అలాగే ఒకస్థాయికి మించి భారం పెరుగుతుందనుకున్నప్పుడు కొన్ని షేర్లలో ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకొని భారం తగ్గించుకోవాలి. చాలా మంది పొజిషన్లపై మమకారం పెంచుకుంటారు. అది మంచిది కాదు. ఒకస్థాయి వద్ద లాభాలు స్వీకరించి కొత్తవాటిలోకి ఎంటర్ కావడం ఉత్తమం. ఇతరులు మాకెందుకులే అని వదిలేసిన రంగాల్లో అవకాశాలను వెతికి లాభాలు సంపాదించేవాడే నిజమైన ఎంటర్‌ప్రెన్యూర్. ఎమోషన్స్ మీద, ఒకటిరెండు ఐడియాల మీద ఆధారపడి వ్యాపారంలోకి వస్తే ఏమీ మిగలదు. బీ2బీ మోడల్‌కు చెందిన వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి ఆరంభించడం ఉత్తమం. దీంతో పాటు ఎంటర్‌ప్రెన్యూర్లు కొత్త టెక్నాలజీలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలి.

ఈ ర్యాలీ 'బఫే' విందు లాంటిది..: దేశీయ మార్కెట్లో ర్యాలీని బఫే భోజనంతో పోల్చవచ్చు. బఫేలో మనకు కావాలిసినవి అందుబాటులో ఉంటాయి, నచ్చినవి తీసుకొని తినొచ్చు. మార్కెట్లో కూడా పలు రంగాల స్టాకులు అందుబాటులో ఉన్నాయి, వీటిలో అనువైనవి ఎంచుకోవడమే మన పని.



'పన్ను' పోటు తక్కువే...

ఈక్విటీలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) మార్కెట్‌పై పెద్దగా ప్రభావం చూపించకపోవచ్చు. ఈ పన్నుతో మార్కెట్లు వెనకంజ వేస్తాయనుకోవడంలేదు. ఈక్విటీలతో పోల్చితే ఇతర పెట్టుబడి సాధనాలపైననే ఎక్కువ పన్ను ఉంది. ఎల్‌టీసీజీ విధించినా ఈక్విటీలే తక్కువ పన్ను భారం ఉంది. దీంతో ఇవి ఆకర్షణీయంగా ఉన్నాయి. దేశీయ పెట్టుబడులను ఈ పన్ను పెద్దగా ప్రభావితం చేయకపోవచ్చు. అయితే విదేశీ పెట్టుబడిదారులు ఇంతవరకు పన్నులు లేకుండా పెట్టుబడులు పెడుతూ వచ్చారు. కాబట్టి ఈ పన్ను ప్రభావం వారిపై ఉండొచ్చు.

వడ్డీరేట్లు ప్రస్తుత స్థాయిల్లోనే..

మన దేశంలో వడ్డీరేట్లు మరికొంత కాలం ప్రస్తుత స్థాయిల్లోనే ఉండే అవకాశాలే అధికంగా ఉన్నాయి. ఇక అమెరికాలో ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది మూడు దఫాలుగా రేట్లను పెంచవచ్చు. దీనివల్ల ద్రవ్యోల్బణం పెద్దగా పెరుగుతుందని భావించడంలేదు. ప్రైవేట్ పెట్టుబడులు వృద్ధి చెందడం ఒక నిరంతర ప్రక్రియ. 2002లో ప్రైవేట్ పెట్టుబడుల వాటా జీడీపీలో 27 శాతం కాగా 2008కి 35 శాతానికి చేరింది. ప్రస్తుతం 28 శాతానికి తగ్గింది. వచ్చే నాలుగేళ్లలో తిరిగి 35 శాతం వరకు పెరగవచ్చు. స్టీల్, వాణిజ్యవాహనాలు, కెమికల్ యూనిట్లలో ప్రస్తుతం పెట్టుబడులు వస్తున్నాయి. డిమాండ్ ఊపందుకునే కొద్దీ ఇవి మరింత పుంజుకుంటాయి.

బ్యాంక్ మోసాలు మంచికే..

ఇందిరా గాంధీ కారణంగా దేశంలో అవినీతి వ్యవస్థీకృతమైంది. పలు ప్రభుత్వ రంగాల్లో పెరిగిన అవినీతి, వైఫల్యాల కారణంగా ప్రైవేటీకరణపై ప్రజల్లో మోజు పెరుగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఇందుకు ఎయిర్‌ఇండియాను ఉదాహరణగా చెప్పొచ్చు. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను విలీనం చేయాలి. కేవలం 3– 4 పీఎస్‌యూ బ్యాంకులనే ఉంచాలి. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లకు మూలధన నిధులు ఇవ్వడం దీర్ఘకాలంలో ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇలా పీఎస్‌బీలకు నిధులు ఇచ్చుకుంటూ పోతే ఐదారేళ్లలో ఇన్‌ఫ్రా తదితర ప్రాజెక్టులకు వెచ్చించడానికి ప్రభుత్వం దగ్గర దమ్మిడీ మిగలదు. నిజానికి బ్యాంక్ కుంభకోణాలు బయటకు రావడం ఒకందుకు మంచిదే. ఇవిప్పుడు వెలుగులోకి రాకపోతే, ఈ తరహా స్కామ్‌లు మరింతగా పెరుగుతూ ఉండేవి. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) యంత్రాంగం కూడా బాగుంది. మొత్తం మీద త్వరలో బ్యాంకుల భవితవ్యం బాగుపడే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

హైఎండ్ బైక్‌ల విక్రయాలు పెరుగుతాయి

కవాసాకి మోటార్స్ ఆశాభావం



కోల్‌కతా: కవాసాకి మోటార్స్ ఇండియా తన హైఎండ్ బైక్స్ విక్రయాలపై పూర్తి ఆశావహంగా ఉంది. భారత్‌లో ప్రీమియం బైకుల విభాగంలో మార్కెట్‌ను మరింత పెంచుకోవాలని ప్రయత్నిస్తోంది. 'పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు చేసినా కూడా ఇండియాలో ప్రీమియం బైక్స్ అమ్మకాల వృద్ధిపై నమ్మకంగా ఉన్నాం. అలాగే మరొకవైపు ప్రజల ఆదాయం కూడా పెరుగుతోంది. ఇది కూడా మాకు సానుకూలాంశం' అని కవాసాకి మోటార్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యుతకా యమాషితా తెలిపారు. ప్రీమియం బైక్ మార్కెట్‌లో ప్రతి ఏడాది 30 శాతంమేర వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేశారు. కాగా కవాసాకి ప్రస్తుతం తన పుణే ప్లాంటులో 300 సీసీ– 1,400 సీసీ శ్రేణిలో ఇంజిన్ సామర్థ్యం కలిగిన బైక్స్‌ను అసెంబుల్ చేస్తోంది. కంపెనీ 2017 ఏప్రిల్ నుంచి 1,500 యూనిట్ల బైక్స్‌ను భారత్‌లో విక్రయించింది. దీనికి దేశవ్యాప్తంగా 22 డీలర్‌షిప్స్ ఉన్నాయి. కాగా కవాసాకి గతంలో బజాజ్ ఆటోతో కుదుర్చుకున్న సేల్స్ అండ్ సర్వీసింగ్ ఒప్పందానికి గతేడాది ఏప్రిల్‌లో ముగింపు పలికిన విషయం తెలిసిందే.




పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
--	--	--	రూ.1,210 (కనిష్ఠం)	రూ.3,600	రూ. 3,800 (హెచ్ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--
--	--	--	రూ.1,540 (గరిష్ఠం)					











మార్చి 8 నుంచి ఇండియావుడ్ ప్రదర్శన



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆసియాలోనే అతిపెద్ద వుడ్ వర్కింగ్, ఫర్నీచర్ తయారీ పరిశ్రమ ప్రదర్శన 'ఇండియావుడ్–2018' మరోసారి సందర్శకుల ముందుకురానుంది. బెంగళూరులోని బీఐఈసీలో మార్చి 8 నుంచి 12 వరకు జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ షోలో వుడ్, ఫర్నీచర్ తయారీ పరిశ్రమలో వస్తున్న కొత్త టెక్నాలజీ, ట్రెండ్స్‌ను ప్రదర్శిస్తారు. మన దేశంతో పాటూ శ్రీలంక, నేపాల్, మలేసియా, మయన్మార్, థాయ్‌ల్యాండ్, ఇండోనేసియా వంటి సుమారు 60 దేశాలకు చెందిన 850కి పైగా తయారీ సంస్థలు, 60 వేల మంది వర్తకులు ఈ షోలో పాల్గొంటారని పీడీఏ ట్రేడ్ ఫెయిర్ వైస్ ప్రెసిడెంట్ శివ కుమార్ వీ తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌తో పాటు వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి వుడ్ వర్కింగ్ సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. దేశీయ ఫర్నీచర్ పరిశ్రమ ఏటా 20% వృద్ధి చెందుతుంది. 2019 నాటికి ఈ రంగం 32 బిలియన్ డాలర్లకు చేరుతుంది.

34,000పైకి సెన్సెక్స్

- అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్లు
- పుంజుకున్న రూపాయి
- కలసివచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- 323 పాయింట్ల లాభంతో 34,142కు సెన్సెక్స్
- 108 పాయింట్లు పెరిగి 10,491కు నిఫ్టీ



సానుకూల అంతర్జాతీయ సంకేతాలకు దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల జోరు జత కావడంతో శుక్రవారం స్టాక్ మార్కెట్ లాభపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ కీలకమైన 34వేల పాయింట్లపైకి ఎగబాకగా. ఎన్ఎస్ఈ నిఫ్టీ కీలకమైన 10,500 పాయింట్ల మైలురాయికి చేరువయ్యింది. అన్ని రంగాల షేర్లలో వేల్యూ బయింగ్ చోటు చేసుకోవడంతో మార్చి డెరివేటివ్స్ సిరీస్ శుభారంభం చేసింది. సెన్సెక్స్ 323 పాయింట్లు లాభపడి 34,142 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 108 పాయింట్లు పెరిగి 10,491 పాయింట్ల వద్ద ముగిశాయి. స్టాక్ సూచీలు రెండూ ఒక శాతం మేర ఎగిశాయి. ఈ వారం నష్టాలన్నింటిని పూడ్చుకున్న సెన్సెక్స్ వారం గరిష్ఠ స్థాయికి ఎగసింది. బీఎస్ఈ సూచీలన్నీ లాభాల్లోనే ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 348 పాయింట్ల వరకూ లాభపడింది. ఫెడరల్ రిజర్వ్ రేట్ల పెంపుపై ఊరటనిచ్చేలా ఫెడరల్ రిజర్వ్ ఉన్నతాధికారొకరు వ్యాఖ్యానించడం, ఇటీవల వరకూ పెరుగుతూ వచ్చిన అమెరికా బాండ్ ఈల్డ్స్ దిగిరావడంతో ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. ఇంట్రాడేలో రూపాయి పుంజుకోవడం, లోహ, ఫార్మా, బ్యాంక్, ఆర్థిక రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరగడం సానుకూల ప్రభావం చూపించాయి.

ఐదు సెన్సెక్స్ షేర్లకే నష్టాలు: 31 సెన్సెక్స్ షేర్లలో ఐదు షేర్లు– హిందుస్తాన్ యూనిలివర్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, ఏషియన్ పెయింట్స్ మాత్రమే నష్టపోయాయి. టాటా స్టీల్, సన్ ఫార్మా, యెస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ఆర్ఐఎల్ షేర్లు లాభపడ్డాయి.

ఆల్‌టైమ్ హైకి అవెన్యూ సూపర్ మార్ట్స్

డి–మార్ట్ రిటైల్ చెయిన్‌ను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్ మార్ట్స్ షేర్ 5% లాభంతో రూ.1,300 వద్ద ముగిసింది. ఈ షేర్ టార్గెట్ ధరను అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ రూ.1,672కు పెంచడంతో ఈ షేర్ ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హై రూ.1,306ను తాకింది. ఈ షేర్‌తో పాటు వెంకీస్ ఇండియా, బ్రిటానియా ఇండస్ట్రీస్, మైండ్‌ట్రీ తదితర షేర్లు కూడా ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైని తాకాయి.

స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)	
బీఎస్ఈ	3,978
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	32,328
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	4,10,335
ఎఫ్ఐఐ	-486
డీఐఐ	1,514

సెబీకి సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఐపీఓ పత్రాలు

ఇష్యూ సైజు రూ.4,500–5,000 కోట్లు!



న్యూఢిల్లీ: సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా కంపెనీ ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) పత్రాలను మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీకి సమర్పించింది. థర్మల్, పునరుత్పాదన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోన్న ఈ కంపెనీని సింగపూర్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టైన సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ ప్రమోట్ చేస్తోంది. ఈ ఐపీఓలో భాగంగా రూ.4,095 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తారు. వీటితో పాటు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ప్రస్తుత వాటాదారులకు సంబంధించిన 14.68 కోట్ల ఈక్విటీ షేర్లను కూడా జారీ చేస్తారు. మొత్తం మీద ఈ ఐపీవో ద్వారా ఈ కంపెనీ రూ.5 వేల కోట్ల వరకు నిధులు సమీకరిస్తుందని అంచనా. ఈ ఐపీఓ నిధులను రుణ భారం తగ్గించుకోవడానికి, సాధారణ వ్యాపార కార్యకలాపాల కోసం వినియోగించుకోవాలని కంపెనీ యోచిస్తోంది. ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా యాక్సిస్ క్యాపిటల్ క్రెడిట్ సూసీ సెక్యూరిటీస్(ఇండియా), సీఎల్ఎస్ఏ ఇండియా, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ వ్యవహరిస్తున్నాయి. ఇండస్ఇండ్ బ్యాంక్ మర్చంట్ బ్యాంక్ విధులు చూస్తుంది. గత ఏడాది డిసెంబర్ చివరినాటికి ఈ కంపెనీ మొత్తం విద్యుదుత్పత్తి సామర్థ్యం 3.57 గిగావాట్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ ఆదాయం 41 శాతం వృద్ధితో రూ.3,418 కోట్లకు పెరగ్గా, రూ.44 కోట్ల నికర నష్టాలు వచ్చాయి.

బీఎండబ్ల్యూ మోటొరాడ్ బైక్స్ ధరలు తగ్గాయి..

10 శాతం వరకు దిగువకు



ముంబై: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బీఎండబ్ల్యూకు చెందిన ప్రీమియం మోటార్‌సైకిల్ విభాగం బీఎండబ్ల్యూ మోటొరాడ్ తాజాగా భారత్‌లో తన బైక్స్ ధరలను 10 శాతం వరకు తగ్గించింది. ధరల తగ్గింపు నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది. అడ్వెంచర్, స్పోర్ట్, టూరింగ్, హెరిటేజ్, రోడ్‌స్టర్ వంటి కేటగిరీల్లోని మోటార్‌సైకిళ్లకు తగ్గింపు వర్తిస్తుందని పేర్కొంది. కాగా కంపెనీ గతేడాది భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించింది. గతేడాది 252 యూనిట్లను విక్రయించింది. బీఎండబ్ల్యూ మోటొరాడ్ ప్రస్తుతం ఐదు కేటరిగీల్లో 12 మోడళ్లను మార్కెట్‌లో విక్రయిస్తోంది.

కట్ డైమండ్స్ దిగుమతులు 14 శాతం డౌన్

ముంబై: కట్ అండ్ పాలిష్డ్ డైమండ్స్ దిగుమతులు తగ్గాయి. వార్షిక ప్రాతిపదికన చూస్తే గతేడాది ఏప్రిల్– నవంబర్ మధ్యకాలంలో 14.44% క్షీణతతో 1,527 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. 2016 ఏప్రిల్–నవంబర్‌లో దిగుమతులు 1,785 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. జెమ్స్ అండ్ జువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) ఈ విషయాలను వెల్లడించింది. రిటర్న్ కన్‌సైన్‌మెంట్స్ కూడా దాదాపు సమానంగానే ఉన్నాయని పేర్కొంది. 2016 ఏప్రిల్–నవంబర్‌లో 4,978 మిలియన్ డాలర్లుగా ఉన్న రిటర్న్ కన్‌సైన్‌మెంట్స్ గతేడాది ఇదే కాలంలో 4,945 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయని తెలిపింది. మీడియాలో వచ్చినట్లు కట్ డైమండ్స్ దిగుమతుల్లో 284% వృద్ధి నమోదు కాలేదని స్పష్టం చేసింది. కట్ అండ్ పాలిష్డ్ డైమండ్స్ దిగుమతుల్లో వాస్తవ దిగుమతులు, రిటర్న్ కన్‌సైన్‌మెంట్స్ అనే విభాగాలుంటాయని పేర్కొంది. కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ ఈ పదాలను విరివిగా ఉపయోగిస్తుంటుందని తెలిపింది. వాస్తవ దిగుమతులు 14.44% తగ్గాయని పేర్కొంది.

మోటరోలా, లెనొవొ ఫోన్లపై ఎయిర్‌టెల్ క్యాష్‌బ్యాక్

న్యూఢిల్లీ: టెలికం దిగ్గజ కంపెనీ 'భారతీ ఎయిర్‌టెల్' తాజాగా కన్సూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ 'లెనొవొ'తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన మోటరోలా, లెనొవొ స్మార్ట్‌ఫోన్లపై రూ.2,000 వరకు క్యాష్‌బ్యాక్‌ను ఎయిర్‌టెల్ అందిస్తోంది. వినియోగదారులు మోటో ఈ4, మోటో సి, లెనొవొ కే8 నోట్ స్మార్ట్‌ఫోన్లపై ఈ ఆఫర్‌ను పొందొచ్చు. అంటే మోటో ఈ4ను రూ.6,499కు, మోటో సి ఫోన్‌ను రూ.3,999కు, లెనొవొ కే8 నోట్‌ను రూ.10,999కు సొంతం చేసుకోవచ్చు. వీలైనంత మందికి స్మార్ట్ ఫోన్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మోటరోలాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ వాణి వెంకటేశ్ తెలిపారు.

క్యాష్‌బ్యాక్ ఇలా..: ఎయిర్‌టెల్ కస్టమర్లు మోటరోలా, లెనొవొ స్మార్ట్‌ఫోన్లను మార్కెట్ ధరకే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. తర్వాత క్యాష్‌బ్యాక్ మొత్తం రూ.2,000.. 36 నెలల కాలంలో రెండు విడతల్లో యూజర్ ఎయిర్‌టెల్ వాలెట్‌లో జమవుతుంది. కస్టమర్లు తొలి విడత క్యాష్‌బ్యాక్ (రూ.500) పొందాలంటే ఫోన్ కొనుగోలు దగ్గరి నుంచి తొలి 18 నెలల కాలంలో రూ.3,500 విలువైన రీచార్జ్ చేసుకోవాలి. ఇక తర్వాతి 18 నెలల కాలంలో మళ్లీ రూ.3,500 విలువైన రీచార్జ్ చేయించుకోవాలి. అప్పుడు రెండో విడత క్యాష్‌బ్యాక్ (రూ.1,500) పొందొచ్చు.



అలాంటి ఆడిటింగ్ సంస్థలతో ముప్పు



న్యూఢిల్లీ: దేశంలో సేవలందిస్తున్న బహుళజాతి ఆడిటింగ్ సంస్థల నియంత్రణల విధానాలను పరిశీలించేందుకు ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీ ఏర్పాటును పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. సదరు అకౌంటింగ్ సంస్థల నియంత్రణ యంత్రాంగాన్ని పునఃసమీక్షించే విధానం లేకపోతే చార్టర్డ్ అకౌంటెన్సీ వృత్తిపై గణనీయమైన ప్రబావం పడుతుందని, అనియంత్రిత ఆడిటింగ్ సంస్థలతో ఆర్థికరంగం, దేశంపైనే తీవ్రమైన ప్రభావం పడుతుందని జస్టిస్ ఏకే గోయెల్, జస్టిస్ యు.యు.లలిత్‌తో కూడిన ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. ఎఫ్‌డీఐ, ఫెమా నిబంధనలను సమర్థవంతంగా అమలు చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించింది. సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ (సీపీఐఎల్) అనే ఎన్‌జీవోతోపాటు మరో సంస్థ దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన ధర్మాసనం ఈ మేరకు కేంద్రానికి సూచనలు చేసింది.

ఫలితాల లీక్‌పై దర్యాప్తు జరపండి!

వాట్సాప్ లీక్ విషయమై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు సెబీ ఆదేశాలు

న్యూఢిల్లీ: ఆర్థిక ఫలితాలు ముందుగానే వాట్సాప్ ద్వారా లీకైన విషయమై దర్యాప్తు చేయాల్సిందిగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను సెబీ ఆదేశించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆర్థిక ఫలితాలు అధికారికంగా వెల్లడి కాకుండానే వాట్సాప్ ద్వారా లీకయ్యాయని దీనికి ప్రాథమికంగా ఆధారాలు లభించాయని పేర్కొంది. సమాచారం ఇలా లీక్ కావడానికి కారకులైన వ్యక్తులను గుర్తించాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను సెబీ ఆదేశించింది. ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతం కాకుండా సంబంధిత వ్యవస్థలను పటిష్టం చేయాలని, తగిన నియంత్రణలు విధించాలని కూడా సూచించింది.

తొలి 5జీ ట్రయల్స్ సక్సెస్..

సంయుక్తంగా నిర్వహించిన ఎయిర్‌టెల్, హువావే



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజ కంపెనీ ఎయిర్‌టెల్, చైనాకు చెందిన నెట్‌వర్కింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్ ఉపకరణాల తయారీ సంస్థ హువావే తాజాగా భారత్‌లో తొలిసారి 5జీ నెట్‌వర్క్ ట్రయల్స్‌ను నిర్వహించాయి. ఇందులో 3 గిగాబైట్ పర్ సెకన్ (జీబీపీఎస్)కుపైగా డేటా స్పీడ్‌ను సాధించినట్లు ఇరు కంపెనీలు ప్రకటించాయి. గురుగావ్‌లోని మానేసర్ వద్ద ఉన్న ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ఈ ట్రయల్స్ జరిగాయి. '5జీ దిశగా మా ప్రయాణానికి తాజా ట్రయల్స్ చాలా కీలకమైనవి. మన జీవన విధానాన్ని మార్చేయగలిగే శక్తిసామర్థ్యాలు 5జీకి ఉన్నాయి. భారత్‌లో ఈ కొత్త టెక్నాలజీ ఏర్పాటుకు మా భాగస్వాములతో కలిసి పనిచేస్తాం' అని భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్స్ డైరెక్టర్ అభయ్ సావర్గాంకర్ తెలిపారు. తాము 5జీ టెక్నాలజీ అభివృద్ధికి, దాని ఉపయోగాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించామని హువావే వైర్‌లెస్ మార్కెటింగ్ డైరెక్టర్ ఎమ్మాన్యూల్ కోయెల్హో అల్వేస్ పేర్కొన్నారు.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,570	▲	15
బంగారం (99.5, 10గ్రా)	30,420	▲	15
వెండి (కిలో)	38,390	▲	75
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	29,120	▲	30
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,580	▲	40
బంగారం (22 క్యారెట్లు)	29,120	▲	30
వెండి (కిలో)	41,600	▲	200
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,350	▼	50
బంగారం (22 క్యారెట్లు)	29,070	▲	90
వెండి (కిలో)	39,700	▲	200
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,789	▲	55
బంగారం (22 క్యారెట్లు)	29,140	▲	50
వెండి (కిలో)	41,000		0
విజయవాడ (బుధవారం ధరలు)			
బంగారం (24 క్యారెట్లు)	31,500		
బంగారం (22 క్యారెట్లు)	29,150		
వెండి(కిలో)	39,500		
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,480	▲	30
బంగారం (22 క్యారెట్లు)	29,120	▲	30
వెండి (కిలో)	39,600	▲	150

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.00కు	గురువారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	63.57	$62.77
బ్రెంట్	66.86	$66.39

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 24-2-2018

విశాఖ	365-00
చిత్తూరు	388-00
వరంగల్	357-00
ముంబై	400-00
చెన్నై	395-00
విజయవాడ	363-00
గోదావరి	363-00
నమక్కల్	380-00
23-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	355-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	385-00
కోల్‌కతా	415-00
ఢిల్లీ	375-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	406.5	404
AMBUJA CEME	260.2	256.9
ASIAN PAINT	1101.8	1118.1
AXIS BANK L	536.65	530.25
BAJAJ AUTO	2986.4	2974.3
BAJAJ FINAN	1633.4	1600.35
BHARTI AIRT	425.55	416.1
BOSCH LIMIT	18920.6	18889.7
BHARAT PETR	429.9	427.45
CIPLA LTD	595.65	589.65
COAL INDIA	310.95	311.55
EICHER MOTO	26724.4	26868.5
GAIL (INDIA	458.4	466.15
HCL TECHNOL	955.6	941
HDFC LTD	1824.2	1819.25
HDFC BANK L	1880.55	1853.2
HERO MOTOCO	3494.7	3481.2
HINDALCO I	246.55	239.9
HIND.petrol	386.1	384.1
HIND.Unilever	1323.15	1326.45
INDIABULLS	1283.65	1267.4
ICICI BANK	322.75	318.35
INDUSIND BA	1643.5	1623.5
BHARTI INFR	340.4	333.85
INFOSYS LIM	1155.65	1160.75
INDIAN OIL	368.4	363.2
ITC LTD	269.05	267.1
KOTAK MAHIN	1080.85	1072.5
LARSEN & TO	1301.7	1292
LUPIN LIMIT	807.5	800.05
MAHINDRA &	718.65	721.95
MARUTI SUZU	8698.8	8634.05
NTPC LTD	163.55	160.75
OIL AND NAT	189.8	186.1
POWER GRID	193.25	190.25
RELIANCE IN	934.25	924.35
STATE BANK	276.05	272.6
SUN PHARMAC	569.65	541.45
TATA MOTORS	360.2	358.5
TATA STEEL	677.75	637.55
TATA CONSUL	3075.8	3050.2
TECH MAHIND	621.45	602.6
ULTRATECH C	4116.4	4099.9
UPL LIMITED	700.55	675.45
VEDANTA LIM	337.9	328.65
WIPRO LTD	295	292.65
YES BANK LI	323.45	316.1
ZEE ENTERTA	569.95	567.05

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

ABB INDIA L	1523.25	1516.25
ACC LIMITED	1651.45	1632.35
ASHOK LEYLA	134.4	132.35
BAJAJ FINSE	5019.65	4951.85
BANK OF BAR	145.55	143.4
BHARAT ELEC	150.95	146.55
BHEL	92.9	91.25
BRITANNIA I	4961.9	4855.85
CADILA HEAL	406.55	400.65
COLGATE PAL	1049.8	1042.15
CONTAINER C	1329.75	1332.7
CUMMINS IND	820.3	816.95
DABUR INDIA	330.6	327.1
DLF LIMITED	225.15	219.85
AVENUE SUPE	1300.25	1240.65
EMAMI LIMIT	1072.2	1059.75
GLAXOSMITHK	2404.7	2411.95
GLENMARK PH	534.3	523.55
GODREJ CONS	1048.2	1042.05
GLAXOSMITHK	6788.65	6764.95
HAVELLS IND	507.7	495.2
HIND.Zinc	328	314.15
ICICI PRU L	408.5	400.8
IDEA CELLUL	82.15	81.2
INTERGLOBE	1285	1275.45
JSW STEEL L	306.95	297.7
LIC HOUSING	517.65	506.6
MARICO LIMI	306.65	302.9
UNITED SPIR	3238.85	3157.3
MOTHERSON S	318.9	310.65
MRF LTD	72473.4	70107.8
NHPC LTD	27.6	26.6
NMDC LTD.	130.15	126.65
ORACLE FIN	4032.3	4090.6
OIL INDIA L	344.5	340.25
PIRAMAL ENT	2623.9	2590.1
PETRONET LN	243.55	240.7
POWER FIN C	107.8	104.65
P&G HYGIENE	9355.05	9407.65
PIDILITE IN	900.7	885.5
PUNJAB NATI	113.45	114.6
RURAL ELEC	140.3	136.65
STEEL AUTHO	87.05	83.9
SHREE CEMEN	17219.5	16729.55
SIEMENS LTD	1172.1	1193.2
SHRIRAM TRA	1322.85	1298.45
SUN TV NETW	928.55	908.3
TATA POWER	85.75	84.9
TITAN COMPA	814.2	817.5
TORRENT PHA	1336.55	1322.2

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8.2	8
Alphageo	813	808.4
Alu Flouride	111.5	108.35
Amar Raja Bat	814.45	797.05
And Bank	46.25	45.55
And Cemen	11	10.92
And Paper	319	311.05
And Petro	58.8	56.95
Anjani Portl	191.5	191.8
Aries Agro Ltd	210.7	203.4
Aurobindo Ph	601.85	587.15
Avantel Soft	520	523.35

A B C D

20 MICRONS	51.85	50.25
3M INDIA LI	20733.8	20725.25
5PAISA CAPI	370.6	368.1
63 MOONS TE	94.05	93.85
8K MILES SO	753.45	758.7
AARTI DRUGS	613.15	607
AARTI INDUS	1170.4	1155.1
AARVI ENCON	98	96.95
ABAN OFFSHO	173	168.3
ABBOTT INDI	5811.3	5754.4
BAYER CROPS	3831.75	3827.7
BEARDSELL L	54.75	56.15
BEML LIMITE	1232.5	1194.2
BERGER PAIN	245.85	240.6
BETA DRUGS	152	154.6
BF INVESTME	328.9	318.3
BF UTILITIE	448.9	440.95
BGR ENERGY	118.9	118.25
BHAGERIA IN	295.95	284.5
BHANSALI EN	168.6	160.6
BHARAT BIJL	1442.25	1422.3
BHARAT FIN	1000.2	977.5
BHARAT FORG	750	756.2
BHARAT GEAR	194.8	192.15
DILIP BUILD	962.2	958.85
DISH TV IND	74.25	74.35
DISHMAN CAR	329.35	331.25
DIXON TECHN	3285.45	3265.9
DOLLAR INDU	420.3	417.1
DOLPHIN OFF	92.15	88.95
DONEAR IND.	62.7	61.45
DR. LAL PAT	905.6	905.85
DYNAMATIC T	1947.65	1623.05
DYNEMIC PRO	201.95	199

E F G H

GUJARAT ALK	748.55	737.05
GUJARAT AMB	243.55	232.25
GUJARAT FLU	777.1	749.45
GUJARAT GAS	855.1	860.1
GUJARAT MIN	141.35	138.55
GUJARAT PIP	142.25	141.9
GUJARAT STA	199.25	199.95
GULF OIL LU	985.5	985
GULSHAN POL	79.95	78.05
HARITA SEAT	954.1	933.7
HARRISON MA	83.15	82
HATSUN AGRO	775.45	768.95
HCL INFOSYS	63.9	62.25
HDFC STAND	468.85	450.8

I J K L

JBM AUTO LI	440.85	431.6
JET AIRWAYS	745.45	733.9
JET FREIGHT	100	100
JET KNITWEA	115.5	105
JHS SVEND.	67.85	66.9
JIND POL IN	62.75	64.2
JINDAL DRIL	170.55	157.8
JINDAL PHOT	65	64
JINDAL POLY	357.2	330.6
JINDAL SAW	138.7	134.25
JINDAL STAI	101.95	100.4
JINDAL STAI	183.05	178.95
JINDAL STEE	265	250.25
JINDAL WORL	620.35	620.75

M N O P

MAN INFRA L	56.4	55.75
MANAKSIA LT	55.25	53.6
MANAPPURAM	108.25	105.45
MANG.CHEM.F	68.15	67.25
MANGALAM CE	331.9	331.45
MANGALAM DR	162.35	160.2
MANPASAND B	387.9	378.8
MARATHON NX	486.25	467.65
MAS FINANCI	601	600.8
MASTEK LTD	503.3	493.9
MATRIMONY.C	847.65	852.3
MAWANA SUGA	62	60.6
MAX FINANCI	498	494.95
MAX INDIA L	95.7	95.9
PG ELECTROP	310.2	322.65
PHILIPS CAR	1190.15	1182.85
PI INDUSTRI	837.55	841.05
PIONEER DIS	185.55	180.25
PLASTIBLEND	191.4	197
PNB HOUSING	1215.4	1206.35
PNC INFRATE	166.6	163.8
PODDAR HOUS	1150	1170
PODDAR PIGM	282.05	282.7
POKARNA LIM	206.45	207.05
POLY MEDICU	254.35	243.45
POLYPLEX CO	493.7	479.8
PONNIE SUGA	168.5	165.8
POWER MECH	931.1	917.55

R S T U

SHANKARA BL	1704.6	1698.05
SHANTHI GEA	143.75	139.85
SHARDA CROP	395.85	387.3
SHARDA MOTO	2258.4	2269.7
SHEELA FOAM	1600.05	1596.15
SHEMAROO EN	524.45	516.2
SHILPA MEDI	450.35	443.05
SHIPPING CO	73.1	72.8
SHIRPUR GOL	153.4	152.1
SHIVA TEXYA	551.95	530.05
SHIVAM AUTO	79.2	76.85
SHOPPERS ST	527.9	522.05
SHRE PUSH C	231.2	223.95
SHRENIK LIM	573.05	571.6
THE MANDHAN	136.05	130.75
THE NEW IND	705	704.7
THE PHOENIX	569.05	566.25
THE RAMCO C	718.3	714.1
THE RUBY MI	330.6	330.75
THE STATE T	152.35	150.55
THE TINPLAT	234.55	228.4
THEMIS MEDI	539	539.15
THERMAX LTD	1153.5	1152.65
THIRUMALAI	2027.6	1968.6
THOMAS COOK	236.3	231.85
THYROCARE T	622.6	620.35
TI FINANCIA	674.3	664.8
TIDE WATER	6524.8	6453.95

V W X Z

26న కరీంనగర్‌లో రైతు సదస్సు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఈ నెల 26న కరీంనగర్‌లో ప్రాంతీయ రైతు సమన్వయ సమితి సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.శుక్రవారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే సదస్సు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'పెట్టుబడి'సాయం పథకం దేశానికే ఆదర్శమన్నారు. రైతుల భవిష్యత్ మార్చడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన విధానమే ఈ రైతు సమన్వయ సమితులని పేర్కొన్నారు. వ్యవసాయం అంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చేయాలని వలసలు తిరిగి వచ్చే విధంగా పంట వేసిన దగ్గర నుంచి అమ్మే వరకు అండగా ఉంటామ అన్నారు.

యాదాద్రి పనుల్లో మార్పులు చేయాలి

అధికారులకు సూచనలు చేసిన చిన జీయర్‌స్వామి


యాదాద్రిలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చినజీయర్ స్వామి

యాదగిరికొండ: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రధానాలయంలో జరుగు తున్న పనుల్లో కొన్ని లోపాలు ఉన్నాయని చినజీయర్‌స్వామి తెలిపారు. శుక్రవారం దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. గర్భాలాయనికి ఎదురుగా నిర్మిస్తున్న మెట్ల మార్గాన్ని తీసివేయాలని ఆయన సూచించారు. స్వయంభూ మూర్తులకు అవి చాలా ఎత్తులో ఉన్నట్లు పేర్కొన్నారు. వాటిని కొద్దిగా పక్కకు జరిపి నిర్మించాలని సూచించారు. ఓంకారం పిల్లర్లను కూడా ఆయన పరిశీలించారు. ఈ పిల్లర్లపై ఎక్కడ రాయితో తాకినా అక్కడ ఓంకార శబ్దం ధ్వనిస్తుందని స్తపతి సుందర్‌రాజన్, జీయర్ స్వామికి తెలిపారు.

యాదగిరీశుడి సన్నిధిలో మరో బస్ డిపో


మహేందర్ రెడ్డి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రవాణా సదుపాయాలు మరింత మెరుగు పరిచేందుకు యాదగిరిగుట్ట పట్టణంలో 15 ఎకరాల స్థలంలో మరో బస్ డిపోను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ గొంగిడి సునితా మహేందర్‌రెడ్డితో కలసి శుక్రవారం ఆయన ఆర్టీసీ డిపో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో 1,300 వరకు బస్సు సౌకర్యం లేని గ్రామాలు ఉంటే అందులో 400 గ్రామాలకు బస్సులను నడిపిస్తున్నామని, ఇంకా 900 గ్రామాలకు బస్సులు నడిపే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. నష్టాల్లో ఉన్న డిపోలను లాభాల బాటలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. భువనగిరి ఆర్డీఓ భూపాల్‌రెడ్డి, డిపో మేనేజర్ రఘు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భద్రకాళి సన్నిధిలో అమ్రపాలి దంపతులు


ఆలయంలో అమ్రపాలి దంపతుల పూజలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ అమ్రపాలి, సమీర్‌శర్మ దంపతులు శుక్రవారం వరంగల్‌లోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవాలయాన్ని సందర్శించారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్రపాలి కుటుంబ సభ్యులను ఆలయ ఈఓ రాముల సునీత, ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, అర్చకులు వేదస్వస్తి ఘనంగా స్వాగతించారు. మహాదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలు బహూకరించారు. మరోవైపు కలెక్టర్ వివాహ రిసెప్షన్ సాయంత్రం ఘనంగా జరిగింది. ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు, ఉద్యోగులు తదితరులు కలెక్టర్ వివాహ శుభాకాంక్షలు తెలిపారు.


శుక్రవారం రాత్రి యాదాద్రిలో ఎదుర్కోలు మహోత్సవం

నేడు యాదగిరీశుడి కల్యాణం

కనుల పండువగా ఎదుర్కోలు మహోత్సవం

సాక్షి, యాదాద్రి/యాదగిరికొండ: యాదాద్రి లక్ష్మీనారసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం 11 గంటలకు బాలాలయంలో స్వామి, అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం జరుగుతుంది. అంతకుముందు శ్రీరాముని అలంకరణలో హనుమంత సేవ నిర్వహించి 11గంటలకు గజవాహన సేవతో బాలాలయంలోకి పెళ్లి కుమారుడు, పెళ్లి కూతురును తీసుకుని వస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యే రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తారు. అలాగే రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, కలెక్టర్ అనితారామచంద్రన్ కల్యాణానికి హాజరు కానున్నారు. కల్యాణోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థాన ఈఓ గీతారెడ్డి తెలిపారు.

కనుల పండువగా ఎదుర్కోలు ఉత్సవం

శుక్రవారం రాత్రి ఎదుర్కోలు మహోత్సవం కనుల పండువగా సాగింది. స్వామి, అమ్మ వార్లను పెళ్లి కూతురు, పెళ్లి కుమారుడిగా అలం కారం చేసి వాద సంవాదాలను మనోహరంగా సాగించారు. ఉదయం స్వామి వారు జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం చైర్మన్ నరసింహమూర్తి, ఈఓ గీతారెడ్డి, ఆలయ స్థానాచార్యులు రాఘవాచార్యులు, ప్రధానార్చకులు నల్లందీగళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపూడి నరసింహాచార్యులు పాల్గొన్నారు.

అమ్మకానికి ఆధునిక మగ్గాలు!

తిరోగమనంలో 'టెక్స్‌టైల్' పరిశ్రమలు

సిరిసిల్ల నుంచి తరలిపోతున్న యూనిట్లు
నిర్మాణాలు బ్రేక్.. ఉన్నవాటికి షాక్
కొత్త యూనిట్లకు తగ్గిన 'టఫ్' రాయితీ

సిరిసిల్ల : రాష్ట్రంలోని తొలి టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమలు తిరోగమిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వస్తున్నాయని ప్రభుత్వం ప్రకటిస్తుండగా.. సిరిసిల్ల టెక్స్‌టైల్‌లోని పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. మౌలిక వసతుల లేమి.. విద్యుత్ చార్జీల భారంతో యజమానులు ఆధునిక మగ్గాలు విక్రయిస్తున్నారు. మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో టెక్స్‌టైల్ రంగం కుదేలవుతోంది.

పుష్కర కాలంగా కష్టాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులో 65 ఎకరాల్లో 2003లో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేశారు. 7 వేల మంది కార్మికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో 237 ప్లాట్లు కేటాయించారు. ఇందులో 210 ప్లాట్లను పరిశ్రమలు, 27 ప్లాట్లను వాణిజ్య దుకాణాలకు కేటాయించారు. 2006లో పరిశ్రమలు వస్త్రోత్పత్తిని ప్రారంభించాయి. ప్రస్తుతం 113 యూనిట్లలో (1,695 మగ్గాలు) వస్త్రోత్పత్తి సాగుతోంది. ప్రస్తుతం రెండు వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. 14 యూనిట్లు నిర్మాణంలో ఉండగా.. 110 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ప్లాట్లు పొంది ఆధునిక మగ్గాలను ఏర్పాటు చేయని పారిశ్రామిక వేత్తలకు జౌళిశాఖ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ స్కీం ఫండ్ (టఫ్) రాయితీని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించింది. ఈ రాయితీ పొందితే రాష్ట్రం ఇచ్చే రాయితీని తీసుకోరాదనే నిబంధనలు కొత్తగా అమలులోకి వచ్చాయి. తద్వారా ఏదో ఒక రాయితీనే తీసుకోవాల్సి వస్తోంది. దీంతో కొత్తగా పరిశ్రమలు స్థాపించే వారికి పెట్టుబడి రాయితీ రావడం లేదు.

తక్కువ ధరకే మగ్గాల విక్రయాలు

ఇక్కడి ర్యాపియర్ లూమ్స్‌ను తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన వస్త్ర వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఆధునిక మగ్గం ధర మార్కెట్‌లో రూ.3.75 లక్షలు ఉండగా సిరిసిల్లలో మగ్గాన్ని రూ.1.15 లక్షల నుంచి రూ.1.70 లక్షల వరకు కండిషన్‌ను బట్టి వారు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే 20 మంది వస్త్ర వ్యాపారులు తమ మగ్గాలను తక్కువ ధరకే అమ్మేసుకున్నారు. మధ్య తరగతి పారిశ్రామికవేత్తలు పరిశ్రమలను స్థాపించి ఆర్థికంగా చితికిపోయారు. బ్యాంకు అప్పులు కట్టలేక ఇప్పటికే మూడు యూనిట్లను వేలం వేశారు. మరో 25 పరిశ్రమలను వేలం వేసేందుకు బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఓ పరిశ్రమ యజమాని బ్యాంకువారి వేధింపులతో ఆత్మహత్యకు యత్నించాడు. ఆధునిక మగ్గాలు అమ్ముడుపోతుండగా.. కొత్తగా యూనిట్లు నిర్మాణం కాకపోవడంతో టెక్స్‌టైల్ పార్కు ప్రగతి తిరోగమిస్తోంది.


టెక్స్‌టైల్ పార్క్‌లో క్రేన్‌సాయంతో తరలిస్తున్న ఆధునిక ర్యాపియర్ లూమ్స్

భారంగా మారిన విద్యుత్ చార్జీలు

మరమగ్గాలకు విద్యుత్ చార్జీల్లో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ చెల్లిస్తోంది. అదే టెక్స్‌టైల్ పార్కులో వస్త్రోత్పత్తికి విద్యుత్ రాయితీ లేదు. 2014 డిసెంబర్ నాటికి 50 శాతం విద్యుత్ రాయితీని ప్రభుత్వం అందించింది. ఇప్పుడు పూర్తి స్థాయిలో యజమానులే బిల్లులు చెల్లిస్తున్నారు. పార్కులో విద్యుత్ యూనిట్ రేటు రూ.6.70 ఉంది. తమిళనాడులో 500 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తుండగా, అంతకు మించి వినియోగిస్తే.. ప్రతీ యూనిట్‌కు రూ.2.50 ఉంది. మహారాష్ట్రలో యూనిట్‌కు రూ.2.90 ఉంది. కర్నాటకలో యూనిట్ విద్యుత్ రేటు రూ.2.50 ఉంది.

ప్రభుత్వమే ఆదుకోవాలి



మేం 26 మందిమి. అన్నీ అమ్ముకుని పార్కులో పెట్టు బడులు పెట్టి యూనిట్లు పెట్టినం. కానీ మూడేళ్ల ఆలస్యంగా రాయితీలు రావడంతో బ్యాంకు రుణాలపై వడ్డీలు పెరిగిపోయాయి. మంత్రి కేటీఆర్ మాకు వడ్డీ రాయితీ కల్పించి ఆదుకోవాలి. ఇప్పటికే మంత్రిని కలసి సమస్యలను వివరించాం.

మేర్గు పర్శరాములు, చిన్న పరిశ్రమల యజమాని

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



టెక్స్‌టైల్ పార్కులో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. తమిళనాడు, మహారాష్ట్రల్లో పరిశ్రమలకు విద్యుత్ రాయితీ ఇస్తున్నారు. ఆ విధానాలను అమలు చేస్తే సిరిసిల్లలో టెక్స్‌టైల్ పార్కు మనుగడ ఉంటుంది.

అన్నల్‌దాస్ అనిల్, పరిశ్రమ యజమాని

ఫారం - సి
(ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016లోని చాప్టర్ ||| ఏ లోని 10ఎ అనుసరించి)
(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము, రోడ్డు, రవాణా మరియు భవనాల శాఖ (ఆర్.||) గారి ఉత్తర్వు నెంబర్ 4 తేది 27.01.2018 చూడుము)

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. జి/458/2016 — తేది. 22.02.2018
ఫైల్ నెం. బి/5620/2016 — తేది : .02.2018
గెజిట్ నెం. 33/2018 — తేది. 22.02.2018

తెలంగాణ ప్రభుత్వము / జిల్లా కలెక్టర్, యాదాద్రి - భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, రుద్రవెల్లి గ్రామములో విస్తీర్ణం ఎ।। 3.03 3/4 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్ధం మూసి నదిపై అనగా కిలో మీటర్ 7/4-6 వద్ద హై లెవెల్ బ్రిడ్జ్ నిర్మాణము కోసం దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ఇట్టి భూసేకరణ గూర్చి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము, రోడ్డు, రవాణా మరియు భవనాల శాఖ (ఆర్.II) నెంబర్ 4 తేది.27.01.2018 ఉత్తర్వుల ప్రకారం భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం, (తెలంగాణ సవరణ) చట్టం 2016 (నెం.21/2017)లోని సెక్షన్ 10ఏ (ఇ) ప్రకారము చాప్టర్ III ఏ ప్రకారము ఈ ప్రాజెక్టు జరుపు భూసేకరణకు చాప్టర్ II లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక, చాప్టర్ IIIలోని ఆహార భద్రత పరిరక్షణ వంటి అంశములను మినాహాయించనైనది.

కావున ఈ ప్రాజెక్టు క్రింద యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం, రుద్రవెల్లి గ్రామములో విస్తీర్ణం ఎ 0.30 1/2 గుంటల భూమి యొక్క వివరములు ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రకటన జారీచేయనైనది.

షెడ్యూల్

గ్రామము : రుద్రవెల్లి — మండలము : బీబీనగర్ — జిల్లా: యాదాద్రి భువనగిరి

క్ర. సం.	సర్వే నెంబర్	యాజమాన్య రకము	భూమి రకము	సేకరించు విస్తీర్ణం	పట్టాదారు పేరు	అనుభవదారుపేరు	భూమిపై ఉన్న చెట్లు/పైపులు/ డ్రిప్పులు/బావి/ బోరు/ఇతరములు
1	2	3	4	5	6	8	10
1	84	పట్టా	తరి	0.05	వడ్ల నారాయణ	వడ్ల నారాయణ	
2	84	పట్టా	తరి	0.05 1/4	వడ్ల బ్రహ్మయ్య	వడ్ల సుగ్రీవ చారి	
3	85	పట్టా	తరి	0.03 1/2	పోలరాజు యాదయ్య	పోలరాజు యాదయ్య	
4	86	పట్టా	తరి	0.11	మడిపడిగ అనిత భర్త సత్తయ్య	మడిపడిగ అనిత భర్త సత్తయ్య	
5	86	పట్టా	తరి	0.08 3/4	జిల్కాపల్లి నర్సింహ్మా తండ్రి బాలయ్య	జిల్కాపల్లి నర్సింహ్మా తండ్రి బాలయ్య	
6	86	పట్టా	తరి	0.03 1/2	జిల్కాపల్లి స్వామి తండ్రి సత్తయ్య	జిల్లాపల్లి స్వామి తండ్రి సత్తయ్య	
7	86	పట్టా	తరి	0.06 1/2	చిన్న యాదయ్య తండ్రి సత్తయ్య	చిన్న యాదయ్య తండ్రి సత్తయ్య	
8	86	పట్టా	తరి	0.02 1/4	నర్సింహా తండ్రి సత్తయ్య	నర్సింహా తండ్రి సత్తయ్య	
9	209	పట్టా	తరి	0.06	గండు వీరస్వామి తండ్రి అచ్చయ్య	గండు వీరస్వామి తండ్రి అచ్చయ్య	
10	210	చౌతా ఇనాం	తరి	0.07 1/2	జిల్కాపల్లి యాదయ్య తండ్రి మల్లయ్య	జిల్కాపల్లి యాదయ్య తండ్రి మల్లయ్య	
11	210	చౌతా ఇనాం	తరి	0.03 1/4	జిల్కాపల్లి నర్సింహా తండ్రి మల్లయ్య	జిల్కాపల్లి నర్సింహా తండ్రి మల్లయ్య	
12	210	చౌతా ఇనాం	తరి	0.01	జిల్కాపల్లి భాగయ్య తండ్రి సత్తయ్య	జిల్కాపల్లి స్వామి	
13	210	చౌతా ఇనాం	తరి	0.03 1/4	జిల్కాపల్లి చిన్న యాదయ్య తండ్రి సత్తయ్య	జిల్కాపల్లి చిన్న యాదయ్య తండ్రి సత్తయ్య	
14	212	మాఫీ ఇనాం	తరి	0.01	నిరుడు చంద్రమ్మ భర్త ఎల్లయ్య	నిరుడు చంద్రమ్మ భర్త ఎల్లయ్య	
15	212	మాఫీ ఇనాం	తరి	0.01	నిరుడు భిక్షపతి తండ్రి రామయ్య	నిరుడు భిక్షపతి తండ్రి రామయ్య	
16	213	మాఫీ ఇనాం	తరి	0.04 1/4	మన్నే యెల్లయ్య తండ్రి నర్సయ్య	మన్నే మహేందర్ తండ్రి నర్సింహ్మా	
17	213	మాఫీ ఇనాం	తరి	0.04	మన్నే నర్సింహ్మా	మన్నే నర్సింహ్మా	
18	214	మాఫీ ఇనాం	తరి	0.01	కొమ్ము నర్సింహ్మా తండ్రి బాలయ్య	కొమ్ము నర్సింహా	
19	214	మాఫీ ఇనాం	తరి	0.01		కొమ్ము పోచయ్య	
20	214	మాఫీ ఇనాం	తరి	0.01		కొమ్ము వెంకయ్య	
21	214	మాఫీ ఇనాం	తరి	0.01		కొమ్ము బక్కయ్య	
22	214	మాఫీ ఇనాం	తరి	0.01		కొమ్ము లక్ష్మయ్య	
23	214	మాఫీ ఇనాం	తరి	0.00 1/2	కొమ్ము మైసయ్య	కొమ్ము మైసయ్య	
24	215	పట్టా	తరి	0.38	పాండు లింగయ్య తండ్రి రాజయ్య	జీనగ నర్సింహా, జీనగ నాగరాజు తండ్రి ముత్తయ్య, మన్నే మహేందర్	
25	216	పట్టా	తరి	0.03 1/4	మన్నే నర్సింహా తండ్రి రాజయ్య	మన్నే నర్సింహా తండ్రి రాజయ్య	
				3.03 3/4			

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనలను అనుసరించి సంబదిత వ్యక్తులు అందరికి తెలియజేయుటకు గాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాను ఏదైన పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు రాజస్వ మండలాధికారి, భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు రాజస్వ మండలాధికారి, భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేది నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు / తాకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేది నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టర్/అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయయచ్చును.

సం/- భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి, భువనగిరి
సం/- జాయింట్ కలెక్టర్ యాదాద్రి - భువనగిరి జిల్లా
సం/- జిల్లా కలెక్టర్ యాదాద్రి - భువనగిరి

రోడ్డెక్కిన పసుపు రైతులు

జగిత్యాలలో భారీ ర్యాలీ

మద్దతు ధర కల్పించాలని డిమాండ్

జగిత్యాల అగ్రికల్చర్: పసుపు పంటకు తగిన మద్దతు ధర కల్పించాలంటూ జగిత్యాలలో రైతులు ఆందోళనకు దిగారు. క్వింటాలుకు రూ.15 వేల మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో దాదాపు 2 వేల మంది రైతులు పాల్గొన్నారు. జగిత్యాలలోని మినీ స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు రోడ్డుపై బైఠాయించారు. కలెక్టర్ వచ్చి వినతి పత్రం స్వీకరించాలని పట్టుబట్టారు. అయితే కలెక్టర్ అందుబాటులో లేరని పోలీసులు ఎంత నచ్చజెప్పినా వారు శాంతించలేదు. అప్పటికే రెండు గంటల నుంచి ఆందోళన చేస్తున్న రైతులను అధికారులు పట్టించుకోకపోవడంతో, వారు కలెక్టర్ కార్యాలయంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. ఓ రైతు కలెక్టర్ కార్యాలయం గేటుకే ఉరి వేసుకునేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంత సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొద్ది సేపటి తర్వాత జేసీ వచ్చి వినతిపత్రం స్వీకరించారు. పసుపు రైతు సంఘం నేతలు మాట్లాడుతూ, పంటకు ఎకరాకు రూ.90 వేల నుంచి లక్ష వరకు ఖర్చు చేస్తే, కేవలం క్వింటాల్‌కు రూ. 4-5 వేల ధర మాత్రమే లభిస్తోందని చెప్పారు. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని చెప్పారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా తగిన గిట్టుబాటు ధర ఇచ్చి కొనాలని వారు డిమాండ్ చేశారు.


శుక్రవారం జగిత్యాలలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

పాలమూరులో పల్లి రైతు కన్నెర్ర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పల్లికి కనీస మద్దతు ధర చెల్లించడం లేదంటూ రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం మహబూబ్‌నగర్ మార్కెట్‌కు రికార్డు స్థాయిలో 29,819 బస్తాల పల్లి వచ్చింది. దీంతో ట్రేడింగ్ ఆలస్యం కాగా.. ధర కూడా సరిగ్గా ఇవ్వడం లేదంటూ రైతులు అసహనానికి గురయ్యారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.4,459 కాగా.. చాలావరకు రూ. 2వేల వరకే ధర పలికిందని ఆరోపిస్తూ ఒక్కసారిగా మార్కెట్‌యార్డు కార్యాలయంలోకి దూసుకువెళ్లి బీరువాలు, ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. అయినా శాంతించక కార్యాలయం ఎదుట బైఠాయించారు. తర్వాత మార్కెట్ చైర్మన్ చెరుకుపల్లి రాజేశ్వర్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ప్రభాకర్ నచ్చచెప్పడంతో రైతులు శాంతించారు.

ఈ తండ్రి నాకొద్దు!

- పోలీసులను ఆశ్రయించిన బాలుడు
- తాగి నిత్యం నరకం చూపిస్తున్నాడు
- డబ్బులు తీశావంటూ చిత్రహింసలు


శశికుమార్


శ్రీనివాస్

జమ్మికుంట: కొడుకును కంటికి రెప్పలా చూసుకోవాల్సిన తండ్రి కర్కశత్వంగా మారాడు. తాగుడుకు బానిసై.. విచక్షణ కోల్పోయి శరీరం కమిలిపోయేలా చిత్రహింసలకు గురిచేశాడు. తండ్రి అనే మమకారం లేకుండా పసి హృదయాన్ని గాయపరిచాడు. తండ్రి బాధలు భరించలేక 11 ఏళ్ల బాలుడు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. 'ఈ తండ్రి నాకొద్దు.. జైల్లో పెట్టండి'అని ఫిర్యాదు చేశాడు. జమ్మికుంట నగర పంచాయతీ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన మొలుగూరు శ్రీనివాస్ తాగుడుకు బానిసగా మారాడు. మేస్త్రీ పని చేస్తూ చేతికి వచ్చిన డబ్బులతో తాగుడుకు ఖర్చు చేస్తున్నాడు. ఇంటికి వచ్చిన తర్వాత భార్య, కుమారుడిపై తన ప్రతాపం చూపిస్తున్నాడు. గురువారం సాయంత్రం కుమారుడు శశికుమార్ పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి వచ్చాడు. అప్పటికే నిషాలో ఉన్న తండ్రి.. కొడుకును చూసి కోపంతో ఊగిపోయాడు. ఇంట్లో ఉన్న రూ.3 వేలు తీశావా అంటూ కర్రకు కారం రాసి చితక్కొట్టాడు. దీంతో బాలుడి ఒళ్లంతా తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం జమ్మికుంట పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. మా నాన్నతో ఎప్పటికైనా అమ్మకు, తనకు ప్రాణహాని ఉందని వాపోయాడు. పోలీసులు బాలుడి ఒంటిపై ఉన్న గాయాలను చూసి చలించిపోయారు. ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. తాను కస్తూర్బా పాఠశాలలో చదువుకుంటానని శశికుమార్ చెప్పాడు. కాగా, శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు సీఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కిన సీఐ

సదాశివనగర్: ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ఓ పోలీసు అధికారే ఫుల్లుగా మద్యం సేవించి దొరికిపోయాడు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి సీఐ ధరావత్ కృష్ణ మద్యం సేవించి గురువారం రాత్రి నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు కారులో వెళ్తున్నారు. సదాశివనగర్ ప్రాంతంలో హైవేపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు.. ఆయన వాహనాన్ని ఆపి వివరాలు అడిగారు. అయితే మత్తులో ఉన్న సీఐ దురుసుగా మాట్లాడటంతో కారుతో సహా స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించినట్లు తేలడంతో కేసు నమోదు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో సీఐ పట్టుబడిన విషయం నిజమేనని ఎస్పీ శ్వేత ధ్రువీకరించారు.

కేయూలో విద్యార్థుల ఘర్షణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాల విషయమై విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతల మధ్య శుక్రవారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థి నేతలకు గాయాలవడంతో ఉద్రిక్తత నెలకొంది. పీహెచ్‌డీ ప్రవేశాల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థి సంఘాలు కొద్దిరోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో తరగతుల బహిష్కరణకు ఉపక్రమించారు. తరగతి గదుల నుంచి బయటకు పంపిస్తుండగా పలువురు విద్యార్థులు అభ్యంతరం తెలిపారు. దీంతో వారి మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో కొందరు ఇంజనీరింగ్ విద్యార్థులు దాడి చేయగా టీఆర్‌ఎస్‌వీ నేత లంకరాజ గోపాల్, పీడీఎస్‌యూ నేత రాజుకు గాయాలయ్యాయి. ప్రిన్సిపాల్ మల్లారెడ్డి కొట్టించాడంటూ విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కిటికీల అద్దాలు, మొక్కల కుండీలను ధ్వంసం చేశారు.

కాళేశ్వరం..తెలంగాణకు కలికితురాయి

మండలి చైర్మన్ స్వామిగౌడ్

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్సీల బృందం


మాట్లాడుతున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్, చిత్రంలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు

భూపాలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రానికి కలికితురాయిగా నిలుస్తోందని శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. స్వామిగౌడ్ ఆధ్వర్యంలో 22 మంది ఎమ్మెల్సీలు శుక్రవారం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులు, ప్రాజెక్టు నిర్మాణ వివరాలను ఇంజనీర్లు వివరించారు. అనంతరం స్వామిగౌడ్ విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం తరహా ప్రాజెక్టు దేశంలో ఎక్కడా లేదన్నారు. చైనాలో మాత్రమే ఒకటి, రెండు ప్రాజెక్టులు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాదిరిగా సంకల్పం ఉన్నవారు మాత్రమే ఇలాంటి పనులు చేస్తారని కితాబిచ్చారు. భగీరథుడిని సైతం కిందికి దించే యత్నం తెలంగాణ సర్కారు చేస్తోందని ప్రశంసించారు. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇలాంటి పనులు చేయలేదన్నారు. నాలుగేళ్లలోనే రివర్స్ పంపింగ్ ద్వారా గోదావరి నీటిని వాపస్ తీసుకొని రావాలని చూడటం సంతోషకరమని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు పూర్తయితే మత్స్యకారులకు ఉపాధి, పర్యాటక రంగంగా మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే రాష్ట్రంలో చీకట్లు అలుముకుంటాయని కొందరు అన్నారని, ప్రస్తుత ప్రభుత్వం వారి మాటలను పటాపంచలు చేసిందన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీల బృందం, డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ, మంథని ఎమ్మెల్యే పుట్ట మధు ఉన్నారు.

అయ్యా.. మాకు ఉపాధి కల్పించండి

ముఖ్యమంత్రికి విద్యార్థుల ఉత్తరాలు



హన్మకొండ చౌరస్తా: ''అయ్యా.. మేము తెలంగాణ బిడ్డలం.. డిగ్రీలు చదివి ఖాళీగా ఉంటున్నాం.. ఖాళీలను భర్తీ చేసి ఉపాధి కల్పించాలని కోరుతున్నాం''.. అంటూ విద్యార్థులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉత్తరాలు రాశారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జేఏసీ వరంగల్ అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం హన్మకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి హెడ్ పోస్టాఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉత్తరాలను పోస్టు బాక్సులో వేశారు. కార్యక్రమంలో సుమారు 100 మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి స్పోర్ట్స్
శనివారం 24-2-2018

కేప్‌టౌన్‌లో మొదలైన భారత జట్టు సఫారీ ఆఖరి మజిలీగా మళ్లీ కేప్‌టౌన్‌ చేరింది. వరుసగా రెండు పరాజయాల తర్వాత ఒక అద్భుత విజయంతో టెస్టు సిరీస్‌కు ముగింపు... ఆ గెలుపు ఇచ్చిన ఉత్సాహంతో ఏకపక్షంగా వన్డే సిరీస్‌ సొంతం... పొట్టి ఫార్మాట్‌లో రెండు మ్యాచ్‌లలో సమం సమం... ఇక దక్షిణాఫ్రికా పర్యటనను సంతృప్తికరంగా ముగించి స్వదేశం తిరిగి వెళ్లేందుకు భారత్‌ ముందు ఆఖరి అవకాశం. మరొక్క మ్యాచ్‌లో మన ఆటగాళ్లు స్థాయికి తగ్గట్లుగా ఆడితే ఈ 51 రోజుల టూర్‌ ఎప్పటికీ చిరస్మరణీయంగా మారిపోతుంది. మరోవైపు దక్షిణాఫ్రికా వన్డేల్లో పోయిన పరువును ఇక్కడైనా కాపాడుకునే ప్రయత్నంలో సిరీస్‌ గెలుచుకోవాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో నేడు చివరి టి20లో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది.

‘ఫినిష్‌’ చేసేదెవరు?

నేడు చివరి టి20 మ్యాచ్‌ ● అమీతుమీకి సిద్ధమైన భారత్‌, దక్షిణాఫ్రికా ● గెలిస్తే సిరీస్‌ సొంతం ● పర్యటనలో ఆఖరి పోరు


కోహ్లి

కేప్‌టౌన్‌: దక్షిణాఫ్రికా జట్టు ఆఖరి సారిగా 2015లో భారత్‌లో పర్యటించినప్పుడు టెస్టు సిరీస్‌లో చిత్తుగా ఓడినా... వన్డే, టి20 సిరీస్‌లు రెండింటిని సొంతం చేసుకుంది. ఇప్పుడు సరిగ్గా అదే తరహాలో బదులివ్వాలంటే టీమిండియా టి20 సిరీస్‌ కూడా గెలుచుకోవాల్సి ఉంది. ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో నేడు న్యూలాండ్స్‌ మైదానంలో ఆఖరి టి20 మ్యాచ్‌ జరగనుంది. గత మ్యాచ్‌లో అనూహ్య విజయంతో సఫారీ టీమ్‌లో ఆత్మవిశ్వాసం పెరగగా... ఆ మ్యాచ్‌లో దొర్లిన తప్పులను దిద్దుకొని సత్తా చాటాలని కోహ్లి సేన పట్టుదలగా ఉంది.

రాత్రి గం. 9.30 నుంచి సోనీ టెన్‌-1, 3లలో ప్రత్యక్ష ప్రసారం

కుల్దీప్‌కు చోటు!

చాలా కాలంగా పరిమిత ఓవర్లలో చుక్కానిలా ఉన్న భారత్‌ టాపార్డర్‌ సెంచూరియన్‌లో అనూహ్యంగా విఫలమైంది. రోహిత్‌, ధావన్‌, కోహ్లి ముగ్గురూ ఒకేసారి తక్కువ స్కోర్లకే వెనుదిరగడం ఇటీవల ఎప్పుడూ జరగలేదు. అయితే అదీ ఒకందుకు మేలు చేసింది. మనీశ్‌ పాండే బ్యాటింగ్‌ లోతు ఏమిటో తెలియగా, తగినన్ని ఓవర్లు అందుబాటులో ఉంటే ఏం చేయగలడో ధోని చూపించాడు. రైనా రెండు మ్యాచ్‌లలో తన విలువను చూపించాడు. మరోసారి ఈ బ్యాటింగ్‌ లైనప్‌ చెలరేగాల్సి ఉంది. కేప్‌టౌన్‌ టెస్టులో తొలి ఇన్నింగ్స్‌ మినహా ఒక్కసారి కూడా బ్యాటింగ్‌లో ప్రభావం చూపించలేకపోయిన పాండ్యాకు ఇది మరో అవకాశం. బౌలింగ్‌లో భువనేశ్వర్‌తో పాటు రాణించిన శార్దుల్‌ ఠాకూర్‌కు కూడా చోటు ఖాయం. బుమ్రా కోలుకోవడంపై ఇంకా స్పష్టత రాలేదు. పిచ్‌ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో ఉనాద్కట్‌ స్థానంలో కుల్దీప్‌ లేదా అక్షర్‌ పటేల్‌కు అవకాశం దక్కవచ్చు. చహల్‌ రెండో టి20లో ఘోరంగా విఫలమైనా... అతని స్థానానికి ఢోకా లేదు. అయితే ఆ మ్యాచ్‌ దెబ్బకు ఆత్మవిశ్వాసం కోల్పోయిన అతను తిరిగి గాడిలో పడాల్సి ఉంది. ఇప్పటికే దక్షిణాఫ్రికా గడ్డపై అనుకున్నదానికంటే మంచి ఫలితాలు సాధించిన భారత్‌కు ఈ మ్యాచ్‌ చావోరేవోలాంటిదేమీ కాదు. అయితే రెండు సిరీస్‌ విజయాలతో తిరిగి వెళ్లాలని జట్టు కోరుకుంటుందనడంలో మాత్రం సందేహం లేదు.


దుమిని

అమితోత్సాహంతో...

రెండో టి20లో పవర్‌ప్లే ముగిసేసరికి కూడా దక్షిణాఫ్రికా విజయంపై ఎవరికీ అంచనాలు లేవు. కానీ క్లాసెన్‌ ఇన్నింగ్స్‌ మ్యాచ్‌ స్వరూపం మార్చేసింది. డుమిని చాలా కాలం తర్వాత బాధ్యతాయుత ఇన్నింగ్స్‌ ఆడాడు. ఫలితంగా దక్కిన గెలుపు వారికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ జోరును తగ్గించరాదని, ఇదే తరహాలో ఆడి సిరీస్‌ సొంతం చేసుకోవాలని ఆ జట్టు భావిస్తోంది. వీరిద్దరితో పాటు హెన్‌డ్రిక్స్‌ దూకుడైన బ్యాటింగ్‌ సఫారీలకు ఇప్పుడు బలంగా మారింది. స్మట్స్‌ రెండు మ్యాచ్‌లలో విఫలమైనా... అతని దేశవాళీ రికార్డును బట్టి చూస్తే సంచలన ఇన్నింగ్స్‌ ఆడగలడని జట్టు నమ్ముతోంది. దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌కు ఏకైక సమస్యగా మిల్లర్‌ మారాడు. ఐదు వన్డేల్లో 39 పరుగులే అతని అత్యధిక స్కోరు కాగా రెండు టి20ల్లోనూ విఫలమయ్యాడు. చివరి మ్యాచ్‌లోనైనా చెలరేగితే టీమ్‌కు తిరుగుండదు. బౌలింగ్‌లో కొత్త ఆటగాడు డాలా మెరవగా... మోరిస్‌, ఫెలుక్‌వాయో ప్రధాన పేసర్లు. అయితే సఫారీలు కూడా రెండో స్పిన్నర్‌ను ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది. భారీగా పరుగులిచ్చిన ప్యాటర్సన్‌ స్థానంలో ఫాంగిసో రావచ్చు. మొత్తానికి సీనియర్లు లేని లోటు సెంచూరియన్‌లో కనిపించనివ్వని కొత్త ఆటగాళ్లు మరో విజయాన్ని అందించి తమ ఎంపికకు న్యాయం చేయాలని భావిస్తున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్‌: కోహ్లి (కెప్టెన్‌), రోహిత్‌, ధావన్‌, రైనా, పాండే, ధోని, పాండ్యా, భువనేశ్వర్‌, చహల్‌, ఠాకూర్‌, కుల్దీప్‌/అక్షర్‌ పటేల్‌.
దక్షిణాఫ్రికా: డుమిని (కెప్టెన్‌), హెన్‌డ్రిక్స్‌, స్మట్స్‌, క్లాసెన్‌, మిల్లర్‌, బెహర్డీన్‌, ఫెలుక్‌వాయో, మోరిస్‌, డాలా, షమ్సీ, ప్యాటర్సన్‌/ఫాంగిసో.

పిచ్‌, వాతావరణం

బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. భారీ స్కోరుకు తగిన వేదిక. వాతావరణం మ్యాచ్‌కు అనుకూలంగా ఉన్నా తేలికపాటి వర్షం కూడా కురిసే అవకాశం ఉంది.

17
మరో 17 పరుగులు చేస్తే టి20ల్లో కోహ్లి 2 వేల పరుగులు పూర్తవుతాయి. ఈ ఫార్మాట్‌లో ఇప్పటికే గప్టిల్‌, మెకల్లమ్‌ ఈ ఘనత సాధించారు.

5
ఈ మైదానంలో దక్షిణాఫ్రికా 8 మ్యాచ్‌లు ఆడి 5 ఓడింది. మరోవైపు భారత్‌ న్యూలాండ్స్‌లో ఒక్క టి20 కూడా ఆడలేదు. ఇదే తొలి మ్యాచ్‌.

విజయంతో ముగించాలి

సునీల్‌ గావస్కర్‌

సఫారీ సిరీస్‌ తుది అంకానికి వచ్చింది. న్యూలాండ్స్‌లో దక్షిణాఫ్రికాను ఓడిస్తే భారత్‌ ఈ పర్యటనను విజయంతో ముగించినట్లవుతుంది. అద్భుత బ్యాటింగ్‌తో ప్రొటీస్‌ రెండో టి20ని గెలుపొందింది. ఇది వారిలో ఉత్సాహం నింపి ఉంటుంది. ఇది విజయం మాత్రమే కాదు... వన్డే సిరీస్‌లో తమను వేధించిన యజువేంద్ర చహల్‌ను వారు ఎదుర్కొన్న తీరు తర్వాతి మ్యాచ్‌లో ఎలా ఆడనున్నారనేదానికి సంకేతం. నెమ్మదిగా ఉన్న సెంచూరియన్‌, జొహన్నెస్‌బర్గ్‌ పిచ్‌లపై చహల్‌ ఫ్లైటెడ్‌ బంతులు మరింత నెమ్మదిగా కనిపించాయి. దీంతో క్రీజులో స్థిరంగా కదిలిన సఫారీ బ్యాట్స్‌మెన్‌ ప్రత్యేకించి క్లాసెన్‌... బంతిని పుల్‌ చేయడంతో పాటు భారీ షాట్లు ఆడాడు. డుమిని ఆలస్యంగా మొదలుపెట్టినా... క్లాసెన్‌కు స్ట్రయికింగ్‌ ఇస్తూ చక్కటి భాగస్వామ్యం నెలకొల్పాడు. దూకుడు మీదున్న క్లాసెన్‌ కొట్టిన ప్రతి షాట్‌ బ్యాట్‌ మధ్య నుంచి వెళ్లిందే. చహల్‌కు ఇలాంటి అనుభవం రెండోసారి. దీంతో న్యూలాండ్స్‌లో అతడి బదులు అక్షర్‌ పటేల్‌ను ఆడించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇక్కడి పిచ్‌ మూడో వన్డే జరిగినప్పటిలానే ఉంటే... మరో భారీ స్కోర్ల మ్యాచ్‌కు అవకాశం ఉంటుంది.

భారత్‌ తమ టాపార్డర్‌లోని ముగ్గురు బ్యాట్స్‌మెన్‌ను 50 పరుగుల్లోపే కోల్పోవడం ఎప్పుడో కాని జరగదు. కోహ్లి అద్భుత బంతికి అవుటయ్యాడు. మనీశ్‌ పాండే



అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. తన మ్యాచ్‌ ఫినిషింగ్‌ సామర్థ్యంపై వ్యక్తమవుతున్న అనుమానాలకు ధోని ఈ ఇన్నింగ్స్‌తో తెరదించాడు. వీరిద్దరి దాదాపు శతక భాగస్వామ్యంతో జట్టుకు మంచి స్కోరు వచ్చింది. అయినప్పటికీ దానిని కాపాడుకోలేక పోయిందంటే ఘనతంతా ఆతిథ్య జట్టు బ్యాట్స్‌మెన్‌దే. ప్రొటీస్‌ ఇన్నింగ్స్‌ ఆసాంతం జల్లులు పడుతున్నా మ్యాచ్‌ను కొనసాగించాలన్న అంపైర్ల నిర్ణయాన్ని ప్రశంసించాల్సిందే. భారీగా హాజరైన ప్రేక్షకులు ఈ కారణంగా సంతృప్తిగా ఇళ్లకు వెళ్లి ఉంటారు. తేమ వల్ల తమ బౌలర్లకు పట్టు చిక్కలేదని వాపోయినప్పటికీ ఆట కొనసాగేలా చూసిన కోహ్లి కూడా ప్రశంసలకు అర్హుడే. టి20లు ఉన్నది వినోదానికే. అందుకని చిన్నపాటి వర్షానికి మ్యాచ్‌లు ఆగిపోకూడదు. ఐదు రోజుల పాటు జరిగే టెస్టుల విషయంలో వానతో పిచ్‌ మారిపోయే అవకాశం ఉంటుంది. మొత్తానికి గెలిచినందుకు ప్రొటీస్‌ జట్టుకు అభినందనలు. ఆట నిలిచిపోకుండా చూసి అభిమానుల డబ్బుకు సరైన విలువ చేకూర్చిన భారత జట్టుకు, అంపైర్లకు కూడా...!

పసిడి పోరుకు మేరీకోమ్‌



సోఫియా (బల్గేరియా): స్ట్రాండ్‌జా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్‌ టోర్నమెంట్‌లో భారత మేటి మహిళా బాక్సర్‌ మేరీకోమ్‌ స్వర్ణ పతకానికి మరో విజయం దూరంలో ఉంది. శుక్రవారం జరిగిన మహిళల 48 కేజీల విభాగం సెమీఫైనల్లో యె జియాలీ (చైనా)పై మేరీకోమ్‌ గెలిచింది. పురుషుల విభాగంలో తెలంగాణ బాక్సర్‌ మొహమ్మద్‌ హుస్సాముద్దీన్‌ (56 కేజీలు), అమిత్‌ పంఘల్‌ (49 కేజీలు), వికాస్‌ కృషన్‌ (75 కేజీలు), సతీశ్‌ కుమార్‌ (ప్లస్‌ 91 కేజీలు), గౌరవ్‌ సోలంకి (52 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు.

ఫ్లోర్‌, వాల్ట్‌ ఫైనల్స్‌లో అరుణ



ప్రపంచకప్‌ జిమ్నాస్టిక్స్‌

సాక్షి, హైదరాబాద్‌: ప్రపంచకప్‌ జిమ్నాస్టిక్స్‌ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్‌ అమ్మాయి బుద్దా అరుణ రెడ్డి ఫ్లోర్‌, వాల్ట్‌ ఈవెంట్స్‌లో ఫైనల్లోకి ప్రవేశించింది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో అరుణ రెడ్డి తన విన్యాసాలతో ఆకట్టుకుంది. 10 మంది పాల్గొన్న ఫ్లోర్‌ ఎక్సర్‌సైజ్‌ క్వాలిఫయింగ్‌లో అరుణ రెడ్డి 11.466 పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌ బెర్త్‌ దక్కించుకుంది. 11 మంది పాల్గొన్న వాల్ట్‌ ఈవెంట్‌ క్వాలిఫయింగ్‌లో అరుణ రెడ్డి 13.566 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. ఈ విభాగంలో భారత్‌కే చెందిన ప్రణతి నాయక్‌ 13.483 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం వాల్ట్‌ ఫైనల్‌... ఆదివారం ఫ్లోర్‌ ఫైనల్‌ జరుగుతాయి.

క్రికెట్‌ మనుగడకు టి20లు అవసరం

గంగూలీ వ్యాఖ్య



న్యూఢిల్లీ: పొట్టి ఫార్మాట్‌ వల్ల టెస్టు క్రికెట్‌ ప్రభ తగ్గిపోతోంది అనే మాటలు ఎక్కువవుతున్న నేపథ్యంలో ఈ అంశంపై భారత మాజీ కెప్టెన్‌ సౌరవ్‌ గంగూలీ అనూహ్యంగా స్పందించాడు. అంతర్జాతీయ క్రికెట్‌ సజీవంగా ఉండాలంటే టి20ల అవసరం ఎంతైనా ఉందని దాదా అన్నాడు. ‘టి20లు క్రికెట్‌కు చాలా అవసరం. ధనాధన్‌ ఆట లేకపోతే క్రికెట్‌ మనుగడే ప్రశ్నార్థకమౌతుంది’ అని అన్నాడు. దక్షిణాఫ్రికా గడ్డపై కోహ్లి సేన ప్రదర్శనపై దాదా స్పందిస్తూ... ‘ఈ పర్యటనలో భారత్‌ అద్భుతంగా ఆడుతోంది. చివరి మ్యాచ్‌లో గెలిచి పొట్టి సిరీస్‌నూ చేజిక్కించుకుంటుంది’ అని ఆశాభావం వ్యక్తం చేశాడు. యువ క్రికెటర్లకు మరింత సమయం ఇవ్వడం ద్వారా వారిలోని ప్రతిభ బయటకొస్తుంది అని అన్న దాదా... గతంలో సెహ్వాగ్‌, హర్భజన్‌ విషయంలోనూ ఇదే జరిగిందని గుర్తుచేశాడు. మరోవైపు సమయ పరిమితి వల్ల లోధా కమిటీ సిఫార్సులు అమలు చేయలేకపోతున్నామని బెంగాల్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ (క్యాబ్‌) అధ్యక్షుడు కూడా అయిన గంగూలీ బీసీసీఐకి తెలిపాడు. ఈ మేరకు శుక్రవారం బీసీసీఐకి లేఖ రాశాడు. బీసీసీఐ కార్యదర్శి అమితాబ్‌ చౌదరి ఇటీవల నియమావళి మార్పుచేర్పులకు సంబంధించిన అంశాలపై అన్ని రాష్ట్రాల సంఘాలకు మెయిల్‌ చేసిన నేపథ్యంలో... గంగూలీ దానిపై వివరణ ఇచ్చాడు. ‘మీ మెయిల్‌ పై స్పందించేందుకు మా వద్ద సమయం లేకపోయింది. కొద్ది రోజుల క్రితమే బెంగాల్‌ క్రికెట్‌ సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎమ్‌) నిర్వహించాం. తిరిగి వెంటనే మరో ఎస్‌జీఎమ్‌ నిర్వహించేందుకు సమయం సరిపోలేదు. ఆ కారణంగా కొత్త ప్రతిపాదనలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయాం. వచ్చే ఎస్‌జీఎమ్‌లో మీరు ప్రతిపాదించిన అంశాలపై చర్చిస్తాం’ అని లేఖలో పేర్కొన్నాడు.

సిరీస్‌ విజయమే లక్ష్యంగా...

ఐదో టి20 బరిలో భారత మహిళలు ● నేడు దక్షిణాఫ్రికాతో ఆఖరి మ్యాచ్‌

సా. గం. 4.30 నుంచి సోనీ టెన్‌-1లో ప్రత్యక్ష ప్రసారం



కేప్‌టౌన్‌: దక్షిణాఫ్రికా గడ్డపై అరుదైన రెండు సిరీస్‌ విజయాల ఘనత సాధించేందుకు భారత మహిళల జట్టు సన్నద్ధమైంది. ఇప్పటికే వన్డే సిరీస్‌ను 2–1తో గెలుచుకున్న భారత్‌, ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో 2–1తో ముందంజలో నిలిచింది. నాలుగో మ్యాచ్‌ వర్షం కారణంగా రద్దు కావడంతో నేడు జరిగే ఆఖరి మ్యాచ్‌ సిరీస్‌ ఫలితాన్ని తేల్చనుంది. తొలి రెండు మ్యాచ్‌లలో సునాయాసంగా నెగ్గిన హర్మన్‌ బృందం మూడో మ్యాచ్‌లో అనూహ్యంగా ఓడింది. ఆఖరి మ్యాచ్‌ లో గెలిచి సిరీస్‌ సొంతం చేసుకుంటే భారత మహిళల జట్టు ప్రస్థానంలో మరో కీలక మైలురాయి కాగలదు. కొన్నాళ్ల క్రితం ఇదే జట్టు ఆస్ట్రేలియా గడ్డపై కూడా టి20 సిరీస్‌ గెలుచుకుంది. ఈ మ్యాచ్‌లో ఓడితే భారత్‌ 2–2తో సిరీస్‌ను ముగిస్తుంది. భారత జట్టు బ్యాటింగ్‌ ప్రధానంగా మిథాలీ రాజ్‌, స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్‌లపై ఆధారపడి ఉంది. రెండు మ్యాచ్‌లలో కీలక పరుగులు చేసిన వేద కృష్ణమూర్తి కూడా చివర్లో ధాటిగా ఆడగల సమర్థురాలు. పూజ వస్త్రకర్‌, పూనమ్‌ యాదవ్‌, రుమేలీ ధార్‌లతో కూడిన మన బౌలింగ్‌ కూడా పటిష్టంగానే కనిపిస్తోంది. దక్షిణాఫ్రికా జట్టు ప్రధానంగా బ్యాటింగ్‌లో కెప్టెన్‌ వాన్‌ నికెర్క్‌, ఓపెనర్‌ లిజెల్లే లీను...బౌలింగ్‌లో షబ్నిమ్‌ ఇస్మాయిల్‌ను నమ్ముకుంది.

బోపన్న జంట ఓటమి



మార్సెలీ (ఫ్రాన్స్‌): ఓపెన్‌–13 ప్రావిన్స్‌ ఏటీపీ టెన్నిస్‌ టోర్నమెంట్‌ నుంచి రోహన్‌ బోపన్న (భారత్‌)–ఎడువార్డ్‌ రోజర్‌ వాసెలిన్‌ (ఫ్రాన్స్‌) జంట నిష్క్రమించింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్‌ సెమీఫైనల్లో రెండో సీడ్‌ బోపన్న–వాసెలిన్‌ ద్వయం 1–6, 4–6తో నాలుగో సీడ్‌ మార్కస్‌ డానియల్‌ (న్యూజిలాండ్‌)–డొమినిక్‌ ఇంగ్లోట్‌ (బ్రిటన్‌) జోడీ చేతిలో ఓటమి చవిచూసింది. 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జంట తమ సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయింది. సెమీస్‌లో ఓడిన బోపన్న జోడీకి 9,960 యూరోల (రూ. 7 లక్షల 93 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్‌ పాయింట్లు లభించాయి.

క్వార్టర్‌ ఫైనల్లో కశ్యప్‌



వియన్నా: ఆస్ట్రియా ఓపెన్‌ బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌ ప్లేయర్‌ పారుపల్లి కశ్యప్‌ క్వార్టర్‌ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో కశ్యప్‌ 21–15, 22–20తో జియా వె తాన్‌ (మలేసియా)పై గెలుపొందాడు. మరో ప్రిక్వార్టర్‌ ఫైనల్లో హైదరాబాద్‌కే చెందిన చిట్టబోయిన రాహుల్‌ యాదవ్‌ 17–21, 9–21తో విక్టర్‌ స్వెండ్సన్‌ (డెన్మార్క్‌) చేతిలో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో హైదరాబాద్‌ అమ్మాయి ఇరా శర్మ 16–21, 13–21తో జు వీ (చైనా) చేతిలో పరాజయం పాలైంది. స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో జరుగుతున్న స్విస్‌ ఓపెన్‌లో పురుషుల సింగిల్స్‌ క్వార్టర్‌ ఫైనల్లో గురుసాయిదత్‌ 8–21, 15–21తో కాంతాపోన్‌ వాంగ్‌చరోయెన్‌ (థాయ్‌లాండ్‌) చేతిలో ఓడిపోయాడు.

రజతం నెగ్గిన వరుణ్‌, నిహాల్‌

సాక్షి, విశాఖపట్నం: జాతీయ జూనియర్‌, యూత్‌ వెయిట్‌లిఫ్టింగ్‌ చాంపియన్‌షిప్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ లిఫ్టర్లకు ఒక్కో రజత పతకం లభించింది. జూనియర్‌ పురుషుల 77 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాగాల వరుణ్‌ 282 కేజీల (స్నాచ్‌లో 131 కేజీలు+క్లీన్‌ అండ్‌ జెర్క్‌లో 151 కేజీలు) బరువెత్తి రజతం సాధించాడు. యూత్‌ బాలుర 77 కేజీల విభాగంలో తెలంగాణ లిఫ్టర్‌ ఎం.హెచ్‌.నిహాల్‌ రాజ్‌ 264 కేజీల (స్నాచ్‌లో 116 కేజీలు+క్లీన్‌ అండ్‌ జెర్క్‌లో 148 కేజీలు) బరువెత్తి రజత పతకం సొంతం చేసుకున్నాడు.

తొలి మ్యాచ్‌లో ఆంధ్ర పరాజయం

సాక్షి, హైదరాబాద్‌: సౌత్‌జోన్‌ మహిళల అండర్‌–23 వన్డే టోర్నమెంట్‌లో భాగంగా తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఓడిపోయింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత ఆంధ్ర 8 వికెట్లకు 153 పరుగులు చేసింది. అనూష 30 పరుగులు సాధించింది. అనంతరం తమిళనాడు కేవలం రెండు వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసి గెలిచింది. హేమలత 88 పరుగులతో టాప్‌ స్కోరర్‌గా నిలిచింది.

కొరియాతో హాకీ సిరీస్‌కు
భారత జట్టులో రజని



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు సీజన్‌ ఆరంభ సిరీస్‌లో దక్షిణ కొరియాతో తలపడనుంది. మార్చి 3 నుంచి 12 వరకు జరుగనున్న 5 మ్యాచ్‌ల సిరీస్‌ కోసం భారత జట్టు త్వరలో కొరియా బయల్దేరనుంది. ఈ సిరీస్‌లో పాల్గొనే జట్టును సెలక్టర్లు శుక్రవారం ప్రకటించారు. 20 మందితో కూడిన ఈ బృందానికి రాణి రాంపాల్‌ కెప్టెన్‌గా ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్‌ అమ్మాయి ఎతిమరపు రజని గోల్‌కీపర్‌గా వ్యవహరించనుంది.

మహిళల హాకీ జట్టు: రాణి రాంపాల్‌ (కెప్టెన్‌), సునీత లక్రా (వైస్‌ కెప్టెన్‌), ఎతిమరపు రజని, స్వాతి, దీపిక, దీప్‌గ్రేస్‌ ఎక్కా, సుమన్‌ దేవి, గుర్జీత్‌ కౌర్‌, సుశీల చాను, మోనిక, నమిత, నిక్కీ ప్రధాన్‌, నేహా గోయల్‌, లిలిమా మిన్జ్‌, ఉదిత, వందన కటారియా, లాల్రెమ్‌సైమీ, నవజ్యోత్‌ కౌర్‌, నవ్‌నీత్‌ కౌర్‌, పూనమ్‌ రాణి.

ఫైనల్లో ప్రాంజల జంట



సాక్షి, హైదరాబాద్‌: అంతర్జాతీయ టెన్నిస్‌ సమాఖ్య (ఐటీఎఫ్‌) మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్‌ అమ్మాయి యడ్లపల్లి ప్రాంజల డబుల్స్‌ విభాగంలో టైటిల్‌ పోరుకు చేరుకుంది. ఈజిప్ట్‌లోని షర్మ్‌ ఎల్‌ షేక్‌ నగరంలో జరుగుతున్న ఈ టోర్నీ మహిళల డబుల్స్‌ సెమీఫైనల్లో ప్రాంజల (భారత్‌)–లీ పెచి (చైనీస్‌ తైపీ) ద్వయం 6–2, 6–2తో చార్లొటి రొమెర్‌ (ఈక్వెడార్‌)–హెలెన్‌ షోల్సెన్‌ (బెల్జియం) జంటపై గెలిచింది. 78 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రాంజల జంట రెండు ఏస్‌లు సంధించి, మూడు డబుల్‌ ఫాల్ట్‌లు చేసింది. ప్రత్యర్థి జోడీ సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్‌ చేసి, తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయింది. శనివారం జరిగే ఫైనల్లో నాలుగో సీడ్‌ మార్టినా కోల్‌మాగ్నా (ఇటలీ)–వలెరియా సోలోవియా (రష్యా) జంటతో ప్రాంజల ద్వయం ఆడుతుంది. సింగిల్స్‌ విభాగంలో మాత్రం ప్రాంజల తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన ప్రాంజల తొలి రౌండ్‌లో 3–6, 2–6తో క్వాలిఫయర్‌ కరోలినా బెరెన్‌కోవా (చెక్‌ రిపబ్లిక్‌) చేతిలో ఓటమి చవిచూసింది.

పెట్టా.. ఇదెట్టా..

పెట్ట పని ఏంటి.. గుడ్లు పెట్టడం..

ఒలివియా కూడా అదే పని చేసింది.. కొన్ని నెలల క్రితం వరకూ..

మరిప్పుడో..

గుడ్లు పెట్టడం మానేసి.. పుంజులతో గొడవలకు పోతోంది.. తెల్లారకముందే.. కొక్కొరోకో అంటూ చుట్టపక్కలోళ్ల నిద్ర చెడగొడుతోంది..

ఎందుకలా..

ఎందుకంటే.. ఆ పెట్ట కాస్త ఇప్పుడు పుంజుగా మారింది!

ఇదెట్టా??

ఆస్ట్రేలియాలోని కామ్డెన్‌లో ఉండే ఒలివియా అకస్మాత్తుగా గుడ్లు పెట్టడం మానేయడం.. నెమ్మదిగా పుంజులాగ తురాయి పెరగడం చూసి.. దాని యజమానులు దంగైపోయారు.. సంబంధిత వైద్యుల దగ్గరకు తీసుకెళ్తే..

ఇదో అరుదైన సిండ్రోమ్ అని.. ప్రతి పది వేల పెట్టల్లో ఒకదానికి ఇలా జరుగుతుందని చెప్పారు. దీని అండాశయంలోని కుడివైపు భాగం సరిగా అభివృద్ధి చెందలేదని.. దీనికితోడు టెస్టోస్టిరోన్ హార్మోన్ ప్రభావమూ ఉందని తెలిపారు. మళ్లీ పెట్టగా మార్చాలంటే.. హార్మోన్ల చికిత్స ఒక్కటే మార్గమని తేల్చారు. ప్రస్తుతం ఆ చికిత్స కొనసాగుతోంది.. కొంచెం కొంచెంగా పుంజు కాస్త పెట్టగా మారుతోందట.. దాని యజమానులు మాత్రం ఇది పూర్తిగా పెట్టగా ఎప్పుడు మారుతుందో.. మళ్లీ గుడ్లెప్పుడు పెడుతుందో అని గుడ్లేసుకుని మరీ ఎదురుచూస్తున్నారు.



ప్రేమ్‌సాగర్‌రావుకు హైకోర్టులో ఊరట

సాక్షి, హైదరాబాద్: పలు పోలీస్‌స్టేషన్లలో తనపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావుకు హైకోర్టు ఊరటనిచ్చింది. ఆయనకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ టి.రజనీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 లోపు సంబంధిత పోలీసుల ముందు హాజరవ్వాలని ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో ఇటీవల జరిగిన అల్లర్లకు సంబంధించి ప్రేమ్‌సాగర్‌పై దాదాపు 25 కేసుల వరకు నమోదయ్యాయి.



జన్యువుల్లో మార్పులు తెలుసుకోవాలి

మరో పదేళ్ళలో కీమోథెరపీ కనుమరుగయ్యే అవకాశం

బయో ఆసియా–2018 సదస్సులో కేన్సర్ చికిత్సపై డాక్టర్ రఘునాథరావు

సాక్షి, హైదరాబాద్: జన్యుక్రమ విశ్లేషణతోపాటు జన్యువుల్లోని మార్పులను గుర్తించి వాటిపై ప్రభావం చూపే మందులను ఎంచుకోవడం ద్వారా కేన్సర్‌కు మెరుగైన చికిత్స అందించవచ్చని డాక్టర్ దిగుమర్తి రఘునాథరావు స్పష్టం చేశారు. ఈ వ్యాధిని ఏదో ఒక పద్ధతి, మందు ద్వారా నయం చేయడం దాదాపు అసాధ్యమన్నారు. విశాఖపట్నంలోని హోమీబాబా కేన్సర్ ఆస్పత్రిలో ఆంకాలజిస్టుగా పనిచేస్తున్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో జరుగుతున్న బయో ఆసియా–2018 సదస్సులో పాల్గొన్నారు. కేన్సర్ చికిత్సకు వాడుతున్న కీమోథెరపీ అనేక దుష్ప్రభావాలకు కారణమవుతున్న నేపథ్యంలో ఇంకో పదేళ్లలో ఇది కనుమరుగైనా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. జన్యుక్రమాల నమోదు నుంచి వాటి విశ్లేషణకు అవసరమైన టెక్నాలజీ అభివృద్ధి చెందుతుండటం వల్ల పర్సనల్, ప్రెసిషన్ కేన్సర్ చికిత్స పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. పర్సనలైజ్డ్ మెడిసన్ కేన్సర్ కారక జన్యుమార్పులున్న కణాలపైనే పనిచేస్తుందని, తద్వారా ఇతర కణాలకు హాని జరగదని వివరించారు. హోమియోపతి మందుల ద్వారా కేన్సర్‌కు చికిత్స అందించవచ్చని, ఆ వైద్యవిధానాన్ని అనుసరించే వారు చెబుతుంటారని, ఇందులో వాస్తవికతపై పరిశోధనలు జరగాలని పేర్కొన్నారు. కేన్సర్ చికిత్సలో మూల కణాలను వాడేందుకు ప్రయత్నం జరుగుతున్నా పూర్తిస్థాయిలో స్పష్టత లేదని, కేన్సర్ మూలకణాల లక్షణాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించొచ్చన్నారు.



పరిశోధనలతోనే పరిశ్రమల మనుగడ

'బయో ఏసియా'లో సీఈఓలతో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఔషధాలు, జన్యువులు, ఔషధ పరికరాలపై పరిశోధనలు, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) వ్యయాన్ని ఔషధ పరిశ్రమలు పెంచాలని పరిశ్రమలు, ఐటీ మంత్రి కేటీఆర్ అభిలషించారు. ఔషధ ధరలు సామాన్యులకు అందుబాటులోకి రావడం, ఔషధ పరిశ్రమల కార్యకలాపాలను నియంత్రించడం కూడా ప్రభుత్వానికి ముఖ్యమని స్పష్టం చేశారు. పరిశోధనలపై పరిశ్రమలు మరింత దృష్టి పెట్టాలని కోరారు. హైటెక్స్‌లో జరుగుతున్న బయో ఆసియా సదస్సులో శుక్రవారం రెండో రోజు ఔషధ కంపెనీల సీఈఓలతో చర్చాగోష్ఠిలో మంత్రి మాట్లాడారు. పరిశోధనలపై కేంద్రం 0.83 శాతమే వ్యయం చేస్తోందని, దీన్ని కనీసం 5 శాతానికి పెంచితేనే ప్రయోజనమన్నారు. అప్పుడే సీసీఎంబీ, ఐఐసీ తదితరాల నుంచి గొప్ప ఆవిష్కరణలు వస్తాయన్నారు. జెనరిక్స్, స్పెషాలిటీ డ్రగ్స్‌పై పరిశోధనలకు ప్రైవేటు కంపెనీలకు ప్రోత్సాహక రాయితీలు అవసరమన్నారు. 'పెద్ద పరిశ్రమలకు రాయితీలతో చిన్న పరిశ్రమలు నష్టపోయే ప్రమాదముంది. కనుక రాయితీల పంపిణీ చిన్న పరిశ్రమలతోనే మొదలవాలి. రాష్ట్రంలో ఔషధ రంగ పరిశ్రమల అభివృద్ధికి ప్రధానంగా మూడు చర్యలు తీసుకుంటున్నాం. ఫార్మా సిటీ, జినోమ్ వ్యాలీ 2.0 ఏర్పాటుతో పాటు లైఫ్ సైన్స్‌ను విస్తృతంగా ప్రోత్సహిస్తున్నాం. ప్రపంచంలోనే అతి పెద్ద ఫార్మా సిటీ నిర్మిస్తున్నాం. అందులో ప్రపంచ స్థాయి సదుపాయాలుంటాయి' అని వివరించారు. కార్యక్రమంలో బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్ షా, నొవార్టిస్ ఇండియా ప్రెసిడెంట్ జావిద్ జియా, రెడ్డీస్ ల్యాబ్ చైర్మెన్ సతీశ్ రెడ్డి, డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం, 24-2-2018



పుట్టింటి వారితో అత్తింటి బయట మానవత..

చెత్తను కూడా రీసైకిల్ చెయ్యొచ్చేమో కానీ
ఇలాంటి అత్తింటివాళ్లను మాత్రం బాగు చెయ్యలేం.
ఎక్కడైనా.. అత్త వేధిస్తుంటే మామ ఆపుతాడు.
భర్త వేధిస్తుంటే అత్తమ్మ అడ్డుకుంటుంది. మామ వేధిస్తుంటే భర్త తిరగబడతాడు.
అత్తింట్లో ఉండే అమ్మాయికి కష్టాల నుంచి సేద తీర్చే మనుషులు వీళ్లంతా.
అలాంటిది అందరూ కలిసి అమ్మాయిని వేధిస్తుంటే..
వాళ్లు.. అత్తింటివాళ్లు ఎలా అవుతారు?
చెత్తింటివాళ్లు కారా?

చెత్తింటివారు!

లింగ విజయ్‌కుమార్, సత్యవతిల మూడవ కుమార్తె మానవత. వారిది ఖమ్మం జిల్లా. అదే జిల్లాలోని తాళ్లగుమ్మూరు గ్రామానికి చెందిన కరి సత్యనారాయణ, రాజకుమారిల కుమారుడు ఫణీంద్రకు ఇచ్చి 2013లో వివాహం జరిపించారు. కట్న కానుకల కింద రూ.5లక్షల నగదు, రూ.5లక్షల విలువ గల బంగారు ఆభరణాలు, ఆరొందల గజాల స్థలం ఇచ్చారు. పెళ్లిని అంగరంగ వైభవంగా నిర్వహించి కుమార్తెను మెట్టినింటికి పంపారు. పట్టుమని పది రోజులు కాపురం చేయకుండానే కట్టుకున్న భర్త నుంచి వేధింపులు మొదలయ్యాయి! అయిదేళ్లుగా ఆ గృహ హింసను భరిస్తూనే వచ్చింది మానవత. ఈ మధ్యే భర్త చెప్పాపెట్టకుండా అమెరికా వెళ్లిపోయాడు. అత్త, మామలను అడిగితే ''నీకు దిక్కున్న చోట చెప్పుకో'' అంటూ దబాయించారు. జరిగిన అవమానాలను ఎదుర్కొంటూ తన భర్తని అమెరికా నుంచి ఇండియాకు తీసుకురావాలి అంటూ అత్త, మామల ఇంటి ఎదుట నేటికి (శనివారం) 134 రోజులుగా దీక్ష చేస్తోంది. ఈ స్థితిలో మానవతను కలిసింది. దుఃఖాన్ని దిగమింగుకుంటూ ఆమె మాట్లాడింది ఆ వివరాలు.. మానవత మాటల్లో...

''పెళ్లి అయిన తరువాత హనీమూన్ కోసం కేరళ వెళ్లాం. సరదా, సంతోషం పక్కనపెడితే అక్కడ నా భర్త నుంచి అవమానాలే ఎదురయ్యాయి. 'ఇక్కడ నువ్వు కాకుండా ఇంకో అమ్మాయి అయితే ఇంకా బాగా చూసుకునేవాడ్ని' అన్నాడు. ఈ మాటను మా అమ్మకు చెప్పి బాధపడ్డాను.'' పెళ్లికి ముందు బ్యాచిలర్‌గా ఉన్నాడు కదా..ఎవరితో ఎలా మాట్లాడాలో తెలీదులే అవన్నీ పట్టించుకోకు'' అంటూ అమ్మ నన్ను ఓదార్చింది.

వేధింపులు, అబార్షన్ ప్రయత్నాలు

''మీ అక్కకి ఎక్కువ కట్నం ఇచ్చారంటగా.. మరి నీకెందుకే.. తక్కువ కట్నం ఇచ్చారు. మా వదిన చూడు మా ఇంటికి వస్తూ రూ.2కోట్లు కట్నం తెచ్చింది. నువ్వు ఊపుకుంటూ వచ్చేస్తే నిన్ను పోషించడం ఎలాగే..పో.. మీ అమ్మ,నాన్న దగ్గరకు వెళ్లి ఇంకా ఏమైనా తీసుకురా.'.. అంటూ పెళ్లయిన మూడో నెల నుంచే నా భర్త దెప్పడం మొదలుపెట్టాడు. నేను ప్రెగ్నెంట్ అయ్యాక హైదరాబాద్‌లోని మధురానగర్ ఉన్న ఒక హాస్పిటల్‌కి వెళ్లి ''నా భార్యకు అబార్షన్ చేయాలి. ఇది నా భార్య ఇష్టంతోనే చేస్తున్నాను'' అని అక్కడి అప్లికేషన్స్‌పై సంతకాలు కూడా చేశాడు. నేను హాస్పిటల్‌కు వెళ్లాక అక్కడి సిబ్బంది నాకు ఒక అప్లికేషన్ ఇచ్చి సంతకం పెట్టమన్నారు. వాటిని చదివితే తెలిసింది.. అవి అబార్షన్ పేపర్స్ అని! వెంటనే నా భర్తను నిలదీశాను. హాస్పిటల్ వాళ్లు కూడా ఆయన్ని మందలించారు. ఇంటికి వెళ్లగానే.. ''పిల్లలే కదా మళ్లీ పుడతారు. ఎంతమంది అబార్షన్ చేయించుకోవట్లేదు?'' అంటూ నాపై ఎగిరిపడ్డాడు. నేను మా అమ్మ, నాన్నలకు చెప్పాను. వాళ్లు వచ్చి, ''ఇష్టం లేకపోతే విడాకులు ఇచ్చేసేయ్.. అంతే కానీ నీ ఇష్టం వచ్చినట్లు మా అమ్మాయిని వేధిస్తే మాత్రం సహించం'' అని వార్నింగ్ ఇచ్చారు. అక్కడే ఉన్న మా అక్క జోక్యం చేసుకుని ''పుట్టబోయే బిడ్డను నేను పెంచుకుంటానులే.. అబార్షన్ ఏం చేయించకు'' అని చెప్పడంతో అప్పుడు శాంతించాడు!

రూ.2లక్షలు అడిగాడు

2014 సెప్టెంబర్‌లో పాప పుట్టింది. డెలివరీ సమయంలో నాన్న రూ.50 వేలు నా భర్త చేతికి ఇచ్చాడు. నేను బెడ్‌మీద ఉండగానే నా దగ్గరకు వచ్చి 'నీకు ప్రెగ్నెన్సీ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.2లక్షల ఖర్చు అయ్యింది. ఈ రెండు లక్షలను తిరిగి నాకు ఇవ్వాలి' అంటూ వేధింపులు మొదలుపెట్టాడు.

ఇల్లంతా బ్లీడింగ్!

యూఎస్‌లో ఉద్యోగం వచ్చిందంటూ నన్ను ఇక్కడే ఉంచి తను యూఎస్ వెళ్లాడు. రెండు నెలల్లో నన్ను కూడా తీసికెళ్తానని చెప్పి కాలయాపన చేశాడు. మా నాన్న 'మానవతని అమెరికాకు ఎప్పుడు తీసుకెళ్తావ్?' అంటూ సీరియస్‌గా అడిగితే అప్పుడు..వీసా ఏర్పాట్లు చేశాడు రమ్మని. వీసా ఏర్పాట్ల సమయంలో అత్త, నా భర్త వాళ్ల అన్నయ్యలు నా డాక్యుమెంట్స్‌ను దాచేసి చాలా ఇబ్బందులకు గురిచేశారు. పాపతో పాటు, యూఎస్ వెళ్లాక 'నువ్వు రాకుండా ఉంటే డబ్బులు మిగిలేవి కదా'.. అంటూ మళ్లీ స్టార్ట్ చేశాడు. 'మీ నాన్నకు గుండెనొప్పి వచ్చినప్పుడు రూ.25వేలు బిల్లు కట్టాను. అవి ఇంత వరకు ఇవ్వలేదు. నువ్వు ఇవ్వు లేదా..మీ నాన్నని ఇవ్వమను' అంటూ సూటిపోటి మాటలతో వేధించాడు. అవి భరించలేక మా మేనమామకు కాల్ చేసి డబ్బులు అడిగాను. మామయ్యను అడిగిన విషయం మా అమ్మకు చెప్తే.. అమ్మ నాన్నకు చెప్పింది. నాన్న చాలా బాధ పడి వెంటనే మా ఆయనకు ఫోన్ చేశాడు.

కన్నీళ్లతో నాన్న బతిమలాడారు

''నీ డబ్బులు నీకు వారం రోజుల్లో అకౌంట్‌లో వేస్తా.. దయచేసి నా కూతుర్ని అక్కడ ఇబ్బందులు పెట్టొద్దు' అంటూ ఏడ్చేశాడు మా నాన్న. ఎంత చెప్పినా వినట్లేదని నా మెడలో ఉన్న నల్లపూసల దండని తీసి 'నేను రూ.25వేలు ఇచ్చే వరకు ఇది నీదగ్గర పెట్టుకో.. దయచేసి మా అమ్మ, నాన్నలను డబ్బుల కోసం పదే పదే వేధించకు' అంటూ కాళ్లు పట్టుకుని ఏడ్చాను. అప్పుడు సరేనంటూ మా నాన్నకు ఫోన్ చేసి మీ దగ్గర ఉన్నప్పుడే డబ్బులు ఇవ్వండి అని చెప్పాడు. యూఎస్‌లో వేరే అమ్మాయితో ఎఫైర్ పెట్టుకున్నాడు. ఈ విషయం అడిగితే నన్ను చిత్రహింసలకు గురిచేశాడు. ఇదే సమయంలో నేను ప్రెగ్నెన్సీలో ఉంటే అబార్షన్ కోసం మళ్లీ ప్రయత్నాలు చేశాడు. నాకు అబార్షన్ ఇష్టం లేదూ అన్నాను. టార్చర్ మొదలు. 'సరే అబార్షన్ చేయించుకుంటా' అని చెప్పిన మరుసటి రోజే డాక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకుని హాస్పిటల్‌కు తీసికెళ్లాడు. అక్కడ నాకు వాళ్లు కొన్ని ట్యాబ్లెట్స్ ఇస్తే అవి వేసుకున్నాను. ఇంటికి వచ్చాక, 'ట్యాబ్లెట్స్ మింగిన వెంటనే కళ్లు మూతలు పడి కిందపడిపోయే సమయంలో 'ఫణి..ఫణి..' అని నా భర్తను పిలిచినా ఆయన పట్టించుకోలేదు. పడిపోతున్న సమయంలో ఇంట్లో లైట్లు అన్నీ ఆఫ్ చేశాడు. కొద్దిసేపయ్యాక.. నేనేం చప్పుడు చేయట్లేదని లైట్లు వేసి చూశాడు అప్పటికే ఆ రూమ్ అంతా బ్లీడింగ్‌తో నిండిపోయింది. పట్టించుకోలేదు.

ఆ అమ్మాయితో మేసేజ్‌లు ఏంటి అని ప్రశ్నిస్తే నన్ను విపరీతంగా కొట్టాడు. 'నీకెందుకే..నువ్వు ఏమైనా సంపాదిస్తున్నావా..? నా ఇష్టం వచ్చినట్లు చేస్తా.. ఇంట్లో పడి ఉండు' బూతులు తిట్టాడు'. కొట్టిన దెబ్బలకు తల, ముక్కులో నుంచి రక్తం కారుతుంది. అయినా హాస్పిటల్‌కు తీసికెళ్లలేదు. నేను అంత బాధపడుతున్నా.. ఇరవై రోజుల వరకు నన్ను హాస్పిటల్‌కు తీసికెళ్లకుండా ఇంట్లోనే ఉంచాడు.

ఇండియాకు తీసుకొచ్చాడు

''నేను స్టాంపింగ్ కోసం ఇండియా వెళ్లాలి.. కలిసి వెళ్దాం రా'' అన్నాడు ఓ రోజు. ''నేను రాను నువ్వు వెళ్లి రా.. '' అంటే వినలేదు. బలవంతంగా నన్ను ఇండియా తీసుకొచ్చాడు. ఎయిర్‌పోర్ట్ వద్ద నాకేమో..క్యాబ్ మాట్లాడాడు. తను తన మామయ్య, బాబాయ్‌లతో కలిసి సొంత కారులో వెళ్లారు. ఎయిర్‌పోర్ట్ నుంచి పంజాగుట్టలో ఉన్న ఓ గెస్ట్‌హౌస్‌కు నన్ను బలవంతంగా తీసుకొచ్చి అక్కడ చిత్రహింసలు పెట్టాడు. నన్ను గెస్ట్‌హౌస్‌లో వదిలేసి వెళ్లిపోయాడు. ఉదయం వచ్చిన దాన్ని సాయంత్రం మా అమ్మ, నాన్నలు వచ్చేవరకు బిక్కుబిక్కుమంటూ పాపతో ఉన్నాను. ఆ తరువాత మేము ఖమ్మం వెళ్లి నా భర్త గురించి అడిగాం. ఎవర్ని అడిగినా మాకు తెలీదు, మాకు తెలీదు అన్నారు. ఇదే విషయంపై ఖమ్మం ఉమెన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాము. పోలీసులు 498/ఏ, 506డీవీ యాక్ట్‌ల కింద కేసు నమోదు చేశారు. నేను అత్తగారింట్లోనే ఉండాలని కోర్టు కూడా ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలను డీజీపీకి చూపించాం. డీజీపీ కూడా జిల్లా ఎస్పీకు ఆదేశాలు ఇచ్చారు. స్థానిక పోలీసులు మాత్రం సరైన రీతిలో స్పందించట్లేదు. నా భర్త అమెరికా నుంచి ఇండియాకు రావాలి అని, మా అత్తమామల్ని, వాళ్ల బంధువులను కఠినంగా శిక్షించాలని నేను నా నాలుగేళ్ల కుమార్తెతో కలసి మా అత్త,మామల ఇంటి ఎదుట దీక్ష చేస్తున్నా'' అని ఎంతో ఆవేదనగా చెప్పారు మానవత.

- చైతన్య వంపుగాని,
సాక్షి, హైదరాబాద్

> **ఎక్కువ మాట్లాడితే ఆర్డర్ క్యాన్సిల్ చేయిస్తాం**
>
> కోర్టు ఆదేశాల మేకు శుక్రవారం 'ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్' అధికారులు మానవత దగ్గరికి వచ్చారు. ''నీకు న్యాయం చేస్తాం. ఇంతకాలంగా నువ్వు చేస్తున్న దీక్ష ఆదర్శనీయం'' అన్నారు. అయితే లోపలికి వెళ్లి అత్త మామలతో మాట్లాడి వచ్చాక మాత్రం మాట మార్చారు! ''వాస్తు ప్రకారం నువ్వు వాళ్లింట్లో ఉండటం కుదరదు'' అన్నారు. అదేంటని అడిగితే, ''ఎక్కువ మాట్లాడితే రెసిడెన్షియల్ ఆర్డర్‌ని క్యాన్సిల్ చెయ్యమని కోర్టుకు పంపుతాం'' అని బెదిరించారని మానవత చెప్పారు.



"ఆ తర్వాతి రోజు అదే దారిలో ఇంటికెళ్తూంటే లావణ్యకు వీధి మలుపు దగ్గర ఒక చిన్నమ్మాయి కనిపించింది. పదేళ్లుంటాయేమో ఆ అమ్మాయికి. మాసిపోయిన బట్టలతో, నల్లగా, బక్కచిక్కి ఉంది. నిజానికి లావణ్య అంతకుముందు రోజే ఆ అమ్మాయిని చూసింది. ఒకసారి రోడ్డుపైన, ఇంకోసారి కాలేజీ పక్కన, మరోసారి వారుండే వీధిలో అక్కడక్కడే తచ్చాడుతూంటే లావణ్య ఆ అమ్మాయిని చూసింది. బిత్తరచూపులు చూస్తూ, దిగులుగా, ఏదో పోగొట్టుకున్నట్లుగా ఇంకేదో వెతుకుతున్నట్లుగా ఉంది........"
ఆ చిన్నమ్మాయి ఎవరి కోసం ఎదురుచూస్తోంది? ఆ అమ్మాయి వెతుకున్న దానికి, లావణ్యకు సంబంధం ఏంటి? ఆ చిన్నమ్మాయి దారి చూపులు ఎవరికోసం?

రేపటి ఫన్‌డేలో..
'దారి చూపులు' అన్న కథలో.. చదవండి.. !!



ఆయనకు డెబ్భై ఏళ్లు. ఆమెకు అరవై ఏళ్లు. ఇద్దరిదీ అన్యోన్యమైన జంట. ఒకరంటే ఒకరికి ప్రాణం. ఒకరికి బాగోలేదంటే, ఇంకొకరు తట్టుకోలేరు. వారు సంతోషంగా ఉండటానికి వాళ్లిద్దరు బాగుంటే చాలు. అలాంటి ఇద్దరి జీవితంలో ఓ చిన్న కుదుపు. ఆ కుదుపు ఏంటి? దాంతో వాళ్లిద్దరిలో వచ్చిన మార్పేంటీ? ఆయనను ఆమె కోరిన ఒక చివరి కోరిక ఏంటి?

రేపటి ఫన్‌డేలో..
'కడపటి కోరిక' కథలో చదవండి..!

చెట్టు నీడ

తప్పు కూడా స్వీట్

ముద్దొచ్చే వీడియో ఒకటి ఆన్‌లైన్లో తిరుగుతోంది. అది ఇలా సాగుతుంది.

ఒక క్లాసులో ఒక బుజ్జిపిల్లాడు. ఏ ఒకటో తరగతో అయివుండవచ్చు. వాడిని వాళ్ల లెక్కల టీచర్ బ్లాక్‌బోర్డు దగ్గరికి పిలిచారు. 3+2=? అన్న సమస్య బోర్డు మీద రాసివుంది. బుజ్జిగాడు వెళ్లి చాక్‌పీసు చేతిలోకి తీసుకున్నాడు. కానీ అది వాడి తలకు మించిన లెక్క. అందుకే అటూయిటూ ఆలోచించాడు. బుర్ర గోక్కున్నాడు. ఏమీ తట్టలేదు. చివరికి, వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ ముందు బెంచీలో వాడి స్నేహితుడు కావొచ్చు, కూర్చుని వున్నాడు. విషయం అర్థమైంది. పైగా వాడికి జవాబు తెలుసు. వెంటనే 'ఐదు' అని తెలిసేలా, అరచేతిని ఎత్తి చూపించాడు. ఇక్కడే తిరకాసు జరిగింది. అది ఈ బుజ్జిగాడికి ఇంకోలా అర్థమైంది. వెంటనే తన చేతిని బోర్డు మీద పెట్టి, వేళ్ల వెంబడి ట్రేస్ చేస్తూ అరచేతి బొమ్మ చకచకా గీసేసి, చక్కగా వెళ్లి కూర్చున్నాడు. ఇక చిరునవ్వే మన వంతు.

> **అది వాడి తలకు మించిన లెక్క. అందుకే అటూయిటూ ఆలోచించాడు. బుర్ర గోక్కున్నాడు. ఏమీ తట్టలేదు. చివరికి, వెనక్కి తిరిగి చూశాడు.**

తప్పుల్ని కూడా పిల్లలు చాలా స్వీట్‌గా చేస్తారు. అందుకే వాటిని ఒక్కోసారి క్షమించేయొచ్చు. పిల్లల తప్పులనే కాదు, ఎవరి తప్పులైనా సరే మొత్తంగా క్షమించేయగలిగితే జీవితం ఇంకా స్వీట్‌గా ఉంటుంది.



వాళ్లమ్మకు స్టీల్ పాత్రలంటే ఇష్టం. ఎంతిష్టమంటే చిన్నప్పట్నుంచీ స్టీలుపాత్రలు తప్ప ఇంకేం కోరుకునేది కాదు. వాళ్ల నాన్న ఆమెను ఇష్టంగా "నీకేం కావాలి?" అని అడిగినా, "ఒక్క స్టీల్‌కంచం మాత్రం కొనివ్వండి.." అని అడిగేది. ఆ ఇంట్లో ఉండే ప్రతిస్టీలు పాత్రా అమ్మ జ్ఞాపకమే. ఆ జ్ఞాపకాలను తల్చుకుంటూ ఓ కొడుకు చెప్పే కథ..

'స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు'..
రేపటి ఫన్‌డేలో..

సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
శనివారం
24-2-2018

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా...! నేను బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. నేను వన్ మంత్ బ్యాక్ మా కాలేజ్‌లో థర్డ్ ఇయర్ అమ్మాయిని చూశాను. బాగా నచ్చింది. అప్పటి నుంచి తనే గుర్తుకొస్తోంది. 'తను చాలా డేంజర్, జాగ్రత్త' అంటున్నారు మా ఫ్రెండ్స్. ఎందుకని అడిగితే.. గతంలో మా కాలేజ్ అబ్బాయి ఆ అమ్మాయికి ప్రపోజ్ చేస్తే.. తను వెళ్లి వాళ్ల డాడీకి చెప్పిందట. వాళ్ల డాడీ ప్రెస్‌లో పని చేస్తారట. ఆయన కాలేజ్‌కి వచ్చి మరీ వార్నింగ్ ఇచ్చారట. తనతో ఎవరు మాట్లాడినా వాళ్ల డాడీతో చెబుతుందట. నాకు ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు. పైగా నా చదువు కూడా పూర్తికావస్తోంది. ఈ సమయంలో తనతో ఎలా మాట్లాడాలో అర్థం కావడం లేదు. ప్లీజ్ మంచి సలహా ఇవ్వండి. నన్ను ఏం చెయ్యమంటారు? తనని మరచిపోవడమే కరెక్టా?

- శివ

ఎందుకన్నా మరచిపోవడం?
'అంటే.. మరి ఏం చెయ్యాలి సార్..?? వాళ్ల ఫాదర్ పీకుతాడు కదా సార్??'
ఫాదర్ పీకుతాడని ప్రేమ వదులుకునే టైప్ కాదు శివ.. శివ.. శివా...!
'ఊరుకోండి సార్.. పసిబిడ్డని ఉసిగొలిపి ముంచుతారా ఏంటి??'
అది కాదు నీలాంబరీ మంచి సొల్యూషన్ చెబుతాగా..!
'చెప్పండి సార్ పాపం, శివ ఈజ్ వెయిటింగ్..!'
శివ నీకో ఫ్రెండ్ ఉన్నాడా.. ప్రాణ మిత్రుడు లాంటివాడు..?
'ఎందుకు సార్..? ఉంటే ఏం చెయ్యాలి???'
ఆ ఫ్రెండ్‌ను అమ్మాయికి లవ్ లెటర్ ఇవ్వమని.. అది ఇచ్చే లోపే.. అమ్మాయి ఫాదర్‌కి ఇన్ఫర్మేషన్ నువ్వే వెళ్లి లీక్ చెయ్యి. అప్పుడు ఫాదర్ వచ్చి నీ ఫ్రెండ్‌ని బాదుతాడు. ఆ తరువాత నువ్వు నీ ఫ్రెండ్‌కు హాస్పిటల్ ఖర్చులు చూసుకుని.. పెద్ద బొకే ఇచ్చి థ్యాంక్యూ చెప్పి.. అమ్మాయి ఫాదర్‌కి కనిపించు. ఆయన ఇలాంటి పోకిరీగాళ్లు ఎవరైనా అమ్మాయిని వేధిస్తే ఫస్ట్ ఇన్ఫర్మేషన్ ఇవ్వమని చెబుతాడు. మెల్లమెల్లగా ఇంట్లోకి పాకిపో..! ఫాదర్‌కి మదర్‌కి కావల్సిన కిరాణా కొట్టు పనులన్నీ చేసి పెట్టు. ఎప్పటికైనా ఒకరోజు అమ్మాయి నిన్ను గమనిస్తుంది. ఇక అక్కడ నుంచి నీ లక్కూ...!
'నీకు వర్కౌట్ కాకపోతే హాస్పిటల్ బిల్లు లవ్ డాక్టర్‌కి పంపు.. బొకేతో వస్తారు' అని నవ్వింది నీలాంబరి.

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

4		7		3				2
9	2		1		8	5		
		3	9			6	7	
	7				9			3
1			3		2			9
3			4				2	
	4	1			6	3		
		9	7		3		6	1
6				9		4		7

నిబంధనలు:
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

సుడోకు జవాబు

7	2	5	3	9	1	6	8	4
4	9	1	8	6	2	5	3	7
8	6	3	7	4	5	2	9	1
9	3	2	4	8	6	1	7	5
6	1	7	9	5	3	4	2	8
5	4	8	1	2	7	3	6	9
1	8	6	5	3	9	7	4	2
3	7	9	2	1	4	8	5	6
2	5	4	6	7	8	9	1	3

టేస్టీ కార్న్‌ర్



పిండి వంటలు 1

రండి.. రండి.. రండి
'పిండి' వంటలు చేయండి
టేస్టీ కార్న్ వంటకాలు తినగ రండి.



కార్న్‌ఫ్లోర్ హల్వా

కావలసినవి
కార్న్ ఫ్లోర్ – కప్పు; **పాలు** – 3 కప్పులు; **నీళ్లు** – 2 కప్పులు; **పంచదార** – 3 కప్పులు; **నిమ్మరసం** – టేబుల్ స్పూను; **ఫుడ్ కలర్** – చిటికెడు (నారింజ రంగు); **నెయ్యి** – ముప్పావు కప్పు; **ఏలకుల పొడి** – పావు టీ స్పూను; **తరిగిన డ్రై ఫ్రూట్స్** – తగినన్ని

తయారి
ఒక పెద్ద పాత్రలో కార్న్ ఫ్లోర్, మూడు కప్పుల పాలు పోసి ఉండలు లేకుండా బాగా కలపాలి • బాణలిలో రెండు కప్పుల నీళ్లు, పంచదార వేసి స్టౌ మీద ఉంచి పంచదార కరిగేవరకు కలపాలి • నిమ్మరసం జత చేసి పాకం బాగా ఉడుకుపట్టే వరకు కలపాలి • పాకం బాగా ఉడుకుతుండగా, కార్న్‌ఫ్లోర్ మిశ్రమం పోస్తూ కలపాలి • ఫుడ్ కలర్ జత చేసి మిశ్రమం గట్టిపడే వరకు బాగా కలపాలి • కొద్ది కొద్దిగా నెయ్యి జత చేయాలి • ఉడుకు పట్టిన తరవాత దింపేయాలి • డ్రైఫ్రూట్స్ తరుగు, ఏలకుల పొడి వేసి కలపాలి • ఒక ప్లేట్‌కి నెయ్యి పూసి, హల్వా మిశ్రమాన్ని సమానంగా పరవాలి • కొద్దిగా గట్టి పడిన తరవాత చాకుతో ముక్కలుగా కట్ చేసి అందించాలి.



కార్న్ ఫ్లోర్ పాటీస్



కావలసినవి: కార్న్ ఫ్లోర్ – 2 కప్పులు; మైదా పిండి – 4 టేబుల్ స్పూన్లు; **బేకింగ్ పౌడర్** – అర టీ స్పూను; **ఉప్పు** – టీ స్పూను; **గోరు వెచ్చని నీళ్లు** – ఒకటిన్నర కప్పులు; **నూనె** – డీప్ ఫ్రైకి సరిపడా, **చీజ్ తురుము** – 2 టేబుల్ స్పూన్లు; **అవొకాడో** – 1 (తొక్క తీసి, చిన్నచిన్న ముక్కలు చేయాలి)
తయారి: ఒక పాత్రలో కార్న్‌ఫ్లోర్, మైదాపిండి, ఉప్పు, బేకింగ్ పౌడర్ వేసి బాగా కలపాలి • గోరు వెచ్చని నీరు జత చేసి చపాతీ పిండిలా కలిపి, ఒక ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి, గంటసేపు పక్కన ఉంచాలి • బాణలిలో నూనె కాగాక కలిపి ఉంచుకున్న పిండిని వడల మాదిరిగా ఒత్తి నూనెలో వేసి దోరగా వేయించి తీసేయాలి • చీజ్ తురుము, అవొకాడో ముక్కలను తయారుచేసి ఉంచుకున్న పాటీలపై వేసి వెంటనే అందించాలి.

కార్న్ ఫ్లోర్ చికెన్ కబాబ్

కావలసినవి
చికెన్ (పెద్ద ముక్కలు) – అర కేజీ; **మిరప కారం** – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; **వెనిగర్** – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; **సోయా సాస్** – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; **ధనియాల పొడి** – టేబుల్ స్పూను; **అల్లం వెల్లుల్లి ముద్ద** – టేబుల్ స్పూను; **కార్న్ ఫ్లోర్** – టేబుల్ స్పూను; **పెరుగు** – టేబుల్ స్పూను.
తయారి: చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి నీరు ఒంపేయాలి • ఒక పాత్రలో చికెన్ ముక్కలు వేసి, మిగతా పదార్థాలన్నీ జత చేసి బాగా కలిపి మూడు నాలుగు గంటలు పక్కన ఉంచిన తరువాత, ఒక్కో ముక్కను గ్రిల్ మీద కాని అవెన్‌లో కాని వేయించి తీసేయాలి • వేడివేడిగా అందించాలి.



కార్న్ ఫ్లోర్ స్పినాచ్ ఆనియన్ పకోరా

కావలసినవి
కార్న్ ఫ్లోర్ – ఒకటిన్నర కప్పులు; **సెనగ పిండి** – 3 టేబుల్ స్పూన్లు; **ఉల్లి తరుగు** – 2 కప్పులు; **పుదీనా తరుగు** – 2 కప్పులు; **అల్లం వెల్లుల్లి ముద్ద** – టేబుల్ స్పూను; **పచ్చి మిర్చి పేస్ట్** – టేబుల్ స్పూను; **మిరప కారం** – టీ స్పూను; **పసుపు** – టీ స్పూను; **బేకింగ్ సోడా** – చిటికెడు; **ఉప్పు** – తగినంత; **కసూరీ మేథీ** – అర టేబుల్ స్పూను; **నూనె** – అర టేబుల్ స్పూను; **కొత్తిమీర** – 3 టేబుల్ స్పూన్లు; **నీళ్లు** – తగినన్ని; **నూనె** – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారి
ఒక పాత్రలో నూనె తప్పించి, మిగతా పదార్థాలన్నీ వేసి పకోడీల పిండిలా కలుపుకోవాలి • బాణలిలో నూనె కాగాక కలిపి ఉంచుకున్న కార్న్ ఫ్లోర్ మిశ్రమాన్ని పకోడీల మాదిరిగా వేసి వేయించి పేపర్ నాప్‌కిన్ మీదకు తీసుకోవాలి • టొమాటో సాస్‌తో వేడివేడి పకోడీలు అందించాలి.

కార్న్ ఫ్లోర్ టోర్టిల్లా



కావలసినవి: కార్న్ ఫ్లోర్ – ఒకటిన్నర కప్పులు; **గోధుమ పిండి** – కప్పు; **ఉప్పు** – తగినంత; **నూనె** – 3 టేబుల్ స్పూన్లు; **గోరు వెచ్చని నీళ్లు** – ముప్పావు కప్పు; **ప్లాస్టిక్ పేపర్లు** – 2
తయారి: ఒక పాత్రలో కార్న్‌ఫ్లోర్, గోధుమపిండి, ఉప్పు వేసి బాగా కలపాలి • కొద్దిగా నీళ్లు, నూనె జత చేసి మరో మారు కలపాలి • కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ, చపాతీ పిండి మాదిరిగా కలపాలి. (చేతికి అంటుతున్నట్లుగా ఉంటే, మరికాస్త పిండి జత చేసి కలుపుకోవచ్చు) • కలిపి ఉంచుకున్న పిండిని చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి • ఒక్కో ఉండను ప్లాస్టిక్ పేపర్ మీద ఉంచి, పైన మరో ప్లాస్టిక్ పేపర్ ఉంచి, చపాతీ కర్రతో ఒత్తాలి • స్టౌ మీద పెనం బాగా వేడయ్యాక, ఒత్తి ఉంచుకున్న చపాతీని ప్లాస్టిక్ పేపర్ నుంచి వేరు చేసి పెనం మీద వేసి, రెండు వైపులా బంగారు రంగులోకి వచ్చే వరకు కాల్చాలి.

రాశి ఫలాలు (సౌరమానం)

జన్మనక్షత్రం తెలియదా?
నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా?
మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం (ఫిబ్రవరి 24 నుంచి మార్చి 2 వరకు) మీ రాశి ఫలితాలు



డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

మేషం
(మార్చి 21 - ఏప్రిల్ 19)

ఎవరికైనా పరిగెత్తుతూ పరిగెత్తుతూ ఉంటే ఆయాసం రావడం సహజం. అదే మరి గుర్రమేగాని పరిగెడుతూ ఉంటే, దానికి ఆయాసం వస్తుందేమో అనుకోవడం సరికాదు. ఎందుకంటే, గుర్రానికి పరిగెత్తినకొద్దీ ఉత్సాహంగా ఉంటుంది. సరిగ్గా మీ పరిస్థితీ ఇదే. మీరు ఈ పనీ ఆ పనీ అంటూ వేగంగా వెళ్లిపోతుంటే, మీ మిత్రులూ, బంధువులూ విశేషించి కుటుంబ సభ్యులూ, మీ ఆరోగ్యం, శారీరక శ్రమా అంటూ వెనక్కి లాగుతూ ఉండొచ్చు. అదృష్టయోగం ఉన్న కాలం కాబట్టి మీరు మీ ధోరణిలో వెళ్లిపోతూ ఉండక తప్పదు ప్రస్తుతానికి.

కుటుంబానికి లేదా తలిదండ్రుల ఆస్తులకి సంబంధించిన ఓ సమస్యలో ఆందోళనకి గురవుతూ ఉండవచ్చు. అది దాదాపు పరిష్కార దిశకి వస్తూ ఉండవచ్చు. దిగులు పడాల్సిన అవసరం లేదు. మీరుగాని ఏదైనా ఓ సంస్థని నడుపుతూ ఉన్నవారైతే దానికి ఎవరైనా విరాళాలిచ్చి ఉండడం, అలాగే మూలధనమంటూ కొంత ఉండి ఉండడం, నెలవారీ ఖర్చులూ వంటివి గాని ఉండే లేదా మీరే ఆర్థికమైన లెక్కలని చూసే వారుగా ఉండడం జరుగుతుంటే తప్పక ఆర్థికమైన లెక్కల్లో జాగ్రత్తగా ఉండక తప్పదు. మిమ్మల్ని ఆర్థికమైన లావాదేవీలని గురించి అడిగే రోజులు దగ్గరౌతున్నాయి కాబట్టి సరైన తీరులో ఉండడం అవసరం.

వృత్తి ఉద్యోగ వ్యాపారాల్లో ఓ కొత్తశైలిని మీకున్న బుద్ధిబలంతో మీరు ప్రవేశపెడతారు. అది ఎందరికో నచ్చే కారణంగా మీకు గౌరవం ఓ గుర్తింపూ లభించే అవకాశం ఉంది. మరోసారి గుర్తుంచుకోవాల్సిన విషయాలు– సమయ నియమాన్ని పాటించడం, పనుల్ని వాయిదా వేసుకుందామనే దృష్టిని మానుకోవడమున్నూ. సంతానాన్ని గారాబంతో పెంచడం మాని, తగినంత క్రమశిక్షణలో ఉంచండి. విందులూ వినోదాలూ విహారాలూ తీర్థయాత్రలూ వంటి కార్యక్రమాల ద్వారా సంతానపు చదువు వెనకబడుతోందేమో గమనించుకోండి.

లౌకిక పరిష్కారం: ఖర్చు చేసిన సొమ్ములకి సరైన లెక్కలూ పత్రాలూ ఉన్నాయా సరి చూసుకోండి.
అలౌకిక పరిష్కారం: రావిచెట్టుకి ప్రదక్షిణల్ని చేస్తూ గోవిందనామాలని అనుకుంటూ ఉండండి.

వృషభం
(ఏప్రిల్ 20 - మే 20)

చేరుకోవలసిన గమ్యం గురించిన స్పష్టమైన అవగాహన ఉన్నవారెవరైనా, లక్ష్యం మీదే దృష్టి ఉంచుకుని జీవితంలో ప్రయాణిస్తూంటారు. మధ్యలో మరో గమ్యం వైపుకి తమంత తాముగా వెళ్లరు. ఎవరైనా మరొక వైపుగా తీసుకువెళ్లే ప్రయత్నం చేయదలిచినా వ్యతిరేకిస్తారు. ప్రస్తుతదశలో మీరు చేయవలసినదిదే. ఎవరైనా మరో కొత్త ప్రణాళికతో వచ్చి కొత్త గమ్యానికి దృష్టిని పెట్టవలసిందని కోరితే, నిర్భయంగా వ్యతిరేకించండి. మొగమాట పడడం, మెత్తగా లౌక్యంగా సమాధానించడం సరి కాదు.

తాత్కాలికంగా మీరు చేస్తున్న వ్యాపారం మందకొడిగా ఉన్నా, దిగులుపడకండి, నిరాశ చెందకండి. మండుతున్న నిప్పులో తడిసిన కట్టెలు వేస్తే తాత్కాలికంగా అగ్ని విజృంభించలేక పోవచ్చు గాని, ఆ తడిదనం పోయాక పరిస్థితి ఎంత గొప్పగా మారుతుందో గమనించండి.

జరిగిపోయిన కాలం, అప్పుడు చేసిన పొరపాట్లు, నష్టపోయిన కీర్తిప్రతిష్ఠలతో పాటు ధనం... ఇలా ఆలోచించినందువల్ల ప్రయోజనం ఉండదు. విలువైన వర్తమానం నుండి భవిష్యత్తులోకి ఆలోచించండి.

పట్టుదల, కోపం అనే రెండు శత్రువుల వల్ల ఏ మాత్రం ప్రయోజనం ఉండదు. అలాగే మీ కుటుంబ విషయాన్ని పదిమందికీ చెప్పుకున్నందువల్ల కూడ ఉపయోగమేమీ ఉండదు. అంతేకాదు... మీ ఇల్లు మొత్తం ఒక్క తలుపు కూడా లేని సత్రంలా అయిపోతుంది.

మీకు కోపం వచ్చినప్పుడు మాట్లాడే మాటల వరుస సరైన పద్ధతిలో ఉండనే ఉండదు కాబట్టి శత్రువుల సంఖ్య పెరుగుతూ ఉంటుంది. ఈ తీరుగా కావాలని ఆపదని ఎదురెళ్లి కొని తెచ్చుకోవడం ఏ మాత్రం మంచిది కాదు.

లౌకిక పరిష్కారం: కోపం పట్టుదల అనేవి సరికావు. ఉన్నా తగు మాత్రంలో ఉండాల్సిందే!
అలౌకిక పరిష్కారం: ఆంజనేయుని ద్వాదశ నామాలని రోజుకి ముమ్మారు చొప్పున చదవండి.

మిథునం
(మే 21 - జూన్ 20)

మబ్బులు వీడి సూర్యప్రకాశం నేలని తాకుతున్నట్టుగా, మీకు ఇప్పుడిప్పుడే కష్టాలు తొలగి మంచిరోజులు ప్రారంభమయ్యాయి. ఇంతకుముందుకీ ఇప్పటికీ ఉన్న తేడాని మీకు మీరే పరిశీలించుకు చూసుకుంటే మీకే తెలుస్తుంది. మీలో ఉత్సాహం పెరిగిందని, ఉత్సాహమనేది బుద్ధికి ప్రతిబింబమని గుర్తించండి. సరైన ఆలోచనలూ ఆరోగ్యకరమైన ఆచరణలూ ఉన్నప్పుడే ఉత్సాహం పెరుగుతుంది. ఇది మంచి పరిణామం.

కొంతలో కొంత మీరు విలాసానికీ వినోదానికీ ప్రాధాన్యం ఇచ్చే లక్షణమున్నవారు కాబట్టి, కొన్ని కొన్ని వస్తువులూ ప్రయాణాలు చేస్తూ ధనాన్ని విరివిగానే ఖర్చు చేస్తారు ఈ వారంలో. ఈ అన్నిటి కంటె భూమి, పొలం లేదా ఇల్లు కొనాలనే గట్టి ఆలోచన అకస్మాత్తుగా వస్తుంది. అమలు కోసం ప్రయత్నిస్తే పెద్ద కష్టమేమీ కాబోదు. అయితే నలుగురి మధ్య చర్చ పెట్టినట్లయితే తప్పక ఈ కార్యం రూపుదాల్చదు. మంచి పనిని వాయిదా వేయకుండా చేయాలిట. అదే చెడ్డపనిని రేపు చేద్దామనుకుంటూ ఉండాలిట. 'స్వర్గానికి నిచ్చెన వేయగలను కదా! ఆ పని నా చేతిలోనిదే కదా!' అనుకున్న రావణుడు ఆ మంచి పనిని తన జీవితంలో చేయలేకపోయాడు. చేయకూడని సీతాపహరణాన్ని అనుకున్న క్షణంలోనే చేశాడు. గుర్తుంచుకోవాలి.

మీరు చేస్తున్న వ్యాపారంలో కొన్ని కొన్ని తీరుల అపమార్గాలు ఉండవచ్చు. మీకు ఆ తోవ మంచిది కాదు. ధర్మబద్ధంగానే వ్యవహరించండి. మీకంటూ ఓ గుర్తింపుని పొందండి. మీ ప్రవర్తనకీ నిజాయితీకీ అది నిజమైన పెట్టుబడి. ముఖం ఎంతో అందంగా ఉన్నా నుదురంతా నల్లమచ్చ ఉన్నట్టు, ఒక ప్రత్యేకమైన చెడ్డ పేరు గాని వస్తే అది చాలు జీవితాన్ని చెడగొట్టుకోవడానికి.

లౌకిక పరిష్కారం: మంచి పని అనిపిస్తే వెంటనే చేసేయండి.
అలౌకిక పరిష్కారం: శివాలయానికి వెళ్లి ఆవునేతి దీపాన్ని వెలిగించి రండి.

కర్కాటకం
(జూన్ 21 - జూలై 22)

అలనాటి భీష్మపితామహుని కళ్లముందు జూదం– పాండవుల అరణ్యవాసం, కృష్ణరాయబారం... ఇలా ఎన్నెన్నో సాగిపోయి, అధర్మం తాండవించిందో, దాన్ని చూస్తూ కూడా భీష్ముడు ఏమీ చేయలేకపోయాడో, మౌనంగా బాధపడ్డాడో, దాదాపు అదే విధంగా ఆదాయాలు రాకుండా పడి ఉన్న స్థిరమైన కొన్ని ఆస్తులూ, శక్తి ఉండికూడా సంపాదించ వీలులేని విధంగా పరిస్థితులూ... ఇలా ఏమేమో వస్తూ మొత్తానికి మీ శక్తికి సరిపోయిన కృషిని మీరు చేయలేకపోతున్నారని అనిపిస్తుంది. అది నిజమే, మాగాణి పొలానికి తాత్కాలికంగా వర్షం లేదా నీటి వసతీ లేని కారణంగా బీడు పడి ఉంది అని భావించండి. తొందర్లోనే మంచి సస్యానికి అవకాశముంది. లోగడ కంటె మీలో పెరిగిన బుద్ధిశక్తి కారణంగా లౌక్యంగా మాట్లాడటం, చాకచక్యంగా వ్యవహరించడం, రాబోతున్న నష్టాన్ని ముందే పసిగట్టగల్గడం, ఒక పనిని తేలికగా నిర్వహించుకోగల తీరుతెన్నుల్ని ఎంచుకోవడం, అన్నిటికీ మించి వాదవివాదాలకి అతీతంగా ఉండడం... బాగా అలవాటై పోయి ఉం(టుం)ది. ఇతరులకి సహాయపడడం తప్పు కాదుకానీ, సహాయపడుతూనే ఉండడం, ఆ నేపథ్యంలో మీ పనుల్ని వెనకపెట్టడం మాత్రం సరికాదు. ముఖ్యంగా స్త్రీలతో అధికారులతో చనువుగా ఉండడాన్ని తగ్గించుకోవడం, తగినంత దూరంలో ఉండడం తప్పనిసరి. పరిచయాలు పెరిగినా, పరిచయాన్ని పెంచుకున్నా, కొన్ని మొగమాటాలు రావడం, తద్వారా మనం మనకు ఇష్టంలేని పనిని చేయలసి రావడం, ఇబ్బందికి గురి కావడం తప్పనిసరి అవుతుంది. గమనించుకోండి.

ముఖ్యంగా పై చదువులు చదవడం, పోటీ పరీక్షలకి వెళ్లదలచడం, గ్రంథరచన చేయడం, నూతన వ్యాపారాలకి ప్రణాళికలు వేసుకుని ప్రారంభించడం, లాభకరమైన పరిచయాలని చేసుకోవడానికి అనుకూల కాలం ఇది. పరిమిత స్థాయిలో స్వార్థం ఉండడం తప్పేమీ కాదు. అవసరం కూడా.

లౌకిక పరిష్కారం: స్త్రీలతో, అధికారులతో కొద్దిదూరంగా ఉండాలి. పరిచయాన్ని 'అతి' చేసుకోకూడదు.
అలౌకిక పరిష్కారం: ఆదిత్యహృదయ స్తోత్రాన్ని బుద్ధివికాసం కోసం రోజుకి ఆరుమార్లు పఠించడం మంచిది.

సింహం
(జూలై 23 - ఆగస్ట్ 22)

వర్షం మొత్తం ఆగిపోయాక తలమీద తెరిచి ఉన్న గొడుగుని ముడిచి వేసినట్టుగా, మీ పాత జీవితపు ధోరణిని మార్చుకోవాలనే గట్టి నిర్ణయానికి వచ్చేస్తారు. కాబట్టి, లోగడ సమస్యలని ఒకటొకటిగా ధర్మబద్ధంగా పరిష్కరించు కోవటానికి ప్రయత్నాలని ప్రారంభించండి. తప్పక ఫలవంతమౌతాయి. సంఘంలో మంచి గుర్తింపు మీకొస్తుంది.

ముంగిస గాని, నెమలి గాని సంచరిస్తోందన్నప్పుడు పాముల రాక తగ్గిపోయేటట్లుగా మీరు తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా, చెడు సలహాలనీ, అప్పటికప్పుడు ఇబ్బంది దాటిపోయే తీరు సూచనలనీ ఇచ్చి మిమ్మల్ని మరింత ఇబ్బందిలోనికి నెట్టినకొందరు తప్పక దూరమౌతారు. బాధపడకండి. అలాగని వాళ్లని శత్రువులుగానూ చూడకండి. అప్పటి పరిస్థితి ప్రకారం వాళ్లూ మీరూ కలిపి ఆ పనిని చేసేశారు. అయిపోయింది ఆ చరిత్ర. అంతే!

ఆర్థికంగా గట్టిచిక్కులోనే మీరుండొచ్చు. ఏ సంస్థకో సంఘానికో మీకు నచ్చిన విరాళాలని ఎప్పటికప్పుడు లెక్కల్ని చూపిస్తూ ఉండండి తప్ప సొంతానికి వినియోగించుకోకండి. మంచిది కాదు. సంతానం విపరీతమైన ఆడంబరాలకి అలవాటుపడితే కూర్చోబెట్టి మీ పరిస్థితిని వివరించండి. మీ అదృష్టమంతా మిమ్మల్ని మీ సంతానం అర్థం చేసుకోగలిగినవాళ్లు కావడమే...

ఏ విషయాన్నైనా కుటుంబసభ్యులందరికీ తెలిసినదేనా? అని ఆలోచించి మరీ చెయ్యండి తప్ప వ్యక్తిగత స్వీయాలోచనకి వెళ్లకండి. 'పది కర్రలని కలిపి కట్టిన కట్టని విరగ్గొట్టడం తేలిక కాదు. అదే ఏ కర్రకి ఆ కర్రే అయిన పక్షంలో ఎదుటివారికి విరగ్గొట్టడం చాలా తేలిక' అని చిన్నప్పుడు అమ్మ చెప్పిన కథని గుర్తు తెచ్చుకోండి.

వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలకి సకాలంలో వెళ్లడం, సమయపాలనని చేస్తూ ఉండడాన్ని (సరైన వేళకి రాకపోకలు) దేవాలయ పూజతో సమానంగా భావించండి. ఇది తప్పనిసరి.

లౌకిక పరిష్కారం: సమస్యలని ధర్మబద్ధంగా పరిష్కరించుకునేందుకు కృషిని ప్రారంభించండి.
అలౌకిక పరిష్కారం: విఘ్నాల తొలగింపుకీ, శుభాల ఆహ్వానానికీ గణపతిని విశేషంగా ఆరాధించండి.

కన్య
(ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

'కృషితో నాస్తి దుర్భిక్షమ్'– ఎంత కృషిని మీరు చేస్తే అంతగానూ మీకు ఫలితముంటుందనే పై వాక్యానికి ఉదాహరణ మీరే. అదృష్టం కలిసొచ్చే ఈ కాలంలో అలసత్వాన్ని వీడి ముందుకి దూకినట్లయితే అన్నీ అనుకూల ఫలితాలే, విజయాలే మీకు. మీ విషయంలో మరింత పొదుపు చేసుకోవలసింది ధనాన్ని కాదు – విలువైన మీ సమయాన్ని, ఎవరు మిమ్మల్ని చూడాలనుకున్నా మొగమాటం లేకుండా రావలసిన సమయాన్ని చెప్పండి – ఎంత అవసరమో అంతే మాట్లాడండి. పంపించి వెయ్యండి. 'కాసుల వర్షం కురుస్తుంటే కునుకు తీశాట్ట వెనక్కి ఎవడో'... అలా కాకండి.

తాబేలు కూడా తనకి ఆహారం సరిపడినంత లేదని తనకి తోచిన పక్షంలో ఒడ్డుకొచ్చి కొంత దూరం ప్రయాణించి మరో సరసులోకి వెళ్తుంది. జన్మభూమి, పరిచయస్థులు, ఇల్లూవాకిలీ... అనుకుంటూ ఉన్నచోటనే ఉండాలనుకోకండి. వ్యాపారస్థునికీ ఉద్యోగికీ పరభూమి (మరోచోటు) ఉండదు. ఎక్కడుంటే అదే స్వభూమి. అవసరమైతే కొన్నాళ్లపాటు మకాం మార్చండి. అనుకూలంగా ఉండే కాలం కాబట్టే ఈ మార్పు సుమా!

మంచి పేరూ గుర్తింపూ రావాలనే తపన మీలో ఎక్కువ ఉంటుంది. ఆ ఆలోచన మంచిదే కాని, కేవలం అవి మాత్రమే ఉండి ప్రయోజనమేమిటి? చంద్రగుప్తుడికి మహామంత్రి అయిన చాణక్యుడు రాజ్యాన్నీ రాజునీ నడిపించడమే ప్రధానమనుకున్నాడు తప్ప తన గురించి ఆలోచించుకోలేదు. చివరి వరకు పూరి గుడిసెలోనే జీవించాడని చరిత్ర చెప్తుంది. రాజుగారు కాదని చెప్పినప్పటికీ ఆ నిరాడంబరతకే ప్రాధాన్యమిచ్చాడు. రాజుకి సంతోషం – కుటుంబానికి దుఃఖం కదా! ఎదగడానికి మీకిది మంచి కాలం – పరుగెత్తండి!

ఉత్తమవ్యక్తులూ పెద్దపెద్ద అధికారులూ పరిచయం అవుతారు. వారి పరిచయాన్ని కొనసాగించుకుంటూ ఉండండి నూనె ధారలాగా (మైత్రీ తు తైలధారావత్)

లౌకిక పరిష్కారం: కాసుల వర్షం వస్తోంది. కునుకు తీయకండి.
అలౌకిక పరిష్కారం: నిత్యపూజని మానకండి. పూజల్లోనే కాలాన్ని గడిపేయకండి.

స్పూఫ్ ఆఫ్ బాలీవుడ్

'వెలకమ్ టు న్యూయార్క్'... ఐఫా అవార్డ్స్ మీద వచ్చిన స్పూఫ్ అని చెప్పొచ్చు. వెంకటేష్, కమల్‌హాసన్ నటించిన 'ఈనాడు' సినిమా దర్శకుడు చక్రి తోలేటి నిర్దేశకత్వంలో వచ్చిన చిత్రం వెల్‌కమ్ టు న్యూయార్క్. నిజానికిది పారిస్ ఫ్యాషన్ వీక్ మీద రాబర్ట్ అల్ట్‌మన్ తీసిన 'ప్రెట్ ఎ పోర్టర్' సినిమాకు రీమేక్ లాంటిదని చెప్పొచ్చు. ఫ్యాషన్ వీక్ చోట ఐఫా అవార్డ్ ఫంక్షన్ ఉంది అంతే.

కథ..

సోఫియా (లారా దత్తా) ఐఫా అవార్డ్స్ ఈవెంట్‌ను నిర్వహించే సంస్థ ఎంప్లాయి. గ్యారీ (బొమన్ ఇరానీ) ఆమె బాస్. పర్సనల్ లైఫ్ అంటూ లేకుండా అహోరాత్రులు కష్టపడి ఆ సంస్థను నిలబెడుతుంది. అంత కష్టపడ్డా తనకు రావల్సిన వాటా ఇవ్వడు గ్యారీ. ఈసారి జరగబోయే ఐఫా అవార్డ్స్ ఫంక్షన్ ఫెయిల్ చేసి కక్ష తీర్చుకోవాలనుకుంటుంది. అందులో భాగంగానే ఇండియాలో టాలెంట్ సెర్చ్ పెట్టి జీనల్ పటేల్ (సోనాక్షి సిన్హా), తేజి (దిల్జిత్)లను ఎంపిక చేస్తుంది. వాళ్లు గొప్ప ప్రతిభావంతులని కాదు.. ఎందుకూ పనికిరారని.



మల్టీప్లెక్స్ మూవీ

ఇంతకీ ఆ ఇద్దరికున్న టాలెంట్ ఏంటీ?

జీనల్ పటేల్.. యాంబిషియస్ గుజ్జి గర్ల్. డ్రెస్ డిజైనర్. గొప్ప డిజైనర్‌గా పేరు తెచ్చుకోవాలని.. ఎలాగైనా సరే బాలీవుడ్‌లోకి ఎంట్రీ అయి సల్మాన్ ఖాన్ లాంటి స్టార్ హీరోకి కాస్ట్యూమ్ డిజైనర్‌గా మారాలని కలలు కంటుంది.. కష్టపడుతుంటుంది. తేజీ విషయానికి వస్తే.. రికవరీ ఏజెంట్. యాక్టింగ్ అంటే పిచ్చి. అద్దాన్ని చూస్తే అతనిలో ఉన్న నటుడు నిద్రలేస్తాడు. బాలీవుడ్‌లోని నటులను అనుకరిస్తూ తన నటవిశ్వరూపాన్ని ప్రదర్శిస్తాడు. జీనల్ డ్రెస్ డిజైనింగ్, తేజ్ నటనతో పంపిన వీడియోలను ఫస్ట్ రౌండ్‌లోనే రిజెక్ట్ చేసేస్తారు. తన బాస్ మీద రివేంజ్ తీసుకోదల్చిన సోఫియా వాటిని ఏరి ఓకే చేస్తుంది. న్యూయార్క్‌లో జరగబోయే ఐఫా అవార్డ్స్‌కు టికెట్స్, హోటల్ గదులు బుక్ చేసి వాళ్లకు ఆహ్వానం పంపుతుంది.

ఇంకో వైపు..

ఈ అవార్డ్స్ ఫంక్షన్‌కు యాంకర్స్‌గా కరణ్ జోహార్, రితేష్ దేశ్‌ముఖ్‌లను పిలుస్తారు. కరణ్‌జోహార్.. ఫ్యాషన్ ఫ్రీక్.. బ్రాండ్స్ అంటే పడి చస్తుంటాడు. అయితే కరణ్‌కు ఓ కవల సోదరుడు ఉంటాడు. అతని పేరు అర్జున్. న్యూయార్క్‌లో అతనో గ్యాంగ్‌స్టర్. కరణ్ జోహార్ తీసిన కుఛ్ కుఛ్ హోతా హై, కభీ ఖుషీ కభీ గమ్ వంటి సినిమా అభిమానులు న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్, మ్యాన్‌హటన్ లాంటి వీధుల్లో అర్జున్ తిరుగుతుంటే జనాలు భయపడకపోగా.. కరణ్.. కరణ్ అంటూ ఆటోగ్రాఫ్‌లు, సెల్ఫీల కోసం వెంటపడుతుంటారు. ఇది అర్జున్‌కు చాలా కోపం తెప్పిస్తుంది. తన దందాను పాడు చేస్తున్నాడు అని కరణ్ మీద చిరాకు కలుగుతుంది. ఎలాగైనా కరణ్‌ను చంపాలనుకుంటాడు. ఐఫా అవార్డ్స్‌కు న్యూయార్క్ వస్తున్నాడని తెలుసుకొని ఆ టైమ్‌ను వినియోగించుకోవాలనుకుంటాడు. కాని కథ అడ్డం తిరిగి అర్జున్ ప్లాన్ పాడవుతుంది. అతను కటకటాల్లో చిక్కుకుంటాడు. కరణ్, రితేష్‌తో కలిసి హోస్ట్ చేసి ఐఫా అవార్డ్ ఫంక్షన్‌ను హిట్ చేస్తాడు. ఆ షోను వరెస్ట్ షోగా చూపించాలనుకున్న సోఫియా కుట్రను అర్థం చేసుకున్న జీనల్, తేజీలు అలా కానివ్వకుండా నిజంగానే తమ టాలెంట్‌ను చూపిస్తారు. సల్మాన్‌కు డ్రెస్ డిజైన్ చేసి జీనల్, షోలో తన అభినయ కౌశలం చూపించి తేజీలు తమలో ప్రతిభ ఉందని రుజువు చేస్తారు.

టీవీ షోకి కొనసాగింపుగా..

సినిమా అవార్డుల ప్రదానోత్సవ వేడుకల వెనక ఉన్న డ్రామా, డబ్బు వంటి విషయాలను హాస్యరస ప్రధానంగా తెరకెక్కించే ప్రయత్నమే వెల్‌కమ్ టు న్యూయార్క్. కరణ్ జోహార్ తన సినిమాల మీద తానే సెటైర్ వేసుకుంటుంటాడు. బాలీవుడ్ స్టార్స్ మీద వ్యంగ్యోక్తులూ ఉన్నాయి. అయితే ఈమాత్రం టీవీ షోల్లో, టీవీల్లోనే ప్రసారమయ్యే స్టాండప్ కామెడీ షోలో చాలా కనపడుతున్నాయి. దీన్ని సినిమాగా తీస్తున్నప్పుడు చక్రీ తోలేటి ఇంకాస్త పకడ్బందీ స్క్రిప్ట్, స్క్రీన్ ప్లేను పెట్టుకుంటే బాగుండేది. ఈ సినిమాలో రానా దగ్గుబాటి తెలుగువారికి ప్రత్యేక ఆకర్షణ అని చెప్పుకోవచ్చు.

- శరాది

మళ్లీ చెప్పుకుందాం! రీటోల్డ్ కథలు - 14





● మన్నం సింధుమాధురి

ట్రేడ్

'దాలయమ్మ వద్దు. దివ్యా అని పెట్టుకుందాం. ఎవరైనా అడిగితే అసలు పేరు అదే అని నువ్వు కూడా చెప్పు'

'ఊ' అన్నాను.

'ఏమైనా మనం అదృష్టవంతులం. పిల్ల దొరికింది. పదునాలుగు లోకాలు తిరిగితే పాతాళంలో దొరికింది పిల్ల. తూర్పు ప్రాంతం అంటే పాతాళమేలే. ఏం ఉండి చచ్చింది కనుక ఇక్కడ'

మళ్లీ 'ఊ' అన్నాను.

నా దృష్టంతా పెద్ద రింగుల అమ్మాయి మీదే ఉంది. చిన్న రింగుల అమ్మాయి నా కాళ్ల దగ్గర కూచుని ఉంది. ఇద్దరూ మాలాగే శ్రీకాకుళం రోడ్డులో రైలెక్కారు. హౌరా నుంచి వాస్కో వెళ్లే రైలంటే ఇసుక లారీ కన్నా అధ్వాన్నం. రిజర్వేషన్ ఉన్నా లేకున్నా ఎక్కడ దొరికితే అక్కడ దూరిపోతారు. ఈ ఇద్దరు ఆడపిల్లలు కూడా దూరిపోయారు బతిమిలాడుకుని. రెండు పెద్ద సూట్‌కేసులు ఉన్నాయి. ఒక మూటలో వంట గిన్నెలు ఉన్నట్టున్నాయి. పక్క కంపార్ట్‌మెంట్‌లో వీళ్లలాగే చోటు చేసుకోగలిగిన ఒక మొరటు మనిషి గంటగంటకూ వచ్చి ఈ ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారా లేరా చూసి వెళుతున్నాడు. పెద్దరింగుల అమ్మాయి సైడ్ బెర్త్ పక్కన నిలుచుని ఉంది. ఇందాకటి స్టేషన్‌లో ఎక్కిన కుర్రాడు ఆ అమ్మాయికి దగ్గరగా నిలుచున్నాడు. వాడంత దగ్గరగా నిలుచున్నా చలించడం లేదేమిటా అని చూస్తున్నాను.

'బ్రోకరుగాడు దొంగముండా కొడుకులాగున్నాడు. ఐదు లక్షలకు టోపీ వేద్దామనుకున్నాడు. మూడున్నరకే తెగ్గొట్టడం మంచిదయ్యింది. లక్షకు మూడెకరాలొచ్చే ప్రాంతంలో మూడున్నరంటే ఎక్కువే. అదీగాక పెళ్లి ఖర్చులు మనవే. మంటపం ఖర్చు మనదే. తాళిబొట్టు, గాజులు... ఒకటేమిటి... రేపు మనింటి కోడలైతే మనాస్తి తనాస్తి కాదా. హూ. మన ప్రాంతం అమ్మాయి మన తాహతు అమ్మాయి దొరుకుతుందనుకున్నాను. నాగుపాము నెత్తిన మణైనా దొరికేలా ఉందికాని ఆడపిల్ల దొరికేలా లేదు. కులం గోత్రం కూడా వదిలేయాల్సొస్తుంది. అయితే అమ్మాయ్... నేను మాత్రం మీ పెద్ద పిన్నిలాగా ఈవైపు నుంచి తెచ్చుకుని వేషం మార్చి రూపు మార్చి కాటను చీరలకు బదులు కంచి పట్టుచీరలు కట్టి ఇంట్లో బుట్టబొమ్మలాగా కూచోబెట్టినా మరీ సంవత్సరానికి ఒకసారి తీర్థం కోసమే పుట్టింటికి పంపను. ఎన్నిసార్లయినా రావొచ్చు. ఎన్నిసార్లయినా పోవచ్చు. ఆడపిల్లనే కదా తెచ్చుకుంటున్నాం. బానిసను కాదు గదా'

రాత్రి పది దాటేసింది. మార్కాపురం కూడా దాటేసినట్టుంది. లైట్లు మందం అయ్యాయి. ఆ కుర్రాడు ఆ అమ్మాయి చెవి దగ్గరకు వాలాడు. వాలాడా? చలించదేంటా పిల్లా?

'ఏమైనా బ్రోకరు తెలివైనోడేలే. అమ్మాయిని కూచోబెట్టి దాని అమ్మాబాబుని కూచోబెట్టి అన్నీ వైనంగా చెప్పాడు. ఇక్కడుంటే ఏముంది మట్టి బతుకు... రైకగుడ్డకి కూడా కూలిపనికి వెళ్లి గాడిద చాకిరీ చేయాలి. ఇక్కడి పిల్లోణ్ణి చేసుకుంటే పగలు బయటి కష్టం రాత్రి మంచం కష్టం తప్ప ఏమీ ఉండదు. పైగా తాగొచ్చి బాదడం ఒకటి. మన ఆడపిల్లలు ఎందరిప్పుడు సుకంగా లేరూ? తుంగబద్ర పక్కకెళ్లి కర్నాటకలో సెటిలైన తెలుగాళ్లు అక్కడ వ్యవసాయం చేసి ఆరుసార్లు తిని మూడుసార్లు వెళ్లేంత సంపాదిచ్చారు. కార్లు బంగళాలు నౌకర్లు చాకర్లు పట్టుపరుపుల మీద పడుతుంది బతుకు. అదేమైనా దుబాయా గిబాయా బయపట్టానికి. మూడు నెలలు బెజవాడ బాష మాట్లాడటంలో ట్రెనింగ్ ఇస్తా. పోయి బెజవాడ ప్రాంతం అమ్మాయిలాగా కలిసిపోవడమే. వాళ్లు ఎదురిచ్చిన డబ్బుతో మీ అమ్మా అప్పా బాగుపడతారు. మన పక్కూరు పుల్లెంకి పుష్పలా మారి గుంటూరుకు కోడరికం వెళ్లలేదా. అప్పలమ్మ అనూషా పేరుతో నూజివీడులో చెలాయించడం లేదా. ఇది బూదిగుంపు కేంపు సంబంధం. హోస్పేటకు దగ్గర. సినిమాల్లో చూపించినట్టు స్వర్గంలా ఉంటుందా చోటు. ఎర్రగా బుర్రగా ఉండబట్టి నీ పంట పదహారుసార్లు పండినట్టే పో అనంటే అప్పుడు ఒప్పుకున్నారు'

'అయినా వాళ్ల భయాలు వాళ్లకున్నాయిగా అత్తా' అన్నాను.

'ఎందుకుండవు. కూటికి లేనోళ్లని తెచ్చి కోడలిగా కూచోబెట్టాక మన పద్ధతులు తెలిసే దాకా కసరమా.. కొసరమా? ఛీఛాలు చీత్కారాలు ఉంటాయ్. నిఘా ఉంటుంది. డబ్బుకు అమ్ముడుపోయాక అన్నీ పడాల్సిందే. మన పక్క అమ్మాయిలు కరువై ఒక్కో ఊళ్లో యాభై అరవైమంది కుర్రాళ్లు పెళ్ళిళ్లుగాక ఆడచెట్టుకైనా ఇచ్చి చేయండో అని తిరగతా ఉన్నారనిగానీ'....

ఏదో కదలిక.

మైగాడ్. బేరం కుదిరినట్టుంది.

పెద్ద రింగుల అమ్మాయి, ఆ కుర్రాడు టాయిలెట్ వైపు వెళుతున్నారు. కాళ్ల దగ్గర కూచున్న చిన్న రింగుల అమ్మాయి ఏమీ పట్టనట్టే చూస్తోంది. ఇదంతా నా కంట్లో పడుతుందేమిటీ.

ఐదు పది నిమిషాలు కూడా కాలేదు. ఆ కుర్రాడు వేగంగా రాసుకుంటూ ఈ వైపుకు వెళ్లాడు. పెద్ద రింగుల అమ్మాయిని గంట గంటకీ వచ్చి చెక్ చేస్తున్న మనిషి టపాటపా రెండు బాదుతున్నాడు.

'అప్పుడే మొదలెట్టావా సొంత బిజినెస్సు. దొంగ ముఖం దానా' తిడుతున్నాడు.

ఆ అమ్మాయి ఏం పట్టనట్టుగా వచ్చి ఇందాక నిలుచున్న చోట నిలుచుంది. కుర్రాడు డబ్బులెగ్గొట్టి వెళ్లినట్టున్నాడు.. అటే చూస్తోంది.

'ఎక్కడికెళుతున్నారు?' అడిగాను.

'గోవా'

'ఏం చేస్తారక్కడ'

'క్లబ్బుల్లో పేకలు కలపడం, మందు పొయ్యడం, రాత్రిళ్లు ఈడు పంపినోళ్ల దగ్గర ఉండటం. మా అమ్మాబాబులకు అడ్వాన్స్ ఇచ్చి తీసుకెళుతున్నాడు. ఇది రెండోసారి' ఏ భావం లేకుండా చెప్పింది.

'ఎంత సంపాదిస్తావ్'

'ఎంత సంపాదించినా అదంతా నరకం. ఎంత మందొస్తారో చెప్పలేం. ఒక్కోసారి ఇద్దరుముగ్గరొచ్చి ఒకేసారి అంటారు. కొట్టేవాళ్లు.. కొరికేవాళ్లు... రాజాం పక్కన వంద గడపల ఊరు మాది. తినడానికి తిండి లేదు. అక్కడైతే టేబుల్ మీదొదిలేసిన చికెన్ ముక్కలైనా దొరుకుతాయి. ఆకలికి ఏడ్వడం కన్నా మగాడు మీద పడ్డప్పుడు ఏడ్వడం మేలుగదా' లోగొంతుకలో జీరగా అంది.

వికారంగా అనిపించింది. టాయిలెట్ వైపు వెళుతుంటే ఆ కుర్రాడు కనిపించి ఐదువందల నోటు ముందు సాచాడు.

'ఇది ఆ అమ్మాయికి ఇవ్వండి. దీని మీద నా నంబర్ ఉంది. ఇష్టమైతే బళ్లారిలో దిగిపొమ్మనండి' అన్నాడు.

బళ్లారిలో గోలగోలగా తెల్లారింది.

'తప్పించుకున్నారా ముండల్లారా... తప్పించుకున్నారా.. ఎక్కడికెళతారో చూస్తాను' అని ఆ చెకింగు మనిషి రంకెలేస్తూ తిరుగుతున్నాడు.

ఎస్కేప్ అయ్యారన్నమాట.

మా మేనత్త లేచి తీరిగ్గా ఆవలించి జుట్టు ముడివేసుకుంటోంది.

ఈ పిల్లలు వాడి నుంచి తప్పించుకున్నారు. మా అత్త నుంచి ఆ దాలయమ్మ తప్పించుకుంటుందా?

కథ ముగిసింది.

మన్నం సింధుమాధురి రాసిన 'తూరుపు కండ' కథ ఇది.

అసమ ఆర్థిక వ్యవస్థలో ట్రేడ్ అయ్యే మొదటి వస్తువు స్త్రీయే. స్త్రీతో ముడిపడిన వ్యాపారం శృంగార బానిసత్వానికే కాదు సాంస్కృతిక బానిసత్వంలోకి కూడా కొనసాగుతూ ఉంటుంది. నాగరీకం నేర్చిన కోస్తాంధ్ర ఉన్నత వర్గాలు ఒకరితో ఇద్దరితో సరిపెట్టుకుని ఆప్షన్స్ కోల్పోయి చతికిల పడటం తెలుస్తోంది. పూర్వం పాలఘాట్ నుంచి ఆడపిల్లలను పెళ్లి చేసుకుని తెచ్చేవారు. ఇప్పుడు తూరుపుకు వెళుతున్నారు. హింస అంటే కొట్టడం తిట్టడమే కాదు. కల్చరల్ డిస్‌ప్లేస్‌మెంట్ కూడా. ఎన్ని కథలొస్తే ఈ బాధ తెలుస్తుంది.

పునః కథనం: **ఖదీర్**

తుల
(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)



పైకి కన్పడుతూన్న శరీరం ఎంత దృఢంగా, ఆరోగ్యవంతంగా ఉన్నా, లోపల కన్పించకుండా ఉన్న మనసు గాని దృఢంగా, ఆరోగ్యకరంగా లేని పక్షంలో ఏ వ్యక్తీ ఏ చిన్నపనినీ కూడా కనీసం ప్రారంభిద్దామని అనుకో(లే)డు. మీకు మనోబలం నిశ్చయంగా ఉం(టుం)ది కాబట్టి శరీరం అంతగా సహకరించకున్నా వెంటనే చేయదలచిన పనిని ప్రారంభించండి. ఈ దశలో విజయాన్ని సిద్ధింపజేస్తుంది.

చేస్తున్నది వ్యాపారమే అయితే అనుకోకుండా ఆర్థికంగా లాభం కలుగుతుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ముడిసరుకు సొంతమౌతుంది. పనిని ప్రారంభిస్తే చాలు వృత్తి, ఉద్యోగాల్లో కూడా అనుకూల ఫలితాలే వస్తాయి. దగ్గరివారంతా సహకరించే కారణంగా మీ మనోబలానికి తోడుగా మనోధైర్యం అదనంగా వచ్చి చేరుతుంది. ఇంతటి నిబ్బరం మనసుకొచ్చే కారణంగా శరీరం కూడా ఓపిక లేకపోయినప్పటికీ బాగా సహకరిస్తుంది.


నడుస్తున్న జీవిత సమస్యలో పట్టుదల మాత్రమే జీవిత లక్ష్యం, ధ్యేయం అనుకోకుండా ఉన్న పక్షంలో పనులన్నీ సానుకూలమౌతాయి – విజయం చేరువౌతుంది – ఒక మెట్టు దిగిన పక్షంలో సమస్యలన్నీ గాలికి మబ్బులు చెదిరిపోయినట్లుగా చెల్లాచెదురై మీకు మనశ్శాంతిని కలిగిస్తాయి.

'భార్యాభర్తల మధ్య నుంచి వెళ్లకూడ'దని పెద్దలు కట్టడి చేస్తూండేవాళ్లు మన చిన్నతనాల్లో. దానికర్థం ఇద్దరి మధ్య నుండీ భౌతికంగా నడిచి వెళ్లకూడదనేది కాదు – 'ఇద్దరి మధ్య ఏదో సమస్య వచ్చినప్పుడు దాంట్లో కలగజేసుకోకూడదు. సలహాలు, సూచనలు వంటివి సరికా–దని. కైకా దశరథుల మధ్య దూరిన మంథర వల్ల కదా శ్రీమద్రామాయణం అంత విశాల కథగా మారిపోయింది. అయినా మంథర లాంటి వాళ్లది తప్పు కాదు. దంపతులు సరిగ్గా ఉండగలగాలి. మీ జీవితంలో ఇలాంటిది గాని ఉన్నట్లయితే ముందుకు ముందే జాగ్రత్త పడండి – ఇంకా కూరుకుపోవడం సరికాదు.

లౌకిక పరిష్కారం: దాంపత్యంలో వచ్చిన పొరపొచ్చాల్లో మరొకరి ప్రమేయం వద్దు.

అలౌకిక పరిష్కారం: లలితా సహస్రనామాలని పఠిస్తూ ఉండండి దాంపత్య అన్యోన్యతకి.

ధనుస్సు
(నవంబర్ 22 - డిసెంబర్ 21)



జీవితం – జీతం (ఉద్యోగం) అనే రెంటిలో రెండవదానికే ప్రాముఖ్యమిచ్చే ఆలోచనని విరమించుకోండి. జీతం శాశ్వతం కాదు. శాశ్వతంగా ఉండాల్సిన దాంపత్యంతో ముడిపడ్డ జీవితమంటూ ఒకసారి కుంటుపడితే తిరిగి దాన్ని తోవలోనికి తెచ్చుకోవడానికి చాలా సమయం పట్టచ్చు. సమయం పట్టినా కొందరి విషయంలో సరి కాకపోవచ్చు కూడా. కొద్దిగా దీన్ని ఆలోచించి, పెద్దగా మనసుని జీవితం మీద పెట్టేలా కేంద్రీకరించుకోండి. ఉద్యోగానికి ప్రత్యేకమైన వేళలూ రాకా పోకా ఉన్నట్లే జీవితానికి – అంటే – ఇల్లూ భర్తా/ భార్యా కుటుంబసభ్యులూ కలిగిన ఇంటికి కూడా కొన్ని వేళలూ రాకలూ పోకలూ అనే వాటిని నియమించుకోండి. అలా కాని పక్షంలో గుమ్మం దగ్గర బెబ్బులి నిల్చున్నట్లు కష్టం పొంచి ఉందనుకోండి. మొక్కైనప్పుడే వంచేస్తే మాను అయ్యేంతగా ఎదగదు కదా! ఎదుటి వ్యక్తి ప్రవర్తన సరిగా లేనప్పుడూ, ఉద్యోగంలో సరైన సమయానికి సరైన పనిని ముగించనప్పుడూ మందలించడం తప్పు కాదు గాని, మందలించిన మీరు పైవారితో మందలింపబడే స్థాయిలో మందలించద్దు – మీకు వచ్చే కోపం కారణంగా. ఈ వారంలో వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో మంచి ఒత్తిడిని ఎదుర్కోవలసి ఉన్నానంటూ ముందుకి ముందే మీ మనసుతో చెప్పేసుకోండి. శాంత మహాసముద్రంలా లోతున్న కొద్దీ అలలు లేకుండా ఉండేవారు కొందరైతే, లోతు తక్కువైన కొద్దీ చెప్పలేనన్ని అలలతో అల్ల కల్లోలం చేసుకునే మనస్తత్వం మీది. ఏ చిన్న అలజడి అయినా ఫలితం మనసుమీద పడుతుంది మీకు. నియంత్రించుకోండి మీరే మిమ్మల్ని.

ఇటు తల్లిదండ్రులూ – అటు భర్తా/ భార్య అనే రెంటి సంబంధాలనీ సమానంగా చూసుకోండి. ఏవైపు తూకం మొగ్గుచూపినా మీ వేలితో మీ కంటినే మీరు పొడుచుకో ప్రయత్నిస్తున్నారని భావించుకోండి. సంతానపు ప్రవర్తనని గమనించాల్సిందే. ముఖ్యంగా స్నేహాల విషయంలో.

లౌకిక పరిష్కారం: నిజమైన, స్థిరమైన ఆస్తులు పిల్లలే. వాళ్ల ప్రవర్తన, చేస్తున్న స్నేహాలని కచ్చితంగా గమనించండి.

అలౌకిక పరిష్కారం: శివునికి అభిషేకాన్ని మారేడు పత్రి జలంతో చేసుకోండి / చేయించుకోండి.

కుంభం
(జనవరి 20 - ఫిబ్రవరి 18)



ఈ వారం మీరు మీ వినయ విధేయతలు అనే రెండు రెక్కల పక్షిలాగా రివ్వున ఆకాశంలోకి మరింత ఎత్తుకి ఎగిరి, గమ్యాన్ని సాధించుకుని క్షణంలో తిరిగొస్తారు. ఊహించని విజయాన్ని సొంతం చేసుకుని మీ సామర్థ్యాన్ని మీరు పరోక్షంగా తెలుసుకోగలుగుతారు. దీనంటికీ తగిన శక్తి మీకెక్కడిది? అనుకోకండి. అదృష్టయోగం దైవబలం కారణంగా మీకు పట్టి ఉండడమే. యోగం మరికొంతకాలం పాటు కొనసాగించాలంటే – దైవధ్యానాన్ని పొదుపుగా మొక్కుబడిగా కాకుండా ఇష్టంతో విశేషంగా చేసి తీరాల్సిందే! చేస్తూ ఉండాల్సిందే. పదునులో వేసిన విత్తనం అవసరానికి చేతికొస్తుంది సస్యంలా! మీరే వృత్తి చేస్తున్నారో ఆ వృత్తిలో మీకు తప్పక గుర్తింపు లభిస్తుంది. సాధారణంగా ఓ విజయం లభించగానే ఎవరైనా ఆ విజయానికి మూలమైన రహస్యాన్ని ఉత్సాహంతో చెప్పేస్తారు. అయితే, విజయరహస్యాన్ని చెప్పేయడం ప్రస్తుతానికి సరికాదు. తప్పక చెప్పబోతున్నాననండి. ఎంతగా రహస్యం కోసం ఎవరు ఒత్తిడి చేస్తున్నారో వారే మీ సమీప శత్రువులని భావించండి. అయితే వారితో శత్రుభావంతో వ్యవహరించకండి.

కుటుంబసభ్యులతో ఎక్కువసేపు గడిపేందుకు ప్రాధాన్యాన్ని ఇవ్వండి. ఎవరైనా బంధువులతో చిన్నపాటి పొరపొచ్చాలుంటే, వారు గనుక చుట్టపుచూపుగా మీ ఇంటికొచ్చినా ఏదో శుభకార్యం సందర్భంగా ఎక్కడో తారసపడినా, ఈ పొరపొచ్చాలని సరిచేసుకునేందుకు ప్రయత్నించవద్దు. నలుగురికీ ఆ విషయాన్ని పొక్కనీయద్దు. మీకు కాలం బాగా అనుకూలంగా ఉన్న కారణంగా ఆ పొరపొచ్చాలన్నీ తొలగిపోవడమే గాక, వారికి వారే మీ గురించిన నిజాన్ని తెలుసుకోగలుగుతారు తొందర్లో.

మీ సంతానంతోగాని భార్య, భర్తల్లోగాని ఎవరైనా మానసికంగా సున్నితమైన వారయ్యుంటే (సెన్సిటివ్) వారు తప్పు చేసినా మరింతగా ప్రతిస్పందించకండి. వారి మనసు గాయపడి, తిరిగి ఎదుర్కోలేక అనవసర ప్రయత్నాలు చేస్తారు గమనించుకోండి.

లౌకిక పరిష్కారం: సున్నితమైన మనసున్నవారుంటే ఈ వారంలో జాగ్రత్తగా వారితో మాట్లాడండి.

అలౌకిక పరిష్కారం: శివాలయానికి వెళ్లి 11 ఆవునేతి దీపాలని వెలిగించి రండి.

వృశ్చికం
(అక్టోబర్ 23 - నవంబర్ 21)



నడుంలోతు నీళ్లలో నుండి గుండె లోతు నీళ్లకి వెళ్తున్నామంటే లోతు వైపుకి ప్రయాణిస్తున్నట్టు – దానికి వ్యతిరేక దిశగా ప్రయాణించాలన్నట్టూ సంకేతం. ప్రస్తుతం మీరు నడుంలోతు నుండి పాదాలు తడిసేంత స్థాయికి వచ్చేశారు. పరమ ధైర్యంగా ఉండండి.

'ధర్మో రక్షతి రక్షితః – ధర్మాన్ని గాని మీరు రక్షిస్తే అది మిమ్మల్ని కష్టకాలంలో ఆదుకుని రక్షిస్తుం'–దన్న గొప్ప మాట మీ విషయంలో అక్షరాక్షర సత్యం కాబోతోంది. మిమ్మల్ని నిందించినవారూ అవమానించినవారూ రచ్చకీడ్చినవారూ రచ్చకీడ్చదలిచినవారూ తమంత తామే మీకు అండగా నిలబడి, మీవైపు నుండి మీ శత్రువుల మీదికి అస్త్రాలని గుప్పిస్తారు. అహంకరించకండి. దీనికి మీ ప్రజ్ఞ కారణమనుకోకండి. దైవం అనుకూలిస్తూ ఉండడమే దీనిక్కారణం.

మనం నిలబడ్డ వైపుకే సూర్యుడు అస్తమిస్తూ నీడని రప్పించినట్టుగా, ఈ అదృష్టయోగ కాలంలో మీరు ఏ నిర్ణయాన్ని చెప్తే అదే మీకు అనుకూలిస్తూ సత్ఫలితాలనిస్తుంది. 'ఎల్లయ్యకి ఓ రహస్యాన్ని చెప్తే ఎంతమందికి చెప్పాడో లెక్కేసుకోవా'లన్నట్టు మీ సమస్యా రహస్యాన్నీ, పరిష్కారం ఎంతవరకూ అయిందో ఆ సారాంశాన్నీ ఎవరికీ చెప్పకపోవడం మంచిదని గ్రహించండి. చివరికి ఆప్త బంధువులక్కూడ – అబద్ధం చెప్పద్దు గాని, నిజాన్ని దాచి ఉంచాల్సిందే. అది ఎలాగో మీ మీ ఆలోచన కోణంలో ఆలోచించుకోండి. కుండకి ఏర్పడ్డ సన్న చిల్లు చాలు మొత్తం కారిపోయేలా చేయడానికి.

ఈ వివాద ప్రయత్నాల్లో కొంత సమయాన్నీ ధనాన్నీ వ్యాపారాన్నీ కూడా తాత్కాలికంగా నష్టపోవచ్చు. దాన్ని నష్టంగానూ అశుభంగానూ భావించకండి. కాలు బెణికినప్పుడు నడవకపోవడమనేదే సరైన చికిత్స. ఈ స్థితిలో ఈ తీరుగా నష్టపోవడమే యదార్థమైన లాభం.

లౌకిక పరిష్కారం: రహస్యాన్ని పాటించండి. ఏమాత్రం బయటికి పొక్కనివ్వకుండా చూసుకోండి.

అలౌకిక పరిష్కారం: శనికి ప్రదక్షిణలని చేస్తూ ఉండండి. శనివారం నాడు మాత్రం 19×19=361 మార్లు శని శ్లోకాన్ని పఠించండి.

మకరం
(డిసెంబర్ 22 - జనవరి 19)



పైకి చిన్న మచ్చగా కనిపిస్తూ రోజు రోజుకీ పెరుగుతూ ఉంటే దాన్ని చూస్తూనే వైద్యుడు – ఓ పెద్ద వ్యాధికి సంబంధించిన సూచన అని అనుమానిస్తాడు. అలాగే 'అనుకూలంగానే ఉన్నారు సుమా!' అని అనుకున్నా కొందరిలో ఒకరి ప్రవర్తనా పద్ధతీ వ్యవహార శైలీ పూర్తి వ్యతిరేక ధోరణిలో ఉండొచ్చు. దిగులు పడద్దు. ఇది ఈ యుగ లక్షణం. అంతా అందరూ అన్ని కాలాల్లోనూ అనుగుణంగా ఉండకపోవడం ఈ యుగధర్మం. ప్రతి అడుగునీ నూనె పూసిన నాపరాయిమీద నడుస్తున్న చందంగానే ఆచితూచి వేస్తూ ఉండక తప్పదు. హాని జరగదు గాని తాత్కాలిక ఆందోళన మాత్రం కలగకమానదు.

'ఎప్పటికెయ్యది ప్రస్తుతము...'అన్నట్లుగా కూడా ఆలోచన చేస్తూ తాత్కాలికంగా సమస్య నుండి బయటపడిపోతారు. ఇది కారాగారంలోకి వెళ్లకుండా తెచ్చుకున్న తాత్కాలిక స్వేచ్ఛానుమతిపత్రం (బెయిల్) వంటిది తప్ప, దీన్ని నమ్ముకుని ధైర్యంగా ఉండద్దు. కాలం (భగవంతుడు) అనుకూలంగానే ఉంది కాబట్టి గుచ్చుకున్న ముల్లుని శరీరం నుండి తొలగించేంతవరకూ, తొలగించిన తర్వాత కూడా ఒకట్రెండు రోజుల పాటు బాధ అనుభవించేటట్లుగా దీని అలజడి మీ శరీరం మీదా బుద్ధి మీదా ఉంటుంది తాత్కాలికంగా.

శరీరానికి వ్యాధి వస్తే ఔషధ చికిత్సానంతరం కొంత కాలానికి తగ్గి స్పష్టత లభించేటట్లుగా మీరు మీరు చేసిన ప్రయత్నం ఓ శుభఫలితాన్ని ఈ వారం చివరికి తెచ్చి పెట్టచ్చు. అప్పటివరకూ ఇది మీకు ఓ పరీక్షా కాలం కూడా ఉండచ్చని అనిపించవచ్చు. ఎటుదారో ఎటు తలుపో ఎటు జలాశయమో తెలియని మయసభని చూపించడానికి అన్ని రహస్యాలూ తెలిసిన భీమసేనుడు ముందు నడుస్తున్నప్పుడు భయం దేనికి? అన్నట్లు మీ రక్షణ కోసం వచ్చినవారు మార్గదర్శకులుగా ఉండగా భయమెందుకు? అయితే మీకు మీరుగా జారిపడకుండా నడవగలిగితే చాలు పరమ ధైర్యంగా ఉండండి.

లౌకిక పరిష్కారం: ఎండానీడల్లా చలీ వేడిమిలా సుఖం దుఃఖం అనే రెండూ మీ తలుపు తడతాయి. భయం లేకుండా సిద్ధంగా ఉండండి.

అలౌకిక పరిష్కారం: శివునికి భస్మజలాలతో అభిషేకాన్ని చేయించుకోండి.

మీనం
(ఫిబ్రవరి 19 - మార్చి 20)



పురాణేతిహాసాలు చెప్తాయి– స్వార్థమనేది ఉండడం తప్పు కాదనీ– అయితే అది పరిమితంగా ఉండాలనీనూ. ఆ దృష్టికోణంతో ఆలోచించి, ముందు మీ ఎదుగుదలని చూసుకుని ఆ మీదట మీ కుటుంబంలో ఉన్న మిగిలిన వారిని పైకి తేవడానికి ప్రయత్నించండి. అలాగే మీ ఉద్యోగంలో పనుల్ని సకాలంలో ముగించుకుని, ఆ మీదట ఇతరుల పనికి సహకారమందించండి. మంచి విజయావకాశాలు మెండుగా ఉన్న ఈ కాలంలో మీరు చేస్తున్న ప్రధానమైన వృత్తి ఉద్యోగ వ్యాపారాలకంటే వేరైన ఏ అంశంలో మీకు ప్రాధాన్యం, నైపుణ్యం ఉన్నాయో ఆ రంగానికి సంబంధించిన ఆలోచనలని కూడా చెయ్యండి. అదనపు అర్హతగానూ ఉంటుంది. ఆర్థికంగా రాణించగలరు కూడా. ఉద్యోగానికో సంస్థకో వ్యాపారానికో సంబంధించిన– అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల కాగితాలనీ సరిచూసుకోండి తప్ప, అన్నీ సక్రమంగా ఉన్నాయని భావించుకోకండి. ఒక్కసారి సరిచూసుకుంటే మంచిది కదా!

సహజంగా వర్షం రావచ్చనేది మబ్బులూ తడిగాలీ సన్నని తుంపర ద్వారా ముందుగా తెలుస్తుంది. ఎదుటివ్యక్తిలో మార్పొచ్చిందనేది అతడి మాటలూ ప్రవర్తన ద్వారా ముందుగా తెలుస్తుంది. అయితే మీకు రాబోయే అనారోగ్యం ఏ ముందు సూచనా లేకుండా వచ్చే అవకాశం ఉంది కాబట్టి– ఆహార విహార విషయాల్లో తప్పనిసరిగా జాగ్రత్తలని పాటించక తప్పదు. ఈ మధ్య మధ్యే మీలో మొహమాటం తగ్గి, చెప్పదలిచిన దాన్ని స్పష్టంగా చెప్పాలనే దృఢనిశ్చయంతో ఉంటున్న కారణంగా పనులు మీరనుకున్నట్లుగా జరుగుతూ ఆనందాన్నిస్తున్నాయి. ఇదే ధోరణిని కొనసాగించండి. దాంపత్య అన్యోన్యత అంతంతమాత్రంగా ఉండవచ్చు. వినోద విహార యాత్రలు వారానికోసారి చేయడం మంచిది. అలాగే పదిమందిని సలహాలడగడం ఏదీ చేయకపోవడం సరికాదు. రంగంలోకి దూకండి.

లౌకిక పరిష్కారం: దాంపత్య అనుకూలత కోసం వారానికోసారి వినోద/ విహార యాత్ర చెయ్యండి.


అలౌకిక పరిష్కారం: ఏదైనా ఒక మంచిరోజు చూసుకుని మీ ఇంటిలో భజన / ప్రార్థన / పారాయణ పెట్టించండి.

తీపి కబురు


● మహేశ్‌బాబు

కారం, తీపి, వగరు, పులుపు, ఉప్పు, చేదు అనే షడ్రుచులు కలిసిన ఉగాది పచ్చడి పిచ్చ టేస్టీగా ఉంటుంది. అలాగే ఓ ఫైట్, సాంగ్, సీన్, డైలాగ్, రొమాన్స్, ఎమోషన్ కలగలిపి ఉన్న ఓ సూపర్ టీజర్‌ను రెడీ చేస్తోందట భరత్ అండ్ టీమ్. మహేశ్‌బాబు హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న చిత్రం 'భరత్ అనే నేను'. ఇందులో కియారా అద్వాని కథానాయిక. సీయం భరత్ పాత్రలో మహేశ్‌బాబు కనిపించనున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా భరత్ ఫస్ట్ ఓత్ అండ్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ ఏడాది తెలుగు సంవత్సరాది ఉగాదికి టీజర్‌ను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారట. టీజర్ రిలీజ్ వేడుక ఫ్యాన్స్ సమక్షంలో జరిగే అవకాశం ఉందని కొందరు అంచనా వేస్తున్నారు. ఇదే నిజమైతే ఫ్యాన్స్‌కు ఇంతకంటే తీపి కబురు ఏముంటుంది. ఈ నెల 25 నుంచి 28 వరకూ జరిగే షెడ్యూల్‌లో మహేశ్‌బాబు పాల్గొంటారు. ఆ తర్వాత లండన్‌లో ఓ షెడ్యూల్ ఉంటుందని సమాచారం. సినిమా ఎంటైర్ షూటింగ్ మార్చి 27కల్లా కంప్లీట్ చేసేలా చిత్ర బృందం ప్లాన్ చేసింది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 20న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఆన్ సైలెంట్ మోడ్


● ఎన్టీఆర్

'సైలెంట్ మోడ్' అంటే ఫోన్ పరిభాషలో ఏదో ఇంపార్టెంట్ పనిలో ఉన్నామని, అందుకే సైలెంట్ మోడ్‌లో పెట్టాం అని అర్థం. ప్రస్తుతం సైలెంట్ మోడ్‌లోకే వెళ్లారు ఎన్టీఆర్ – త్రివిక్రమ్ కాంబినేషన్ మూవీ యూనిట్. విషయం ఏంటంటే.. ఈ సినిమాకు 'ఆన్ సైలెంట్ మోడ్' అనే టైటిల్‌ను రిజిస్టర్ చేయించిందట హారికా హాసినీ క్రియేషన్స్ సంస్థ. టైటిల్‌కు తగ్గట్టుగానే సినిమాకు సంబంధించిన పనులన్నీ చాలా సైలెంట్‌గా చేస్తున్నారు చిత్రబృందం. ఈ సినిమాలో సిక్స్ ప్యాక్ లుక్‌లో కనిపించేందుకు కసరత్తులు చేస్తున్నారు ఎన్టీఆర్. స్క్రిప్ట్ వర్క్ విషయంలో కూడా చాలా సైలెంట్‌గానే ఉన్నారు త్రివిక్రమ్. ఇంత సైలెంట్‌గా పనులు చేసుకుంటూ వెళ్తున్నారంటే కచ్చితంగా బాక్సాఫీస్ వద్ద ఏదో సెన్సేషన్ క్రియేట్ చేయటానికే అనుకోవచ్చు. ఈ సినిమాలో హీరోయిన్‌గా పూజా హెగ్డే, శ్రద్ధా కపూర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మార్చి నుంచి సెట్స్ పైకి వెళ్లనుంది. హారికా హాసినీ బ్యానర్ పై ఎస్.రాధాకృష్ణ నిర్మించనున్న ఈ సినిమాకు సంగీతాన్ని తమన్, కెమెరాను పీఎస్ వినోద్ హ్యాండిల్ చేయనున్నారని సమాచారం.

తలైవా @165


● రజనీకాంత్


పక్కా... పొలిటికల్ ఎంట్రీకి ముందే రజనీ ఓ సినిమా చేయడం పక్కా అన్న వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. ఈ వార్తలే నిజమయ్యాయి. 'కాలా', '2.0' చిత్రాల తర్వాత రజనీ నెక్స్ట్ చిత్రం ఏంటీ? అని వస్తున్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. ఆయన నెక్స్ట్ చిత్రం ఫిక్సైంది. రజనీకాంత్ హీరోగా 'పిజ్జా' ఫేమ్ కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కళానిధి మారన్ సమర్పణలో ఓ సినిమా రూపొందనుంది. ఇది రజనీకాంత్ కెరీర్‌లో 165వ సినిమా అట. తలైవా (నాయకుడు)ను డైరెక్ట్ చేసే ఛాన్స్ కార్తీక్ సుబ్బరాజుకు దక్కడం ఊహించని విషయమని అంటున్నారు కోలీవుడ్‌వాసులు. ''నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. తలైవాతో సినిమా చేయాలనే నా కల నిజమైంది. తలైవాకి, నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు కార్తీక్ సుబ్బరాజు. 'పిజ్జా, జిగర్ దండా, బెంచ్ టాకీస్, ఇరైవి, 'మెర్క్యూరీ' వంటి చిత్రాలను తెరకెక్కించారు కార్తీక్ సుబ్బరాజు. ప్రభుదేవా ప్రధాన పాత్రలో నటించిన సైలెంట్ థ్రిల్లర్ 'మెర్క్యూరీ' ఏప్రిల్ 13 రిలీజ్ కానుంది. 'కబాలి' ఫేమ్ రంజిత్. పా దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా రూపొందిన 'కాలా' చిత్రం ఏప్రిల్ 27న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. ఈ సంగతి ఇలా ఉంచితే.. రజనీకాంత్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన '2.0' ఈ ఏడాది దీపావళికి రిలీజ్ కానుందన్న వార్తలు షికారు చేస్తున్నాయి. దీపావళికే విజయ్, సూర్య, అజిత్ సినిమాలతో పాటు బాలీవుడ్‌లో ఆమిర్‌ఖాన్, అమితాబ్ బచ్చన్ నటిస్తున్న 'థగ్స్ ఆఫ్ హిందోస్థాన్' సినిమాలు షెడ్యూల్ అయిన సంగతి తెలిసిందే. సో.. దీపావళికి గట్టి పోటీ అన్నమాట.



నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఎమ్మెల్యే'. 'మంచి లక్షణాలు ఉన్న అబ్బాయి' అనేది ఉపశీర్షిక. ఇందులో కాజల్ అగర్వాల్ కథానాయిక. టీజీ విశ్వ ప్రసాద్ సమర్పణలో బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్మెంట్ ఎల్‌ఎల్‌పీ అండ్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై సీ. భరత్ చౌదరి, ఎమ్‌వీ కిరణ్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమాను మార్చిలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. కొత్త పోస్టర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. పోస్టర్‌లో కల్యాణ్‌రామ్, కాజల్ కెమిస్ట్రీ అదుర్స్ కదూ!

ఓ ట్విట్టర్ పక్షీ.. నీ ఇల్లెక్కడ?

అమితాబ్ బచ్చన్ ట్విట్టర్‌లో ఎంత యాక్టివ్‌గా ఉంటారో మనందరికీ తెలిసిన విషయమే. సినిమా షూటింగ్ అప్‌డేట్స్, ఫ్లాష్‌బ్యాక్ ఫొటోలు, ఫ్యామిలీ ఈవెంట్స్ విషయాలతో సహా అన్ని విషయాల్నీ అభిమానులతో షేర్ చేసుకుంటూ ట్విట్టర్‌లో చాలా చురుకుగా ఉంటారు. ఇటీవల ట్విట్టర్‌లో ఒకేరోజులో సుమారు 2 లక్షల మంది ఫాలోయర్స్ సంఖ్య తగ్గిపోవటంతో అప్‌సెట్ అయిన అమితాబ్ ట్విట్టర్‌ను వదిలేస్తున్నాను అని చమత్కరించారు. అక్కడితో ఆగకుండా ఏకంగా ట్విట్టర్‌ను ఉద్దేశిస్తూ ఓ కవిత కుడా రాసేశారు. ఆ కవిత ముందు ట్విట్టర్‌ని ఉద్దేశిస్తూ ఓ విన్నపం కూడా వదిలారు. ''అరే తమ్ముడూ లేదా అక్కయ్యా.. నువ్వే జెండరో తెలియదు అందుకే రెండిటితో సంభోదిస్తున్నాను. నేనేదో రాద్దాం అనుకుంటాను, నువ్వు దానికి రాద్ధాంతం చేస్తావు. నా 2లక్షల మంది ఫాలోయర్స్‌ను లాగేసుకున్నావు. ఇప్పుడు నా అకౌంట్‌ను కూడా లాగేసుకోవద్దు. నా పట్ల క్రూరంగా ఉండొద్దు'' అని పేర్కొన్నారు. ఈ విన్నపం తర్వాతి ట్వీట్‌లో కవితను పోస్ట్ చేశారు బిగ్ బీ. ఆయన రాసిన 'ట్విట్టర్ కవిత' సారాంశం ఏంటంటే...


● అమితాబ్ బచ్చన్

"పక్షీ... ఓ పక్షీ ఎక్కడుంది నీ ఇల్లు?
తుర్రు తుర్రుమంటూ ఇక్కడికి ఎగిరి వస్తున్నావు.
నిన్ను చూడాలనుకునే వారు ఇంతమంది...
నీకెందుకు భయం?
ఒకవేళ అలిగితే చెప్పు మాకు...
మేం తిరిగిపోతాం కాసేపటువైపు
సదా నీ ఆశీస్సులెప్పుడూ ఉండాలి మాపైనే
నిత్యనూతనమైన మా పువ్వులనెప్పుడూ
(మాటలు) కురిపిస్తాం నీపైనే ".

అంటూ సరదాగా సాగే ఈ పద్యాన్ని అభిమానులతో పంచుకున్నారు బిగ్ బీ.


● కీర్తీ సురేష్

సేమ్ టు సేమ్ సావిత్రి

సినిమా రిలీజ్‌కాక ముందే సేమ్ టు సేమ్ సావిత్రి అనేస్తున్నారేంటీ అనుకుంటున్నారా? ఇక్కడ చెప్పబోతున్నది అభినయం గురించి కాదండి, అలవాట్ల గురించి. నాకూ సావిత్రి గారికి కామన్ ఇంట్రెస్ట్‌లు చాలానే ఉన్నాయి అంటున్నారు కీర్తీ సురేష్. 'మహానటి' సినిమాలో సావిత్రి పాత్రను కీర్తీ సురేష్ పోషిస్తున్నారన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో సావిత్రి పాత్రను పోషించడానికి చాలా హోమ్ వర్క్ చేశారట కీర్తి. సావిత్రిగారి గురించి ఇంకా బాగా తెలుసుకోవటానికి సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరితో కూడా మాట్లాడారట. అప్పుడు తనకూ సావిత్రికీ సంబంధించిన చాలా కామన్ ఇంట్రెస్ట్‌లు తెలుసుకున్నారట కీర్తి. ఆ విషయం గురించి ఆమె మాట్లాడుతూ– ''విజయ చాముండేశ్వరిగారు వాళ్ల అమ్మగారి మేనరిజమ్స్, హావభావాలు, వాళ్ల ఇద్దరు మధ్య బాండ్ గురించి చాలా బాగా మాట్లాడారు. కొన్ని రోజుల తర్వాత ఒక నాలుగు పేజీలు ఉన్న లెటర్‌ను పంపించారామె. ఆ లెటర్ చదివిన తర్వాత సావిత్రిగారికీ నాకు కొన్ని విషయాలు కలవడం చూసి నేను చాలా ఆశ్చర్యపోయాను. సావిత్రిగారు స్విమ్మింగ్ చేసేవారు. నాకు స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం. మా ఇద్దరికీ టీ అంటే చాలా ఇష్టం. ఆమె క్రికెట్ ఆడేవారు. నేను స్కూల్ డేస్‌లో క్రికెట్ బాగా ఆడేదాన్ని. తనకు కార్ డ్రైవింగ్ అంటే చాలా ఇష్టం. నాక్కూడా ఇష్టమే..'' అని పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు కీర్తి. మహానటి సావిత్రి జీవితం ఆధారంగా నాగ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతి బ్యానర్‌పై అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ సినిమాను మార్చి 29న రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

చర్చలు విఫలం

థియేటర్ల మూత తప్పదు

వారం వారం విడుదలయ్యే కొత్త చిత్రాల కోసం సినిమా లవర్స్ వెయ్యి కళ్లతో ఎదురు చూస్తారు. అయితే మార్చి 2కి థియేటర్లలోకి కొత్త బొమ్మ వచ్చే అవకాశం కనిపించడంలేదు. థియేటర్లు మూతపడబోతున్నాయి. వినడానికి షాకింగ్‌గానే ఉంటుంది. ఎందుకీ పరిణామం అంటే.. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు (క్యూబ్, యూఎఫ్ఓ), నిర్మాతల మధ్య ధర విషయంలో చర్చలు ఓ కొలిక్కి రాలేదు. ధర ఎక్కువగా ఉందని భావించిన నాలుగు (తెలుగు, తమిళ, కన్నడ, కేరళ) రాష్ట్రాల నిర్మాతలు డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో ఇప్పటికే రెండుసార్లు చర్చలు జరిపారు. శుక్రవారం బెంగళూరులో సౌత్ ఇండియన్ ఫిల్మ్ చాంబర్ జాయింట్ యాక్షన్ కమిటీ (తెలుగు, తమిళ, కేరళ, కర్నాటక) వారు డిజిటల్ ప్రొవైడర్స్‌తో మరో సమావేశం నిర్వహించారు. ఇప్పుడు వసూలు చేస్తున్న మొత్తంలో 20 శాతం తగ్గిస్తే చాలన్నది నిర్మాతల విన్నపం అని తెలిసింది. గత సమావేశాల్లా ఈసారి కూడా చర్చలు విఫలం అయ్యాయి. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు 9 శాతం మాత్రమే తగ్గించడానికి ముందుకు వచ్చారని సమాచారం. దాంతో మార్చి 2 నుంచి కొత్త చిత్రాల కంటెంట్ ఇవ్వకూడదనే అభిప్రాయానికి నిర్మాతలు వచ్చారు. కంటెంట్ ఇవ్వకపోతే ఆటోమేటిక్‌గా థియేటర్లు మూతపడతాయి. అది మాత్రమే కాదు.. అప్పటికే ఆడుతున్న సినిమాలను కూడా నిలిపివేయాలని నిర్మాతలు నిర్ణయించుకున్నారట. ఈ పరిస్థితి ఎందాకా వెళుతుందో వేచి చూడాలి.

క్రేజ్‌కి తగ్గట్టుగా...


● విజయ్ దేవరకొండ

'అర్జున్ రెడ్డి' లాంటి సక్సెస్‌ఫుల్ సినిమా తర్వాత విజయ్ దేవరకొండ హీరోగా ప్రియాంక జవాల్కర్, మాళవికా నాయర్ హీరోయిన్లుగా నూతన దర్శకుడు రాహుల్ సంక్రిత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. జీఏ2, యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా ద్వారా ఎస్.కే.యన్ నిర్మాతగా పరిచయమవుతున్నారు. ఈ సినిమాను మే 18న రిలీజ్ చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ – ''విజయ్ దేవరకొండకు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకొని అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే విధంగా తన క్యారెక్టర్‌ను డెవలప్ చేశాడు దర్శకుడు రాహుల్. బాడీ లాంగ్వేజ్, మేనరిజమ్స్ ఆడియన్స్‌ను ఆకట్టుకుంటాయి. సినిమా టీమ్ అంతా చాలా బాగా వర్క్ చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మే 18న గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నాం. ఈ సినిమాకు చక్కని టైటిల్, అలాగే ఫస్ట్ లుక్‌ని త్వరలో విడుదల చేస్తాం'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: జేక్స్ బిజాయ్, కెమెరా: సుజిత్ సారంగ్.

రాణీగారు మళ్లీ బయటికొచ్చారు!



● కంగనా రనౌత్

రాణి అంటే ఎలా ఉండాలి? అందంగా ఉండాలి. అందంగా మాత్రమేనా? రాజసం ఉట్టిపడాలి. చూపులు చురకత్తుల్లా, నడక ఠీవీగా, మాటలు తెలివిగా ఉండాలి. అందుకే క్వీన్ పాత్రకు సాదా సీదా తారలను తీసుకోరు. కంగనా రనౌత్‌లా ఉండేవాళ్లనే తీసుకుంటారు. దర్శకుడు క్రిష్ తన 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' కోసం ఆమెనే తీసుకున్నారు. ధీర వనిత ఝాన్సీలక్ష్మీభాయ్ జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో ఝాన్సీ లక్ష్మీభాయ్ పాత్ర చేస్తున్నారు కంగనా. ఈ సినిమా షూటింగ్ రాజస్థాన్‌లోని బికనీర్‌లో జరుగుతోందని సమాచారం. రాజదర్బార్ సీన్స్‌కి సంబంధించిన కొన్ని ఫొటోలు మళ్లీ బయటికొచ్చాయి. ఇక్కడ కనిపిస్తున్న ఫొటోలో భారీ ఆభరణాలతో కంగనా భలేగా ఉన్నారు కదూ. ఈ సంగతి ఇలా ఉంచితే ఈ సినిమాలో ఝాన్సీ లక్ష్మీభాయ్ జీవిత చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. రాణీ లక్ష్మీభాయ్‌కు బ్రిటిష్ ఏజెంట్‌కు మధ్య అభ్యంతరకర సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని మహారాష్ట్రకు చెందిన సర్వబ్రాహ్మణ సభ చేసిన ఫిర్యాదుకు మణికర్ణిక చిత్రబృందం స్పందించి, వివరణ ఇచ్చింది. దీంతో ఆ ఫిర్యాదు విరమించుకున్నారని బాలీవుడ్ టాక్. ''రచయిత మిశ్రా నవల ఆధారంగా 'మణికర్ణిక' సినిమాలో అభ్యంతకర సన్నివేశాలను చిత్రీకరిస్తున్నామని వస్తున్న వార్తల్లో నిజం లేదు. చరిత్ర అంశాలను మార్చడం లేదు'' అని చిత్రనిర్మాతల్లో ఒకరైన కమల్ జైన్ తెలిపారు.

నందికొండ వాగుల్లోన...

'గీతాంజలి' చిత్రంలోని 'నందికొండ వాగుల్లోన నల్ల తుమ్మ నీడల్లోన' పాట ఎంత సూపర్‌హిట్ అయిందో తెలిసిందే. ఇప్పుడా పాట ప్రస్తావన ఎందుకంటే.. 'నందికొండ వాగుల్లోన' పేరుతో ఓ సినిమా రూపొందుతోంది. లక్కీ ఏకరీ, పూజశ్రీ జంటగా షఫీ, సాయికిరణ్ ముఖ్య తారలుగా సత్యనారాయణ ఏకరీని దర్శకుడిగా పరిచయం చేస్తూ రఘు.హెచ్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. సాయి వెంకట్ సమర్పణలో రూపొందుతోన్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని దర్శకుడు తేజ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''నా వద్ద పనిచేసిన యువకులు చేసిన తొలి సినిమా పోస్టర్ లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. నా మొదటి సినిమా 'చిత్రం' నాకెంత పేరు తెచ్చిపెట్టిందో...' నంది కొండ వాగుల్లోన' సినిమా ద్వారా వీరు అంతకన్నా ఎక్కువ విజయాన్ని అందుకోవాలని ఆశిస్తున్నా'' అన్నారు. ''మా గురువు తేజ గారు మా సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ చేసి, మమల్ని ఆశీర్వదించినందుకు కృతజ్ఞతలు'' అన్నారు సత్యనారాయణ ఏకరీ. ''ఈ నెల 25న పాటలు విడుదల చేసి, మార్చిలో సినిమా రిలీజ్ చేస్తాం'' అన్నారు నిర్మాత రఘు.హెచ్. లక్కీ ఏకరీ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: నవనీత్ చారి.


● దర్శక-నిర్మాతలతో తేజ

సమ్మర్‌లో సస్పెన్స్


● సత్యదేవ్, పూజా ఝువేరి

సత్యదేవ్, పూజా ఝువేరీ, రోషిణి ప్రకాష్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం '47 డేస్'. 'ద మిస్టరీ అన్‌ఫోల్డ్స్' అనేది ఉపశీర్షిక. ప్రదీప్ మద్దాలి దర్శకత్వంలో దబ్బార శశిభూషణ్ నాయుడు, రఘు కుంచె, శ్రీధర్ మక్కువ, విజయ్ శంకర్ డొంకాడ నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ – ''సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది. ఇటీవల వస్తోన్న థ్రిల్లర్ సినిమాలు మంచి వసూళ్లు సాధిస్తున్నాయి. అందుకే.. మా మూవీ అవుట్‌పుట్ తెలిసిన 'త్రిశూల్ సినిమాస్' మంచి ధరకు ఓవర్సీస్ రైట్స్ దక్కించుకుంది. రఘు కుంచె సంగీతం సినిమాకి ప్రధాన ఆకర్షణ. ప్రేమికులరోజు సందర్భంగా దర్శకుడు పూరి జగన్నాథ్ చేతుల మీదుగా రిలీజ్ చేసిన 'క్యా కరూన్' పాటకు మంచి స్పందన వచ్చింది. త్వరలో ట్రైలర్, వేసవిలో సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు. రవివర్మ, హరితేజ, ఇర్ఫాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ముక్తార్ ఖాన్, సత్యప్రకాష్, కిరీటి, అశోక్ కుమార్ తదితరులు నటించిన ఈ సినిమాకి కెమెరా: జీకె, సహనిర్మాత: అనిల్ కుమార్ సోహాని.

నమస్తే హైదరాబాద్

ఎంతో చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరాన్ని నేపథ్యంగా తీసుకొని పి.సి.క్రియేషన్స్ పతాకంపై 'నమస్తే హైదరాబాద్' అనే పేరుతో ఓ చిత్రం రూపొందనుంది. ఈ చిత్రానికి చిమ్మని మనోహర్ దర్శకుడు. చిత్రవిశేషాలను మనోహర్ తెలియజేస్తూ– ''తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఒక తెలంగాణ దర్శకుడిగా నేను రూపొందిస్తున్న పూర్తి స్థాయి యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రమిది. సినిమాలో మంచి సందేశం కూడా ఉంది'' అన్నారు. చిత్రసంగీతదర్శకుడు ప్రదీప్ చంద్ర మాట్లాడుతూ – ''మంచి పాటలివ్వడానికి స్కోప్ ఉన్న కథ ఇది. తెలంగాణ యువతలో మంచి సంగీత జ్ఞానం ఉంది. అందుకే నూతన గాయనీ గాయకులను పరిచయం చేయాలనే ఉద్దేశంతో పలువురు సింగర్స్‌కు ఆడిషన్స్ నిర్వహించాం'' అన్నారు. నూతన నటీనటులతో రూపొందనున్న ఈ చిత్రానికి కెమెరా: వీరేంద్ర లలిత్, నిర్మాత: ప్రదీప్‌చంద్ర, కథ–స్క్రీన్‌ప్లే–మాటలు–దర్శకత్వం: చిమ్మని మనోహర్.


● ప్రదీప్‌చంద్ర, మనోహర్